



తప్పక చూడండి
యస్.కృష్ణమూర్తి సమర్పించు
వీనస్ కంబైన్స్
దర్శకత్వం వి.మధుసూదనరావు
నిర్మాతలు టి.గోవిందరాజన్,
టి.ఎమ్.కిట్టు
నవయుగ
VEEKAY

నాటినుండి నేటివరకు మేము వహించునది ప్రథమ స్థానము

అవును మోపెడ్లలో నేటికీ ప్రథమ స్థానం వహించునది సువేగాయే



సువేగాకు ఈ ప్రథమస్థానం ప్రారంభ దశ నుండి ఉన్నది దీనికి కారణం-శ్రేష్ఠతయందు ప్రథమస్థానం వహించు సువేగా, అనుదినము క్రొత్త అభివృద్ధులు చేస్తూ అగ్రశ్రేణి యందుండుటయే

సువేగా మొట్టమొదటగా హార్డ్‌క్రోమ్ అల్యూమినియం మిశ్రమ సిలిండర్లను ఉపయోగించినది-ఇందువల్ల, బహుకాల మన్నిక మరియు వేలకొలది అదనపు కిలోమీటర్లు.

సువేగా: బండిని సులభముగా నడుపుటకు మొట్టమొదటిగా ఆటోమెటిక్ క్లచ్‌గలది. నడుపుటకు శారీరక శ్రమ అక్కరలేదు. కాన తక్కువ శ్రమ.

అధిక స్థిరత్వమునకు "సమతూకముగల" ప్రత్యేక డిజైను మరియు కుదుపులులేని ప్రయాణమునకు ముందు/వెనుక భాగములందలి సస్పెన్షన్లు, సువేగాకు అమర్చబడి యున్నవి.

సువేగా నుండి మరో ఉపయోగము: అమ్మకము తర్వాత విరివి అయిన అనుబంధ సర్వీసు వసతులు. ఇండియా అంతయు విడిభాగములు లభించు వసతులు అందగాగలవు

అవును నాటికీ, నేటికీ, ఎన్నటికీ మోపెడ్లలో ప్రథమ శ్రేణియందుండునది సువేగాయే, తిరుపతి, ఆంధ్రప్రదేశ్.

సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి
రాఘవయ్య

ఆగస్టు 1979

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 17 సంచిక 7

విషయసూచిక

నవలానుబంధం

మళ్ళీరాని వయసు — ఇచ్ఛాపురపు రామచంద్రం

మరియు

మావారూ-మీసాలూ (కథ)-విజయకుంతల

ముఖచిత్రం : 'వేటగాడు'లో శ్రీదేవి

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో రు. 42/)


మీ అందానికి తగిన
మిల మిల మెరిసే చీరెలు!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును
లక్ష్మీ
జనతా స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిల్పా, ఫోన్: 73467, 77052

తొలిమాట

తుపానులూ, భూకంపాలూ, వర్షాలులేక వచ్చే కరువు కాటకాలూ - మనిషి చేతిలో లేనివి—దాదాపు మనిషి నివారించలేని ప్రమాదాలు. అయితే మనిషి నిరంతర అన్వేషణలో, కొత్త విషయాలు తెలుసుకొనే తపనలో, సాధించే కొత్త విజయాలలో ప్రమాదాలు సృష్టించేవీ ఉంటుంటాయి. ఇప్పుడు చిత్రమైన ప్రమాదమొకటి ప్రపంచ మానవాళితో దోబూచులాడుతోంది. ఎప్పుడో 1973లో అంతరిక్ష పరిశోధనలో భాగంగా అమెరికా దేశం ప్రయోగించిన 'స్కైలాబ్' అనే పేరు గల రోదసి ప్రయోగశాల ఇప్పుడు తన పని పూర్తయ్యాక తిరిగి మాతృస్థానానికి తిరిగొస్తూందట. అది జూలై మాసం మధ్యలో భూమిపై పతనం కావచ్చని అంచనా. అమెరికన్ నిపుణుల అంచనాల ప్రకారం స్కైలాబ్ జనసాంద్రతఉన్న ప్రదేశాలపై కాకుండా సముద్రంలోనో, మనుషులు సంచరించని ప్రాంతాలలోనో పడుతుందని అంచనా. అదే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లాలో పడే అవకాశముందని, మరెక్కడో పతనమయే అవకాశమున్నదనీ కూడా వార్తలు వస్తున్నాయి. మనం ప్రయోగించిన బాణం మనపైకే ఎదురుతిరిగి వెంటబడితే కలిగే అనుభూతి కలుగుతోంది ఈ వార్తలు వింటుంటే. అమెరికన్ నిపుణుల అంచనాలు సరియై, మనుషులు లేని ప్రదేశాలలో స్కైలాబ్ పతనమౌతుందనే ఆశిద్దాం.

* * *

కళాశాల విద్యార్థులకోసం జ్యోతి ప్రకటిస్తున్న కథలపోటీ వివరాలు ఈ సంచికలో ఉన్నాయి. విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తూ, ఆహ్వానాన్నందిస్తున్నాము.

* * *

ఉత్తరాలు

ఒకవైపు సుధీర్, మరోవైపు శేఖరం, మీదా తమ దోబూచులాటలతో మాకు చాలా కోపం తెప్పించేస్తున్నారు. ఆ రెండు జంటలూ చివరకు ఒకటైపోతారనే మేము నమ్ముతున్నాము. ఆ ఒకటయ్యేందుకు నడుస్తున్న సంఘటనలు చాలా ఆసక్తిదాయకంగా ఉంటున్నాయి - మళ్లీ జ్యోతి పంచికలకోసం యెదురుచూసేలా. ఇది ప్రేమసింహాసనం, మీరా సీరియల్స్ గురించిన విషయం. రెండూ కలిపి రాయవలసి వచ్చింది రెండూ ఒకే ఉత్కంఠతో ముందుకు సాగుతున్నందువల్ల.

—అన్నపూర్ణ, రాజమండ్రి.

జూలై సంచికలో పిల్లి కథ చాలా బాగుంది. అది కల్పనకాదని నా విశ్వాసం. ఒక హైదరాబాదులోనే కాదు దాదాపు ప్రతి నగరంలోనూ అచ్చోసిన ఆంబోతుల్లా వెన్నెముకలేని ప్రజలను బెదిరించి బతికే 'ఖుస్రూ' లెందరో ఉన్నారు. బెదరకుండా అట్టివారిపై ప్రజలు ఎదురు తిరిగితే వారి కొమ్ములు ఊడబెరికినట్లే. తలంచితేనే గుద్దగలరు వాళ్లు. తలెత్తితే రారే. రచయిత తులసి బాలకృష్ణ గారికి అభినందనలు.

—డి. వి. రాజు, అవనిగడ్డ.

జ్యోతిలో ప్రచురిస్తున్న అన్ని కథలూ 'మాస్టర్ పీసెస్', దేనికదే ఆ సంచికకు హైలైట్ అని రాయలేనుగాని నిజంగా మంచి కథలను అందిస్తోంది జ్యోతి. గత సంచికలోని 'హింస' చాలా మంచి కథ. అవతలివారి వ్యక్తిత్వాలకు ఏదో వంక ఆపాదించి ఆలోచించిన కథానాయకుని అవస్థ నిజంగా హింసే. చాలా చక్కని కథ.

—కె. ఎన్. ఆచార్యులు, ఖమ్మం.

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన జూలై సంచిక జ్యోతిలో ప్రచురించిన 'ఓ కథ ముగిసింది' నవల బాగుంది. కాని మొదట సగంవరకూ కథను అర్థం చేసుకోవడం కష్టమైంది ఇదీ అని కారణం చెప్పే ప్రతిభ నాకు లేదు కాని నేను ఫీలయినదది. అయితే మొత్తం నవలగా చాలా బాగుంది. ఒకే వ్యక్తి ముగ్గురి స్నేహితురాండ్ర జీవితాలతో ఆడుకోగలిగి వారిని మోసం చేయగలిగినా చివరకు అన్యాయం సహించలేని ఆడదాని రూపంలో, భార్యే నిలబడి అతన్ని శిక్షించడం చాలా విప్లవాత్మకమైన ముగింపు. అదే సంచికలో ప్రచురించిన వినకుమారీలో వర్ణించబడ్డ ఆడదాని లక్షణాలతో గాకుండా (మీరెంత వెధవపనులైనా చెయ్యండి స్వామీ, భర్తగారూ మీరే నా దైవం, మీ సేవే నా పరమావధి, మీ పాదరేణువులే నాకు పరమపూజ్యములు

FDS APDDC 2810A TEL

వగైరా న్యూసెన్స్ వాగకుండా) మంచి వాడు కానప్పుడు, శిక్షార్హుడు అయినప్పుడు భార్య అయినా సరే భర్తను శిక్షిం చాల్సిందే!

—కె. మాలతి, గుంటూరు.

జూలై నెల జ్యోతి మాసపత్రికయందు ప్రచురించబడిన 'ఊబి' కథానిక చాల బాగుంది. వాస్తవానికి చాల దగ్గరగా వుంది. కొంతమందికి గుణపాఠం చెప్ప గల దీ కథ. ఇలాంటి మంచికథ వ్రాసిన వారికి, మీకు ధన్యవాదాలు. ఎక్కువగా ఇలాంటి కథలకే ప్రాధాన్యత నివ్వ గలరు.

—కె. సరస్వతి, నార్త్ రాజుపాలెం.

నర్సీపట్నంలో చెలం
సంస్మరణ సభ

స్థానిక గ్రంథాలయంలో 25-5-79 వ తేదీన సాయంకాలము 6 గంటలకు స్థానిక సాహితీ సమితి ఆధ్వర్యములో చెలం సంస్మరణసభ జరిగింది. ఈ సందర్భంలో చెలానికి నివాళులర్పిస్తూ—శ్రీ మానేపల్లి సత్యనారాయణ, శ్రీ చాడ శ్రీనివాసరావు, శ్రీ కేసా ప్రగడ రాఘవరావుగారలు ప్రసం గించారు. శ్రీ ఎన్.వి.యల్. నరసింహం గారి వందన సమర్పణతో సభ ముగి సింది.

—వేదుల సింహాచలం, నర్సీపట్నం.

శ్రీ మునీర్‌గారి మినీకథ 'అడ్వెంచర్' ఆఖరి వాక్యంలో అతనికి ఈత రాక పోవడం రచయిత అయిడియాని మినీ కథగా మార్చింది.

అసలు మినీకథ ముగింపు అలా వుండాలి.

—గుడిమెట్ల గోపాలకృష్ణ,
జమాల్‌పూర్-బీహారు.

కీర్తిశేషులు గుడిపాటి వెంకటచలం గారి గురించీ, తుపాను గురించీ కలిపి రాసిన తొలిమాట చాలా అర్థవంతంగా ఉంది. చలం నిజంగా తుపానులాంటివాడే. తాను నమ్మిన సత్యాలను నిర్భయంగా చాటిన వ్యక్తి చలం. వచన రచనలో ఆయనకు సాటి యెవరూ కన్పించరు. ఆయన అన్ని ఉద్దేశ్యాలతో మనం ఏకీభ వించక పోవచ్చునేమోగాని రచయితగా ఆయన ప్రతిభను కాదనలేం మనం. మీరు రాసినట్లు చలం గుర్తును శాశ్వతం చేసుకో వలసిన బాధ్యత మనందరిదీను.

—కె. అప్పారావు, కందుకూరు.

మా అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి రచించిన 'ప్రేమ సింహాసనం' చాలా బాగుంది సుధీర్ యెంతగా స్వప్నని ఆదుకోవాలని చూసినా స్వప్న మొండితనంగా తిరస్కరించడం మాకు స్వప్నపై చాలా ఆగ్రహం కలి గిస్తోంది. అయినా మీరు 'ప్రేమ సింహా సనం' సీరియల్ చాలా తక్కువ పేజీలు వేస్తున్నారు. చాలా అసంతృప్తి కలి గిస్తున్నారు మాకు.

జ్యోతిలో మరో సీరియల్ 'మీరా' కూడా చాలా అద్భుతంగా సాగుతోంది. మీరాకు, శేఖరంకు మధ్య నలిగిపోతున్న అరుణ స్థితి చాలా జాలి కలిగిస్తోంది. మధ్యలో జ్యోతి రంగంలోకి రావడం, ఓ వైపు కుసుమ అభ్యర్థిగా సుందరి ప్రయత్నాలూ, మరోవైపు మూర్తికి అరుణపై అనురాగం కలగడంతో కథ చాలా రసవత్తరంగా సాగుతోంది. ఇంత చక్కగా కథ నడిపిస్తున్న లక్ష్మిగారికి అభినందనలు.

—వి. కె. రాజరాజేశ్వరి, మచిలీపట్టణం.



TRIVENI
BETEL NUT POWDER
PRIDE OF INDIA
CHOICE OF MILLIONS
TRADE MARK
BEST PICKED
FRESH PACKED
TRIVENI
PARIMALA
NUT POWDER
TRIVENI
TRIVENI NUT POWDER MFG. CO.,
Proprietor DESU VENKATA SUBBA RAO
PORT ROAD MACHILIPATNAM 521 001 A P
PHONES 458 & 270

స్టూడెంట్లకు మాత్రమే!

సరికొత్త (పాత) శీర్షిక
సరిపాత (కొత్త) ఆకర్షణ

విద్యార్థులలో రచనాసక్తిని, శక్తిని ప్రోత్సహించుతూ గతంలో 'చిన్నచిన్న కథ' పేరుతో ఒక శీర్షిక నిర్వహించింది. జ్యోతి పాత సంచికల్లోంచి ఊపిరి పోసుకుని అమాంతం ఆ శీర్షిక ఇప్పుడు తిరిగి వచ్చేసింది!

ఇవి పోటీశీర్షిక. అక్టోబరు 79 సంచిక నుంచీ నెలనెలా ఈ శీర్షిక జ్యోతిలో వుంటుంది. భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలకు చెందిన స్టూడెంట్లూ ఇందులో పాల్గొనవచ్చును.

రచనలు పంపువారు తమ పూర్తిపేరూ, చిరునామా, చదువుతున్న తరగతి, కాలేజి చిరునామా రాసిపంపాలి. రచనలు పంపే కవర్లపై 'చిన్నచిన్న కథల పోటీ'కి అని విధిగా రాయాలి.

రచన, జ్యోతిలో రెండు పేజీలకు తగ్గకుండా, మూడు పేజీలకు మించకుండా వుండాలి. అనువాదాలు, అనుసరణలూ లేకుండా స్వంత రచనలే పంపుతూ, ఆ మేరకు ఒక హామీ పత్రాన్ని కూడా జతచెయ్యాలి.

చిన్న కథరూపంలో హాస్య, కరుణ, రౌద్ర, భయానక-మీ ఇష్టం-నవరసాలలో ఏ రసస్ఫూర్తిని కలిగించే రచనైనా పంపవచ్చు. నీరసంగా మాత్రం వుండరాదు

125 రూపాయల బహుమతులు

చిన్నచిన్న కథల పోటీలో ప్రతి నెలా రెండు కథలకు మొదటి బహుమతిగా రు. 75/-, రెండవ బహుమతిగా రు. 50/- పారితోషికం ఇవ్వబడుతుంది. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హమైన వాటిని సాధారణ ప్రచురణకు స్వీకరించే హక్కు జ్యోతికుంటుంది.

ఆగస్టు 1 వ తేదీనుంచీ వచ్చే రచనలకు అక్టోబరు సంచికకోసం పరిశీలిస్తాం. అక్కడ నుంచి అదే పద్ధతిన సెప్టెంబరు 1 వరకూ వచ్చిన రచనలు నవంబరు సంచికకూ . అలా పరిశీలించడం జరుగుతుంది.

కాలేజీ స్టూడెంట్లు తమ రచనాశక్తిని (ఈ సమాసానికి రెండు అర్థాలు—రచనలో శక్తి, రచనలో ఆసక్తి వస్తాయిగావును!) పరీక్షించుకోవడానికి ఇది మంచి అవకాశం. రెండు, మూడు పేజీలు రాయడం కష్టంకాదు గనుక దాదాపు ప్రతివారూ రాయాలని కోరుతున్నాము. అయితే మూడు పేజీలలో ముచ్చటైన కథను రాయడం కష్టం గనుక బహుమతుల నిర్ణయానికి సంబంధించి అంతిమ బాధ్యత మటుకు జ్యోతి సంపాదకులకే వదిలేయాలని మనవి.

వీరి కోసం జ్యోతి అందిస్తున్న కొత్త స్లోగన్

నేటి విద్యార్థులే, నేటి రచయితలూ (రచయిత్రులూను)

—ఎడిటర్

పి. యస్: చిన్నచిన్న మార్పులతో ఈ ప్రకటన కూడా ఒకప్పటి జ్యోతిలోదే!



అచలం

చలంగారిలాంటి మనిషి అయిన రచయిత, రచయిత అయిన మనిషి చాలా అరుదుగా వుంటారు ఆయన నిజాయితీతో బ్రతికాడు నమ్మింది రాసాడు తను చేస్తున్న పనుల కోసం ప్రచారంగా, ఆసరాగా, మార్గాన్వేషణగా ఆత్మ విమర్శకోసం, క్రొత్త బాట కోసం, ఉన్న బాటని ముళ్ళులేకుండా శుభ్రం చేయడం కోసం-ఆయన రాసాడు బ్రతికాడు తపించాడు ఏడ్చాడు నమ్మాడు ఆచరించాడు మార్గాంతరం లేకపోతే నిరాశపడ్డాడు

ఆయన రాసినవాటిని ఉద్యమ సాహిత్యం, ప్రచార సాహిత్యం, అనుభూతి సాహిత్యం, అంతరావలోకన సాహిత్యం అని విభజించుకొంటే కొన్ని క్రొత్త కోణాలు కనబడతాయి

ఆయన మరణిస్తే తెలుగుజాతి అంతా శ్రాద్ధాంజలి ఘటించింది

ఆయన హేతువాది అయినంతకాలమే భజించాలన్నారు ఆయన ఈశ్వరుడేమిటో అర్థం చేసుకోకుండానే ఈశ్వరవాదిగా తీసి పారేశారు కమ్యూనిస్టు కాలేదని విలపించారు శ్రీశ్రీకి ఆయనిచ్చిన తాఖీదునే సమగ్ర సాహిత్యంగా భావించారు ఆయన చిన్ననాటి పరిచయాలు తెల్సిన పెద్దలు పిన్నలు వేదిక లెక్కి సోదితవ్వారు ఆఖరికి అనాగరిక తత్వంవల్ల వచ్చిన ఆలోచనలనీ-మ్యూజింగ్స్‌ని జేరీజువేసి ఆయన సాతిజాన్ని గమనించా లన్నారు

చలంగారికి భజంత్రీలు అప్పుడూలేరు, ఇప్పుడూలేరు కానీ అసత్యశోధకులు, ఆయన నిజాయితీని గమనించలేని హ్రస్వదృష్టులూ ఎక్కువయ్యే ప్రమాదం వుంది

ఒకలాగ చలంగారిది భవ్యజీవితం ఆయనవి దివ్యమైన రచనలు

ఆశోపహతులనూ, నిరాశోపహతులనూ ఆయన ఒకే దివ్వెటి వెలుగుకు ఎత్తారు దీపానికి వెలుగే ధర్మం వెలుగుకు నీడలా జాడలు చూపటం ధ్యేయం జీవింపచేసేది ఉజ్జీవింపచేసింది రచయితకి మచ్చలేని అంతఃకరణ అందుకే ఆయన జీవితం భవ్యమైనది

పరిశీలనశోధన, అనుభవం ఈ భుజాలమీద

ఆయన అజ్ఞానపు పెళ్ళికూతుర్నీ అంధకారపు పెళ్ళికొడుకునీ ఊరేగించాడు.

సంఘర్షణ మొదలు సాక్షాత్కారం దాకా ఆయనకు కనబడిన మహా సౌందర్యం వెనుక ఘోర కురూపం వున్నది. వలపుల సుడి గుండాలలో చైతన్యపు నిస్తేజమూ కనబడింది.

జడ సంస్కృతిలోని ఆంత్ర చూషకాలు మానవత్వాన్నీ సమానతత్వాన్నీ పీల్చడం భరించలేకపోయారు. అలలు అలలుగా విరిగి పడ్తూ బుసకొట్టారు. పడగెత్తి ఎందరినో బలంలేనివారిని రక్షించారు.

ఆ బుస తెలుగు సుడికారానికి వసంతం జల్లింది. వచన రచనకి క్రొత్త స్వరాలు కల్పించింది. రాగల గద్యరచనకి కొత్తపల్లవి అల్లింది వ్యాసాల్ని స్ఫటిక కాంతులతో నిల బెట్టింది. స్వేదగంధాన్నుండి వుత్తరాలను సార్వజనీన శక్తి పుంజాలుగా మార్చే యత్నం చేసింది.

ఆయన ఈశ్వరవాదం వున్నతికోసం పల వరింతగా 'యశోదా గీతాలలో' సంకేతంగా కనబడుతుంది.

"అర్థరాత్రులు యమునాతీరంనుంచి నిలవనీని, చావుకన్నా బలమైన వేణుగానం లాక్కుపోతోందిట. భర్తల్నీ, పిల్లల్నీ ఇళ్ళనీ, సిగ్గునీ, మర్యాదని, ఆజ్ఞల్ని వొదిలి పరుగెత్తు తారట-నాకెన్నడూ వినిపించదేం "

—ఈ 'నామరూప సహితమైన పారం పర్యం' మన సంసారాల్లో పూర్వులూ, చలాన్ని తిట్టినవారూ కోరుకొన్నదే. కాని ఆయన కెన్నడూ కనబడలేదు. కనబడాలని కోరు కున్నాడు. అబద్ధపు బ్రతుకుల్లో అవి ఎలా సాధ్యం కాదో దశాబ్దాలు రాసిపోసాడు.

"—ఎవరు తెరువగలరు ఈ ఇనుపగడియః చేతులు బొబ్బలెక్కాయి. కొట్టుకుపోతున్నాను" అన్నారు

—ఒక్కరూ ఆయనకి సహాయం చేయ లేదు. బొబ్బలెక్కుతాయని భయపడి గడియ తెరువలేక ఆవలిగదిలో, చీకట్లో, మీ ప్రతి

బింబాల్నీ మీ రక్తసంబంధాన్నీ తోటి వారినో అలాగే చావనిచ్చారు.

"అనాదిగా ఈ హారాన్ని లాగి లాగి, నా వేళ్ళు బొబ్బలెక్కాయి. ఒంచి ఒంచి (ఆయన ప్రయత్నాలు) నా మెడ లాక్కుపోతోంది, ఈ చిక్కుల్ని విడతీయలేక నా మతి పోయింది.

అలసిపోయి నా కళ్ళు నాలిక ఎండింది. అయింది నాపని. కాని ఏదో నీ కంఠం నాకు వినిపిస్తున్నట్లే వుంటుంది." (స్త్రీ విమోచన జరుగుతుందనే ఆశాకంఠం)

"వెళ్ళే ప్రజలు సిగ్గుపడ్డారు నా దిగంబరత్వాన్ని చూసి." సమకాలికులు పాఠకులు ఆయన రచనల్లోని వీరవిహారంచూసి సిగ్గుపడ్డారట.

ఒచ్చే జనులు (ఆయన మిత్రులు) జాలిపడ్డారు నా యాతనను గమనించి. కాని ఎవరి తరమూ కాలేదు ఈ గొలుసుల్ని తెంపటం.

ఏం చెయ్యమ తీరా యింతదూరం వచ్చి

నా విశ్వాసం చలిస్తోంది నేనింక ఒక అడుగు కదల్చలేను. నువ్వే ఎదురు రావాలి. నేనే కావలిస్తే (చలం కోరిన స్త్రీ జాగరణే కావలిస్తే) నువ్వే ఒదల్చాలి ఈ భారాలు, సంకెళ్ళు. నువ్వే నా చెయ్యి పట్టుకొని నడిపించుకొని పోవాలి. (ఎవరు ఈ 'నువ్వు'- ముందుతరాల స్త్రీయా? చిత్తశుద్ధి వున్న సంస్కర్తా?)

అనుభూతి ప్రధానంగా అన్వేషించిన కత్తి పదునుగల రచయితని తన పీడను తను చూసి భయపడే స్త్రీని తమరు చేసిన సంఘం-నిజాయితీ లోపించిన సంఘ సంస్కర్తలూ కుదిపి కదిలించాయి.

అర్థశతాబ్దికిపైగా నిప్పులు చెరిగిన చలం ఇంతవేడిగల ఇంధనాన్ని ఎలా సమకూర్చుకున్నారో ఆయన ఆత్మకథ 'చలం' చెప్తుంది. దానిలో ఎందరివో జీవిత చరిత్రల సెగల పొగలు, అరుణల ఆర్తనాదాలు ఘనీభవించి వున్నాయి. అ మంచు శిఖరాలను తను ఎలా ఎక్కిందీ, దిగిందీ, కూలిందీ, వెన్ను చరచుకొన్నదీ రక్తం పట్టేలా చెప్పారు.

ఆనాటి ఆయన నాటికలు చదివితే ఈనాటి నాటక రచయితలకి కొంత క్లూ దొరుకుతుంది. సంభాషణ ప్లాటు, పాత్రల ఇంటర్ ప్లే, సృజన యొక్క వెయ్యి విత్తులూ, పిల్లలు పెట్టగల మాటల గర్భశక్తి, ఆలోచనలకు సులోచనాలు ఇవ్వగల కటకాలు-ఆయన శ్రవ్య సంపుటాల నిండా వున్నాయి.

చలం చిత్రకారుల కవి. అందునా అంగార తల్పంమీది కవి.

"తేనెపిట్ట రెక్కలపై ఆప్యాయంగా రంగులు పూసిన ప్రేమ చీల్చుకుతినే డేగ వాడి ముక్కు రుచిలో మూర్ఛలుపోతోంది" అందుకే—

"యామినీ శిరోజ దీప్తజ్వాలా కుసుమాలు
తేజోతల్పంపై రాలి అదృశ్యమైనాయి,"

కాలతేజోతల్పంపై రాలి అదృశ్యమైనట్లనిపించినా ఆ కుసుమాలు ఆయన రచనలలో నిత్య జ్వాలా దీపాలు వెలుగునిస్తూనే వుంటాయి.

అందుకే రజనికిచ్చిన ఇంటర్వ్యూలో చలం గారు, "—ఎందుకింత చీకటి వుందో? మూర్ఖత్వం వుందో-యింత క్రౌర్యముందో ఈ ప్రపంచంలో ఎక్కడినుంచి పుడుతోంది ఇదంతా! అసలు సత్యం ఎక్కడనేటటువంటి అన్వేషణలోనే మీకు ఆ పుస్తకాలన్నీ వ్రాసాను. మీరు వాటిని వరుసగా తేదీల ప్రకారం చూసినట్లయితే అది ఒక జీవిత సమరం అవుతుంది. మొదటి పుస్తకం దగ్గర నుంచీ యీనాటివరకూ వూరికే రాయాలని రాసిన పుస్తకం ఒక్కటీలేదు. ఒక్క కథ లేదు."

"ఈ లోకపు అంధకారం ఎంత గొప్పదంటే-సముద్రంలో ఎన్ని కాగడాలు వెలిగించి పారేసినా ఎట్లా ఆరిపోతాయో అట్లా ముంచేటటువంటి అంధకారం లోకంలో పేరుకుంది. కాని ఎవడేం చేయగలడు? అందుకని ఏదో చేతైంది చేసేయడం. అది మనపని కాదనుకోవటం. వదిలేయడం " అన్నారు.

—పన్నాల సుబ్రహ్మణ్యభట్టు



ప్రపంచం నిద్రపోతోంది.

ఆ నిద్రకు రూపాలు అనంతం

అందంగా—వికృతంగా

ఆర్భాటంగా—ఆవేదనగా

మత్తుగా—అలసటగా

ఆశల్ని మేస్తూ—నిరాశల్ని కక్కుకుంటూ.

అనుభవం చివుళ్ళని తుంచుకుంటూ-ఆకలి మొదళ్ళని తెంచుకుంటూ.

నిద్రపోనిదల్లా ఆ గదీ—

గదిలోని గడియారం—

గడియారంలాంటి మనుష్యులూ.

కాలం గుండెకాయ గడియారంముళ్ళ,

మధ్య చిక్కుకుని బిక్కు బిక్కుమంటూ కొట్టుకుంటోంది.

సృష్టిలోని చీకటినంతా చీపురుతో చిమ్మి, అక్కడే పారబోసినట్లు ఆ గదంతా నల్లగా, నల్లనల్లగా ఉంది.

నల్లటి ఆ గదిలో చీకటి నీడల్లా ముగ్గురు.

గడియారం పన్నెండుసార్లు నిట్టూర్చింది, మార్చి మార్చి ఆ ముగ్గుర్నీ చూస్తూ.

కాళ్ళకట్ట తెగిపోయిన నులకమంచంలో వెల్లకిలా పడుకున్న పరశురామయ్య తదేకంగా చూస్తున్నాడు ఇంటికప్పు కేసి. పైకప్పు కన్నంలోంచి, ఓ వెన్నెల కిరణం పరశురామయ్య కంట్లో ప్రతిఫలించాలని ప్రయత్నించింది. కాని, గబ్బిలం కాబోలు అడ్డంవచ్చి కప్పుదగ్గరే ఆగిపోయింది జాలిగా చూస్తూ.

గుమ్మానికి చెరో ప్రక్కా జారగిలబడి కూర్చున్నారు కన్య, కుమార్‌లు.

వాళ్ళ ముగ్గురి మనసుల్లోనూ తీవ్రమైన అలజడి.

ఒకరితో ఒకరు మాట్లాడుకునే ధైర్యం లేదు.

ఆ మనసుల్లో భాషకందని భావాలే తప్ప-మాటలు లేవు. ఉన్నా అవి వినిపించవు.

అందుకే మౌనం 'మొనార్క్'లా ఆ చీకటి గదిని ఏలుతోంది.

ఎవరి ఆలోచనలో వాళ్ళు ఈదుతూ—

ఎవరి ఏకాంతాన్ని వాళ్ళు మోసుకుంటూ—

సమాధానం వెతుక్కుంటున్న ప్రశ్న—

కనీసం రేపటి ఇంటర్వ్యూలోనైనా కుమార్‌కు ఉద్యోగం రాకపోతే !

ఆ ప్రశ్నకు సమాధానం అందులోనూ తృప్తికరమైన సమాధానం ఖరీదు చాలా ఎక్కువని వాళ్ళ ముగ్గురికీ తెలుసు.

నేడో, రేపో రిటైర్ అవబోతున్న పరశురామయ్య—

స్త్రీత్వం సంతరించుకుని పదేళ్ళైనా కన్యగానే మిగిలిపోయిన కన్య—

రాత్రింబవళ్ళు శ్రమించి ఫస్ట్‌రాంక్‌లో పట్టా పుచ్చుకున్న తర్వాత అయిదేళ్ళుగా నిరుద్యోగిగా తిరుగుతున్న కుమార్.

ముగ్గురూ

పగలు కలలుకనే ధైర్యంలేక-నిద్రరాని కళ్ళతో చీకటి రాత్రిని అర్థిస్తున్నారు సమస్యకు సమాధానం చెప్పమంటూ.

నాకేం తెలుసు? మీరే వెతుక్కోండంటూ వెకిలిగా నవ్వింది చీకటిరాత్రి.

గదిలోని గడియారం మాత్రం తను నిమిత్తమాత్రురాలినన్నట్లు క్షణాల్ని ముడి వేస్తూ 'కాలం' చాంతాడును పేనుతోంది.

ర ర ర

ఏదో లేవోయ్ పరశురామయ్యా! గుడ్డిలో మెల్లన్నట్లు-మన డిపార్టుమెంట్‌లో సర్వీసులో ఉండగా గుటుక్కుమంటే, మన పిల్లలకి ఉద్యోగం అంటూ ఏదో ఒకటి ఇస్తారు. ఇది కొంత నయం-మన తర్వాత పెళ్ళాం బిడ్డలు వీధిన పడకుండా "

తోటి గుమస్తా సుందర్రామయ్య అన్న మాటలు పరశురామయ్య చెవుల్లో ప్రతిధ్వనించాయ్!

అంటే—అంటే నేను సర్వీసులో ఉండగానే చనిపోతే

ఆలోచనా తరంగం లేపిన అలజడికి-అంతరంగం సముద్రంలో షార్క్‌లా ఒక్కసారి ఎగిరిపడింది.

పరశురామయ్య ఊహలు చదువుతున్న గోడగడియారం ఒక్కక్షణం విస్తుబోయింది.

అవును అంతే చెయ్యాలి కళ్ళు మూసుకుని తన బ్రతుక్కు-మరణానికీ మధ్యనున్న సరిహద్దురేఖను చెరుపుకోగలిగితే కుమార్‌కు ఉద్యోగం


ప్రతిక్షణం వాడి జీవితంలో నవతోరణరేఖ నవ్వుతుంది

తమ్ముడు ఉద్యోగంచేసి దుర్భరమైన తన జీవితానికి ఓ అర్థం, పరమార్థం కల్పిస్తాడని నమ్ముకున్న వెర్రితల్లి ఆశ నెరవేరుతుంది

కాని, ఈ సంగతి వాళ్ళకు తెలిస్తే ?

అప్పే ఎందుకు తెలుస్తుంది

తెలియకుండా, అతిసహజంగా, క్షణకాలంలో



జరిగిపోయేందుకు ఎన్ని మందులు లేవు

గోడగడియారం భయంతో ఒక్కసారి గుండె బాదుకుంది

సమయం రాత్రి ఒంటి గంట——!

క్ష క్ష క్ష

యూనివర్సిటీలో కాన్వొకేషన్ రోజున గోల్డ్ మెడల్ యిస్తూ-తనని ప్రశంసించిన సన్ని వేశమూ-ఆ ప్రశంసల పలకరింపులూ-కళ్ళ ముందు కదిలాయ్ కుమార్‌కు వెర్రిగా నవ్వుకున్నాడు

ఇరవై ఇంటర్వ్యూలలో పనికిరాని డిగ్రీ-కనీసం రేపటి యింటర్వ్యూలోనైనా పని కొస్తుందా గోల్డ్ మెడలిస్ట్ కుమార్‌కు ?

"ఇటీజ్ డామ్ క్రిపిల్డ్ డిగ్రీ క్రిపిల్డ్ క్రిపిల్డ్

అనాలోచితంగా దొర్లిన తన ఆలోచనను ఆత్రుతగా మళ్ళీ మళ్ళీ వెతుక్కున్నాడు కుమార్

చటుక్కున మనసులో ఓ ఫ్లాష్ వెలిగింది

అన్నట్లు-క్రిపల్డ్ కాండిడేట్స్‌కు రిజర్వేషన్స్ ఉన్నాయి కదూ?!

యస్ తనూ వాళ్ళలో ఒకడెందుకు కాకూడదు? ఎందుకు కాకూడదు??

అతని ముఖంలో కండరాలు ఒక్క క్షణం బిగుసుకుని అంతలోనే యీజ్ అయ్యాయి

నో అదర్ వే ఓ చెయ్యి లేకున్నా ఫర్వాలేదు. నాన్న ఇంకో నాలుగైదు నెలల్లో రిటైరై పోతారు ఆ తర్వాత ఫుక్తి ? తన మీదే ఆశలు పెంచుకు బ్రతుకుతున్న కన్యక్క పెళ్ళి——

సమస్యకు పరిష్కారం దొరికినట్లు, తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు కుమార్

ఈ ఘోరాన్ని భరించలేనట్లుగా, చీకటి తలుపుల్ని మరో రెండుమార్లు గట్టిగా తట్టింది గడియారం

సమయం——రాత్రి రెండు గంటలు !

క్ష క్ష క్ష

శుష్కంగా నవ్వుకుంది కన్య తనలో తను

బాగా ఆలోచించే, పుట్టినపుడే, తన నూరేళ్ళ బ్రతుకు భవిష్యత్తునూ చేరిజూపే పెట్టారేమో తనకు పేరు

తోటివాళ్ళయిన దత్తుడిగారి పార్వతీ, శారదా, విజయకుమారీ, ఇల్లాళ్ళయి ఇద్దరు ముగ్గురు పిల్లల తల్లులయ్యారు తను మాత్రం

యింకా కన్యే !

"ఇప్పుడు సమస్య నువ్వు 'కన్యవా-తల్లివా' అనికాదు. ఇందాక మీరు ముగ్గురూ అడిగారే-కుమార్ ఉద్యోగం సంగతి-అదుగో అదీ!" అంటూ కళ్ళమీద సూదులు పొడిచింది చీకటి.

భయంతో ప్రక్కకు తిరిగి చూసింది కన్య.

లీలగా తమ్ముడి ఆకారం కన్పించింది.

ఆమె మనసు కరిగిపోయింది

"నాన్న రిటైరైపోతే, ఉద్యోగంలేని తమ్ముడూ-పెళ్లికాని తనూ-తమని వేటాడే ఆకలీ !"

కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

తనేం చేయగలదు ఈ పరిస్థితుల్లో? ఏం చేస్తే తమ్ముడికి ఉద్యోగం దొరుకుతుంది?? అసలేం చాతనవును తనకు???

ఉన్నదల్లా కేవలం అడవికాసిన వెన్నెల లాంటి అందం మాత్రం "

ప్రక్కవీధి దత్తుడిగారి దొడ్లో పోట్లగిత్త కట్లు తెంచుకుని, వేసిన భయంకరమైన అంకె ఆ మరుక్షణమే భీతితో అంబా అంబా అని అరుస్తూ, పరుగెత్తుతున్న ఆవు డెక్కల చప్పుడూ

ఒక్కసారి ఉలిక్కిపడింది కన్య.

చీకటి మూపున స్వారిచేస్తూ, పోట్లగిత్త అంకెల్నీ, భీతిల్లిన ఆవు అరుపుల్ని మోసుకొచ్చిన వాయుతరంగం, కన్య కర్ణేంద్రియాల చుట్టూ పనిగట్టుకుని ఏలాసంగా పరిభ్రమించింది.

"ఈ అందం ఎలాగూ అడవిపాలే పోనీ వెన్నెలను నాగరికత మైదానానికి అర్పిస్తే కనీసం తన తమ్ముడికి, తన నీడైనా కన్పించవచ్చేమో !"

యుగయుగాలుగా జీర్ణించుకుపోయిన సంస్కృతిని నిలువునా కోస్తూ, కదిలిన ఊహతో, కన్య రక్తం సల సల కాగింది.

"ఇంతకుమించి వేరేమార్గం మాత్రం ఏదీ! కాదూ కూడదని పవిత్రంగా నిలుపుకున్నా ఈ కన్నెరికానికి ఏమిటి ప్రయోజనం?? ఎవరు మెచ్చును-మరెవరు వరించను???

ఇలా ఆయితే కనీసం ఈ అందానికి ఓ సార్ధకత ఏర్పడినట్లేగా ! అంతకుమించి తమ్ముడి భవిష్యత్తు ఎంత ఆనందంగా ఉంటుంది!"

కన్య ఆలోచనల్ని పసిగట్టింది కాబోలు—కసిగా నవ్వుకుంది చీకటి.

పెళ్ళి కాని కన్య

అందమైన కన్య

కలలు కనీకనీ అలిసి సొలిసిన కన్య

తమ్ముడి ఉద్యోగంకోసం - ఓ ముక్కూ-మొహం తెలీనివాడికి తన కన్యాత్వాన్ని అర్పించుకోడానికి

గడియారం గుండె ఆగిపోయింది.

కాని, అప్పుడు సమయం-రాత్రి మూడు గంటలు

* * *

సూర్యుడు నడినెత్తిమీది కొచ్చాడు.

అద్దాలు బిగించిన ఎర్‌కండిషన్డు గది. పరదాలు దాటలేని తన అశక్తతను తలుచుకుని రోషపడి కాబోలు, న్యూరోటిక్‌లా, ఆఖరు ఊపిరి పీల్చుకుంటున్న చెట్లమీద, నాగరికత, తన చక్రాలక్రింద నిర్దాక్షిణ్యంగా రేప్ చేస్తున్న ఆ నగ్న వేశ్యల్లాంటి రోడ్ల మీదా తన ప్రతాపం చూపిస్తున్నాడు.

ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళు, క్యూలో వరసగా నిలబడి ఉన్నారు—

రేషన్‌షాప్ ముందు, కార్డు పట్టుకుని పంచదారకోసం నిల్చున్నవాళ్ళలా, చేతుల్లో డిగ్రీలు మార్క్సు షీట్సు పట్టుకుని.


క్యూ మెల్లిగా కదులుతోంది-కుమార్ చివరి వాడు

అతని మనసు కల్లోలిత సాగర గర్భంలా వుంది.

అదృష్టం ఈసారీ తనను మోసగిస్తే ??

నిస్పృహ అతన్ని చుట్టుముట్టింది. "నో మోర్ ఇంటర్వ్యూ కుమార్—ది గ్రేట్ గోల్డు మెడలిస్టు విల్ డై యస్ కుమార్ చచ్చిపోతాడు హిజ్ హిస్టరీ విల్ బి రిటెన్

(వి)చిత్ర విజ్ఞానం



పసిపిల్లల మనోతత్త్వ శాస్త్రజ్ఞుడు, డా॥ ఇర్‌వింగ్ మార్కోవిట్జ్ అల్లరిపిల్లలను అదుపులోకి తేవడానికి, తల్లీ తండ్రీ — యిద్దరూ సమంగా పాటుపడాలి అంటున్నారు! "ఉండు! ఆఫీసునుంచి మీ నాన్నగారు రానీ! నీ పనిబడతాను!" అని గదమాయించే తల్లి పిల్లవాడికి చులకనై పోతుందట. ఆఫీసునుండి అలిసి సొలిసి వచ్చిన తండ్రి పిల్లవాడి మాట పట్టించుకోపోతే, ఆ తండ్రీ చులకనై పోతాడట! పిల్లవాడి అల్లరి పెరగడమేగాక అతడు "మంచిబాలుడు రాము" అవడం అతికష్టం అంటున్నారు డా॥ ఇర్‌వింగ్. వీరు అమెరికాలోని న్యూజెర్సీ కుటుంబ-శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్నారు!

ఇన్ గోల్డెన్ లెటర్స్ ఇన్‌ది ఎరా ఆఫ్ డెమొక్రసీ భారతదేశపు భావి నిరుద్యోగులు-తన కంచు విగ్రహాన్ని నాలుగురోడ్ల కూడలిల్లో ఆవిష్కరిస్తారు

కవులు-తన జీవితాన్ని, అత్యంత హృదయ విదారకంగా, విషాదగీతికలుగా రచిస్తారు.

"కుమార్ !" ఎవరో చేత్తో తట్టి పిలుస్తున్నట్లనిపించి, ప్రక్కకు తిరిగిచూశాడు.

ఎదురుగా తండ్రీ-అక్కా!

"ఏమిటిలా వచ్చారు?" అన్నాడు ఆశ్చర్యంగా కొంచెం క్యూలోనుండి పక్కకు జరిగి.

పరశురామయ్య చెప్పాలా వద్దా అన్నట్లు తటపటాయించాడు ఓక్షణం.

"చెప్పు నాన్నా—! ఏమిటి సంగతి!" ఆందోళనగా అడిగాడు కుమార్.

"మీ మామయ్య పోయాట్ట. ఇంటర్వ్యూ కాగానే ఇట్నుంచిటు ఊరెళ్లి పోదామని "

నిట్టూర్చాడు కుమార్ "ఆపేక్షలున్నా, లేకపోయినా ఫార్మాలిటీస్ "

"సరే! అలాగే వెళ్లిపోదాం. అక్కడ కూర్చోండి అంతవరకూ!" అంటూ మళ్ళీ క్యూలో సర్దుకున్నాడు.

స్వింగ్‌డోర్ పక్కనేవున్న బెంచీమీద కూర్చునేందుకు ముందుకువెళ్ళారు పరశురామయ్యా, కన్య.

"బాబూ! తవరక్కడ కూకోటం అయ్యగారు సూత్తే అగ్గి అయిపోతాడు. దానికితోడు ఇంటర్వ్యూలు గూడ నడుత్తుండయ్ ఈ వరండా సివరికెళ్ళితే, కుడిపక్కన ఇంకో వరండా వుంది. అక్కడ కూసోండి సార్!" అన్నాడు ప్యూన్.

మెల్లగా అటువైపు కదిలారు తండ్రీ, కూతుళ్ళు.

క్యూలో కుమార్ కాక, అతనికి ముందు ఇంకా ముగ్గురు మాత్రమే మిగిలారు.

ప్యూన్ కేకతో అందరికంటె ముందున్న తను ఆఫీసర్ గదిలోకి వెళ్ళాడు.

"నే పేరు ?"

"సతీష్ "

" "

" "

వెంటిలేటర్‌నుండి ఆఫీసర్ గదిలోనుండి విన్పిస్తున్న సంభాషణను యధాలాపంగా వింటున్నారు పరశురామయ్య, కన్య

"అన్నట్లు పాపం మీ నాన్నగారు ఈ డిపార్టుమెంట్‌లోనే పనిచేసేవారట కదూ ! అయామ్‌సారీ ఆయన ఆన్‌డ్యూటీలో ఏక్సిడెంట్‌లో

పరశురామయ్యకు కడుపులో ప్రేగు తెగి నట్లనిపించింది.

కళ్ళముందు ఓ క్షణం సుందర్రామయ్య రూపం కన్పించింది.

"అంటే-ఈ ఇంటర్వ్యూలో కూడా కుమార్‌కు ..."

ఆ తర్వాత ఆలోచించే ధైర్యం లేక పోయింది.

రాత్రి 1 గంటకు ఈ సమస్యకు పరిష్కృతిగా తను తీసుకున్న నిర్ణయం

సరైన ఫలితాన్నే ఇస్తుందనిపించింది ఆఫీసర్ మాటల్లోని మార్దవతని బట్టి

గట్టిగా కళ్ళు మూసుకున్నాడు

"నెక్స్ట్ !" కాలింగ్ బెల్ నొక్కి ప్యూన్‌కు చెప్పాడు ఆఫీసర్.

మెల్లిగా స్వింగ్ డోర్ తెరిచి, లోపలకు వెళ్ళాడు రెండో అతను కొంచెంగా కుంటుతూ.

అప్పటివరకూ అతని కుంటితనాన్ని గమనించని కుమార్ కళ్ళు క్షణకాలం కుంచించుకుపోయాయి.

అతని కళ్లు అందించిన 'మెసేజ్‌ని' అతని మెదడు చకచకా భావాలుగా మార్చి, ప్రాజెక్టు చేసింది.

"అంటే హి ఈజ్ క్రిపిల్డ్ ఈ ఉద్యోగం."

కుమార్ ది గ్రేట్ గోల్డు మెడలిస్టు విల్ డై రిటైరవ్వాల్సిన నాన్ననూ-పెళ్ళి కావాల్సిన కన్యక్కనూ వదిలి

" నో బ్రతుకుతాను వాళ్ళ కోసం బ్రతుకుతాను నెక్స్ట్ ఇంటర్వ్యూలో గోల్డు మెడలిస్టు కుమార్ విల్ ఎప్లయ్ యాజ్ క్రిపిల్డ్ కుమార్ !" ఎడంచేతిని కుడిచేత్తో తడుముకుంటూ వెర్రిగా నవ్వుకున్నాడు.


ఇంతలో కుమార్ ముందున్నతను వెళ్లాడు గదిలోకి.

ఆశనిండిన కళ్ళతో కుంటుకుంటూ, తన ప్రక్కనుండి వెళ్ళిపోతున్నతన్ని చూసి అనుకున్నాడు కుమార్, గుడ్‌బై మై క్రిపిల్డ్ అనెంప్లాయ్‌డ్ బ్రదర్. ఈ ఉద్యోగం నీకు వస్తున్నందుకు నాకు జెలసీలేదు. సంతోషంగా వుంది. నాగురించి బాధపడకు. నెక్స్ట్ టైమ్ ఇదుగో ఈ ఎడమచెయ్యిని తీసేసుకుంటా!"

పులిస్తరాకు

ఆకాశపు అంచుల్లో నిలబడి
చందనం పూసుకున్న చంద్రుణ్ణి పలకరించు
వెలయాలి చీరచెంగులో దూరి
కాటుక పెట్టుకున్న కళ్ళని ముద్దుపెట్టుకో
నేను మాత్రం—
పేదవాడి పగిలిన గుండెల్లోకి ప్రాకి
ఆకలితో దించుకుపోయిన కడుపును కావలించుకుని
గోడవతల పారేసిన పులిస్తరాకులోని
ఎంగిలి మెతుకుల్ని ఏరుకు తింటా.

—ప్రేమ్‌శిల.



"నిన్నెక్కడో చూసినట్లుంది అదీ ఈ పది పదిహేను రోజుల్లోనే ఎక్కడైనా ఉంటుం దబ్బా!" సాలోచనగా అంటున్న ఆఫీసర్ మాటలు విన్పించి, కన్య అశాంతిగా లేచి, తమ్ముడివైపు నడిచింది ధైర్యం చెప్పడానికి.

బయటకు వస్తున్నతను కళ్ళు తుడుచు కుంటూ, జేబులోనుండి, ఏదో బయటకుతీసి, ఒక్కక్షణం తదేకంగా చూశాడు.

అతని వాలకాన్నీ, అతని కన్నీళ్ళనీ చూచిన కన్య మనసు జాలితో కరిగిపోయింది. మానవత్వం అతనికి ధైర్యం చెప్పమని ముందడుగు వేయించింది.

అతని చేతిలో వున్నది చూసి వులిక్కిపడింది కన్య.

ఎవరిదో అమ్మాయి ఫోటో అచ్చు ఆ కుర్రాడి పోలికలే.

"మీ అక్కా?" అక్షరాల్ని కూడదీసు కుంటూ అడిగింది కన్య.

అవునన్నట్లుగా తలూపి వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయాడు అతను. ఇందాక ఆఫీసర్ మాటల్నీ, ఆ కుర్రాడి ప్రవర్తననూ, ఆ అమ్మాయి ఫొటోనూ పక్క పక్క పెట్టి చూసిన కన్య కొయ్యబారిపోయింది.

రాత్రి తనలో కలిగిన భయంకరమైన ఊహకు-తనకంటే ముందే ఓ రూపాన్నిచ్చింది మరో కన్య.

ఇంతలో కుమార్ బయటకొచ్చాడు.

ఏమైందన్నట్లుగా పరశురామయ్యా, కన్యా చూశారు. ఆ చూపుల్లో ఆశలేదు. చైతన్యపు రేఖలేదు.

అర్థం తనకు పట్టనట్లుగా, నిప్పులుచెరిగే సూర్యుడ్ని చూడాలని ప్రయత్నిస్తున్నట్లు ఆకాశంకేసి చూశాడు కుమార్.

ఇంతలో గదిలోనుండి ఆఫీసర్ గొంతు గట్టిగా విన్పించంది.

పి.ఏ. గారా ?

" ఆ ? హైద్రాబాద్నుండి ట్రంకాలా! మినిస్టర్గారా? గువ్వల చెన్నగారేనా...కనెక్షన్ ఇవ్వండి నమస్తేసార్ నమస్తేసార్ ఏమిటీ ? కాండిడేట్ని రేపు పంపిస్తారా. అలాగేసార్ తప్పకుండా ఈ పోస్టు వారికే యిస్తాను అమ్మమ్మమ్మ తవరు చెప్పడమూ, నేను చెయ్యకపోడమూనా "

ఆ తర్వాతి మాటలు అక్కడున్న ముగ్గురికీ విన్పించలేదు. □

సమాధి కవిత

నిన్న సంధ్య నీటిలో గీచిన చిత్రాలు
యింకా కళ్ళలో ప్రతిబింబిస్తున్నాయి
కాలప్రవాహంలో నేనూ ఎన్ని
విషాదానందాశ్రువులు రాల్చానో
ఎక్కడ ఎవరు ప్రవాహంలో దిగి
నా హృదయంలో మునకలేసినట్లు
అనుభూతిస్తున్నారో
ఎన్ని పవనాలు ఎక్కడివాటిని మోసుకొస్తాయో
వొక్కొక్కసారి గుండెని కదలలేనంత
భారంతో నింపివేస్తుంది
వొక్కో పవనం వొక్క చిరునవ్వుతో ఎగురగొట్టేస్తుంది
గుండెని—మబ్బుల వుయ్యల లూపుతుంది ఆకాశంలో!
యింద్రధనుస్సులో రంగుల్లా ఋతువులు
వొకదాన్నొకటి తరుముతూ వుంటాయి
అన్ని ఋతువులనుంచీ వసంతాన్ని పిండుకొనే
స్వచ్ఛమైన చూపుకోసమే యీనాడు
మానవాత్మ అన్వేషిస్తోంది;
మనసు వెల్లవేసినట్లు అనిపిస్తుంది వొక్కొక్షణం
కాని కాలం అదృశ్య హస్తం
రంగులపైన రంగులని పులుముతూ వుంటుంది
వాటి నర్థం చేసుకోవటంలోనే
జీవితం హరించిపోతుంది;
జీవితాలకి జీవితాలే పల్కరిస్తాయి
పుస్తకాల సమాధులనుండి
కొన్ని అనుభవైక వేద్యమైన పరిమళాలతో
వూపిరితిత్తులని శుభ్రపరుస్తాయి
నాడుల్లో రుధిర విప్లవాల్ని రగిలిస్తాయి;
హృదయాల్లో రాగోదయాల్ని వెలిగిస్తాయి;
నా స్నేహితులందరూ సమాధుల్లో వున్నవారే
నిశ్శబ్దంలో పిలిచినపుడు పలుకుతారు
నేనూ కడుతున్నాను నా కోసం నేనే
వో అందమైన సమాధిని వొక్కో యిటుకలోనూ
నా రక్తం కలలసారం అనుభవపారావారం
ఘనీభవించిన సమాధిని! —కె. యస్. రమణ

సీరియల్



10

అహల్యమ్మగారు కొడుకుచేతికి కాఫీ కప్పు అందిస్తూ అంది "విమలగాని మామయ్యగాని మన యింటికి రాక పది రోజులు అవుతోంది!"

సుధీర్ జవాబు చెప్పలేదు. అహల్యమ్మగారి కంఠంలో నిష్ఠూరం తొంగి చూసింది. "కనీసం ఫోన్ అయినా చేయలేదు."

"ఏదయినా పనిలో వున్నారేమో నమ్మా,"

"ఎంత పనిలో వుంటే మాత్రం విమల నాతో మాట్లాడకుండా ఎప్పుడూ వుండదు. నేను ఎన్నిసార్లు ఫోన్ చేసినా, ఇంట్లో లేరని వంటమనిషి అంటున్నాడు. అలా అని చెప్పిస్తున్నారేమోనని నా అనుమానం. కనీసం వదిన కూడా మాట్లాడటం లేదు."

సుధీర్ కాఫీ తాగుతూ, స్పోర్ట్స్‌వీక్ తిరగేస్తూ మౌనంగా వింటున్నాడు.

"దానికి బాగా కోపం వచ్చిందిరా అని నేను ఆ రోజే అంటే నువ్వు నవ్వి వూరుకున్నావు."

"నేనేం చేసానమ్మా?" నవ్వుతూనే అడిగాడు.

"ఏం చేసానంటావేం! ఆరోజు సినిమాకి వెళ్లాలని విమల అంత గొడవచేస్తే బయలుదేరుతూ. తీరా డాక్టర్‌గారి దగ్గరనుంచి ఫోన్ వచ్చిందని వెళ్లిపోయావు. థియేటర్ దగ్గరకి వస్తానని రాకుండా వుండిపోయావు."

"నేను కావాలని చేయలేదు. పని అలా వచ్చింది. అయినా దాన్ని యింత పెద్ద నేరంగా చిత్రించటం వాళ్ళ తప్పు."

"పోనీ, విమలకి ఫోన్‌చేసి మాట్లాడమంటే అదీ చేయలేదు.

"అదేమిటమ్మా! ఆ రాత్రి రాగానే నీ ఎదుటేగా చేసాను. నిద్రపోయారని నౌకరు చెప్పాడు."

"అది వాళ్లు కావాలని చెప్పిన మాట అని తర్వాత అర్థం అయిందిగా."

"ఇప్పుడు నన్నేం చేయమంటావమ్మా?"

"మామయ్య యింటికి వెళ్లి విమలతో మాట్లాడమని ఎన్నిసార్లు చెప్పాను! నా మాట వినిపించుకున్నావా నువ్వు?"

సుధీర్ ఖాళీకప్పు పక్కన టేబిల్‌మీద పెట్టాడు.

"నా వల్ల కాదమ్మా! నేనేదో తప్పు చేసినట్టు వాళ్ళు అనుకుంటే, చాలా పొరబడ్డారన్నమాటే! విమల అలగటంలో అర్థం వుంది. కానీ అత్తయ్యా మామయ్యా దాన్ని యింత పెద్ద విషయంగా చూసి రగడ చేయటంలో అస్సలు అర్థం లేదు."

"విమల అంటే మామయ్యకు ఎంత ప్రాణమో నీకు తెలుసుగా!"

"అయితే మాత్రం! విమలకి ఆయన చేసే గారాబం, యితరుల ప్రాణాలు తీస్తోందని గమనించడేం?"

"ఇద్దరూ తెగేవరకూ లాగకండి. సుధీ! మామయ్య మనకి చేసిన మేలుకి మనం ఏ మిచ్చినా ఋణం తీరదు. మామయ్య అండే గనక మనకి లేనట్టయితే మనం ఎక్కడ వుండేవాళ్ళమో! ఆ విషయం నువ్వు కలలో కూడా మర్చిపోవద్దు."

సుధీర్ చేతిలో పుస్తకం పక్కన పడేసి లేచాడు. అతని కళ్ళు ఒక్కసారిగా వుద్రేకం కట్టలు తెంచుకున్నట్టుగా తీక్షణంగా ప్రజ్వరిల్లినాయి. కానీ, అంతలోనే దాన్ని బలవంతంగా నిగ్రహించుకుంటున్నట్టుగా గుటక మింగాడు. మరుక్షణంలో అతని ముఖం మామూలుగా అయింది.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావమ్మా!"

"మామయ్య యింటికి వెళ్లు. విమలని క్షమార్పణ కోరుకో."

"నావల్ల కాదమ్మా!"

"ఎందుకు కాదురా! మీ యిద్దరి మధ్య ఎక్కువ తక్కువ లేమిటి? నోటితో ఒక్కసారి సారీ అని అనేస్తే ఏం పోతుందిరా? దానివల్ల ఎంతో గొడవ తప్పుతుంది. రేపు మన యింటికి కంచి స్వాములవారు వస్తున్నారు. అందరినీ పిలుస్తున్నాను. మామయ్య రాకపోతే నలుగురూ ఏమనుకుంటారు? నువ్వు నాకోసం అయినా విమలకి మామయ్యకి క్షమార్పణ చెప్పి రావాలి. వెళ్ళు. నాకు యింకేం సాకులు

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందును సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు.

చెప్పకు. రేపు యింటికి యాభై మందికి పైగా వస్తున్నారు. పూజ, పునస్కారాలు వున్నాయి. ఆ ఏర్పాట్లు చూసుకోవాలి. నన్ను బాధపెట్టకు. నీవేం చెబుతావో, ఏం బ్రతిమలాడుతావో నాకు తెలియదు. సాయంత్రంలోగా విమల నాకు ఫోన్ చేయాలి. తెలిసిందా?" అనేసి వెళ్ళిపోయింది.

సంభాషణ మొదట మొదట్లో ఆవిడ కంఠం కొడుకుని బ్రతిమలాడుతున్నట్టుగా వున్నా, రాను రాను తీక్షణమై ఆజ్ఞాపిస్తున్నట్టుగా మారింది.

తల్లి వెళ్ళిపోయిం తర్వాత సుధీర్ చాలాసేపు అక్కడే నిల్చుండిపోయాడు; అతని మనసుని ఆగ్రహం, నిస్సహాయత రెండూ పెనవేసుకున్నాయి; తల్లి అలా మాట్లాడినందుకు ఆగ్రహం, తల్లికి ఎదురు తిరిగి, జవాబు చెప్పి ఆవిడని బాధపెట్టలేనందుకు నిస్సహాయత్వం, అలాటి సమయాల్లో అతని మనసు చిత్రమైన వేదనకి గురి అవుతుంది. ఒకవైపు మనసు రోషంతో ఎదురు తిరుగుతుంది. యింకొకవైపు తల్లిని బాధపెడుతానేమోననే వెరపు వెనక్కి లాగుతూ వుంటుంది. అతనికి తెలుసు, తల్లికి తనంటే పంచప్రాణాలు. తన వైపునుంచి ఏకాస్త బాధ ఎదురయినా ఆవిడ తట్టుకోలేదు. అందుకే అతను బుద్ధి తెలిసినప్పటినుంచీ మామయ్య అధికారం భరిస్తూ వచ్చాడు.

సుధీర్‌కి 10 సంవత్సరాల వయసు అప్పుడు తండ్రి పోయాడు। చాలా ఆస్థి వుండటంతో, బంధువులతో రకరకాల యిబ్బందులు ఎదురయినాయి. ఆ యిబ్బందుల్ని అన్నగారి సాయంతో అహల్యమ్మగారు ఎదుర్కొంది। ఆవిడకి అన్నగారంటే, ఎనలేని అభిమానం। అన్నయ్య తనకి చేసిన సాయానికి కృతజ్ఞతగా, విమలని కోడలుగా చేసుకోవాలని ఆవిడ దృఢనిశ్చయం।

సుధీర్ వూహ తెలిసినప్పటి నుంచీ, ఆ యింట్లో మేనమామ పెత్తనం బాగా సాగుతూనే వుంది। చిన్నతనంలో ఒకసారి, విమలతో ఆటల్లో పోట్లాట వచ్చినప్పుడు, సుధీర్ విమలని చిత్తుగా తన్నాడు।

ఆ రోజున, ధనంజయరావుగారి కంటే, తల్లి చేసిన హంగామా, అంతా యింతా కాదు.

విమలని తనే డాక్టరు దగ్గరకి తీసుకు వెళ్ళింది. మంచం దగ్గర కూర్చుండి సపర్యలు చేసింది।

ఆ రోజంతా కొడుకుతో మాట్లాడలేదు।

సుధీర్ దగ్గరకి రాబోతే 'పో అవతలకి। నీ పాపిష్టి ముఖం నాకు చూపించకు। యింకోసారి విమలని యిలా కొట్టావంటే, యింట్లోంచి గెంటుతాను। విమల ఎవరు అనుకుంటున్నావురా।' అంటూ సుధీర్‌ని ఎడాపెడా కొట్టింది.


వంటమనిషి వచ్చి ఆవిడ చేతుల్లోంచి సుధీర్‌ని యివతలకి లాగుతూ, 'ఏమిటమ్మా మీరు। పిల్లలేదో ఆటల్లో తగాదాపడితే యింత గొడవ చేస్తారు. పిల్లాడిని చూడండి ఎలా బిక్క ముఖం వేసాడో' అంటూ మందలించింది.

రోజూ, అహల్యమ్మగారు, విమలకి, సుధీర్‌కి దగ్గర కూర్చుండి కథలు, చెబుతూ, నవ్విస్తూ అన్నం తినిపించేది। ఆ రోజు సుధీర్ భోజనం చేసాడా కూడా అడగలేదు। తల్లి అన్నానికి పిలవలేదనే రోషంతో, సుధీర్ అలాగే పడుకున్నాడు. అహల్యమ్మ వచ్చి బ్రతిమలాడలేదు. వంటమనిషి వచ్చి, 'విమలని యింకెప్పుడూ కొట్టనని, మీ అత్తయ్యకి మామయ్యకి క్షమార్పణ చెప్పు. అప్పుడుగాని మీ అమ్మ నీతో మాట్లాడదుట' అంది.

"నేను చచ్చినా చెప్పను. విమల నన్ను కొరికింది. తిట్టింది. అదే నాకు క్షమార్పణ చెప్పాలి" అన్నాడు.

"సరే నీ యిష్టం" అనేసి వెళ్ళిపోయింది ఆవిడ.

సుధీర్‌కి ఆకలివేస్తోంది। ఒకపక్క రోషం, మరోపక్క ఆకలి। తను తప్పు చేయలేదనే విశ్వాసం। సాయంత్రంవరకూ అలాగే కూర్చున్నాడు. సాయంత్రం వంట మనిషి వచ్చింది. 'సుధీర్। మీ అమ్మకూడా రాత్రినుంచి అన్నం తినలేదు। నీ మొండి



తనం మానవా!' అంది.

"ఉహూ. మానను!" ఖచ్చితంగా చెప్పేసాడు.

ఆ రాత్రి అహల్యమ్మగారు కళ్లు తిరిగి బాత్ రూమ్ దగ్గర పడిపోయింది!

స్పృహతప్పి పడిపోయిన తల్లిని చూసేసరికి అతనికి భయంవేసింది! పెద్ద పెట్టున దుఃఖం వచ్చింది. ఆవిడకి తెలివి రాగానే, దగ్గరకి వెళ్ళి మీదపడి ఏడ్చేసాడు. 'అమ్మా! నేను యింకెప్పుడూ యిలా చేయను. నిన్ను బాధపట్టను. నన్ను క్షమించు." అహల్యమ్మగారు కొడుకుని గుండెలకి అదుముకుంది. రెండు బుగ్గలు ముద్దు పెట్టుకుంది. 'నువ్వు చాలా మంచివాడివి! మావయ్యకి క్షమార్పణ చెప్పుకోవాలి '

తల్లి చూపించిన ఆప్యాయతలో అతని అభిమానం, అవమానం కరిగిపోయినాయి. అక్కడే నిలబడిన ధనంజయరావుగారితో 'మావయ్యా! ఇంకెప్పుడూ విమలని కొట్టను. క్షమించు' అని విమలతో 'సారీ విమలా' అన్నాడు. ఆ క్షణంలో అతనికి ఆ మాటలు చెప్పడానికికూడా బాధేం అన్పించలేదు.

ఆ తర్వాత అందరూ ఆ సంఘటన గురించే మర్చిపోయారు.

కానీ సుధీర్ మాత్రం మర్చిపోలేదు! అతనిచేత మనసులో అది ఒక మరుపు రాని సంఘటనగా నిల్చిపోయింది!

అతనికి బుద్ధి తెలిసిన తర్వాత, పెద్దవాడైనకొద్దీ క్రమంగా అర్థం అయింది! భర్త పోయిన స్థితిలో అమ్మ మావయ్యమీద ఆధారపడింది! అదికూడా తనకోసమే!

తన భవిష్యత్తుకోసమే! అది అలుసుగా తీసుకుని, మావయ్య చాలా అధికారం చెలా యిస్తున్నాడు. సుధీర్‌కి యిది బాగా అర్థం అయింది. కానీ అతను ఏనాడు పైకి అన లేదు! వయసు పెరుగుతున్నకొద్దీ, అతను తల్లికోసం, విమల హరం భరించే సహనం అలవాటు చేసుకున్నాడు. శలవులు వస్తే విమలతో గడపాలి! విమలని సినిమాలుకి తీసుకు వెళ్ళాలి! విమల అకారణంగా అలిగితే బ్రతిమలాడాలి! చదువుకునే రోజుల్లో అతనికి యిదంతా పరమ బోర్‌గా వుండేది! తర్వాత వృత్తిరీత్యా మన స్తత్వ పరిశీలన బాగా అలవాటు అయినతర్వాత అతనికి బోర్ తగ్గిపోయింది! విమలని ఆటపట్టించడం, ఏడిపించటం, తర్వాత సారీ చెప్పటం అది అతనికి ఒక ఆట అయిపోయింది!

విమలకి తనికి పెళ్ళి ఖాయం అని అందరికీ గాఢ నమ్మకం? అది జరిగే పని కాదని అతనికి ఒక్కడికే తెలుసు! యీ సతాయింపు జీవితాంతం కూడానా! అతను ఆ వూహరాగానే, భరించలేనట్లుగా 'బాప్‌రే' అన్నట్లు చిన్నగా భుజాలు ఎగరేసేవాడు.

బి.ఏ.లో వుండగానే మావయ్య పెళ్ళి అని మొదలుపెట్టాడు. చదువు పూర్తి కావాలి అన్నాడు తను.

చదువు పూర్తి అయింది! లాయర్‌గా కాస్త నిలదొక్కుకోవాలి అన్నాడు తర్వాత. అదీ అయింది. అదేం ఖర్మమో! ఆ మాట అన్నప్పుడు మూడు నాలుగేళ్ల టైమ్ వుందికదా అనుకునేవాడు! కానీ అవి మూడు నిముషాల్లో గిర్రున తిరిగి వచ్చేవి!

యిప్పుడిక ఏ సాకూ దొరకటం లేదు! ఇక ఏదయినా తను చెప్పినా మామయ్య-అమ్మ యిద్దరూ వినేట్టు లేరు.

అతనికి ఒక్కొక్కసారి తలుచుకుంటే భయం వేస్తుంది. ఈ ఆపద ఎలా తప్పించుకోవాలా అనిపిస్తుంది.

అహల్యమ్మగారు మళ్లీ గదిలోకి వచ్చింది. "సుధీర్! స్వాములారు రేపు సరిగ్గా 9 గంటలకి మన యింటికి వస్తారుట. డ్రయివర్ని త్వరగా రమ్మనమని చెప్పు" అంది.

"అలాగేనమ్మా!"

ఆవిడ వెళుతూ ఆగింది. "మామయ్య యింటికి ఫోన్ చేసావా లేదా?"

"చేస్తానమ్మా!" అతను ఫోన్ దగ్గరకి వెళ్ళి నంబర్ డయల్ చేసాడు. అవతలనుంచి ఏమి విన్పించిందో ఏమో. "విమల యింట్లో వుంది. నాకు తెలుసు. పిలు. ఏమిటి. మాట్లాడనంటుందా? సరే, యిదుగో యిప్పుడే వస్తున్నాను. ఎత్తుకు పోవటానికి అని చెప్పు" అని పెట్టేసాడు.

అహల్యమ్మగారి ముఖం వికసించింది.

"ఇంటికి వెళ్తావా?" అంది.

"తప్పదుగా మరి!" అన్నాడు.

"ఏమిటిరా నాయనా! మీ యిద్దరికీ ఆ మూడుముళ్ళూ పడిపోతే నాకు నిశ్చింత. చూడు, మామయ్యని రేపే రమ్మని మరీ మరీ చెప్పు."

"అలాగేనమ్మా!"

"నా బంగారు తండ్రివి!" ఆవిడ అపురూపంగా చూసింది.

సుధీర్ కారు తాళాలు తీసుకుని బైటకి వచ్చాడు. కారు గేరేజ్‌లో నుంచి తీస్తుంటే, అతనిలో మళ్ళీ అదే భావం! ఒకప్రక్క ఆగ్రహం! ఇంకోప్రక్క నిస్సహాయత్వం!


ఇలా ఎన్నాళ్లు! దీనికి యిప్పుడే స్వస్తి వాచకం పలకాలి! అతని దవడ ఎముక కదులాడింది. (సశేషం)

శవ కళ్యాణం

చూడు మళ్ళీ
చేస్తున్నారు శవాలకు పెళ్ళి.
స్మశాన వాటికలో
సమాధి వేదికపై
కపాలా లంకరణతో
కాబోయే కొత్త జంట—
దెయ్యాల సన్నాయికి
భూతాల మృదంగం జోడీ
ఆహ్వానించిన అస్థిపంజరాలకు
భస్మాక్షిత లిస్తున్నారు
చల్లండి, చల్లండి.
నియంతృత్వ వరుడు
ప్రజాస్వామ్య వధువుకు
కడుతున్నా డదిగో
ఎముకల తాళి.
తలంబ్రాలకై తెచ్చా రిపుడే
మాటల ధూళి.

(నా దేశానికి)

—శైలకుమార్



మయసభ

గొర్రెపిల్ల పాపం, ప్రపంచం నిండా వున్నది గొర్రెలే అనుకుంటుంది. పోట్టేళ్ళు, గొర్రె తోలు కప్పుకున్న తోడేళ్ళు, గోవు వేషంవేసిన వ్యాఘ్రాలుంటాయని దానికి తెలియడానికి చాల కాలం పడుతుంది.

అడవి వదలి నాగరిక లోకం వద్దామను కుందొక గొర్రెపిల్ల, వచ్చింది. అపుడు, కసాయివాళ్ళు ముగ్గురోచోట చేరి — 'గొర్రె పిల్లా గొర్రెపిల్లా! మరేమో నీకు మంచి తిండి, నీళ్ళు, నీడ ఇస్తాం కాని ముందస్తుగా చెప్పు మీ నాన్నగారు ఎం.ఎల్.ఏనా? లేక మంత్రియా?' అని అడిగారు.

అసలా భాషే అర్థంకాలేదు గొర్రెపిల్లకు.

"క్లోరోఫిల్ అంటే చెప్పుకోచూద్దాం—"

గొర్రెపిల్ల తెల్లమొహం వేసింది.

"నువ్వు తాటి చెట్టెప్పుడయినా ఎక్కావా?"

"సముద్రం ఈదడం వచ్చా?"

"ఎలుగుబంటితో షేక్ హాండివ్వడం ఎలా?"

తల గిర్రున తిరిగిపోయింది , గొర్రెపిల్లకు. తను వేరే యేదో లోకంలోకి పొరబాటున వచ్చా నేమోనని పారిపోయింది గొర్రె మా లోకం లోకి

కాని మనుషుల లోకంలో ఉద్యోగాన్వే షణ చేసే అభ్యర్థి ఎక్కడకూ పారిపోలేడు. మళ్ళా ఆశతో గంపెడాశతో—ఇంకో అప్లికేషన్, ఇంకో సెలెక్షన్ పరీక్ష, ఇంకో ఇంటర్ వ్యూకూ—

ఇలా పడుతూ లేస్తూ ఎక్కడో ఒక అడ కత్తెరలో ఇరుక్కుని బురదలో కూరుకు పోతాడు; జీవితాన్ని "ఎలాగో ఒకటిగా" లాక్కొస్తే ఎవరెస్టెక్కినట్లే ఇంక్రిమెంట్ స్వర్గం, బోనసే మోక్షం.

ఆ కథా క్రమంబు ఇట్టిది

* * *

" డౌన్ డౌన్ వర్ధిల్లాలి.....పోవాలి రావాలి" అని కేకలు వేస్తుంటాడు చిరంజీవి విద్యార్థి.

ఈలలు—స్టెప్‌కటింగ్ క్రాపులు—నాలుగు రోడ్ల కూడలుల వద్ద కాపలాలు మీటింగ్‌లు బస్సులు తగలెట్టడాలు మధ్య మధ్య ఎప్పుడయినా పారాలు పరీక్షలు..తల్లిదండ్రుల్ని, చదువు చెప్పేవారిని, అసలీ 'హోల్ మొత్తం' సిస్టంకేసి ఒక రాజసంతో, నిర్లక్ష్యంతో, తెలిసీ తెలియని అహంభావంతో చూడడమే తెలుసు. జీవితం తన చరణదాసి: తన ఊహాలే తన సామ్రాజ్యం, మూకబలమే తన బలం. ఇంక ఎదురేమిటి?

అయిపోయ్యాయి పరీక్షయి. కాపీకొట్టో, కత్తి చూపించో, అదీ ఇదీ కాకపోతే ఆ పాత పద్ధతి (అదే, అన్నీ చదివి నేర్చుకోవడం) ప్రకారమో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు చిరం

ఏ. రామసంజీవి

జీవి. తండ్రికి ఆనందం, ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతోందని తల్లికి ఆనందం ఇంక ఏ క్షణాన్నయినా కోడలుపిల్ల వస్తుందని.

తండ్రి చెప్పిన ధర్మరాజులు, గంగిగోవులు, కుబేరులు ఏమీ చెయ్యరని తెలుసుకునేలోగా ఏడారము పోతుంది.

అప్పుడిక అరణ్యపర్వం, వినోబాగారు వర్ణించిన 'అనుశాసన పర్వ'—ప్రారంభమవుతోంది.

చిరంజీవి టిప్‌టాప్‌గా వెళతాడు ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజికి.

కలల సౌధాలు కూలి పెచ్చులు మీద పడడం అనేది అక్కడ మొదలవుతుంది. జీవిత వాస్తవాల ధూళి కంట్లోపడి మెరమెర ఆరంభమవుతోంది.

అక్కడ తనలాంటి ఆశాగత జీవులు—అన్యాయాల శరాఘాతాల కడ్డంగా సర్టిఫికేట్ల డాలులు పట్టుకున్న అభిమన్య కుమారులు, ఉద్యోగాల 'పాము'ల పిలుపులకోసం వెర్రిగా చూపులు చూచే డిగ్రీల దేవదాసులు, సమాజోద్ధరణ చేద్దామని పోయి రథ చక్రం క్రింద చేతులిరుక్కుపోయిన ఉత్తర కుమారులు వుంటారు. కోపం వస్తుంది.'ఏమీ ఈ యుద్ధభూమి' అన్పిస్తుంది. అందరినీ చంపేయాలనిపిస్తుంది. తిక మక ఎక్కడుంది అసలు—అన్న సంశయం వస్తుంది. కాలేజిలోవుండగా అంత 'డాషింగ్'గా 'రత్నం'గా, 'జయప్రదం'గా కన్పించిన జీవితం నేడిలా ఎడారిలా వుందే మన్పిస్తుంది. ఈ తలపులన్నీ కలగాపులగం అవడంతో చిరంజీవి, ఠీవిగా పంట్లాం సరిచేసుకుని, చొక్కామీద దుమ్ము దులుపుకుని, 'క్యూ'లో నిల్చుంటాడు.

రిజిస్ట్రేషన్ తొలి కానుపు.

ఏడాదికోసారి జరిగే 'రెన్యూవల్ కార్యక్రమం' మలి కానుపు.

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి అనే ప్రియుడితో, చిరంజీవి అభ్యర్థి సమాగము పదే పదే జరుగుతోంది; సుఖ ప్రసవాలే అవుతుంటాయి. కాని బిడ్డ మాత్రం కనపడదు.

అసలుద్యోగాలకు పిలుపు రావాలంటే పులి బొమ్మ పల్లవితో మేలుకొలుపులు: ఇంటర్‌వ్యూలవుతుంటాయి కాని ఉద్యోగా లేమవుతాయో తనకు తెలియదు.

ఈ ఎక్స్ఛేంజి వ్యవహారం లేకుండా అప్పుడప్పుడు పత్రికల్లో పడే మాంచి ఆకర్షణీయమైన ఉద్యోగాలు చూచినప్పుడిలా మనసు ఒయాసిస్సు చేరిన ఒంటెలా ఫీలవుతుంది. ఇన్ని ఖాళీలుండగా 'నాకొక్కటి రాదా!' అని ఏడున్నర మొదలు నలభై రూకలదాక పోస్టలు ఆర్డరు కొనుట, పెన్నుపాళీ అరిగేదాక ఫారాలు నింపుట, సర్టిఫికేటుల కాపీలు తీయించుట, ఆ కాపీలపై రాజ ముద్రాధికారంగల (వీళ్ళ దుంప తెగ, వాళ్లందరికీ వుద్యోగాలెలా వచ్చాయో...) అధికారుల సంతకాదులు చేయించుట ఈ యజ్ఞమంతా యధావిధిగా జరిగిపోతుంటుంది. హవిస్సు మాత్రం అందదు.

కొన్ని అసలేమయ్యాయో తెలియదు.

కొన్ని ఖాళీలకు చదువులు అనవసరం, కులాలే అవసరం అని తెలుస్తుంది.

మరి కొన్నింటిలో నయితే ఈ అప్లికేషన్లు పెట్టుకున్న మూర్ఖులను చూచి నవ్వుకొని, అప్లికేషన్ పెట్టనటువంటియు, మంత్రిగారి బావమరిది (మంత్రులకు ఎన్ని రకాల బావ మరుదులుందురు అక్కడి యూనివర్శిటీల డాక్టరేటు సిద్ధాంతాలకు, ప్రభుత్వంవారి కమిటీలకు అనువైన, లోతైన విషయం) అయినటువంటియు ఒక బడుద్ధాయికి అయిదు అడ్వాన్సు ఇంక్రిమెంట్లతో ఇచ్చారని తెలుస్తుంది.

అప్పుడిక అతీతశక్తులమీద నమ్మకం పుట్టుకొస్తుంది.

మధ్యలో ఎప్పుడో ఒక ఇంటర్‌వ్యూ వస్తుంది.

టిప్‌టాప్‌గా తయారయి, కొట్టిన కోటా పౌడర్ భూమ్మీద చెమటల వాగులు పారుతుండగా తన ప్రాణమూ శీలమూ అంతా అందులోనే వున్నంత భద్రంగా సర్టిఫికేట్ల కవిలెకట్ట పట్టుకుని గదిలోకి, అడుగుపెడతాడు చిరంజీవి ఆశాజీవి.

కంసుడు, కోరమీసాలవాడు, విలన్లా కన్పించని విలన్, ఆకలిగొనియున్న మృగరాజు, నా అంతటి జ్ఞాననిధి లేదనుకుంటున్న జంబూకం,

సాయం చెయ్యాలనుకున్నా చెయ్యలేని విదురుడు—ఇలాంటి 'స్పెసిమెన్లు'న్న కమిటీ ఎదుట నిలబడతాడు కుర్రవాడు.

చెట్టుమీది మట్టిపావురం మీద ఎక్కుపెట్టి బాణాలు వదిలినట్లుగా, పసివాడిమీదకు ప్రశ్నలు వదిలిపెడతారు.

"అసలు నీకా వుద్యోగం మీద మమకారం ఎందుకు?"

"పెళ్ళి చేసుకోలేదూ?"

"మన దేశంలో సంజయ్‌గాంధీ హయాం తర్వాత కు.ని. శస్త్ర చికిత్స లెన్ని జరిగాయి?"

"స్వాతంత్ర్యం వచ్చాక ఎక్కువగా విమానాలు కూలిన సంవత్సరం ఏది?"

"నర్మదకు ఉపనదులేవి?"

"తాజ్‌మహల్ మీద గోపురా లెన్ని వున్నాయి?"

"ఇడీ అమీన్‌కు, ఇరాన్ షాకు పోలిక లున్నాయంటావా?"

"ఐఫెల్ టవర్ పొడుగెంత?"

"నాగసాకి పేరు చెబితే ఏమి గుర్తుకొస్తుంది?"

—ఇలాగ ఎడాపెడా వాయించేసి బయటికి పంపించేస్తారా కుర్రాడిని. ఇది వుద్యోగం ఇవ్వడానికా, తన్ని భయపెట్టడానికా?

పాపం బెంబేలెత్తిపోతాడు, తనకు తెలియనివి 'ఇన్ని' వున్నాయా? అయ్య బాబోయ్, అవన్ని నేర్చుకోవాలంటే మరి ఉద్యోగం చెయ్యడం ఎప్పుడు? అరెరె! ఇన్నాళ్ళు కష్టపడి చదివి, పరీక్షలు పాసయి సంపాదించిన సర్టిఫికెట్ల నెవరూ అడగాలేదు, చూడలేదు

ఈ విధంగా అనేక ఇంటర్వ్యూ యుద్ధాల నారియు తేరియు వృద్ధమూర్తి అయిన చిరంజీవికి జ్ఞానోదయం అవుతుంది.

ఈలోగా దేవుడు దయతలచి, పక్కన మామో, బాబాయో మంత్రిగానో, కనీసం ఎం.ఎల్.ఏ గానో అయితే ఢోకాలేదు; లేకపోతే అయిదు వందల నుండి అయిదువేలదాక దక్షిణ చెల్లించిన ఉత్తర క్షణంలోనే అప్పాయింట్‌మెంటు ఆర్డర్ వస్తుంది.

నెమ్మదిగా సముద్రమంతా ఈది ద్వీపంమీద చేరినప్పటి సంతృప్తి నెలకొంటుందతనిలో.

కాలేజి రోజులనాటి ఆ అహంకారంలాంటి ఉత్సాహపు ఊట ఏనాడో ఇంకిపోయింది.

శిథిలమయిన సంఘ సౌధంలో ఆ మూల వరండాలో తనకో ఉద్యోగపు దుప్పటీ ఇచ్చారు, అదే పదివేలు—అనుకుంటూ దబ్బాయి.

ఆదర్శాల గాగుల్సు నవతల తీసి పారేసి అవలీలగా పదివేలు కట్నం అడిగేంతగా పతనమవుతాడు పాపం

ఒకరినొకరు హింసించుకుని తింటుండే ఈ CANNIBALISTIC సమాజంలో తానూ ఒకడయి, తానూ ఒక షైలాకయి, పెళ్ళి చేసుకుని పిల్లల్ని కంటాడు. ఆ పిల్లలు పెద్దవారయి, చదువుకుని

మళ్ళీ చరిత్ర పునరావృత్తం.
మన జాతి చరిత్ర సమస్తం.
మనల్ని మనమే పీక్కు తినడం!
రండి సార్, విందుభోజనానికి!! □



బురఖా

ఆకెళ్ల సత్యనారాయణమూర్తి

రాజమండ్రి గోదావరి స్టేషను కోటగుమ్మం ఇక్కణ్ణించే రాజవీధి. ఇటూ అటూ కూలగొట్టబడ్డ కొట్లు, భవంతులు. బజారు బజార్లో—ఫ్యాన్సీ, మెడికల్, ఎలక్ట్రికల్, ఇనుప సామాన్లు స్టెయిన్లెస్ స్టీల్ ఇత్తడి, రాగిపాత్రలు—రకరకాల కొట్లు. శాకాహార, మాంసాహార హోటళ్ళు.

లాడ్జింగులు—చిన్నవి, పెద్దవి, ఓ మోస్తరువి. నాణ్యమైనవి, నాసిరకంవి.

రాజమండ్రి దక్షిణకాశీ. గోదావరి ఒడ్డున ఎన్నో గుళ్ళు.

మెయిన్ రోడ్డుమీద రెండు మసీదులున్నై. ఆపైన జాంపేట బ్రిడ్జి దగ్గర పెద్ద చర్చి.

మనది మతప్రమేయంలేని లౌకిక రాజ్యం. ఇండియా—దటీజ్ భారత్.

ఈ భారత్‌కి యీ వూరు ఓ ప్రత్యేకత పొద్దున్న ఆరు దాటుతోంది. ఊరు పూర్తిగా యింకా మేలుకోలేదు. కోట గుమ్మందగ్గర మెయిన్‌రోడ్డుమీద ఒకటి రెండు దుకాణాలూ, కాఫీ హోటళ్ళూ తీశారు.

మసీదు యెదురుగా ఇరానీకేఫ్‌ని ఆనుకుని వున్న కిళ్ళీషాపు తెరుస్తున్నాడు—షరీఫ్ "బిస్మిల్లా" అనుకుంటూ.

సరిగ్గా యిదే సమయానికి నల్లపరదాలో ఓ పిల్ల రోడ్డుమీది కొచ్చింది. వడిగా నడుస్తోంది. నాలుగడుగులు వేసిందో .లేదో వెనకనుంచి ఓ సైకిలు దూసుకొచ్చింది.

సైకిల్‌మీద వీర్రాజున్నాడు. వీర్రాజు హోల్‌సేలు చింతపండు వ్యాపారి, గవర్రాజు కొడుకు.

వీర్రాజు సైకిల్‌మీద పరదాపిల్లదాకా వచ్చి ఆమె మొహంమీది గుడ్డను లాగేశాడు. పరదాలోనిపిల్ల కెవ్వుమంది.

ఓ సైకిల్‌రిక్షా వచ్చి ఆగింది. పిల్ల రిక్షా యెక్కేసింది. రిక్షా సాగిపోయింది. వీర్రాజు సైకిల్ పెడల్‌మీద కాలేశాడు

వీర్రాజు కాలర్ పట్టుకుని ఆపాడు షరీఫ్.

మసీదు అరుగుమీద కూచున్న కొందరు, ఇరానీ హోటలు స్టాఫూ, చెప్పుల దుకాణాలు తెరుస్తున్నవారూ, ఆ దృశ్యం చూసి చుట్టూ మూగారు.

వీర్రాజు మాటెవరూ వినిపించుకోలేదు. షరీఫ్ చెప్పిందాన్నిబట్టీ, కొందరు తాము చూసినదాన్నిబట్టీ "మారో" అంటే "మారో" అన్నారు.

రాజవీధిని అనుకున్న ఓ లాడ్జింగ్ హౌస్ పై అంతస్థులోంచి వీర్రాజు స్నేహితులు జరిగింది చూసి పరుగున వచ్చారు.

వారు వచ్చేటప్పటికే అంతా అయిపోయింది. వీర్రాజు రోడ్డు మీద పడున్నాడు. నొసలు చిట్లింది. స్పృహలో లేడు.

షరీఫ్ పనీ, అతని అనుచరులపనీ పట్టడం కన్నా వీర్రాజుని ఆసుపత్రికి తీసుకుపోడమే అర్జంటనిపించింది వీర్రాజు స్నేహితులకి.

కోట గుమ్మంవైపు పోతున్న టేక్సీని ఆపి, వీర్రాజుని అందులో వేసుకుని గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకుపోయారు.

మధ్యాహ్నం పన్నెండు దాటుతోంది.

మసీదులో నమాజుకొచ్చిన వారంతా ఆ ఉదయం జరిగింది కథలు కథలుగా చెప్పుకోసాగారు. షరీఫ్‌ని హీరోలాగా చూశారు.

అతనితో చనువున్నవారు, "స్సలామాలేకుం" చెప్పి 'గలేలగ్గా' యించారు.

ఉన్నట్టుండి మసీదులో రాళ్ళ వర్షం కురిసింది. కర్రల్తో, కత్తుల్తో, సైకిల్‌చైన్లతో, కొరడాలతో ఓ వందమంది మసీదు చుట్టు

ముట్టారు.

ఇది గవర్రాజు పనే నని గ్రహించడానికి ఆట్టే సేపు పట్లేదు లోపలివారికి.

మసీదు మైకులోంచి ఎనౌన్సుమెంటు వచ్చింది.

జోళ్ళ దుకాణదారులు, దర్జీలు, కళ్ళ జోళ్ళ షాపులవారు, వాచీ మెకానిక్ షాపుల వార్నీ ఉద్దేశించి, మసీదు ముట్టడెందనీ, వెంటనే తరలిరమ్మని పిలుపునిచ్చాయ్, మసీదు మైకు తాలూకు స్పీకర్లు.

వీర్రాజు తండ్రి గవర్రాజు నియోగించిన రౌడీలు, కిరాయి మనుషులు, షరీఫ్ కిళ్ళీ దుకాణం బద్దలుకొట్టి సరుకూ సరంజామా అంతా ధ్వంసంచేసి పారేశారు.

మసీదు పిలుపు నందుకుని ఆయా కొట్ల వారు కొట్లు కట్టేసి బయల్దేరారు. మసీదులోని వారు ధైర్యంచేసి బయటికొచ్చారు. బయట వున్న, వీరి మద్దతుదారులు గవర్రాజు మను షులమీద తిరగబడ్డారు.

కోటగుమ్మంలో బీటు కాస్తున్న కానిస్టే బులు సైకిలెక్కి స్టేషన్‌కి ఉడాయించాడు.

సోడాబుడ్లు బద్దలయ్యాయి.

సైకిల్ చైన్లు 'ఛళ్ ఛెళ్ళ' మన్నాయి.

రక్తాలు కారాయి. దొమ్మీ

కొట్లాట—

దుమ్మూ ధూళీ రేగింది.

తలలు బద్దలయ్యాయ్.

ఎముకలు విరిగాయ్.

మధ్యాహ్నపు ఎండలో చాకులు తళతళ మన్నాయ్

వేడిరక్తం చిమ్మింది.

నలుగురైదుగురు అక్కడే చచ్చారు.

షరీఫ్ వర్గం—గవర్రాజు వర్గం—

"మారో"—"మార్ డాలో"—

అంటుంటే—

"కొట్టండి చంపండి చంపవతల పారేండి."

భీభత్సం—పోరు హోరాహోరీ సాగు తోంది.

అరగంట గంట

పోలీస్‌వాన్ దిగింది.

పోలీసువారి హెచ్చరిక

కొట్లాట కొనసాగుతోంది.

మరో హెచ్చరిక మరో హెచ్చరిక

పొగబాంబులు పేలాయి.

లాఠీఛార్జి జరిగింది.

తుపాకులు పేలాయి.

వన్‌ఫార్టీఫోర్ అమల్లోకి వచ్చింది.

* * *

ఆ సాయంత్రం మొదలు తెల్లవార్లూ పోలీ సులు గస్తీ తిరుగుతూనే వున్నారు. కంబాల చెరువుదగ్గర, కూరగాయల మార్కెట్లోనూ, గాంధీ విగ్రహాల దిమ్మలకు చుట్టూ తుపాకులు నిలబెట్టి విడత విడతకీ మధ్య పోలీసు బృందాల వారు, ఒకర్ని విడిచి ఒకరు విశ్రాంతి తీసు కుంటూ శాంతిభద్రతలను కాపాడ్డానికి పాటు పడుతూనే వున్నారు.

తెల్లవారగట్ల తెలియవచ్చాయ్—ఆ రాత్రి జరిగిపోయిన ఘోరాలు

ఆసుపత్రిలో వీర్రాజు వచ్చిపోయాడు. కిళ్ళీ కొట్టు షరీఫ్ నెత్తిమీద సోడాబుడ్డి బద్దలైంది.

ఆకుచెప్పు లమ్ముకునే బాషాభాయ్ చేతులు నరుకుడై పోయాయ్.

వాచీ మెకానిక్ జహంగీర్ కొట్టుకి నిప్పంటుకుంది

శనిదానాలు పట్టీ, పుణ్యాహవచనాలు జరి పించి, పొట్టపోసుకునే, పేరిశాస్త్రిమీద నించి గోదారిగట్టున టేక్సీ దొర్లుకుని వెళ్ళిపోయింది.

గవర్రాజు హోల్సేలుకొట్లో కాటామేస్త్రీ అప్పలస్వామి కత్తిపోట్లు తిని ఇసుకవీధిలో పడున్నాడు.

సూరీడు పొడుస్తున్నాడు.

ఆరుగంటల ఇంగ్లీషు వార్తల్లో రేడియో చెప్పింది—"రాజమండ్రీలో కర్ఫ్యూ" అని.

ఈ వార్త అచ్చయి పేపర్లలో వచ్చేసరికి— ఆ మర్నాడైంది.

* * *

ద్వారపూడిలో రైసుమిల్లు.

రైసు మిల్లు కాంపౌండులోనే రెస్టు హౌసు !

ఇందులో విడిది చేసింది సావిత్రి. సాయం కాలం—ఆరు దాటుతోంది. టీపాయ్‌మీది పేపరు తిరగేసి సావిత్రి దిమ్మ తిరిగిపోయింది. తన సూట్‌కేసువైపు చూసింది.


"ఏం అల్లా" అనుకుంది.

టీపాయ్‌మీదనుంచి గ్లాసందుకుని అందులోని పానీయాన్ని గడగడా తాగేసింది.

సావిత్రి కళ్ళు ఎర్రబడ్డాయ్. ఒళ్ళు వేడెక్కింది. ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో వేడి ఆవిర్లు!

సోఫాలోంచి లేచి ఒళ్ళు విరుచుకోబోయింది. తనవల్ల కాలేదు. సోఫా సెట్ ఉన్న కార్పెట్ మీద కూలిపోయింది.

రైసుమిల్లు ఓనరు పానకాలరావు తలుపు



తీసుకొని లోపలికొచ్చాడు. మందుమీదున్నా, ఆయన నిగ్రహంగానే వున్నాడు.

పానకాలరావుని చూడ్డమే తడవు సావిత్రి పాములాలేచింది.దగ్గరకంటూ వచ్చేశాడాయన.

సావిత్రి ఒక అడుగు వెనక్కి వేసింది. "ఒద్దు నన్ను ముట్టుకోకండి. నేను నేను అమ్మవారిని. అంబని చండిని మంటలు మండుతాయ్. మనుషులు చచ్చిపోతారు. నెత్తురు ఏరు అవుతుంది. వద్దు నేను సైతాన్ని పాపాత్మురాల్ని. మనుషుల్ని తినేస్తాను. ఊళ్ళకి ఊళ్ళనే బలి తీసేసుకుంటాను.

దూరం దూరంగా వుండండి. బూడిదై పోతారు మసి మసైపోతారు "

"సావిత్రీ" పానకాలరావు గాండ్రించాడు. "ఏవిటా పూనకం? యెందుకలా రెచ్చిపోతావ్? యేమైంది నీకు?"

సావిత్రి మాట్లాడలేదు. పేపరు చేతికిచ్చింది. తన సూట్ కేసు చూపించింది.

నిముషంలో పానకాలరావు విషయం గ్రహించాడు. సావిత్రిని చాచిపెట్టి కొట్టాడు.

"అట్టే అల్లరి చేసి వీధిన పడ్డావంటే ముక్కలు ముక్కలుగా నరికి పారేస్తారు— అంతా కలిసి. శవంకూడా మిగల్దు. కిక్కురు మనకుండ పడుండు."

ఆ గదిలో ఓ పక్క టేబిల్ మీది సూట్ కేస్ పైనున్న నల్ల బురఖా అంది పుచ్చుకుని పానకాలరావు బైటికి నడిచాడు. బైట తలుపు తాళం వేశాడు.

లోపల, సావిత్రి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆరోజు ఆ రాత్రి ఆ ఉదయం

"ఐ క్లాసు పాసింజరు. రూం నంబరు ఆరోకెళ్ళు—" లాడ్జీ కుర్రాడి మాటమీద తను ఆరోనెంబరు గదిలో కాలు పెట్టింది.

ఓ అరడజనుమంది తాగుతూ పేకాడుకుంటున్నారు.

"రా తాగుతావా? ఇంద" వీర్రాజు తను తాగే గ్లాసు అందించబోయాడు.

గిరుక్కున వెనుతిరిగి గదిలోంచి బైట పడింది. బైట గడియవేసి పరుగెత్తింది.

లాడ్జీ ఆఫీసుగదిలోకి వచ్చింది. "ఏం "ఆ గదిలో ఆరుగురున్నారు."

"వీర్రాజుగారు 'ఒక్కణ్నే' అన్నాడు! సరే—నువ్విక్కడే వుండు అక్కడ వాళ్ళు గోల చేస్తున్నారు. నువ్వు లోపల గడియ పెట్టుకో. నేను బైట తాళం వేస్తాను. నువ్వు నే వచ్చేవరకు యిక్కడే వుండు" లాడ్జీ కుర్రాడు బైట తాళం వేసి ఆరోనెంబరు గది దగ్గరికి వెళ్ళాడు.

గదిలో పాసింజర్లు తలుపులు బాదుతున్నారు. కేకలేస్తున్నారు. అరుస్తున్నారు — తిట్టి పోస్తున్నారు. కాలింగ్ బెల్ నొక్కుతున్నారు

"పోలీసు లొచ్చారు. గొడవెట్టకండహో" లాడ్జీ కుర్రాడిమాటతో వారినోళ్లు మూతబడ్డాయి.

తెల్లవారగట్ల, విషయం తెలిసి మండిపడ్డా రంతా లాడ్జీ కుర్రాడు డ్యూటీ దిగి వెళ్ళిపోయాడన్నారు.

కొంతసేపటికి, పరదాలో, లాడ్జీ గుమ్మం దాటి రోడ్డెక్కుతున్న పిల్ల వాళ్ళ కంటబడింది. వీర్రాజు పౌరుషంగా మేడ దిగి అక్కడున్న సైకిల్ వేసుకుని వెంబడించాడు

జరిగింది తలపుకొచ్చేసరికి సావిత్రికి ముచ్చెమటలు పోశాయ్.

తనమీద తనకే అసహ్యమేసింది. "ఛీ" అనుకుంది.

ఈ సావిత్రి హిందువా? ముస్లిమా?

'సావిత్రి' కాబట్టి హిందువని, పరదా వేసుకుంది కాబట్టి ముస్లిమనీ—ఆమె చెబుతోంది కాబట్టి ఫలానా అనీ నిర్ధారణకు రావడానికి వీల్లేదు. ఆమెను నమ్మడానికి అసలు వీల్లేదు. వృత్తిరీత్యా ఆమె జాతి అటువంటిది.

ఆమె యెవరైనా, అందరికీ సిగ్గుచేటే. తలవంపులే. వీర్రాజువంటి కామాంధులు కూడా దోషులే. పాపులే.

షరీఫ్ వంటి—షరీఫ్‌లే కాలం కావాలంటున్నది.

ఎందుకంటే—వీర్రాజుని 'హమ్లా' చేసిన క్షణంలో—షరీఫ్ మనసులో ఆడకూతుర్ని ఆదుకుందామన్న ఆదుర్దాయే గానీ, ముస్లిం పిల్లన్న సంకుచిత భావం కించిత్తుకూడా లేదు

ముగింపు మాకూ తెలుసు

వి వి బి రామారావు

బొకారో వెళ్ళాల్సిన ఎక్స్‌ప్రెస్ గంటన్నర లేటన్నారు. చూడడానికి చాలా పెద్దదే అయినా కూచోడానికి ఎక్కడా సదుపాయము లేని వాల్తేరు ప్లాట్‌ఫారం. బొత్తిగా పార్సిలు మీదో—ఎవరివో బెడ్డింగుమీదో కూచోడానికి- ఎటూ పెద్దమనిషితరహా అడ్డొస్తోంది.నుంచుని నుంచుని కాళ్ళు లాగాయి. తరచు చేసే ప్రయాణం - రైల్లో కూచోవలసిన కాలంకంటె రైలుకోసం నిరీక్షించవలసిన కాలమే ఎక్కువ కావడంతో ప్రాణం ఉస్సురని విసుక్కుంది.

రైలు వచ్చింది. టూటయ్యర్‌లో కూచోవడం పరిపాటే అయినా ఆ రోజు ఎందుకో జనరల్ కంపార్టుమెంటు దగ్గరకు వెళ్ళాను—రాసిపెట్టి ఉన్నది తప్పించడం, ఎవరికిసాధ్యం? —ఆ తరావాత అనుకున్నాను.

నేను ఎక్కిన పెట్టె జనరల్ అయినా 'మిలిటరీ'అని పెద్దపెద్ద చీటీలు అంటించి ఉన్నాయి. కిటికీదగ్గర ఒకాయన గేటుదగ్గర మరొకాయన నుంచుని ఇది మిలిట్రీ—మిలిట్రీ-రిజర్వేషన్- వెనక్కి, వెనక్కి, వెళ్ళండి అంటూ ప్రజల్ని తరివేస్తున్నారు. నేను ఎక్కుతుంటే మాత్రం నన్ను వారించలేదు.

వారించి ఉన్నా నాకు కొన్ని క్షణాల యాతన తప్పిపోయేదేమో!

ఏదైనా 'గీత' అన్నది మన రక్తంలో నమ్మకమే కదా! మిలిట్రీవాళ్ళా పెట్టెలో ఓ పదిమందికంటె లేరు. వాళ్ళు మీదని పక్కలు పరిచెయ్యడమే కాకుండా జంపఖానాలూ, దుప్పట్లూ కూడా కింద సీట్లమీద పరిచేశారు. జనం కిటకిటలాడుతున్నారు. వాళ్ళు అడ్డుతూ వున్నా ఇంతమంది పెట్టెలోకి ఎలా వచ్చారో అర్థంకాలేదు. ఒక్కక్షణం తటపటాయించి జంబుఖానా మెల్లగా పక్కకి మడిచి మెల్లగా సీటుమీదికి శరీరాన్ని దింపాను. పక్కనున్న మిలిట్రీ మనిషి నా బ్యాగ్ తన బెర్త్‌మీద పెట్టాడు. రైల్లో కూచోవడంతో నా బాధ్యత సరి—అది నే చేరవలసిన గమ్యం చేరేవరకూ విశ్రాంతి. హాయిగా గాలి పీల్చుకుని కిటికీ సీటు వంక చూశాడు.

ఆవిడ—ఆవిడనేకంటె—ఆ అమ్మాయి అనడమే న్యాయం—నాకంటె చాలా చిన్నది కాబట్టి. ఆ అమ్మాయి నావంకే చూస్తోంది. నేనే కళ్ళు తిప్పుకున్నాను.

ఎదురుగా ఓ మార్వాడీ ముసలావిడ -ఆమె పక్క ఓ చిన్నపాప—అయిదేళ్ళుండవచ్చు- చాలా అనారోగ్యంగా కనపడుతోంది.

"నాన్నగారు వఛ్ఛారు. నువ్ అటుజరుగు."

నా కళ్ళలోకి చూసి 'అమ్మాయి' అంది. ఆయన్ని చూసి ఆ పాప జరగబోయింది. కాని చటుక్కున జరగడానికి శరీరంలో శక్తిలేదు. ఆ పాపని రెండుచేతులతోనూ పక్కకి జరిపి అతను కూచున్నాడు. అంతకంటె కిటికీసీటుకి దగ్గరగా కూచోడం సాధ్యంకాదు.

ఎందుకో ఆ పాపనే మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తోంది.—సన్నగా పుల్లల్లా అయిపోయిన కాళ్ళు. - పుల్లల్లాంటి చేతులకి ఆకుల్లాంటి మండలు అంటించినట్లున్నాయి. మండమీద వెయిన్స్ అంత చిన్నపిల్లల్లో అంతలా కనపడటం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. వైద్య పరిభాషలో దాన్ని ఎమాసియేటెడ్ కండిషన్ అంటారు. పిల్ల ప్రాణమంతా కళ్ళల్లో ఉంది. దీక్షగా చూస్తూన్న నావంక ఆ పాప తీక్షణంగా చూస్తోంది—మళ్ళీ కళ్ళు తిప్పుకున్నాను—ఏడాది తిరగకుండా చనిపోయిన మా చంటి బాబు జ్ఞాపకం వచ్చాడు. నా కళ్ళు చెమ్మగిల్లడంప్రారంభించాయి. మళ్ళీ కిటికీ సీటు వంక చూసేసరికి ఆ అమ్మాయి నావంక చూస్తోంది. నేను చెస్తున్నపనే ఆవిడా చేస్తోంది. మిలమిల లాడుతున్న కళ్ళు. పసుపుతాడు. కుత్తిగంటు.

కొత్తపెళ్ళికూతురు కళ. కొత్తచీర. పెళ్ళి కూతురైతే మరి వడిలో సంవత్సరం పైబడ్డ మగబిడ్డ.—పుల్లల్లాంటి కాళ్ళు—పెద్ద కళ్ళు-కళ్ళలో కూడా జీవంలేదు—అదిరిపడి చంటి బాబువంకా, ఆ పాప వంకా మార్చి మార్చి చూస్తున్నా.

ఆ బాబు ఆ పాప తమ్ముడు. ముఖ్యంగా ఆ కళ్లు—ఇద్దరూ ఓ తల్లి పిల్లలే.

కాళ్ళకు మట్టెలు. కొత్తగా మెరుస్తున్నాయి. జోడు కిందకి వదలి కాలు సీటుమీద పెట్టుకుని బొటనవేలు చూసుకుంటోంది ఆ అమ్మాయి. కొత్త జోడు కరిచేసినట్టుంది. చెక్కుకుపోయి ఎర్రగా వేలు.

—"ఓలమ్మ యెంత కసటమైపోనాదిః" ఉస్సురంటూ ఓ ముసలమ్మ ఐదారేళ్ళ పిల్లవాడి నొకడిని తీసుకొచ్చి నేలకూలబడింది. ఆమె వెనకాలే వయసు తెలియని గ్రామీణ స్త్రీ—

మరో పది నిముషాల్లో బండి కదిలింది. టిక్కెట్టు కలెక్టరు వచ్చి టిక్కెట్లు చెక్ చేస్తున్నాడు. ఆ ముసలమ్మని టిక్కెట్టు అడిగే సరికి దూరంగా నుంచున్న ఓ వ్యక్తిని చూపించింది.

కిటికీ సీటు అమ్మాయి పెద్దకళ్ళు చేసుకుని అటు చూస్తోంది.

"బాబ్బాబు, బొబ్బిలికి టిక్కటు దియమని పదిరూపాయల నోటిచ్చినాను. మరోటి కావాలన్నాడు. ఇచ్చినాను. నాకు తీసి బొబ్బెడికి తియ్యకపోడఁవేటి? ఆ టిక్కటూ యియ్యనంటున్నాడు. నేనేటి సేతును బగమంతుడాః అడదాన్నని ఆడన్నేయం సేసినాడు. ఇతగాడు సిచ్చేసెస్తాడటః"

—లబలబ లాడింది ముసిలి.

ముసలమ్మ పక్క చతికిలబడ్డ ఆవిడ ఏదో సర్ది చెప్పజూస్తోంది. టిక్కెట్టు కలక్టరు వాళ్ళని పక్కకు తీసుకెళ్లాడు.

కిటికీ అమ్మాయి వడిలో చంటాడు ఎండిపోయిన తోటకూర కాడలా మెడవేలేశాడు. ఏడవడానికికూడా శక్తిలేక ఈఁ ఈఁ అంటున్నాడు. ఆవిడ సీసాలో నీళ్ళు తాగి వాడి నోటిలో సీసామూతి పెట్టింది. వాడు అలా నీళ్ళు తాగగలడా అన్నఆలోచన ఆమెకు వచ్చినట్టు లేదు. చెయ్యి వేసి చూడక్కరలేకుండానే లివర్ బాగా ఎన్‌లార్జ్ అయినట్టు కనపడుతోంది.ఎంతో జాగ్రత్తగా వైద్యం చేయిస్తేకాని ఆ బిడ్డను దక్కించుకోవడం అసాధ్యం—నా చూపుని గమనించింది ఆవిడ. బిడ్డ పొట్టమీద చొక్కాను సరిచేసి కిందకు లాగింది.

నా వంక ఓమారు ఓరగా కొంటెగా (నా భావనేమో!) చూసి అతనితో మాటల్లోకి దిగింది.

కొత్త జంటకి కబుర్లకేం లోటు. ఏమి టేమిటో మాటాడేసుకుంటున్నారు.

పాప తండ్రివంక చూస్తున్న జాలిచూపులో యెన్ని భావాలుః -జీవితాన్నంతటినీ అర్థం చేసుకున్న వేదాంతి చూపు అది ఆ పసిపిల్లను చూసి గుండె చెరువవడం అంటే యేమిటో అవగాహన కొచ్చింది.

ఎంత వెలుగుగా ఉన్నాయి ఆ కళ్ళుః క్షయరోగం బాగా ముదిరిన లక్షణం అది. నాకు శరీరం వేడెక్కేటంత ఆవేశం వచ్చింది.

ఆ చంటివాడికీ, కిటికీసీటు 'అమ్మాయి'కీ అయనకీ, పాపకీ ఏమిటి సంబంధం?

నా ఆలోచన ఆగడంలేదు.

ఆమె జాకెట్టులోంచి ఏదో చిన్న చీటీ తీసింది. ఓమారు చీటీని అరచేతిలోనే విప్పి చూసుకుంది.

"ఏమిటది—?" అతను గోముగా అడిగాడు.

"ఏం లేదు" సిగ్గుగా, చిలిపిగా ముఖం పెడుతూ కాగితం చూపించినట్టే చూపించి లాగేసుకుంది. కొంతసేపు ఆ ఆట అయ్యాక కాగితం అతను లాక్కుని చూశాడు. ఇద్దరూ గలగలా నవ్వుకున్నారు. ఆమె కంటిలో వగ, వలపు—కొంటెతనం అతనికే కాదు నాకూ చూపు మరల్చుకోడం అసాధ్యమైపోయింది.

రైలు, ఇతర ప్రయాణీకులు — చుట్ట వాసన—ముసలమ్మ గొణుగుడు - నా పరిశీలన



ఇవేవీ వాళ్ళకు పట్టడంలేదు. వారి ప్రపంచంలో వాళ్ళున్నారు. పాప నిస్త్రాణగా వెనక్కి జేరబడిపోయింది. వడిలోని చంటిబాబు ఊహ కందని ఆలోచనలతో నిద్రలాంటి మగతలో ఉన్నాడు.

ఇంతలో అతను వక్కపొడి పొట్లాం జేబులోంచి తీసి ఆమెకు కొంత పెట్టి, పక్కనున్న

కున్నాడు.

"దానికెందుకు, మతిలేకపోతే సరి:"-మందలించింది ముద్దుగా ఆమె.

నాకు పిల్లల ఆరోగ్యస్థితే మనసును కలవరపరుస్తోంది. పాపకి టి. బి. అని వైద్య శాస్త్రం చదవనివాళ్ళకి కూడా తెలిసిపోతుంది. బాబుకి లివర్ ఎన్‌లార్జిమెంట్. ఈ పిల్లలు

స్పృహ

ఈ వ్యవస్థ
నా పైకి
దుఃఖాన్నే వర్షిస్తూంది
నేనేమైనా ఒక గుంటనా,
నా నిండా
దుఃఖాన్ని నింపుకొని
మౌనంగా నిలబడటానికి?—
నే నొక వృక్షాన్ని
దుఃఖాన్ని విదిలించుకుని
రాలిన దుఃఖపు చుక్కలనే
వేళ్ళతో పీల్చి
మరింత ఎదుగుతా!
మరింత పచ్చబడతా! !

—గుడిహాళం రఘునాథం

కెలా తెలుస్తుంది.

వీళ్ళకు తెలిసేటట్లు చెప్పే బాధ్యతను నేనే స్వీకరిస్తే?

"నువ్వెవరివి?" అని, ఆ మెరుస్తున్న కళ్ళమ్మాయి అడిగితే? నేనేం చెప్పాలి?

మెల్ల మెల్లగా విషయం విశదమౌతోంది.

—'చూశారా న్యాయం ఇలా ఉంటుంది' నా పక్కనుండి లేచి వెళ్ళినాయన నిట్టూరుస్తూ నా పక్కకు వచ్చి కూచున్నాడు.

"ఏమైంది?"

"ఆ ముసలమ్మ దగ్గర డబ్బు తీసుకుని టిక్కెట్టు కొనకుండా డబ్బు కొట్టెయ్యాలని చూశాడు."

"అయితే ఏంచేశారు?"

"వాడి టిక్కెట్టు ముసలమ్మకిప్పించేశాను."

"మరి చిన్నవాడి టిక్కెట్టు?"

"బొబ్బిల్లో టి.టి చెప్పి పంపిస్తానన్నాడు."

—నేను చెయ్యగలిగి చెయ్యనిపనిని అతను చేశాడు. న్యాయం గురించి ఆలోచిస్తూ ఏం చెయ్యకుండా కూచున్నాను.

—ఈ పాపల సంగతి.

చటుక్కున స్ఫురించింది.

ఈ బిడ్డల తల్లి కళ్ళు మూసి ఉంటుంది. రెండో పెళ్ళి చేసుకున్నాడతను. ఆ కిటికీ సీటమ్మాయికి కొత్త సంసారం—వయసు తీపి. నూతన దాంపత్యం. దాని సొగసు, దాని మెరుగు, దాని హాయి—వీటితోపాటు బరువైన బాధ్యతలనూ స్వీకరించే మానసిక పరిపక్వత ఆ వయసులో, ఆ సందర్భంలో సాధ్యమా?

లేచి బ్యాగు తీశాను.

ప్యాడ్‌లోంచి కాగితం తీసి రెండువాక్యాలు రాశాను. విజయనగరం స్టేషనొచ్చేసింది. బ్యాగ్ మూసి పెన్ను జేబులో పెట్టుకుని ఆమెవంక చూశాను.

మాసపత్రిక చదువుకుంటోంది దీక్షగా. వడిలోని చంటివాడి తల వేలాడిపోతోంది.

—నేను ఇంటికి రాగానే బ్యాగు సవరించడం మా అమ్మాయికి అలవాటు.

ప్యాడ్‌లో నుంచి చింపిన కాగితంమీద రాసిన వాక్యాలు దానికి అర్థం కాలేదు.

నేను ధైర్యంగా, సినిమాలో కథలోలా, కల్పనలోలా ఆమె కందివ్వాలనుకుంటున్న కాగితం:

"ప్రాణంకంటె విలువైంది ఏదీలేదు. పిల్లలకు వెంటనే వైద్యం చేయించి వాళ్ళప్రాణాలు కాపాడండి."

కథవేరు—నిజం వేరు. ధైర్యం చెయ్యలేకపోయానన్నమాట, కాగితం ఇవ్వడానికి.

అసలు నేనెందుకు రాశాను ఆ కాగితం?

వృత్తిరీత్యా జాలిపడడం నా బాధ్యత కాబట్టి కదూ! మరి బాధ్యతను నిర్వర్తించడానికి ఎందుకు వెనకాడాను?

అదే సమస్య! అదే మానవ స్వభావం. చెయ్యాలనుకున్నా, చెయ్యడం మంచిదనుకున్నా చెయ్యగలిగీ చెయ్యకపోడం—మనిషికి అడపాదడపా ఎదురవుతున్న—మనసుని కలవరపరిచేదు నిజం—

కాని, ఆ పిల్లలు, ఆ పిల్లలు—వారి కథ ముగింపు మీకూ తెలుసు. □

సాడిస్టు

—వెల్లపిల్ల బాబ్జీ

మనుషుల్లో సామాన్యంగా వుండే వాళ్ళ నొదిలేస్తే మిగతావాళ్ళని మూడు రకాలుగా విభజించవచ్చు

—ఎదుటి వ్యక్తుల్ని బాధపెట్టి, వాళ్ళు ఏడుస్తుంటే చూసి ఆనందించేవాళ్ళు మొదటి రకం. వీళ్ళనే 'సాడిస్టు' లంటారు. ఎదుటివాళ్ళు ఆనందంగా వుంటే చూసి ఓర్వలేనివాళ్ళు రెండోరకం. వీళ్ళు అసూయాపరులు. తమని తాము బాధపెట్టుకుంటూ, ఆ బాధలో ఆనందం పొందేవాళ్ళు మూడోరకం. వీళ్ళని 'మసోఛిస్టు' లంటారు.

వీళ్ళలో రెండు, మూడు రకాలకు చెందే వారివలన ఎదుటివాళ్ళకు కష్టం కలగదు.

కానీ—రాజు మొదటి రకానికి చెందే—'సాడిస్టు.'

సూర్యం ఏ రకానికీ చెందని సామాన్యుడూ పిరికివాడూ. అంతేగాక అతను రాజుకి మిత్రుడూ, రూమ్మేటూను.

మరంచేత రాజు వలన సూర్యానికి కష్టాలు తప్పటం లేదనేది—రాజు, 'సూర్యాన్ని ఏడిపిస్తూ ఆనందించేటంత నిజం-వాళ్ళు వుంటున్న బొక్కి కొంప వదిలేస్తే, ఆ వూళ్ళో మరిళ్ళు దొరకవన్నంత నిజం.

అంచేత సూర్యం, రాజునొదిలించుకోలేక, మరో చోటుకి వెళ్ళలేక ఎలాగో రోజులు గడుపుకొచ్చేస్తున్నాడు భగవంతుడిమీద భారం వేసి.

సూర్యం పిరికివాడు కాకపోతే ఏదో ఒక 'రెమెడీ'ని వెతుక్కునుండేవాడు. కానీ, సూర్యం బొత్తిగా నాలుక లేనివాడు అవటంతో, రాజు ఆడింది ఆటగా, పాడింది పాటగా, చెప్పింది వేదంగా సాగిపోతోంది.

రోజులన్నీ యిలాగే గడిచిపోతే చాలన్న సంతోషం వుంది రాజుకి!

రోజులన్నీ యిలాగే గడిచిపోతాయేమో అన్న భయం వుంది సూర్యంకి!

తెల్లారితో ఏంచేసి సంతోషిద్దామా!—అని రాజూ, తెల్లారితే ఏం జరుగుతుందో!—అన్న భయంతో సూర్యం—ఏ రోజు కా రోజు గడిపేస్తున్నారు!

చిత్రమేమిటంటే రాజు, సూర్యాన్ని పెట్టే బాధలు తమాషాగా, ఎవ్వరికి చెప్పుకోలేకుండా వుండేవి. రాజు తన సాడిజాన్ని అలా ప్రదర్శించేవాడు.

—చచ్చీ, చెడీ ఆఫీసునుండి యింటికొచ్చేసరికి, ముందే వచ్చివున్న రాజు ఒక్క చుక్కైనా నీరు లేకుండా చేసేవాడు. దిక్కుమాలిన ఆ బొక్కి కొంపలో—ఎక్కడో ఫర్లాంగు దూరంలో నుయ్యుంది. పెరట్లోనూతికెళ్ళే దారినిండా చెత్తా, చెదారం, చుట్టూ గుబురుగా, భయంకరంగా పెరిగిన పిచ్చిమొక్కలూ, పట్టపగలే దెయ్యాలు గెంతేటంత దారుణంగా వుండే పెరడూ. కొళాయిలు రాని టైము..

స్వతహాగా భయస్థుడైన సూర్యం, 'కాస్త తోడురా, రాజూ!' అని ప్రాధేయపడితే, రాజులా పోజుపెట్టేసి 'అలసిపోయానుగురూ!' అనేవాడు రాజు. ప్రాణాలు అరచేత్తో పట్టుకొని ఎలాగో నీళ్ళు తెచ్చుకునేవాడు సూర్యం.

వారంలో రెండు, మూడుసార్లు యిలాగే జరిగేది—

—రాత్రి పడుకోబోయే ముందు వెలిగించిన బెడ్‌లాంప్‌ని, సూర్యానికి నిద్ర పట్టగానే ఆర్పేసేవాడు రాజు. ఓ రాత్రప్పుడు దాహానికో, మరి దేనికో మెలుకువొచ్చిన సూర్యం, చిక్కటి ఆ చీకటిని చూసి వెంటనే ముసుగెట్టేసేవాడు. ఇక నిద్రపట్టి చచ్చేది కాదు.. అలాగే దాహంతోటో, పీకుతున్న పొత్తికడుపుతోటో పడుకునేవాడు. రాజుని లేపినా ఫలితం వుండదని, అతని గుర్రే చెపుతుండేది.

ఇంక—తెల్లారి లేచేసరికి వొంటిమీద

లుంగీ లేకపోవడం, స్నానం చేస్తూ ముఖానికి సబ్బు రాసుకున్నప్పుడు అకస్మాత్తుగా చెంబు మాయమైపోవడంలాంటి అనుభవాలు చాలా మామూలైపోయాయి సూర్యానికి.

గట్టిగా యేమైనా అంటే నాలుగురోజులు మాట్లాడేవాడు కాదు రాజు. ఆ తర్వాత పరిస్థితుల్ని భరించటం యింకా కష్టంగా వుండేది సూర్యానికి. రాజు సాడిజాన్ని అలా కొనసాగించాడు. కొనసాగిస్తున్నాడు.

కానీ రోజులన్నీ అలాగే జరిగిపోలేదు.

ఒకరోజు

* * *

ఆ రోజు సరిగ్గా రాత్రి ఒంటిగంటయ్యింది. దేవుడే గెలిచాడు సినిమా చూసిన రాజూ, సూర్యం రోడ్డుమీదికొచ్చారు. అంతకు ముందు రోజే స్వంత వూరు నుండి తిరిగొచ్చిన సూర్యాన్ని బలవంతాన లాక్కొచ్చాడు రాజు, సెకండ్ షోకి.

ఆఖరురోజు కావటంవల్ల జనం అంతగా లేరు. వచ్చిన కొద్దిమందిలో చాలా మట్టుకు రిక్షాలమీదా, సైకిళ్ళమీదా వెళ్ళిపోయారు. నాలుగువైపులా వున్న రోడ్లమీదికి మిగతా జనం చెదురు మదురైపోయారు.

కిళ్ళీబడ్డీ దగ్గర సిగరెట్లు కొనుక్కొని వచ్చాడు రాజు.

"ఇలా పోదాం, అడ్డదారంట!" అంటూ రాజు కుడివైపుగా వున్న రోడ్డువైపు, దారి తీసాడు రాజు.

సూర్యం నెమ్మదిగా రాజు ననుసరించాడు.

ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది నిశ్శబ్దంగా వుంది చీకటిగా వుంది. ఆ వీధి కసలు దీపాలే లేవు దానికి తోడు చీకటి రాత్రుళ్ళు.

చిక్కగా అలుముకున్న చీకటి—సూర్యం మనసు నావరించిన భయంలా వుంది రాజు మనస్తత్వంలా అసహ్యంగా వుంది.

కీచురాళ్ళ అరుపులు కర్ణకఠోరంగా వున్నాయి

ఎక్కడో పిట్ట రెక్కలాడిస్తున్న చప్పుడు వినిపించి, మళ్ళీ నిశ్శబ్దం అలుముకుంది

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు

అస్పష్టంగా కనిపిస్తున్న చెట్లు, నించునే నిద్రపోతున్న రాక్షసుల్లా వున్నాయి

చెట్ల మధ్యనుండి అక్కడక్కడ కనిపిస్తున్న ఆకాశంలోని చుక్కలు రెప్పలార్పుకుంటూ చూస్తున్న దెయ్యాల కళ్ళలా వున్నాయి

ఏదో పక్షి, చెట్టు కొమ్మల్లోంచి వికృతంగా అరిచింది!

వెనక్కు దాటిపోతున్న పొడుగాటి చెట్లు, జుత్తు విరబోసుకున్న దెయ్యాల్లాగా వున్నాయి

" ఫొటోగ్రఫీ అద్భుతం గురూ!" సడన్‌గా నిశ్శబ్దాన్ని చీలుస్తూ వినపడ్డ రాజు మాటలకు ఝళ్ళిపడ్డాడు సూర్యం.

"ఆఁ?" అన్నాడు సూర్యం—సరిగా వినపడక. అతని గుండెలు జోరుగా కొట్టుకుంటున్నాయి.

"దెయ్యాన్ని గొప్పగా పిక్చరైజ్ చేసాడు కదూ!"

అస్పష్టంగా తలూపి వూరుకున్నాడు సూర్యం. అతనికి ఆ సంభాషణ యిష్టంలేదు. ఆ సంగతి రాజుకు తెలుసు.

అదే సాడిస్టుల లక్షణం—ఎదుటివారికి పడనివి తెలుసుకుని, తర్వాత బాధ పెట్టడం.

"నువ్వెప్పుడైనా దెయ్యాన్ని చూశావ్, గురూ?" మళ్ళీ అన్నాడు రాజు.

సూర్యం లేదన్నట్లు నెమ్మదిగా తలాడించాడు.

"మా వూళ్ళో వుండేదిట, గురూ! రోజూ రాత్రి పన్నెండింటికి, వూరి చివరన వున్న చింతచెట్టు చిటారుకొమ్మ మీద కూర్చునేదట" రాజు కనుకొలుకుల్లోంచి సూర్యాన్ని ఓరగా చూస్తూ అన్నాడు — గొంతు అదోలా మారుస్తూ.

సూర్యానికి ఒక్కసారి వొళ్లు జలదరించింది!! తన యెదుటనే ఆ చింతచెట్టు వున్నట్టు వొణికిపోయాడు!!!

శోభన్

"కాస్తాగు గురూ!" అంటూ, పేంటు గుండీ లిప్పుకుంటూ రోడ్డుపక్కకు నడిచాడు రాజు.

రోడ్డు ప్రక్కనే వున్న దుంగొకటి— యుద్ధరంగంలో చచ్చిపోయిన రాక్షసుడిలా— వుంది

రాజు నోట్లో ఎర్రగా వెలుగుతున్న సిగరెట్టు పిశాచి ఒంటికన్నులా వుంది.

కొంచెం సేపటి తర్వాత రాజు వచ్చాడు. మళ్ళీ యిద్దరూ నడక ప్రారంభించారు. చిన్న చలిగాలి వీస్తోంది.

"దెయ్యాలున్నాయి గురూ! లేకపోతే మనం చూసిన సినిమా—, అలా తీసే ఐడియా వాళ్ళకు రాదు."

దెయ్యాలమీదికి మళ్ళిన రాజు సంభాషణ, కట్టు కథల్తో సాగుతోంది.

మౌనంగా వినటం తప్ప ఏమీ చెయ్య లేని సూర్యం, నిస్సహాయంగా నడుస్తు న్నాడు

రాజు చెబుతున్న విషయాలు వినేకొద్దీ, సూర్యం గుండెలు కొట్టుకొనే వేగం పెరిగి పోతోంది! చెమటతో చొక్కా అంతా తడిసి పోతున్నట్టు స్పష్టంగా తెలుస్తోందతనికి!

ఎక్కడో కుక్క ఒకటి వికృతంగా



ఏడ్చింది!! చిన్నపిల్లాడు నూతిలో పడిపోతూ హృదయవిదారకంగా అరిచినట్టుంది — ఆ ఏడుపు.

వింటున్న సూర్యం గుండెలు ఝల్లుమన్నాయి!!

"గాలిలో దెయ్యాలు తిరుగుతుంటే కుక్కలు పసిగట్టి అలా ఏడుస్తూ అరుస్తాయట!!" అన్నాడు రాజు.

సూర్యం భయంతో ఒక్కసారి చుట్టూ చూసాడు—అసంకల్పితంగా.

గాలి గట్టిగా వీచిందొక్కసారి—దెయ్యాల గుంపు పరిగెడుతున్నట్లు.

చెట్ల ఆకులు గలగలమంటూ చప్పుడు చేశాయి—దెయ్యాల కాలి మువ్వల్లా.

"భయం వేస్తోందా?" అడిగాడు రాజు లోపల నవ్వుకుంటూ. అతనికి భలే ఆనందంగా వుంది.

సూర్యం మాట్లాడలేదు.

మెల్లగా నడుస్తూ, కుడిప్రక్కనున్న సందులోకి తిరిగారు. ఆ సందు దాటితే వచ్చేదే వాళ్ళ వీధి. నెమ్మదిగా సందు దాటుతున్నారు.

'భయంవేస్తోందా?' మళ్ళీ అన్నాడు రాజు.

జవాబు చెప్పటం యిష్టంలేనట్లు వూరుకొని, 'దాహం వేస్తోంది' అన్నాడు సూర్యం.

సందు దాటగానే కొద్దిదూరంలో, కుడి ప్రక్క ఎర్రగా వెలుగుతూ చిన్న మంట కనిపించింది.

అదొక కిరసనాయలు దీపం బుడ్డి. ఆ బుడ్డి వున్నచోటు అప్పిగాడి టీ పాక. అప్పిగాడు గల్లాపెట్టి సర్దుతున్నాడు.

'కొట్టింకా కట్టినట్టులేదు. రా టీ తాగుదాం!' అంటూ పాకలోకి దారితీశాడు రాజు.

'అప్పీ! మంచినీళ్ళిచ్చి, రెండు సింగల్ టీ కొట్టించు' ఆర్డరిచ్చాడు రాజు, బెంచిమీద కూర్చుంటూ. సూర్యం ప్రక్కనే వచ్చి కూర్చున్నాడు.

'ఏం-రాజు బావ్! చినిమా కెళ్ళినారేటి?' పలకరించాడు అప్పిగాడు. ఆ వెంటనే ఆవులించాడు. మధ్య పళ్ళూడిన వాడి నోరు రాక్షసుడి గుహలా తెరుచుకుని మూసుకుంది. దీపం వెలుతురు పడి వాడి కళ్ళు - స్మశానంలో గుడ్లగూబ కళ్ళలా మెరిసాయి. చీకేసిన తాటిటెంకలా వుంది వాడి బుర్ర. వెడల్పుగా వున్న వాడి ముఖంలో ముక్కు వుందో-లేదో తెలీనంత చప్పిడిలా వుంది. సగం కాల్తూనప్పుడు ఆర్పేసిన శవంలా వుంటాడు వాడు. వాడి ఎదురుగా వున్న కుంపటి, చచ్చినవాడి పాడెముందు మోస్తున్న నిప్పుకుండలా వుంది. ఎక్కువ పొగనొదుల్తూ మండుతున్న దీపశిఖ, మొగుడు చచ్చిన ఆడదాని సగం చెరిపేసిన నుదుటి కుంకుమలా వుంది.

కుంపట్లో బొగ్గులు కదిపి చిన్న డొక్కుతో నీళ్ళు పడేసి, గట్టిగా విసిరాడు అప్పిగాడు. కుంపటి రాజుకుంటోంది మెల్లగా.

గ్లాసుల్లో నీళ్ళిస్తూ "ఏం చినిమా కెళ్ళినారు బావ్?" అన్నాడు అప్పిగాడు. వచ్చిన బేరాన్ని కూర్చోబెట్టి ఎంతసేపైనా మాట్లాడే నేర్పుంది అప్పిగాడికి. వాడి గొంతులో అదో రకమైన మాధుర్యం వుంది.

హనుమంతుడికి తాటకినిచ్చి పెళ్ళి చేసినట్లుంది-వాడి గొంతు వాడి రూపానికి.

రాజు జవాబిచ్చాడు. సూర్యం గడగడా నీళ్ళు తాగాడు

"సిన్నప్పుడు మా తాత సెప్పిందానికి, ఆడు తీసిందానికి రవ్వంత తేడానేదు బావ్!! నాకు తెలకడుగుతాను—ఆదెలా తీసినాడు బావ్? నిజంగా దెయ్యంవేం నంటారేటి?" టకటకా అన్నాడు అప్పిగాడు.

"కాదులే! అదీ! ట్రిక్ ఫోటోగ్రఫీ అని కెమేరాతో అలా తియ్యగలరు" అన్నాడు రాజు.

"ఏం ఫొటోగెరఫో గానీ మా గొప్పగా తీసినాడు. ముచ్చెంగా దెయ్యంవేం బావ్!"

"ఓస్! నువ్వు చూసావేంటి దెయ్యాన్ని?"

"సూడ్నేదు. కానీ, మా తాత సెప్పినాక మరి సూడక్కర్నేదనిపించింది బావ్! నిజం... సెంద్రిగోడని " ఉత్సాహంగా గతంలోకి వెళ్ళిపోయాడు అప్పిగాడు.



వాళ్ళ తాత చెప్పిందంతా, తనే కళ్ళారా చూసినట్టు చెప్తూనే టీ కలిపేసాడు.

'అది బావ్! చివరికి సంగతేటంటే ఆ ఆడ దెయ్యాన్ని మరిగాక, ఆడుకూడా సచ్చి దెయ్యఁమై, కుటుఁవాఁనంతో సహా మా యీది రావిసెట్టుమీద కాపరఁపెట్టేసినాడంట అద్దరేతిరయ్యేసరికి, ఆ రావిసెట్టు కొమ్మ మద్దెనుండి రెండు కాళ్ళు యేలాడేవంట! ఏ నాకొడుకైనా తెగించి ఆ యీదంట ఒక్కడూ వత్తే, ఈ పాదాల్రెండూ ఆడి పీకను జుట్టేసి, రాక్కున నొక్కేసేవంట!!" అంటూ టీతెచ్చి యిద్దరిముందూ పెట్టాడు అప్పిగాడు.

తల టేబిల్‌మీద వాల్చి పడుకుని వింటున్నాడు సూర్యం! వెనక, గోడకు జారబడి, రాజుకూడా సీరియస్‌గా వింటున్నాడు! వాళ్ళ నరాలు చిట్లిపోతాయన్నంత టెన్షన్‌లో వున్నాయి! తరువాత ఇద్దరూ టీతాగి డబ్బులిచ్చి బయటకొచ్చారు.

ఎంచేతో రాజు రూమ్ చేరినదాకా మరేం మాట్లాడలేదు.

లుంగీలు కట్టుకుని యిద్దరూ నిద్రకుపక్రమించారు. సూర్యాన్ని భలే ఏడిపించాను అనుకుంటూ నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు రాజు కానీ అతని బుర్రలో యింకా అప్పిగాడు చెప్పిందంతా మెదులుతోంది. ఆలోచిస్తూనే పడుకున్నాడు రాజు, మూలగా వెలుగుతున్న బెడ్ లాంప్‌ని చూస్తూ

* * *

హఠాత్తుగా మెలుకువొచ్చింది రాజుకి. ఏదో పెద్ద కొండపైనుండి ఒక్కసారి క్రింద పడినట్లనిపించింది.

సందేహంలేదు! తనేదో చప్పుడు విన్నాడు!! రాజు యింకా ఆలోచిస్తున్నాడు 'టక్! టక్!' మంది వీధి తలుపు!

రాజు గుండెలు ఒక్కక్షణం ఆగి, వెంటనే జోరుగా కొట్టుకున్నాయి!! 'ఈ వేళప్పుడెవరు చెప్మా!!!?'

మళ్ళీ టక్! టక్ మంది వీధి తలుపు-ఈ సారి కొంచెం గట్టిగా.

రాజు గొంతు తడారిపోయింది. సూర్యం వైపు చూసాడు. సూర్యం అటు తిరిగి నిద్రపోతున్నాడు.

మరోసారి తలుపు చప్పుడవడంతోబాటు 'సూర్యం!' అని ఓ బొంగురు గొంతు విని

పించింది.

రాజు నెమ్మదిగా లేచి స్విచ్ వేసాడు. కరంటు పోయినట్టుంది. బల్బు వెలగలేదు. బెడ్ లాంప్ ఒత్తి పెద్దదిచేసి చేత్తో పట్టుకుని వెళ్ళి గడియ తీసాడు.

ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి!!

అతని నీడ గోడమీద పెద్దదిగా పడి భయంకరంగా కదులుతోంది.

"నేను సూర్యం అన్నయ్యకి ఫ్రెండ్ని, సూర్యం వున్నాడా?" అంటూ లోపలి కడుగేసాడు అతను. డబ్బాలో గులకరాళ్ళు వేసి కుదిపినట్టు బొంగురుగా వుందతని స్వరం.

రాజు అప్రయత్నంగా దారి తొలిగాడు.

ఆ క్రినీడలో చితిమీంచి లేచొచ్చిన టీబీ పేషెంటులా వున్నాడతను చెంపల మీది చర్మాన్ని చెవులదగ్గరికి లాగి పట్టినట్లు, వికృతంగా వుందతని ముఖం కళ్ళు మరీ లోతుకు వెళ్ళిపోయాయి మెడదగ్గర ఎముకలు ముందుకు పొడుచుకొచ్చి, అసహ్యంగా వున్నాయి ముక్కు బాగా ముందుకొచ్చి, ఇంక రాలేక క్రిందికి వాలిపోయినట్టుగా వుంది. అస్థిపంజరానికి అలంకారం చేసినట్టున్నాడతను.

'అతను' పూర్తిగా లోపలకు రాగానే చటుక్కున లైటు వెలిగింది. వెలుతురును చూసాక రాజు గుండె వేగం కొంచెం తగ్గింది.

'అతను' రాజువైపు చూసాడు–అదోలా.

కుటుంబాన్నంతటినీ తన చేతుల్తోటే తగలెట్టేసిన వ్యక్తి 'యింకా ఎవరున్నారా!' అని వెతికినట్టుంది ఆ చూపు, నిర్దాక్షిణ్యంగా.

రాజు వెళ్ళి సూర్యాన్ని కుదిపి లేపాడు.

"చూడు! మీ అన్నయ్య ఫ్రెండెవరో వచ్చారు!'' మరోసారి కుదుపుతూ అన్నాడు రాజు.

– సూర్యం కళ్ళు నులుముకుంటూ గట్టిగా ఆవలించి, అయోమయంగా ఆ వ్యక్తి వైపు చూసాడు.

"మీరూ . "అంటూ సందేహంగాఆగాడు.

"కృష్ణారావుని. మి అన్నయ్య ఫ్రెండ్ని. మీ యింటి కెదురుగా వున్న పచ్చమేడలో, మీ వూళ్ళో వుండేవాడిని" నవ్వాడతను.

'ఆ! ఆ! రండి!' గుర్తొచ్చినట్టు అన్నాడు సూర్యం.

'చిన్న పనిమీద వచ్చాను. ఆఖరి బస్సు మిస్సయితే 'దేవుడే గెలిచాడు' సెకండ్ షో చూసాను. మా ఫ్రెండొకాయ నింటికెళ్ళాను. కానీ అతడు లేడు. అంచేత రాత్రి వుండి వుదయం ఫస్టు బస్సు కెళదామని యిలా వచ్చేశాను." అన్నాడతను నవ్వుతూ. వెకిలిగా వుందా నవ్వు.

'ఓ! అలాగా!' అంటూ సూర్యం తన మంచం ఖాళీచేసి అతని కిచ్చాడు.

రాజూ, సూర్యం ఓ మంచంమీద సర్దుకున్నారు.

సూర్యం తాముకూడా ఆ సినిమాకే వెళ్ళినట్టు చెప్పి, ఏదో రెండు మూడు నిముషాలు మాట్లాడి, అలాగే నిద్రలోకి జారిపోయాడు.

అతనింకా మాట్లాడుతున్నాడు రాజుతో. రాజు అలా వింటున్నాడు. అతను సినిమా గూర్చే మాటాడుతున్నాడు.

రాజుకి ఏమిటో అతన్నీ, మాట తీరునీ చూస్తూంటే అదోలా వుంది. రాజు సిక్స్త్సెన్స్ ఏదో చెబుతోంది.'సమ్మింగీజ్' రాంగ్!అంటూ.

మంచంమీద పడుకుని మాట్లాడుతున్న అతను, రాజువైపే చూస్తున్నాడు.

రాజుకు సడన్గా తెలిసింది – అతను రెప్ప వెయ్యటం లేదని. అవును!!! అతను రెప్ప వెయ్యటంలేదు!! రాజు రోమాలు ఒక్కసారిగా నిక్కబొడుచుకున్నాయి దేహంమీద!!

అసంకల్పితంగా అతని పాదాల మీదికి వెళ్ళింది రాజు దృష్టి.

అతను వెంటనే కాలిమడమ గోక్కుంటూ అన్నాడు.

"దెయ్యాలు సిగరెట్లు కాల్చవు కదూ!?"

రాజు ఏమీ అనకముందే "అగ్గిపెట్టె కావాలొకసారి" అంటూ తలగడ క్రింద నుండి సిగరెట్ పెట్టె తీసాడు.

రాజు లేచి అగ్గిపెట్టె తెచ్చి యిచ్చాడు. అతని కాళ్ళు వణుకుతున్నాయి!!

"నిద్రొస్తోందండీ!' అంటూ లైటార్పి వచ్చాడు రాజు.

"అమ్మయ్య! ఎప్పుడు తెలారిపోతుందా అని చూస్తున్నాను." అతని గొంతు చిత్రంగా ధ్వనించింది.

అదిరిపడ్డాడు రాజు!! తలలో ఏదో అవుతున్నట్లుగా—బుర్రంతా తిరుగుతున్నట్లుగా !!

"అబ్బే! మరేం లేదు. లైటుంటే నాకు నిద్రపట్టి చావదు."

రాజుకు ఎప్పుడు నిద్ర పట్టిందో, ఏమో తెలియలేదు.

ర ర ర

ఉదయం పదిగంటలు కావస్తుండగా ఆఫీసు కెళ్ళబోతున్న సూర్యం రాజుని లేపి "తలుపు వేసుకుని పడుకో నే వెళ్తున్నా!" అంటూ వెళ్లిపోయాడు.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచాడు రాజు. ప్రక్క మంచం ఖాళీగా వుంది.

మొహం కడుక్కుని వచ్చేసరికి 'పోస్ట్' అంటూ కేక వినిపించింది. వెళ్ళి పోస్ట్‌మేన్ యిచ్చిన కవరు అందుకున్నాడు. అది సూర్యంది. వాళ్ళన్నయ్య రాసాడు. అయినా రాజు కవరు చించాడు. సూర్యం వుత్తరాలన్నీ అతను చదువుతాడు. ఉత్తరం విప్పాడు రాజు.

ప్రియమైన తమ్ముడు సూర్యానికి!

నీ అన్నయ్య దీవించి వ్రాయునది. అందరం క్షేమంగా వున్నాము. నువ్వు క్షేమంగా వున్నావని తలుస్తాను.

మొన్న నువ్వొచ్చినపుడు చెప్పిన పుస్తకాలకు డబ్బు కట్టేసాను. మొత్తం వందరూపాయలు. పదిహేను రోజుల్లో నీకు పుస్తకాలు వచ్చేస్తాయి. శ్రద్ధగా చదవవలెను.

నేను మళ్ళీసారి వొచ్చినపుడు పచ్చళ్ళు తీసుకుని వస్తాను. అప్పుడు వొండుకుందూ గాని. అందాకా హోటల్ భోజనం నీకు తప్పదు.

మీ వొదిన యింకా రాలేదు. బహుశా రేపు రాత్రికి రావొచ్చు. అమ్మ నాన్నా నీకు ఆశీర్వచనములు పంపుతున్నారు. అందరూ నిన్నడిగినట్టు చెప్పమన్నారు. మరేం విశేషములులేవు.

అన్నట్లు—మనింటికెదురుగా పచ్చమేడలో వుండే, కృష్ణారావు—అదే నా ఫ్రెండు మనింటికి రెండుమూడుసార్లొచ్చాడే పాపం—అతను నిన్న ఉదయం చచ్చిపోయాడు!! క్షయ బాగా ముదిరిపోయిందిలే!!

చదువుతున్న రాజు చేతిలోంచి కవరు ఎగిరి, గాలికి పెరట్లోకి ఎగిరి తుప్పల్లో దూరిపోయింది.

ర ర ర

సరిగ్గా అదే టైముకు అన్నయ్యకు రాసిన వుత్తరాన్ని మరోసారి, పోస్టుచేసే ముందు, చదువుతున్నాడు సూర్యం.

ప్రియమైన అన్నయ్యకు!

సూర్యం నమస్కారములు. నీ పథకం అద్భుతంగా యిప్పటివరకు నడిచింది. రాత్రి కృష్ణారావుగా రొచ్చారు.

లెక్కప్రకారం ఈ పాటికి సరిగ్గా రాజు నువ్వు రాసిన వుత్తరం చదువుతుంటాడు.

నిజంగా కృష్ణారావుగారు రెప్పవెయ్యకుండా వుండటం బాగా ప్రాక్టీస్ చేసారు. మనకి సహాయపడినందుకు ఆయనకు నా తరఫున కృతజ్ఞతలు అందచేయవలెను.

అన్ని వివరాలతో మళ్ళీ వుత్తరం వ్రాస్తాను ఇకనుండి రాజు నన్నేడిపించటం మానేస్తాడనుకుంటున్నాను.

వుంటాను. మరి.

నీ తమ్ముడు

సూర్యం.

ర ర ర

రాజు, తరవాత సూర్యాన్నే కాదు—ఎవ్వరినీ ఏడిపించడం మానేసాడు. ప్రస్తుతం ఇంకో వూరు వెళిపోయే ప్రయత్నంలో వున్నాడు. పాపం సాడిస్టు—రాజు.

సీరియల్



స్వైఖరం అడిగిందానికి "అంతే—అందుకే అంటూ పైకి వెళ్ళిపోయింది

సుందరి అలా ఎందుకందో అర్థం కాకపోయినా అప్పటికే ఆలస్యం అయిపోయిందని
[illegible]

సుందరి అరుణతోనే కిందకి వచ్చి, మళ్ళీ అరుణతోనే పైకి వెళ్ళిపోయింది.

శేఖరం వెళ్ళిపోగానే కుసుమ రాజేంద్ర దగ్గర ఇంతెత్తు ఎగిరి పడింది. అసలు తను సుందరి గురించి వివరంగా అడక్కుండానే శేఖరం తన మాటలతో తన నోరు మూయించినట్ట యింది కుసుమకి. ఇంకేం అడగాలి?

"అసలతని గుణాలే వేరు—అతని పద్ధతే వేరు" అంటూ తలా తోక లేనట్లుగా రాజేంద్ర మీద ఎగిరి పడింది కుసుమ.

"వాడు మంచివాడు కాదంటూనే ఎందుకే గొడవ" అన్నాడు రాజేంద్ర.

"ఆవిడ ఉత్తరాలమీద ఉత్తరాలు రాస్తోందని కాని—ఈ పెడసరం మనిషితో ఏం సుఖ పడుతుంది" ఈసడింపుగా అంది.

"అందుకే అంటున్నాను—ఆవిడకేదో ఒకటి నర్దిచెప్పచ్చులే! ఇంక ఆ సంగతి మర్చిపో" కొంచెం ఓదారుస్తున్నట్లుగా అన్నాడు రాజేంద్ర.

ఈ ఓదార్పు మాటలు కుసుమ కోపాన్ని చల్లార్చలేక పోయినాయి.

"అయినా ఏమిటి అతగాడి గొప్ప. ఏం చూసుకొని! నిముషానికి పది రూపాయలు ఖర్చు పెట్టడమే తప్ప రోజుకొక్క రూపాయి సంపాయించడం చేతకాదు. ఊరికే ఎగిరెగిరి పడటమేనా?"

"ఏమన్నాడు! నిన్నేమన్నా అన్నాడా?" మళ్ళా మొదటకే వచ్చిందిరా బాబూ అనుకొన్నాడు రాజేంద్ర.

"నన్నా! నన్నంటే నే నూరుకుంటానా! హు!"

"మరేమయింది."

"నా మొహమయింది—చూస్తూండండి. ఏదో పెద్ద త్యాగం చేసినట్లు చేసి లేనివాళ్ళమ్మా యిని చేసుకొని చీకటి కొట్లో బంధించదా మనుకుంటున్నాడు పిల్లిని గదిలో పెట్టి, తలుపులు మూసి కొట్టబోతే అదేం చేస్తుంది, చివరికి తనకీ అదే గతి పడుతుంది"

"కుసుమా!" ఖంగారుగా పిలిచాడు రాజేంద్ర.

"ఏం? తమ్ముడిని అనేసరికి అంత ఖంగారేసింది. మీరంటే అతగాడికి రవ్వంత విశ్వాసం గౌరవం వున్నాయా? ఒక్కసారి మీరు సుందరి విషయం కదిపిచూశారా! పోనీలెండి—అవ్వక పోవటమే మంచిది మిమ్మల్ని చేసుకొని నేనిలా వున్నాను—సుబ్రంగా పదిమంది గల ఇంట్లో పడేస్తే?" విసురుగా అక్కడనించి వెళ్ళిపోయింది కుసుమ.

కుసుమ చివర వదలిన మాట రాజేంద్రకి బాణంలా గుండెల్లో గుచ్చుకుంది. ఇన్నేళ్ళ సంసారంలో—అదేదో అంతా తన తప్పన్నట్లు అప్పుడప్పుడు మాట్లాడుతుంది కుసుమ. ఆమాట ఆ మాట తను ఆవిడని అనగలడా? పిల్లలు కలగకపోవడం తన తప్పా!

రాజేంద్ర చాలా సేపు అలాగే కూర్చుండిపోయాడు.

ఆ రోజే కుసుమ సుందరి తల్లికి రాజమండ్రి వుత్తరం రాసింది. ఇక్కడ తన మరిది విషయంలో ఆశ వదులుకోమని—ఇక్కడే తనకి తెలుసున్నవాళ్ళు వున్నారు! ఆవిడ తమ్ముడు వున్నాడు నువ్వు ఓసారి వచ్చి చూసుకొంటే మంచిది అని వ్రాసింది.

వెంటనే తిరుగు టపాలో ఆవిడ దగ్గరనుండి వుత్తరం వచ్చింది. తనకి ఇప్పుడిప్పుడే ఒంట్లో కులాసాగా వుంటోందని ఇంకా ప్రయాణం చేసే ఓపిక రాలేదు. కులాసా చూసుకొని

వెనుకబడిన తరగతులకు వెలుగుబాట!

చదువు చదువు చదువు.

అదే కల్పతరువు.

అందరికీ విద్య అందుబాటులో వుండాలి.

వెనుకబడిన తరగతులలో విజ్ఞాన జ్యోతిని వెలిగించి, వెలుగు నింపడానికి పూనుకుంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. వెనుకబడిన తరగతుల కోసం విద్యాపథకాలను అమలు పరచడానికీ, వారికి ఉపకార వేతనాలను ఇవ్వడానికి ప్రభుత్వం హెచ్చు మొత్తాలను మంజూరు చేసింది. ఈ విద్యారంగానికి రు. 236.84 లక్షలు వెచ్చించ సమకట్టింది.

విద్యార్థుల వసతి గృహాల నిర్వహణకు రు. 2 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం వున్న 351 హాస్టళ్ళతో పాటుగా మరో 22 హాస్టళ్లను కూడా తెరిచారు. మత్స్యకారుల బాలల కోసం ఇటీవలనే 5 ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించారు. అనేకమంది విద్యార్థులు నూతన భావిసీమలనందుకోవడానికి వసతి గృహ ప్రాంగణాల్లోకి తరలివచ్చారు. ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య 13, 136, నుంచి 31,665 కు పెరిగింది. వర్ధమానతరం.

కొత్త యుగప్రాంగణంలో అడుగుపెట్టింది.

డి. ఐ; పి. ఆర్. నెం: 54

వస్తానని వ్రాసింది.

*　　　　*　　　　*　　　　*

ఎంతసేపటికీ బస్సురాక విసుగ్గా నిలబడింది మీరా బస్టాపులో.

ఆ తర్వాత రెండు బస్సులు వచ్చినా ఆగకుండా వెళ్ళిపోయినాయి. మీరాకు మరీ చిరాకని పించింది.

మళ్ళీ పది నిమిషాల తర్వాత ఓ బస్సు వచ్చింది. అది స్టాపు దాటి చాలా దూరంలో ఆగింది. బస్టాపులో వున్నవారు కొంతమంది పరుగెత్తేరు. మీరాకూడా పరుగులాటి నడకతో బస్సువరకూ వెళ్ళేసరికి అప్పుడే బస్సు కదిలింది. ఉసూరుమంది మీరా ప్రాణం.

ఈ రోజు అరుణ మ్యాట్నీకి వెళ్దాం రమ్మంది. అది పాత సినిమా! ఈరోజు ఆఖరిరోజు తప్పకుండా వెళ్దాం రమ్మంది. అప్పుడే ఒంటిగంట దాటింది. బస్సు రావాలి—వస్తే ఆగాలి— ఆగితే దొరకాలి. ఈ రోజు వెళ్ళడానికి వుండదు. అరుణకి చాలా కోపం వస్తుంది. అమ్మకి చెప్పి రావలసింది. మేట్నీకి కుదరని పక్షంలో మొదటి ఆటకి వెళ్ళేవాళ్ళం .

తన పక్కగా కారు ఆగటంతో పరధ్యాన్నంగా నిలబడ్డ మీరా ఉలిక్కిపడింది. 'ఎవరా' అని చూసింది. జ్యోతి.

"ఏమిటీ! రోడ్డుమీదే నిద్రపోతున్నావా?" అంది నవ్వుతూ.

"నిద్రా! నా ఎత్తు ధనం పోసినా పగలు నిద్ర రాదు'' అంది మీరా.

"ఎక్కడికి వెళ్ళాలి! రా, కూర్చో!'' అంది డోరు తెరుస్తూ.

"నేను ఫ్రెండింటికి వెళ్తున్నాను."

జ్యోతి నవ్వింది. "నాతో తీసుకుపోతానని భయమా? అలాంటి భయం పెట్టుకోకు. ఎటు వెళ్లాలో చెప్పు" అంది జ్యోతి.

మీరా ఆలోచిస్తోంది. పోనీ వెళ్ళిపోతే! ఇప్పుడప్పుడే బస్సు వచ్చే సూచన లేదు. ఇంత క్యూ వుంది. బస్సు దొరుకుతుందన్న నమ్మకం లేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? రా, కూర్చో!'' అంది జ్యోతి.

మీరా ఇంకేం ఆలోచించలేదు. వచ్చి కారులో కూర్చుంది.

"దారి చూపించాలి—లేకపోతే నా ఇష్టం వచ్చిన చోటుకి తీసుకుపోతాను" అంది జ్యోతి గట్టిగా నవ్వుతూ.

ఆ మాటా నవ్వూ మీరాకి కంపరం కలిగించినాయి.

"బాయ్ ఫ్రెండా-గర్ల్ ఫ్రెండా!" అని అడిగింది జ్యోతి.

మీరా జ్యోతికేసి చురుగ్గా చూసింది.

"కోపం వచ్చిందా, మీరా! తప్పేముంది? అయినా ఇప్పుడుండకపోతే ఇంకెప్పుడుంటారు'' తమాషాగా నవ్వుతూ అంది జ్యోతి,

మీరా మాట్లాడలేదు. అసలు తను కారెక్కటం పొరపాటనుకొంది.

"బాప్‌రే! నిజంగా కోపం వచ్చిందా, మీరా! తమాషాగా అన్నాను" అంది.

"కోపం ఎందుకూ? నాకు కోపంరాలేదు" అంది మీరా.

"మరి ఏదేనా మాట్లాడు."

"నువ్వే మాట్లాడు."

"మాటలాడతాను కాని—నాకేమిటో కుదురుగా మాటలాడ్డం రానంటుంది మా అమ్మ.

ఇంతక్రితం నిన్ను చూ స్తే అది నిజమే అనిపిస్తోంది.''

"అదేం!" ఆశ్చర్యంగా చూసింది మీరా.

"ఏమిటో నా కలాగే వచ్చేస్తాయి మాటలు—ఇందాక నీకు కోపం వచ్చిందిగా!''

"అబ్బే! నాకు కోపం రాలేదు" అంది ఖంగారుగా.

"వచ్చినంత పనయింది కదా!" అంది జ్యోతి నవ్వుతూ.

"ఆఁ. ఇక్కడే ఆపు" అంది మీరా.

మీరా కారు దిగింది. మీరా ఏదో అనబోయింది. జ్యోతి, "ఏఁ? నీ ఫ్రెండుని నేను చూడ కూడదా?" అంది.

మీరా ప్రాణం సిగ్గుతో చచ్చిపోయింది. "ఛ! ఏమిటలా అనేస్తుంది" అన్పించింది. జ్యోతిని లోపలకి రమ్మనటం మీరాకి ఇష్టంలేదు. వెళ్ళిన టైములో ఒక వేళ శేఖరం ఇంట్లోనే వుంటే? అరుణ మాటలనిబట్టి జ్యోతి ఇక్కడకి వచ్చినట్లు లేదు. అంటే జ్యోతికి వాళ్ళ ఇల్లు తెలియదన్న మాట! అయినా జ్యోతి అలా అన్నాక వూరుకొంటే ఏం బాగుంటుంది!

అసలు మీరా రెండిళ్ళ అవతలే కారు ఆపించింది.

తప్పనిసరిగా అంది మీరా నవ్వు తెచ్చిపెట్టుకుంటూ "రా! ఇంకా నువ్వెక్కడికన్నా వెళ్లాలేమో అనుకుంటున్నాను" అంది.

''ఏమిటో ఈ రోజు నాకు చాలా తిక్కగా వుంది—ఏం తోచడంలేదు. ఎక్కడికీ వెళ్లాలని లేదు" అంది మీరాతో నడుస్తూ.

నిజంగానే జ్యోతి ఎలాగో కనిపించింది మీరాకి.

"ఇదేమిటి? ఇక్కడ ఇల్లయితే అక్కడ ఆపించే వెందుకూ?"

మీరా మాటలాడలేదు. ఎందుకో మీరా గుండెలు కొట్టుకుంటున్నాయి.

ఇద్దరూ లోపలకెళ్లారు.

అరుణకి జ్యోతిని పరిచయం చేసింది.

అప్పటికే అరుణ సినిమాకోసం తయారయి వుంది.

జ్యోతితో మాటలాడుతూ కూర్చుంటే ఏం బాగుంటుందని సినిమా ప్రయత్నం విరమించు కున్నారు.

జ్యోతి ఓ అర్ధగంట తర్వాత వెళ్తా వెళ్తా అంటూనే మరో అర్ధగంట కూర్చుంది.

తర్వాత జ్యోతి వెళ్తానని లేచింది. "మీరా ఇంకా వుంటావా?" అని అడిగింది. మీరా వుంటానంది.

జ్యోతి, ''మీరాని తీసుకొని మా ఇంటికి తప్పకుండా రావాలి మీరు" అంది అరుణతో.

"అలాగే" అంది అరుణ.

"మీరు ఎప్పుడొస్తారో చెప్పండి. నేనే వచ్చి తీసుకెళ్తాను" అంది మళ్ళీ.

"ఎందుకండీ! నేనూ, మీరా కలిసి వస్తాం" అంది అరుణ.

జ్యోతి తొందరగా వెళ్ళిపోతే బాగుండు ననుకొంటోంది మీరా.

అరుణా, జ్యోతీ, మీరా కిందికి దిగుతున్నారు.

శేఖరం అప్పుడే ఎక్కడనుంచో వచ్చినట్టున్నాడు. అతను రెండు మూడు మెట్లు ఎక్కే సరికి వీళ్ళు ముగ్గురూ కిందకి దిగుతూ కనిపించేరు.

జ్యోతి నమ్మలేనంత ఆశ్చర్యంగా—సంభ్రమంగా చూసింది.

మీరా గుండెలు క్షణంసేపు కొట్టుకోవడం మానేసి తిరిగి రెట్టింపు వేగంతో కొట్టుకో సాగాయి.

శేఖరం చూపులు జ్యోతిమీంచి మీరామీదికి పాకినాయి—అతను వెంటనే గిరుక్కున వెనక్కి తిరిగి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

జ్యోతి ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే "ఎవరూః" అంది.

"మా చిన్నన్నయ్య" అంది అరుణ.

జ్యోతి శేఖరం ఎక్కడేనా కనిపిస్తాడేమోనని ఇటు అటు చూస్తూనేవుంది ఇల్లు అలంకరణ చూసే నెపంతో. ఊహూః శేఖరం ఎక్కడా కనపడలేదు. "పోనీలేః ఇల్లు తెలిసింది కదాః" అనుకుంది.

గేటువరకూ వచ్చేకా అరుణతో అంది. "తనకి ఇంత మంచి స్నేహితురాలుందని మీరా

తపస్సు

ఆకులు రాలిన చెట్టువలె చైతన్యం రహించిన శరీరం
మొండిగా వున్నది
దిశాంచలాన్ని కమ్మివేస్తున్న తపస్సువలె ఏదో
దుఃఖ పరంపర గుండెన తెర్లుతున్నది;
ఈ చిరకాల దుఃఖాని కంతం ఎప్పుడు?
ఏ సునేత్రాలనుండి ప్రసారించిన దృక్కిరణం
ఈ జీవితాన్ని రస ప్లావితం చేస్తుంది?
కేవలం ఒకే ఒక్క వేదనాభరిత సన్నివేశం
మొత్తం జీవితాన్ని ఊషర క్షేత్రంగా మారుస్తుందని
ఎప్పుడైనా అనుకున్నానా?
మేధస్సు ఎందుకో దుఃఖమేఘారణ్యంలో
సుదీర్ఘ తపశ్చర్యకు పూనుకున్నది.
శరీరాన్ని, కాలంతోపాటు ఆయువునీ
హరిస్తున్న ఈ సమాధి ఎన్నడు ముగుస్తుందో తెలీదు;
ఎన్నడో ఒక తరంగం వీస్తుంది
గాలి అలలుగా పూస్తుంది
తరుణ కెరటాలు లేస్తాయి
రసవత్తర దృశ్యంలో ఆగిన కల
తిరిగి ప్రారంభమవుతుంది

—కలువకొలను రాంమోహన్‌రాజు

ఎప్పుడూ చెప్పనేలేదు—వాటాకొస్తానని భయమేసిందేమో! అవునా మీరా!" మీరాకేసి తిరుగుతూ అంది.

పరధ్యాన్నంగా వున్న మీరా ఉలిక్కిపడింది. "ఏమిట"న్నట్లు చూసింది.

"మీరు వాటా కొచ్చినా తనేమీ అనదు లెండి" అంది అరుణ నవ్వుతూ.

జ్యోతి అరుణని తప్పకుండా రమ్మని చెప్పి, మీరాతో "మీరా! ఆవిడ రాకపోతే నువ్వు తీసుకురాలేదన్నమాట! అర్థమయిందా?" అంది మీరా భుజంమీద చిన్నగా తట్టూ.

జ్యోతి వెళ్ళిపోయింది.

అరుణ వెనక్కి తిరుగుతూ అంది. "మనిషిని చూస్తే అలా చేసేలా లేదు ఏమిటి అలా వున్నావ్" అంది మీరా అదోలా వుండటం చూసి దగ్గరగా వస్తూ.

"ఎలా వున్నాను? ఇంక నేను నీకు కనపడనులే!" అలా అంటూనే అరుణ ఎక్కడ గిల్లుతుందోనని వెనక్కి రెండడుగులు వేసి నిలబడింది.

అరుణ కోపంగా చూస్తూ అంది "మళ్ళా అంత భయం ఎందుకూ? ధైర్యం వుంటే దగ్గరగా వచ్చి అను."

"అబ్బాయిగారు యిప్పుడు చూస్తే అమ్మాయిగార్ని వెనక్కి తిరిగి చూడకుండా వచ్చిన దారినే ఒకటే పరుగిచ్చుకొంటారు" అంది మీరా.

అరుణ చాలా సీరియస్‌గా చూసింది మీరాని.

మీరా పెదాలు బిగించి అలాగే చూస్తూ నిలబడింది.

విసుగొచ్చిన అరుణ: "ఎంత మొండి! ఎరక్కపోయి నీతో స్నేహం చేశాను" అంది.

"బుద్ధొచ్చిందా?" అని అడిగింది మీరా అలాగే చూస్తూ.

"ఆ, బాగా వచ్చింది"

"అయితే లెంపలేసుకో!"

అరుణ మీరాని గబుక్కున పట్టుకోబోయింది.

మీరా అందకుండా మెరుపులా తప్పించుకొంది.

"నీతో నేను పరుగెత్తలేను—రా, లోపలికి పోదాం" అంది అరుణ.

*　　　*　　　*

శేఖరం రాత్రి తొమ్మిది దాటాక వచ్చేడు.

అన్నగారితో ఓ పదినిముషాలు మాట్లాడి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

సాధారణంగా శేఖరం వచ్చేసరికి రాజేంద్ర పడుకున్నా అరుణతో కాస్సేపు కబుర్లు చెప్పటం అతనికి అలవాటు.


శేఖరం వచ్చేవరకూ అరుణ పడుకోదు. పదకొండు గంటలు దాటిపోతే ఏమోగాని.

శేఖరం వచ్చేసరికి అరుణకూడా అక్కడే వుంది. అరుణతో శేఖరం ఏం మాటాడలేదు. శేఖరం అదోలా కనిపించడంతో అరుణ మౌనంగా వుండిపోయింది. ఎందుకలా వున్నాడా అనుకుంది.

మర్నాడు పొద్దున్న కూడా అదోలానే కనిపించేడు.

అన్నగారు మొహం కడుక్కునొచ్చేసరికి తనే కాఫీ తీసుకొచ్చింది అరుణ.

శేఖరం ఎప్పటిలా "నువు తీసుకొచ్చేవేం?" అని అడగలేదు. మౌనంగా అందుకున్నాడు.



'ఎందుకిలా వున్నాడు?' అనుకుంది అరుణ.

ఎవరేనా కాస్త కోపంగా కనిపిస్తే భయం—దిగులుగా కనిపిస్తే బాధ కలుగుతాయి అరుణకి.

చివరికి అడిగేసింది. "అలా వున్నావేం అన్నయ్యా!" అని.

"ఆఁ!" అంటూ తలెత్తేడు శేఖరం. ఆ కళ్ళనిండుగా అన్నగారంటే అభిమానం, ప్రేమా తొణికిసలాడుతున్నాయి. 'అరుణని తనే మనగలడు? వాళ్ళగురించి అరుణని అని తన మనసుని బాధపెట్టలేడు. అయినా అరుణ ఏంచేసింది మధ్య!

ఏమిటన్నయ్యా! అలా చూస్తున్నావ్! అలా వున్నావేం?" లాలనగా అడిగింది.

"ఎలా వున్నాను!" అన్నాడు శేఖరం చిన్నగా నవ్వుతూ.

"ఏమిటో పరధ్యాన్నంగా వున్నావు."

"పరధ్యానమా! దానికీ నాకు సగం ఎరికి—దాని జోలికి పోను."

"పోనీ అదే నీ దగ్గరికి వచ్చిందేమో!"

"తన్ని అవతలకు గెంటుతాను" అన్నాడు నవ్వుతూ.

అరుణ కూడా నవ్వేసింది.

తర్వాత ఇద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పుకొన్నారు.

క్రితం రోజు జ్యోతిని చూసినప్పటినుంచీ అతనికి చాలా చిరాగ్గా వుంది. కోటేశ్వరరావు గారు "మీ ఇల్లు ఎక్కడో తెలియదయ్యా! మీ ఇల్లు ఎక్కడ?" అన్నా ఏదో మాటల్లో తను తప్పించేసాడు. అలాగే రెండు మూడుసార్లు కోటేశ్వరరావుగారు, తనూ కార్లో ఎక్కడికో వెళ్ళి వస్తోంటే "నిన్ను మీ ఇంటిదగ్గర డ్రాప్ చేస్తా"నంటే కూడా తను ఏదో వంకపెట్టి తప్పించు కొంటూ వచ్చేడు. నాలుగుసార్లు తండ్రి వస్తే ఆ తర్వాత జ్యోతికూడా వస్తుందని.

జ్యోతికి ఇల్లు తెలియదు. అరుణతో పరిచయం లేదు. ఇది మీరా చేసిన పనే! మొత్తం

పారిశ్రామిక ప్రగతి

అందరికీ ఉపాధి కల్పించడానికి పరిశ్రమలను అధిక సంఖ్యలో ఏర్పాటు చెయ్యాలి. ప్రతిమనిషికీ పని కల్పించి, తద్వారా నిరుద్యోగాన్ని దూరం చెయ్యాలి. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలను అభివృద్ధి పరచడానికి బృహత్తరమైన కృషి జరుగుతుంది.

భారీ, మధ్య తరహా పరిశ్రమలతో పాటు చిన్నతరహా కుటీర పరిశ్రమలకు కూడ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చిన్నతరహా పరిశ్రమలకు అవసరమైన సదుపాయాలను, సలహాలను ఇచ్చేందుకు 11 జిల్లాలలో జిల్లా పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాలద్వారా చిన్నతరహా, కుటీర పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ముడిసరుకును, ఇతర సుదుపాయాలను సరఫరా చేయడానికి వీలుకలుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ ద్వారా ఇంతవరకూ 180 పథకాలు ప్రయోజనాన్ని పొందాయి. ఈ పథకాలకు రు. 665 కోట్లు పెట్టుబడి పెట్టారు. దీనివల్ల 1,75,000 మందికి ఉపాధి లభిస్తుంది.

రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ బలవత్తరమైన పారిశ్రామిక శక్తిగా రూపొందుతుంది.

డి. ఐ. పి. ఆర్. నెం: 53

ఆ గ్రూప్‌కి నాయకురాలు కదా! జ్యోతికి పర్సనల్ సెక్రటరీ అన్నమాట—వాళ్ళంతా ఏదో ప్లాను వేసుకొన్నారన్నమాట!

వీళ్ళకి బుద్ధిచెప్పడం తనకి బాగా తెలుసు. ముందు మీరాని ఇక్కడకి రాకుండా చేయాలి. తను పొరపాటు చేశాడు. అదివరకే ఆ పని చేసుండాల్సింది—మధ్యలో తన కళ్ళకి తెరలా మైకం కమ్మేసింది. ఇప్పటికేనా మించిపోయిందేమీ లేదు. మొట్టమొదట చేయవలసిన పని మీరాని ఇక్కడకి రాకుండా చేయడం—

మొదట అరుణనే మీరా స్నేహం మానేయమని గట్టిగా చేప్పాలనుకున్నాడు శేఖరం. కాని దానివల్ల చాలా అరాలు వస్తాయి—ఎందుకంటుంది — ఈ గొడవలన్నీ ఎందుకు? తనకే ఎదేనా ఘాటుగా వార్నింగు ఇస్తే సరిపోతుంది అనుకున్నాడు.

ఇతనాలోచనలు ఇక్కడ ఇలా వుంటే—అక్కడ మీరా—క్రితంరోజు శేఖరం రాకుండా జ్యోతి వెళ్ళిపోతే బాగుండు ననుకుంది. కాని అతను రానే వచ్చేడు. అసలు గొడవపడ్డ జ్యోతిని వదిలేసి అతను మాటి మాటికి తనకేసి అలా గుచ్చిచూడ్డం కంపరం పెడుతూనే వుంది. అయినా తనేం తప్పు చేయనప్పుడు తనెందుకు భయపడాలి? అనుకుంటూనే వుంది—మళ్ళీ అతన్నిచూస్తే ఏదో భయం.

మొత్తం సంగతంతా అరుణకి చెప్పేస్తే! అనిపించింది. అంతలోనే మళ్ళీ ఒకవిధమైన మొండితనం ప్రవేశించింది. తనవల్ల చిన్న తప్పుకూడా లేదు. అలాంటప్పుడు తను భుజాలు తడుముకోవడం ఎందుకు? ఎలాగన్నా చూడనీ! తనకేం భయంలేదు అనుకుంది.

ఆ రోజు మాట్నీకి వెళ్ళడానికి లేకపోయినందుకు ఈరోజు మొదటి ఆటకి వెళ్దాం రమ్మని ఆరోజే చెప్పింది అరుణ.

వెళ్ళేరోజు వచ్చేకా వెళ్ళనా మాననా అనుకుంది మీరా. కొన్ని క్షణాలు తటపటాయించిన మీరా తర్వాత వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

తల్లి బట్టలు కుట్టుకుంటోంది. తల్లి కుట్టిన బట్టలకి కాజా బటన్సు కుట్టసాగింది మీరా. ఈ మధ్య కాంతమ్మకి ఒంట్లో బాగుండటం లేదు. కొన్నాళ్ళు కాంతమ్మ డాక్టరు దగ్గరకి వెళ్ళలేదు. డాక్టరుదగ్గర కెళ్ళాలంటే నోట్లకట్టలు చేతిలో వుండాలి.

మీరా వూరుకోలేదు. పోనీ స్కూలుకి శెలవలుకదా రెస్టు తీసుకోమంటే కాంతమ్మ వినదు. ఒంట్లో ఓపిక వున్నప్పుడే చేసుకోవాలంటుంది. సెంటరుకి కోటా వచ్చిందంటే విడవకుండా తీసుకొంటుంది. వద్దంటే మానదు.

తల్లి పని చేసుకొంటోంటే చాతనయినంతవరకూ మీరాకూడా కుడుతుంది. తల్లి మిషను కుడుతోంటే తను కాజా బటన్సు కుడుతుంది.

మీరా బలవంతంచేసి తల్లిని డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళింది.

నీరసంవల్ల. ఏం ఫరవాలేదని మందులు రాసిచ్చేడు డాక్టరు. విశ్రాంతి తీసుకోవాలన్నాడు. కాని ఆవిడ వినదు. మీరాకి విసుగొచ్చి వూరుకొంది.

"సరోజినీదేవమ్మగారు సూర్య కుమారితోటి నిన్ను రమ్మని కబురుచేశారు. సాయంత్రం అలా వెళ్ళిరా" అంది కాంతమ్మ.

మీరా ఆశ్చర్యపోయింది. తన్నెందుకు? "నన్నా?" అంది ఆశ్చర్యంగా.

"ఆఁ, నిన్నే!" అందావిడ.

"నన్నెందుకూ? నాతోఏం పని? నిన్నని చెప్తే పొరపాటున ఆవిడ అలా చెప్పిందేమో!" అంది మీరా.

"మీ అమ్మాయిని అని చెప్తేనా? పోనీ ఓసారి వెళ్ళిరాకూడదూ!''

"ఈ రోజు అరుణ రమ్మంది. ఆ రోజు సినిమాకి వెళ్ళలేదుగా? ఈ రోజు వెళ్దాం రమ్మంది."

"సినిమాకి రేపు వెళ్ళొచ్చు. అదెక్కడికి పోతుంది. కబురుచేసినప్పుడు వెళ్ళకపోతే బాగుండదు."

అక్కడికి వెళ్ళడం మీరాకి యిష్టంలేదు. వెళ్ళకపోతే తల్లి వూరుకోదు. "రేపు వెళ్తాలే, ఈ రోజు నేను వెళ్ళకపోతే ఇంక అరుణకి కోపం వస్తుంది. రేపు తప్పకుండా వెళ్తాను" అంది మీరా.

"నీ ఇష్టం" అంది కాంతమ్మ.

ఆవిడ సాధారణంగా ఏ విషయాన్నీ పొడిగించదు!

*　　　*　　　*　　　*

కుసుమ అరుణ దగ్గరకొచ్చి అంది "అరుణా! ప్లీడరు గారింటికి నువ్వెళ్ళి వచ్చెయ్."

"అదేం. నువు రావా?" అంది అరుణ.

"వద్దామనే అనుకొన్నాను. హనుమాయమ్మగారు రమ్మని ఫోనుచేసింది. నువ్వెళ్ళి వచ్చేయి" అని కుసుమ వెళ్ళిపోయింది.

కనీసం సుందరి నన్నా పంపకూడదూ! ఆ ప్లీడరు గారింట్లో తన కెవరితోనూ అంత పరిచయంలేదు.

'ఈ రోజుకూడా సినిమా సున్నాయే' అనుకొంది అరుణ.

'పోనీ వెళ్ళి మొహం చూపించి వచ్చేస్తే సరి' అనుకుంది మళ్ళీ.

అరుణ అయిదు నిముషాల్లో తయారయింది. పది నిముషాలు మీరా వస్తుందేమోనని చూసింది. మీరాని తీసుకొనివెళ్ళి అటునుంచి అటు సినిమాకి వెళ్ళచ్చని.

మీరా రాలేదు. అరుణ వాచీ చూసుకొంది.

'ఇంకా టైముందిగా! ఈలోగా వెళ్ళి వచ్చేస్తే!' అనుకుంది.

కుసుమా సుందరీకూడా తయారయ్యారు.

అరుణ శేఖరం దగ్గర కొచ్చింది.

"అన్నయ్యా! నేను ప్లీడరుగారింటికి వెళ్ళొస్తాను. పదినా వాళ్ళుకూడా ఎక్కడికో వెళ్తున్నారు. మీరా వస్తే వుండమని చెప్తావా! నేను లేనని వెళ్ళిపోతుందేమో! ఇప్పుడే వస్తానని—కూర్చోమన్నానని చెప్పు" అంది అరుణ.

'మీరా వస్తుంది' అతని చెవుల్లో అమృతం పోసినట్లయింది.

కుసుమ వచ్చి తను ఎక్కడికో వెళ్ళాలనడం తనూ విన్నాడు.

"ఒకవేళ నువ్వెళ్ళిన వెంటనే వచ్చినా వస్తావని చెప్పనా?" అన్నాడు శేఖరం కుతూహలాన్ని అణచుకొంటూ.

"ఆఁ, అలాగే చెప్పు! నేను అక్కడేం కూర్చోను! చెప్తావా?" అంది.

"దానికేం భాగ్యం! అలాగే చెప్తాను కాని, ఆవిడగారు నన్ను ఏ భూతాన్నో అనుకుని

పారిపోతే మాత్రం నేను ఆపలేను" అన్నాడు శేఖరం నవ్వుతూ. అతనికి చాలా సంతోషంగా వుంది ఇంత మంచి అవకాశం ఇంత త్వరలో లభించబోతున్నందుకు.

వెడదామని రెండు అడుగులు వేసిన అరుణ ఆగిపోయింది.

"అస్తమానూ అలా అంటున్నావేమిటీ! మొదట్నుంచీ నేను గమనిస్తూనే వున్నా! నీకు మీరా అంటే గిట్టదల్లే వుంది — ఇంతకీ మీరా వస్తే వుండమని చెప్తావా? — లేక అదరగొట్టి తరిమేస్తావా!" అంది.

"ఛ! ఎందుకు అదరగొడ్తాను? ఎందుకు తరిమేస్తాను! నాకేం పని? నువు నిశ్చింతగా వెళ్ళిరా! నీ ఫ్రెండుని సగౌరవంగా ఆహ్వానించి కూర్చోబెడతాను" అన్నాడు నవ్వుతూ శేఖరం.

అరుణ అక్కడే కుర్చీలో కూర్చుంది.

"అదేమిటి వెళ్ళవా?" ఖంగారుగా చూస్తూ అడిగాడు శేఖరం.

"ఏమో నీ మాటలు నాకర్థంగావటం లేదు. వాళ్ళతో నాకంత పరిచయం లేదు. నేను వెళ్ళకపోయినా మునుగు పోయిందేమీ లేదు" చాలా తీర్గా అంది అరుణ.

అరుణ వెళ్ళదేమోనని శేఖరం భయపడ్డాడు.

"అలా అని వదినకి చెప్పిరా'' అన్నాడు కాస్త విసుగ్గా.

"వదినతోటా?" భయంగా కళ్ళు పెడల్పుచేసింది అరుణ.

మూసీ

అందంగా ప్రవహించి
ఆనందాన్ని ప్రసరించి
నేలల్ని పండించి
నేలనాడుల్ని పులకించిన—మూసీ
నేడు—
నగరం విడిచిన మలినంతో రమించి
కులటై—గర్భవతై
దోమల్ని, దుర్గంధాన్ని ప్రసవించి
బాలింత రోగంతో
ప్రజలస్వామ్యానికి బలైనదానిలా
ప్రజల చవటత్వానికి గురైన దీనలా
హాసం చెదిరి—ఆస్పత్రిలో చేరిన
మూసీ
నువ్వు మా నగరజీవిత చర్మానివి
మా నాగరికత నమిలే కిళ్ళీపై తగరానివి.

—ప్రేమ్‌శిల

"మరింకెవరితో చెప్తావ్‌! నువ్వేడతావనుకుని ఆవిడ ఎక్కడికో వెళ్తోంది—అయినా పిల్చి నప్పుడు వెళ్ళకపోవం ఏమిటి! నా కిలాంటివి నచ్చవ్‌! వెళ్ళి వదినతో చెప్పిరా! లేకపోతే నేనే వెళ్ళనుకదా అంటుంది" కొంచెం గట్టిగానే అన్నాడు శేఖరం.

వదినగారితో వెళ్ళనని చెప్పడానికి భయపడే అరుణ వెళ్ళడానికి తయారయింది. అలాం టిది—ఇప్పుడు వెళ్ళనని చెప్పడమా!

అరుణ లేచి నిలబడుతూ అంది "మీరా వస్తే వుండమని చెప్పు. ఇప్పుడే వచ్చేస్తాను!"

"అలాగే—వెళ్ళిరా! నువ్వు వచ్చేకనే నేను వెళ్తాను" అన్నాడు శేఖరం.

ఇప్పుడు అతనికి ధైర్యంగా వుంది.

అరుణ వెళ్ళిపోయింది.

శేఖరం కిందకి వచ్చి హాల్లో కూర్చున్నాడు.

తొందరగా వదినా వాళ్ళుకూడా వెళ్తే బాగుండును అనుకున్నాడు.

వదినా వాళ్ళు వెళ్ళేవరకూ మీరా రాకుండా వుంటే బాగుండునని కూడా అనుకున్నాడు శేఖరం.

ముందర సుందరీ ఆ వెనకాలే కుసుమా హాల్లోకొచ్చేరు.

కుసుమ వెళ్తూ శేఖరానికి విన్పించేలా తాయారమ్మతో అంది "ఇల్లు జాగ్రత్తగా చూస్తూండు అరుణ ఇప్పుడే వచ్చేస్తుంది" అంతక్రితం ఆవిడలా రెండుమూడు సార్లు తాయారమ్మకి చెప్పింది. తాయారమ్మ "సరేనమ్మా" అంది. మళ్ళీ ఇప్పుడూ "సరేనమ్మా" అంది వినయంగా.

ఆ రోజు నుండీ శేఖరంతో కుసుమ మాట్లాడటం లేదు. ఇంక ఎప్పుడూ శేఖరంతో మాట లాడకూడదనుకుంది కుసుమ. అతనితో మాట్లాడవలసిన అవసరం తనకేం లేదని ఎప్పటికీ రాదని కూడా అనుకుంది.

గేటువరకూ వెళ్ళిన కుసుమా సుందరీ ఆగిపోయారు.

"మొన్న హనుమాయమ్మ గారింటి కెళ్ళినప్పుడు ఈ చీరే కట్టుకున్నానేమో సుందరీ!" అంది కుసుమ తన చీరకేసి చూసుకుంటూ.

"అబ్బే! ఇదికాదు" అంది సుందరి. అవునంటే మళ్ళీ చీర మార్చుకోవడానికి ఇంకోగంట పడుతుంది. సిగ అలవాటు లేనిసుందరికి చాలా బాధగా వుంది. సుందరి సిగ నా కలవాటు లేదు బాబోయ్‌ అన్నా వినకుండా రెండు సవరాలు బిగించి సుందరికి సిగ చుట్టింది. సుందరికి నెత్తిమీద పెద్ద బండ పెట్టినట్టుగా వుంది. మెడ కదల్చాలన్నా చాలా బాధగా వుంది. ఎప్పుడు ఆ హనుమా యమ్మ గారింటికి వెళ్ళి రావటం అవుతుందా ఎప్పుడెప్పుడు ఈ బరువుని దించుకుందామా అని బాధపడుతోంది.

"కాకపోవటం ఏమిటి? నీ మొహం! ఈ చీరే! ఈ చీర చాలా బాగుందని ఎక్కడ కొన్నా రనీ ఆవిడ అడగలేదూ? తనకికూడా తెప్పించి పెట్టమని అడిగిందికూడా" అంది కుసుమ.

ఇంక గత్యంతరం లేనట్లు "అవునవును" అంది సుందరి వుసూరుమంటూ.

మళ్ళీ ఇద్దరూ లోపలకెళ్లారు.

ఈసారి శేఖరం ఉసూరుమన్నాడు. వీళ్ల వెళ్ళకుండా మీరా వచ్చి వెళ్ళిపోతుందేమోనని అతనికి భయంగా వుంది.

కుసుమ ఇంకో చీర మార్చుకుంది. పది నిముషాల్లో బయటకొచ్చేరు.

శేఖరం తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

అతను లేచి కిటికీ దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

సుందరి గేటు దాటింది. కుసుమ ఓ కాలు బయటకేసిందల్లా క్షణం ఆగిపోయింది.

"మళ్ళా ఏమొచ్చింది" అనుకున్నాడు శేఖరం.

కుసుమ గేటు మూసేస్తూ అంది "అరుణ లేదు. ఎక్కడికో వెళ్ళింది."

"ఎంపసేపయిందండీ వెళ్ళి," అని అడిగింది మీరా, తనని రమ్మని ఎక్కడికి వెళ్ళిందో అనుకుంటూ.

"ఇంతక్రితమే వెళ్ళింది. ఆలస్యం అవచ్చు తనొచ్చేసరికి" అని చెప్పింది.

ఆ వచ్చినవాళ్ళు ఎవరో కనిపించక శేఖరం గుమ్మం దగ్గరికి వచ్చేడు.

మీరా కనిపించింది.

అంత దూరాన్నుండి వస్తే అరుణ లేకపోయేసరికి మీరాకి నిరుత్సాహం కలిగింది. తనని రమ్మని, ఎక్కడికో వెళ్ళిపోయినందుకు అరుణమీద కోపం వచ్చింది.

"నేను వచ్చి వెళ్ళేనని చెప్పండి" అని వెళ్ళిపోయింది మీరా.

తర్వాత కుసుమా సుందరీ వెళ్ళిపోయారు.

'ఎంత మంచి అవకాశం చేజారిపోయింది' శేఖరానికి విసుగూ కోపం కలిగినాయి. 'వదినా సుందరీ ఇందాక వెనక్కి తిరిగి రాకుండా వుంటే—ఒక్క రెండు మూడు నిముషాలు మీరా ఆలస్యంగా వచ్చివుంటేః ఎంత బాగుండేది. ఛః తను వేసుకున్న ప్లానంతా పాడయింది.'

శేఖరం అసహనంగా హాల్లో అటూ, ఇటూ పచార్లు చేయసాగాడు.

అతనికి చాలా తిక్కగా వుంది. అరుణ రాగానే కయ్యం పెట్టుకోవాలనుకొన్నాడు.

కుసుమా వాళ్ళు వెళ్ళిన పది నిమిషాలకి అరుణ వచ్చింది.

అరుణ రావటమే హడావిడిగా వచ్చింది. వస్తూనే "అన్నయ్యాః మీరా వచ్చిందాః" అని అడిగింది.

శేఖరం పేపరు చాటునుంచే విసుగ్గా జవాబిచ్చేడు. "మీరో—మిరపకాయ బజ్జీయో నువ్వు చెప్పిన ఆ అమ్మాయి వచ్చింది—వెళ్ళింది."

అతని విసుగుని అరుణ గుర్తించినట్టు లేదు. "అదేమిటీః కూర్చోమని చెప్తానన్నావుగాః నేను వెళ్ళనంటే కూడా వెళ్ళమన్నావ్" అరుణకి చాలా కోపం వచ్చింది.

శేఖరం పేపరు పక్కన పడేసి లేచి నిలబడ్డాడు.

"అరుణ లేదు వచ్చేసరికి ఆలస్యం అవుతుందని వదిన చెప్తే, నేను కూర్చోమని చెప్పనాః" ఈసారి కొంచెం కోపంగా అన్నాడు శేఖరం.

అరుణ ఆ కోపాన్ని ఏం లెక్కచెయ్యలేదు.

"అరుణ చెప్పమంది ఇప్పుడే వస్తుందని చెప్తే తప్పాః" ఈ రోజు కూడా ప్రోగ్రాం కాన్సిలయిందనే బాధతో అరుణ కోపంగా పైకి తన గదిలోకి వెళ్ళిపోయింది.

తెల్లబోయినట్లు అలాగే చూస్తూండిపోయాడు శేఖరం.

అందరి దగ్గరకన్నా శేఖరం దగ్గర అరుణకి చనువయినా ఎప్పుడూ ఇంత విసురుగా

కోపంగా మాట్లాడదు.

మీరా అంటే అరుణకి ఎంతో అభిమానమని మీరాని పల్లెత్తు మాటన్నా అరుణ సహించదని మరోసారి స్పష్టంగా అర్థమయింది శేఖరానికి.

ఇప్పటికే ఇంత గట్టిగా అల్లుకున్న ఈ స్నేహబంధాన్ని అరుణవైపునించి విడదీయడం చాలా కష్టం. అందుకని—ఈసారి ఏమాత్రం అవకాశం దొరికినా జారవిడుచుకోకూడదను కొన్నాడు శేఖరం.

అసలు మీరా ఇల్లు ఎక్కడో!

అరుణ కోపం పోగొట్టి మెల్లగా మీరా ఇల్లెక్కడో తెలుసుకోవాలనుకొన్నాడు.

శేఖరం అరుణ గదిలోకి వెళ్ళేసరికి అరుణ కిటికీ దగ్గరగా కుర్చీ వేసుకుని కూర్చుంది.

అన్నగార్ని చూసి మొహం తిప్పుకుంది అరుణ.

శేఖరానికి నవ్వొచ్చింది. తను అరుణతో కయ్యం పెట్టుకోవాలనుకొన్నాడు. కాని అరుణే తనతో కయ్యం పెట్టుకోవడానికి సిద్ధంగా వుంది.

శేఖరం టేబుల్ దగ్గరకి వెళ్తూ అన్నాడు.

"అరుణా! నేను సినిమాకి వెళ్తున్నాను వస్తావా?"

అరుణ ఇటు తిరక్కుండానే తల అడ్డంగా వూపింది.

ఇదేం గ్రహించనట్టు శేఖరం, "ఏం అరుణా! వస్తావా?" అడిగాడు.

"ఊఁహుఁ!"

"ఏం? పోనీ గోపాలరావుగారింటికి వెళ్ళొద్దాం రా"

"   "

"ఏం మాట్లాడవ్."

"నువ్వెళ్ళిరా" పొడిగా అంది అరుణ.

"ఇంట్లో కూర్చుని ఏం చేస్తావ్! అలా వెళ్ళొద్దాం" అన్నాడు శేఖరం.

అయినా అరుణ మాట్లాడలేదు.

"ఏం అరుణా!"

"నేనేం రాను—నువ్వెళ్ళొచ్చు."

శేఖరం అరుణ దగ్గరగా వస్తూ తనకేమీ తెలియనట్టే అడిగాడు.

"అలా వున్నావేం అరుణా!"

అరుణకి ఒళ్ళు మండింది.

"నాకు ఒంట్లో బాగానే వుంది" కాస్త హేళనగా అంది అరుణ.


ఆ మాటతో శేఖరం మనసు చివుక్కుమంది. అరుణ ఎప్పుడూ ఇలా మాటలాడి ఎరగదు. అతనికి మీరా మీద ఆగ్రహం కలిగిందికూడా. అరుణకి తనమీద ఎప్పుడూ రానంత కోపం వచ్చిందనికూడా గ్రహించేడు.

అరుణ అలా అన్నదే కాని తర్వాత అలా ఎందుకన్నానా అని బాధపడింది.

"అదేమిటి అరుణా!" అన్నాడు శేఖరం బాధగా.

"ఏం లేదు."

"నామీద కోపం వచ్చిందికదూ!"



"నా కెవరిమీదా కోపం లేదు—నేను వెళ్ళడం మానేద్దాం అనుకుంటే నువ్వు—'నువ్వెళ్ళ కూర్చోమని చెప్తానని' ఇలా చేస్తావనుకోలేదు" బాధగా అంది అరుణ.

"చెప్పానుగా! వదిన గేటులోనే ఎదురుపడి చెప్పి పంపేసింది. లేకపోతే చెప్పడానికి నాకేం బాధ! పోనీ ఆవిడగారిల్లెక్కడో చెప్పు—వెళ్ళి తీసుకొస్తాను" అన్నాడు శేఖరం చివరి మాటకి నవ్వుతూ.

అరుణ అశ్చర్యంగా చూసింది.

"నిజంగానే చెప్తున్నా" అన్నాడు శేఖరం అరుణ కళ్ళల్లో ఆశ్చర్యం గమనించి.

"ఎం వద్దులే!" అంది అరుణ మొహం తిప్పేసుకొంటూ.

"ఏం?"

"ఏం లేదు" పొడిగా అంది అరుణ.

"పోనీ అలా వెళ్లొద్దాం రా" అన్నాడు ఎలాగయినా అరుణ కోపం పోగొట్టాలని.

"ఉహూ! నేను రాలేను! నువ్వెళ్ళి రా" అంది.

శేఖరం వెళ్ళిపోయాడు.

*　　*　　*　　*

శేఖరం గోపాలరావు గారింటికి వెళ్ళి చాలా రోజులయింది.

ఆయన రెండు మూడు సార్లు కబురు చేశారుకూడా.

శేఖరం గోపాలరావు గారింటికి వెళ్ళేసరికి ఆయన ఇంట్లో లేరు.

మాధురి నవ్వుతూ ఆహ్వానించింది.

"నేను ఓ గంట పోయాక వస్తానని చెప్పండి" అన్నాడు శేఖరం కూర్చోకుండానే.

"అదేం? నాన్నగారు లేకపోతే కూర్చోకూడదా? ఇప్పుడే వచ్చేస్తారు కూర్చోండి-లాయరు గారింటికి వెళ్ళారు" అంది మాధురి.

శేఖరం ఇబ్బందిగానే కూర్చున్నాడు.

మాధురి లోపలికి వెళ్ళింది.

శేఖరం అక్కడే వున్న ఓ పత్రికని తీసుకుని తిరగేయసాగాడు.

మాధురి టీ తీసుకొచ్చింది.

"మీ ఇంటికి రావాలంటే ఇదే భయం: వచ్చినప్పుడల్లా ఎదో ఒకటి ఇస్తారు" అన్నాడు శేఖరం.

"అబద్దం!"

ఆశ్చర్యంగా చూశాడు శేఖరం.

"మీరు అస్తమానూ టీ తీసుకుంటారు."

'ఈవిడకెలా తెలుస ?'

"మీరు ఇక్కడకి రావడానికి భయం ఇంకోటుంది.",

అతనికి ఇంకా ఆశ్చర్యమేసింది. శేఖరం ఏదో అనబోతోంటే మాధురి అంది.

"చూడండి శేఖరంగారూ! మీరు మా ఇంటికి రావడానికి భయపడనక్కరలేదు—నాన్నగారు పెద్దవారు. ఆయన ఏదేనా చాదస్తంగా అంటే మీరేం పట్టించుకోకండి నేనూ మీ అరుణలాంటి దాన్నే! మీ రిక్కడికి వస్తూ పోతూ వుంటే మా నాన్నగారికన్నా నే నెక్కువ సంతోషిస్తాను" మెల్లని స్వరాన తను చెప్పదలుచుకున్నది చెప్పింది మాధురి.

శేఖరం ఏం మాట్లాడాలో తెలియని వాడిలా వుండిపోయాడు. మాధురి చెప్పింది అతనికి అర్ధమయీ—అర్ధం కాకుండా వుంది.

"మీకు అర్ధమయిందనుకుంటాను" అంది మాధురి శేఖరం ఏం మాట్లాడక పోవటంతో.

శేఖరం తల ఎత్తి ఏదో అనబోయాడు. అంతలో గోపాలరావుగారి కారు లోపలకి వచ్చింది.

శేఖరాన్ని చూస్తూనే ఆయన ముఖం వికసించింది.

ఆయన ఆప్యాయంగా పలకరించి రావటం లేదేమని అడిగారు.

శేఖరం ఆయన ఇలా అడిగితే ఏం చెప్పాలో వచ్చేటప్పుడే ఆలోచించుకున్నాడు. ఆ ప్రకారం చెప్పాడు.

గోపాలరావుగారు మాటల్లో శేఖరాన్ని తొమ్మిది గంటలవరకూ కూర్చోపెట్టేశారు.— ఆఖరికి శేఖరాన్ని భోజనంచేసి వెళ్ళమని తండ్రీ కూతురు పట్టుబట్టారు.

"అన్నయ్యా వదినా నా కోసం ఎదురు చూస్తూంటారు" అని చెప్పి తప్పించుకున్నాడు.

శేఖరం వచ్చేస్తుంటే మాధురి, "వస్తూంటారుగా!" అంది.

"అలాగే" నని మృదువుగా చెప్పి వచ్చేశాడు.

శేఖరం భోజనంచేసి ఇంటికి వచ్చేసరికి రాత్రి పదిగంటలు దాటింది.

శేఖరం వస్తూనే అరుణ గదిలోకి వెళ్ళేడు. అరుణ నిద్రపోతోంది. లైటు వెలుగుతోంది. ఏదో పుస్తకం చదూకొంటూ అలాగే పడుకుంది అరుణ.

శేఖరం అరుణ చేతిలో పుస్తకం తీసేసి టేబుల్‌మీద పెట్టేడు. లైటు తీసేసి తలుపులు దగ్గరగా వేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వారం రోజులు గడిచిపోయినాయి.

అరుణ అన్నగారితో రెండు రోజులు కోపంగా వున్నా తర్వాత మామూలుగానే మాట్లాడ సాగింది.

రెండు రోజుల క్రితం రాఘవరెడ్డి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. తను నాలుగయిదు రోజుల్లో బయలుదేరి వస్తున్నట్లు రాశాడతను.

రాఘవరెడ్డి దగ్గరనుండి ఉత్తరం వచ్చిన మర్నాడు కోటేశ్వరరావుగారూ జ్యోతీ వచ్చేరు.

వాళ్లు వచ్చేసరికి శేఖరం ఇంట్లో లేడు.

కోటేశ్వరరావే తను ఫలానా అని చెప్పుకున్నాడు.

రాజేంద్ర వాళ్ళకి చాలా హడావిడిగా మర్యాదలు చేశాడు.

జ్యోతి అరుణ దగ్గరకెళ్ళి కూర్చుంది.

నలుగురిలోకి వచ్చి కూర్చోవడం అరుణకి అంత అలవాటు లేదు.

వాళ్ళు వచ్చి అర్ధగంట అవుతూండగా శేఖరం, మూర్తి వచ్చేరు.

కోటేశ్వరరావుని చూసి శేఖరం, తెల్లబోయాడు. ఆయనలా ఇంటికి రావటం ఏ మాత్రం ఇష్టం లేకపోయినా పైకి నవ్వుతూ పలకరించాడు.

"వూళ్ళోనే వున్నావా? ఈ మధ్య కనపడకపోతే వూరెళ్ళేవేమో ననుకున్నాను" అన్నాడాయన.

"వూళ్ళోనే వున్నానండీ! ఏదీ ఈ పనులతో ఊపిరి ఆడటం లేదు. గోపాలరావుగారికి యింకా పూర్తిగా ఆరోగ్యం చేకూరలేదు" కావాలనే అన్నాడు శేఖరం.

'గోపాలరావు పనులు ఇతను చూస్తున్నాడు' ఈ మాట ఆయన నెత్తిమీద పిడుగులా పడింది. "గోపాలరావంటే కె.గోపాలరావు కదూ! ఎరువుల ఫ్యాక్టరీ యజమాని" అనుమాన నివృత్తికోసం అడిగాడు.

దానికి రాజేంద్ర బదులిచ్చేడు — "అవునండీ! ఆయనా మా నాన్నగారూ చిన్ననాటి స్నేహితులు."

కోటేశ్వరరావు గారికి ఈ మాటతో గుండె పట్టుకున్నట్టయింది. పైకి నవ్వేస్తూ అన్నాడు "అవును మరి. మనం చెప్పినట్లు పనులు వింటాయా! అవి చెప్పినట్లు మనం నడుచుకోవాల్సిందే! వీలు చూసుకుని ఓసారి రా! ఆవిడ నీకోసం రోజూ ఎదురు చూస్తోంది."

ఒకప్పుడు వాటి చెప్పుచేతల్లో మన ఇరుక్కోకూడదన్న పెద్దమనిషి!

జ్యోతీ, అరుణా కిందకి దిగి వచ్చేరు.

అక్కడ మూర్తికూడా వుండడంతో అరుణ లోపలకి వెళ్ళిపోయింది.

జ్యోతి వచ్చినట్టు శేఖరానికి తెలియదు. జ్యోతి చెప్పగా ఆయన ఒక్కాయనే వచ్చేడనుకుంటున్నాడు.

తను ఏదయితే వద్దనుకున్నాడో అదే జరిగింది. ఇంక ఈ రాకపోకలు ఇలాగే జరుగుతాయి. అతనికి మీరా మీద చెప్పలేనంత కోపం వచ్చింది. ఆ అమ్మాయి చూపించబట్టేగా వాళ్ళకి ఇల్లు తెలిసింది.

వాళ్ళు వెళ్తామనిలేచేరు.

జ్యోతి అరుణ దగ్గరకెళ్ళి, "మిమ్మల్ని తీసుకెళ్లడానికి ఎప్పుడు రాను" అని అడిగింది. "నేనూ, మీరా వస్తాం" అంది అరుణ.

"ఆఁ, ఇప్పటికి చాలాసార్లు వచ్చేరుగా!" నిష్ఠూరంగా అంది జ్యోతి.

"మొన్న మీరా వచ్చిందిట—నేను లేను. రెండుమూడు రోజుల్లో వస్తాం."

"చూస్తాగా! రెండు రోజులు చూసి నేనే వస్తాను" అంది జ్యోతి.

అరుణకూడా హాల్లో కొచ్చింది.

జ్యోతి వెళ్ళేప్పుడు అందరితోబాటు శేఖరానికికూడా చెప్పింది "వస్తా" అని. కాస్త ప్రత్యేకంగా తమాషాగాకూడా చెప్పింది.

శేఖరానికి చాచి లెంపకాయ కొట్టాలనిపించింది.

వాళ్ళు వెళ్ళిపోయాక మూర్తి శేఖరంకూడా బయట కెళ్ళిపోయారు.

రాత్రి, శేఖరం వస్తూనే అరుణ గదిలోకి వెళ్ళేడు.

అరుణ పక్క దుప్పటి దులిపివేస్తోంది.

శేఖరం ఎటువంటి ఉపోద్ఘాతం లేకుండానే అన్నాడు: "అరుణా! నువ్వు వాళ్ళింటికి వెళ్ళక్కర లేదు."

హఠాత్తుగా అతనలా వస్తూనే చిరాగ్గా అన్నది ఏమిటోకూడా అర్థంకాలేదు అరుణకి.

"ఏమిటి?" అంది ఇటు తిరుగుతూ.

"అదే! సాయంత్రం కామేశ్వరరావుగారమ్మాయి నిన్ను రమ్మని ఆహ్వానించిందిగా. వెళ్ళక్కరలేదని చెప్తున్నాను."

"ఏం? ఆవిడ చాలాసార్లు చెప్పింది రమ్మని. ఒక్కసారన్నా వెళ్ళకపోతే ఏం బాగుంటుంది!"

"అదే బాగుంటుంది! అసలు వాళ్ళక్కడికి రావటమే నా కిష్టంలేదు" క్షణం ఆగి అన్నాడు: "వాళ్ళు పట్టుకున్నారంటే జలగల్లా వదలరు. అందుకే మనింటికి ఎప్పుడూ పిలవలేదు. మీ ఇల్లెక్కడంటేకూడా రెండుమూడుసార్లు మాటల్లో చెప్పించేశాను" అతను కోపాన్ని అణుచుకున్నట్లు పళ్ళ బిగువున అన్నాడు "నేనేమనుకుంటే ఏం? — అంతా తలక్రిందులయింది. నీ ఫ్రెండు చక్కగా తీసుకొచ్చింది—రానని నిర్మోహమాటగా చెప్పెయ్! నీకేం భయం అక్కర లేదు" చేతులు గాలిలో ఆడించేడు.

"ఛ! ఏమనుకుంటారు," అన్నగారి కోపానికి హడలిపోతూ నింపాదిగా అంది అరుణ. అసలు దానికింత కోపం ఎందుకోకూడా అర్థం కాలేదు.

"మరీ మంచిది అనుకుంటే, నువు మాత్రం వెళ్ళద్దు."

శేఖరం విసురుగా వెళ్ళిపోయాడు.

అరుణ అలాగే నిలబడిపోయింది.

'ఏమిటిదీ? తను నలుగురిలో తిరగనని సతాయిస్తూండే అన్నయ్య ఎందుకు వెళ్ళద్దంటున్నాడు' ఎంత ఆలోచించినా అరుణకి అర్థంకాలేదు.

రెండు రోజులు గడిచినాయి.

మీరా రాలేదని—మీరాకి తనమీద చాలా కోపం వచ్చుంటుందని అరుణ బాధపడుతోంది.

ఆ మధ్యాహ్నం రెండు గంటలు దాటాక మీరా వచ్చింది.

మీరా చాలా రోజుల కొచ్చినప్పుడు అరుణ కోపంగా వుంటుంది.

మీరాచేత కనీసం పావుగంటసేపు బ్రతిమాలించుకొంటే కాని మాట్లాడేది కాదు. ఇప్పుడలా కాదు. మీరాని చూస్తూనే మీరాని రెండు చేతులతో చుట్టేస్తూ "మీరా! నా మీద చాలాకోపం వచ్చింది కదూ!" అంది.

"వూపిరి ఆడటం లేదు—ముందు వదులు ఎవరనుకొంటున్నావ్‌! నేను మీరాని" అంది అరుణ చేతులని విడిపించుకుంటూ.

మీరా మాటతో మీరాకి కోపం రాలేదని తెలిసినా మీరా విసిరిన మాటకి అరుణ మీరాని విసురుగా తోసేసింది.

కొంచెం వుంటే మీరా తల గోడకి కొట్టుకొనేదే! ఎలాగో నిలద్రొక్కుకుంది.

అరుణ ఖంగారు పడిపోయి—మీరా దగ్గరకెళ్ళి "దెబ్బ తగిలిందా?" అంది.

"తగలాలనేగా తోశావ్‌! బాగా దగ్గరికి లాక్కుంటే—బలంగా—విసురుగా తోసేయచ్చని కాదూ?" చాలా కోపంగా అంది మీరా.

అరుణ తెల్లబోయింది.

"అదేమిటి మీరా! నామీద కోపం వచ్చిందేమోనని ఇన్నాళ్ళనుండీ ఎంత బాధపడుతున్నానో తెల్సా? నువ్వొచ్చేవని సంబరంతో. .. "

"సంబరంతో?"

"అలా అంటే కోపం రాదూ!"

"నే నన్నదాంట్లో తప్పేముంది? నేను మీరానని గుర్తుచేశాను" చివరి మాటకి మీరా కళ్ళు నవ్వినాయి.

అరుణ మీరా చెవి పట్టుకుంటూ అంది. "హడలగొట్టేశావ్‌! నిజంగా నీకు కోపం వచ్చిందనుకుని హడలి చచ్చాననుకో!"

"పైనించి కింకకి తోసేస్తావేమో ననుకుని కోపం పోగొట్టుకున్నాను కాని, లేకపోతే వుంచేసుకుందును."

"గొప్ప పనిచేశావు. సరేకాని ముందు నన్ను మీ ఇంటికి తీసుకెళ్తావో జ్యోతి ఇంటికి తీసుకెళ్తావో నీ ఇష్టం! ఈరోజు మీ ఇల్లు ఎక్కడో నాకు బాగా తెలియాలి. ఒకసారి జ్యోతి ఇంటికి వెళ్ళి వచ్చేద్దాం. మొన్న మా ఇంటికి వచ్చింది—రమ్మని మరీ మరీ చెప్పింది. నేను రాకపోతే ఈరోజో రేపో తను వస్తుందట నన్ను తీసుకెళ్ళడానికి" అంది అరుణ పెట్లోంచి నీలం పూల చీర తీసుకొంటూ.

మీరా కూడా అలాటిదే కట్టుకొచ్చింది.

జ్యోతి ఇంటికెళ్ళడం మీరాకి ఇష్టంలేదు. మొన్నా మధ్య సరోజినీదేవి కబురుచేసినప్పుడు వెడితే తొంభై ప్రశ్నలు వేసింది. అయినా తనకెప్పుడూ వాళ్ళింటికి వెళ్ళాలని వుండదు.

"ఇప్పుడు ఆ మూలనించి వస్తే ఇప్పుడే గెంటేస్తావా? నే నిప్పుడు కదల్లేను బాబూ!" అంది మీరా.

"పోనీ సాయంత్రం వెళ్దాం. మొన్న మీ ఇంటికి వద్దామనుకున్నాను. కాని మళ్ళా అప్పట్లా తిరిగి తిరిగి వెనక్కి రావాల్సి వస్తుందేమోనని రాలేదు. ఈసారి బస్సు దిగేకా మంచి రోడ్డు మీదుగా తీసుకెళ్ళు. ఆ సందులూ అవీ నాకు గుర్తుండవు" అంది అరుణ అక్కడే బట్టల స్టాండు వెనకాల నిలబడి చీర మార్చేసుకుంటూ.

"బాగుంది. నీకు సందులు గుర్తుండవని మా ఇల్లు రోడ్డుమీదకి జరపనా? అయినా ఇదేం మర్యాద! వచ్చిన మనిషిని పట్టుకు పొమ్మనడం" అంది మీరా.

"నిన్నేం పొమ్మనడంలేదు తల్లీ! మీ ఇల్లు తెలుసుకోవాలని. ఓసారి వాళ్ళింటికెళ్ళి వచ్చేస్తే—ఇంక వెళ్ళకపోయినా పరవాలేదు."

"ఎల్లుండో—ఎప్పుడో వెడదాంలే! నా గొంతు ఎండిపోతోంది. గ్లాసుడు మంచి నీళ్ళిద్దూ."

"పోకుండా పట్టుకో!" అంటూ అరుణ గబగబా వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

అరుణ కూడా కూర్చుంటూ అంది. "పోనీ ఈరోజు సినిమాకి వెళ్దాం. మీ అమ్మగారితో చెప్పి వచ్చేవా?"

"నువ్వుంటావో ఉండవోనని చెప్పలేదు."

"వుండక ఎక్కడికి పోతాను? ఆ రోజు పేరంటం వచ్చింది. వెళ్తూ అన్నయ్యతో చెప్పి వెళ్ళేను నువ్వొస్తే కూర్చోమని చెప్పమని. వదిన లేదని చెప్తే నువ్వు వెళ్ళిపోయావు. నువ్వొచ్చినట్టు అన్నయ్య చూళ్ళేదు. నేను గబగబా వచ్చేసరికి నువ్వు వచ్చి వెళ్ళిపోయావ్."

"నాకేం తెలుసు! ఆలస్యంగా వస్తావని చెప్పేరు."

"ఎప్పుడు వెళ్దాం నువ్వే చెప్పు!" అంది అరుణ.

"నీ ఇష్టం! ఈ రోజే వెడదాం" అంది మీరా.

"మరి చెప్పలేదన్నావు."

"ఆలస్యం అయితే వెళ్ళనక్లేనని చెప్పేన్లే."

"మరి చెప్పవేం? ఈ రోజే వెడదాం. మనిద్దరం కలిసి సినిమా కెళ్ళి చాలా రోజులయింది. ఏదో ఒక ఆటంకం వస్తోంది" అంది అరుణ.

"ఈరోజు రాదని గ్యారంటీ ఏమిటి" అంది మీరా నవ్వుతూ.

"అపశకునం అలా అనకు! రాదనే అనుకుందాం—రాదు" అంది.

వాళ్ళిద్దరూ అలా టైము తెలియకుండా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

నాలుగు గంటలవుతుండగా జ్యోతి వచ్చింది.

జ్యోతి వస్తూనే "అన్యాయం. ఇద్దరి కిద్దరే తోడుదొంగలు" అంది.

"లేదండీ! మీరా వచ్చి పావుగంటయింది. ఇంక వద్దామనుకుంటున్నాము. కూర్చోండి" కుర్చీ చూపించింది అరుణ.

"రండి మా ఇంటికి వెళ్దాం" అంది జ్యోతి కూర్చోకుండా.

"ఎలాగూ వచ్చేవుగా కూర్చో! రేపొస్తాం" అంది మీరా.

"అవును. నేనూ మీరా రేపొస్తాం. కూర్చోండి! సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అంది అరుణ.

"ఏదో విధంగా మా ఇంటికి రాకుండా దాటేస్తున్నారు" అంటూ కూర్చుంది జ్యోతి.

"లేదండీ! తప్పకుండా వస్తాం. మీరా ఇంతక్రితమే వచ్చింది. మీరూ ఇప్పుడే వచ్చేరు. సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అంది అరుణ.


జ్యోతికి వుండాలనే వుంది. కాస్సేపు కూర్చుంటే శేఖరం కనిపిస్తాడని ఆశ—అరుణతో స్నేహం పెంచుకుని ఇలా వస్తూ పోతూ వుంటే అనుకున్న పని తేలిగ్గా అవుతుందని జ్యోతి అభిప్రాయం.

(సశేషం)

జో౦గణి

పని(డి)మనసు

జొన్నలగడ్డ రామల



"ఓసేవ్, పద్మా! ఎక్కడ చచ్చావ్? ఒకసారి ఇలా వచ్చి తగలడు."

చిన్నతమ్ముడికి తల దువ్వుతున్న పద్మ ఆ పిలుపు విని కంగారుపడి దువ్వెన అక్కడే పారేసి-వంటింట్లోకి పరుగెత్తింది.

పద్మను చూస్తూ తల్లి అంది. "వచ్చావా తల్లీ-ఇందాకట్నుంచీ అరుస్తూంటే ఇప్పటికైనా తీరుబడి అయింది కదా-కాస్త బియ్యం ఏరి పెట్టి-కడిగి ఎసట్లో పోయగలవా?"

"అలాగే నమ్మా! చిన్నతమ్ముడు మారాం చేస్తూంటే తల దువ్వుతున్నాను. వాడి గొడవలో నువ్వు పిలవడం వినిపించలేదు."

"నిన్నిప్పు డెవ్వరూ సంజాయిషీ అడగ లేదు కానీ-కాస్త చెప్పిన పని చేసిపెట్టు."

పద్మ మాట్లాడకుండా కూర్చుని బియ్యంలో బెడ్డలు ఏరసాగింది.

పద్మ వయసు ఎనిమిదేళ్ళు. ఆమె తల్లి వనజ చాలా బద్ధకస్తురాలు. ఆవిడ బద్ధకానికి తగ్గట్టుగానే అయిదుగురు పిల్లలూ, ప్రస్తుతం మళ్ళీ కడుపేమోనని అనుమానంకూడా ఉంది. పద్మ తండ్రి సుబ్రహ్మణ్యం ఇంటి వ్యవహారా లట్టే పట్టించుకోడు. పనిచెయ్యాలంటే అతనికి బద్ధకమే. పైగా ముక్కుమీదకోపం, కానయితే మనిషి చాలా మంచివాడు.

వనజకు ఒక్క నోటితో తప్ప మరి దేంతోనూ పనిచేయడంలో నేర్పు లేదు. ఉన్న ఆ ఒక్క నేర్పునూ మాత్రం ఆవిడ సవ్యంగానే ఉపయోగించుకుంటోంది. ఆ కారణంగానే ఇంట్లో పనంతా పిల్లలే చేసుకోవలసి వచ్చేది.

ఈ విషయంలో వనజ చాలా అదృష్టవంతురాలనే చెప్పాలి. ఆమెకు లేని నేర్పూ, ఓర్పూ ఆమె పిల్లలకుంది. ఆమెకున్న వాక్శక్తి వాళ్ళకు లేదు. దాంతో వాళ్ళు కిమ్మనకుండా ఇంటి పనులన్నీ చేసుకుపోయేవారు. అందరిలోకీ పెద్దదైన పద్మమీద ఈ బాధ్యతంతా పడింది.

ముక్కుమీద కోపం ఉన్న సుబ్రహ్మణ్యానికీ, నోరూరుకోని వనజకూ తగవులు రావడంలో అసహజమేమీ లేదు. ఆ కారణంగా

వాళ్ళిద్దరూ రోజుకొక్కసారైనా పోట్లాడుకునే వారు. దొడ్లో మామిడి మొక్క తాలూకు ఒక చిన్న ఆకును మేక తినేసిందనే విషయానికి-ఇల్లెగిరిపోయేలా సుబ్రహ్మణ్యం కేకలు వేస్తే ఊరదిరిపోయేలా వనజ జవాబు చెప్పేది. ఫలితంగా పిల్లలు-బిక్కు-బిక్కుమంటూ ఓ మూల కూర్చునేవారు. తల్లీ తండ్రీ ఆప్యాయంగా పలకరించుకున్న రోజున ఇంట్లో పిల్లలకి ఒక పండుగలా వుండేది.

అందుకే పిల్లలెప్పుడూ—నాన్నగారైనా, అమ్మయినా ఊరికెడితే బాగుండును అనుకునేవారు.

ఎప్పుడేనా వాళ్ళవాళ్ళకి జబ్బుగావుండి వనజ పుట్టింటికి వెళ్ళేది-చంటిపిల్లాడినీ-పెద్దపిల్లాడినీ తీసుకుని. అప్పుడు పద్మ తండ్రికి వండిపెట్టేది-తమ్ముళ్ళిద్దరి సాయంతో.

తల్లి దగ్గర లేదుగదా అని సుబ్రహ్మణ్యం కూడా పిల్లల్ని ఎంతో ప్రేమగా పలకరించి యోగక్షేమాలడుగుతూ సరదాగా కాలం గడిపేవాడు. గుండెలదిరిపోయేలా వుండే పోట్లాటలు లేకపోవడంవల్ల పిల్లల ప్రాణాలకు హాయిగా ఉండేది. అలాగే ఏదైనా పనిమీద సుబ్రహ్మణ్యం ఊరెళ్ళినా వాళ్ళకి బాగానేవుండేది.

లేతమనసులు సినిమా చూసినప్పుడు—ఆ సినిమాలో పిల్లలు-తల్లీతండ్రీ కలసివుండాలని అంతగా ఎందుకు తపించిపోయారో పద్మకు అర్థంకాలేదు. అలాగే మరికొన్ని సినిమాల్లో-సవతితల్లి-పిల్లల్ని బాధపెట్టడమూ-అందరూ ఆమెను దూషించడమూ జరిగినప్పుడు-కన్నతల్లయినా అంతేగా-అనుకునేది పద్మ!

ఆమె అలా అనుకోవడంలో అర్థం లేకపోలేదు. ఆమె తల్లిప్రేమను పూర్తిగా రుచి చూడలేదు. తల్లి ఆప్యాయంగా పలకరించిన సంఘటనలు ఆమె జీవితంలో చాలా తక్కువ. ఎప్పుడూ చీవాట్లూ, శాపనార్థాలనే రుచి చూస్తున్న ఆమె ఆప్యాయతతోకూడిన పిలుపు కోసం తహతహలాడిపోతోంది.

పద్మ ఉదయమే లేచి మొహం కడుక్కుని తమ్ముళ్ళచేత మొహం కడిగిస్తుంది. పనిమనిషికి అంట్లు వేస్తుంది. కడిగిన గిన్నెలు ఇంట్లో పెడుతుంది. తమ్ముళ్ళకి నీళ్ళోసి తను పోసుకుంటుంది. తండ్రికి షేవింగుకి కావలసిన ఏర్పాట్లు మొదలైనవి చేస్తుంది. ఆఖరి తమ్ముడికి తల్లి నీళ్ళు పోసేటప్పుడు-తను పై నీళ్ళు పోస్తుంది. వంటలో తల్లికి పైపనులు సాయం చేస్తుంది. ఈ పనులన్నింటినీ ఆమె తమ్ముళ్ళ సాయంతో చాకచక్యంగా ముగించుకుని-బడికెళ్ళిపోతుంది—తండ్రితో కలసి. మళ్ళీ సాయంత్రం వచ్చి చేయవలసినంతా, చేయగలిగినంతా తల్లికి సాయం చేస్తుంది. రాత్రి చదువుకుని పడుకుంటుంది.

చుట్టుపక్కలంతా పద్మను మెచ్చుకుంటూండేవారు. ఆ మెప్పుదల ఆమె కానందాన్ని కలిగించినప్పటికీ-తల్లి తన్ను మెచ్చుకోలేదన్న బాధ ఆమెని వదిలేదికాదు.

తలిదండ్రులామెను ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తున్నారనీ వాళ్ళ తీరే అంత అనీ ఆమెకు తెలియదు. అలా తెలిసే అవకాశం తలిదండ్రులు ఇవ్వలేదు

ఏది ఏమయినా తలిదండ్రుల మీద పద్మకు అసహ్యంలేదు. తల్లికీ, తండ్రికీ ఏమాత్రం బాధ కలిగినా ఆమె గిలగిల్లాడిపోయేది. వాళ్ళు తనని ఆప్యాయంగా పలకరించలేదే అన్న బాధ తప్ప-ఆమెకు వాళ్ళమీద మరో విధమైన కోపంలేదు.

తమ్ముళ్ళకు ఒకటి రెండుసార్లు జ్వరం వచ్చినప్పుడు తల్లి ఎంత గిలగిల్లాడిపోయిందో-తండ్రి ఎంత కంగారుపడ్డాడో ఆమెకు తెలుసు. కానయితే అప్పుడూ ఆమెకు చీవాట్లే ఎదురయ్యేవి. అస్తమానూ తల్లి తమ్ముడిదగ్గరే కూర్చుని-బార్లీ నీళ్ళు కలపమనీ, హార్లిక్సు కలపమనీ పనులు పురమాయించేది. పద్మ అన్ని పనులూ చేయలేక అలసిపోయి-"ఒక్క నిముషమాగి చేస్తానమ్మా!"అంటే వనజ బాగా కసురుకునేది.

అప్పుడు పద్మకు అనిపించేది, "అమ్మకు నేనంటేనే ఇష్టంలేదు. తమ్ముళ్ళంటే ఇష్టమే!" అని.

(వి) చిత్ర విజ్ఞానం



మనంవాడే ఆఫ్టర్ షేవ్ లోషన్లలోని, (ట్రైబ్రోమో సేలిసి లాని లైడ్ (TBS) అన బడే క్రిమిసంహారక పదార్థం చర్మానికి హాని కరమట! దీనివల్ల **"Photo allergy"** అంటే సూర్యరశ్మికి ఎలర్జీ) వస్తుందట, ఈ లోషన్లను విరివిగా వాడితే ముఖం మీద మచ్చలు, దురదపుట్టించే వ్యాధులు వస్తాయని **"THE WALL STREET JOURNAL"** లో పేర్కొనబడి వుంది!

అప్పుడే ఆమెకు మరో ఆలోచనకలిగింది. 'నాక్కూడా జ్వరమొస్తే అమ్మ నన్నూ ప్రేమగా పలకరిస్తుందేమో!" అని. ఆవిషయం తెలుసుకోవడం కోసం తనకు జ్వరమొస్తే బాగుండునని దేవుడికి మొక్కుకుంటూ వుండే దామె.

ఎనిమిదేళ్ళలో ఎన్నడూ జ్వరమన్నది ఎరుగని పద్మకు-భగవంతుని వరప్రసాదమా అన్నట్లు జ్వరం వచ్చింది. రావడంలోనూ ముమ్మరంగా, ఒళ్ళు తెలియనంతగా వచ్చేసింది.

మొదట్లో వనజకు కూడా తెలియలేదు.

ఆరోజు ఆదివారం!

భోజనాలయేక అంతా పడుకున్నారు. పద్మ కూడా పడుకుంది. మిగతా పిల్లలు ఆడుకుంటున్నారు. టైము రెండున్నరయినప్పుడు "పద్మా! కాస్త లేచి కుంపటంటించమ్మా! మీ నాన్నగారికి కాఫీ టయిమవుతోంది!" అంది వనజ మత్తుగా ఆవలిస్తూ.

ఆవిడకు సమాధానం రాలేదు.

"ఒసేవ్-నిన్నేనే!" అంటూ రెట్టించింది వనజ.

అయినా సమాధానం రాలేదు.

"నా సత్తువంతా వీళ్ళను లేపేసరికే అయిపోతోంది. ఇంత మొద్దునిద్దరేమిటి బాబూ!" అని ఆవిడ విసుక్కుని అవులించుకుంటూ పద్మను లేపాలని ఒంటిమీద చేయి వేసి ఉలిక్కిపడింది.

పద్మ ఒళ్ళు కాలిపోతోంది.

ఆవిడ కంగారుపడి పద్మా, పద్మా అంటూ ఒకటి రెండుసార్లు పిలిచింది. పద్మ ఉలక లేదు పలకలేదు. దాంతో కంగారుగా భర్త దగ్గరకు పరుగెట్టింది.

"ఏమిటే-నీ సొద-కాఫీ ఇంకో పావుగంట పోయి తరువాత తాగుతాలే!" అంటూ మరో పక్కకు చిరాగ్గా ఒత్తిగిల్లాడు సుబ్రహ్మణ్యం.


"అబ్బ. ఎప్పుడూ మాయదారి కాఫీయే మీకు. అవతల పిల్లదాని ఒళ్ళు కాలిపోతూంటేనూ" అంది వనజ.

సుబ్రహ్మణ్యం మత్తు వదిలిపోయింది. "ఏమిటీ?" అన్నాడు ఉలిక్కిపడి.

"పద్మ మూసిన కన్నెరక్కుండా పడుకుందండీ-ఒళ్ళు చూస్తే కాలిపోతోంది-పిలిస్తే పలకడంలేదు, నాకేదో భయంగా ఉంది."

సుబ్రహ్మణ్యం వెంటనే లేచి పద్మదగ్గరకు వచ్చాడు. ఓసారి పిలిచాడు. పద్మ మాట్లాడ లేదు. ఓసారి నుదుటిమీద చెయ్యివేసిచూశాడు. వెంటనే చొక్కావేసుకుని, "డాక్టరుని తీసుకొస్తాను!" ముక్తసరిగా అని బయల్దేరాడు.

డాక్టరు వచ్చి పద్మను పరీక్షించాడు. "జ్వరం రావడమే చాలా తీవ్రంగా వచ్చింది. టైఫాయిడేమోనని అనుమానంగా ఉంది. మీరేం కంగారు పడకండి!" అంటూ ఆయన కొన్ని



కథక చక్రవర్తి శ్రీపాద చిన్న కథలపై పరిశోధనకు 'కనక్ ప్రవాసి'కి డాక్టరేట్ డిగ్రీ

"కథక చక్రవర్తి స్వర్గీయ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు-సమగ్ర సమీక్ష' అనే పరిశోధన వ్యాసానికి శ్రీ బామర్తి కనకయ్యకు ఆంధ్రవిశ్వవిద్యాలయం "డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ" (పి. హెచ్. డి) డిగ్రీ ప్రకటించింది. శ్రీ కనకయ్య. "కనక్ ప్రవాసి అనే కలం పేరుతో తెలుగు పత్రికా పాఠకులకు సుపరిచితులు. వీరు కాకినాడ పి. ఆర్ ప్రభుత్వ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

కనక్ ప్రవాసి ఇదివరలో అద్దానికి అటూ ఇటూ; ఒప్పందం; పతివ్రత మొదలయిన కథా సంపుటాలను ప్రకటించడమేగాక గత ముప్ఫై సంవత్సరాలలో వివిధ పత్రికలలో కథలూ, వ్యాసాలూ 500 కి పైగా ప్రకటించారు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు వ్రాసిన 75 చిన్న కథలపై శ్రీ కనకయ్య రచించిన పరిశోధన వ్యాసం (478 పేజీలు) ఒక సుప్రసిద్ధ కథారచయిత కథలపై తెలుగులో వచ్చిన మొట్టమొదటి సిద్ధాంత వ్యాసం. ఇది వ్యావహారిక భాషలో వ్రాయబడడం ఒక విశేషం.

మందులు ఇచ్చి, పద్మకు ఓ ఇంజక్షనిచ్చి వెళ్ళిపోయాడు.

పద్మకు ఆ రాత్రి ఎనిమిదయేదాకా మెలకువ రాలేదు. అంతవరకూ వనజా, సుబ్రహ్మణ్యం ఇద్దరూకూడా స్థిమితంగా లేరు పిల్లలకోసమని ఏదో వంటచేశాననిపించింది వనజ శాస్త్రానికన్నట్లుగా ఎంగిలిపడ్డారు ఇద్దరూ

రాత్రి ఎనిమిది గంటలకు పద్మ కళ్ళు తెరిచిన సమయానికి తల్లీ, తండ్రీ ఇద్దరూ ఆమెవంకే ఆత్రుతగా చూస్తున్నారు తల్లి చేయి ఆమె నుదుటిమీద ఉంది

'ఎలా ఉందమ్మా? ఇద్దరూ ఒక్కసారే ప్రశ్నించారు,

బాగానే ఉంది-అసలు నాకేమయిందమ్మా! అనడిగింది పద్మ

"మరేం లేదమ్మా! నీకు జ్వరమొచ్చింది మధ్యాహ్నంనుంచి ఇంతవరకూ నువ్వు అసలు మాటాడలేదు—మాకేసి చూడలేదు నువ్వు మాటాడతావని ఇంతవరకూ చూసి చూసి ఇప్పుడే పడుకున్నారమ్మా—తమ్ముళ్ళు! మరి ఇప్పుడు నీకెలా ఉందమ్మా!'' అంది వనజ మాటాడుతూంటె ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి


'బాగానే ఉందమ్మా-కానీ కొంచెం నీరసంగా ఉంది!

'అయితే కొంచెం బార్లీ నీళ్ళు పెడతాను తాగుదువు గాని! అని- ఏమండీ కొంచెం దగ్గరుండి ఆ కబురూ ఈ కబురూ చెప్పండీ- నేనిప్పుడే బార్లీ కలుపుకొస్తాను అంటూ వనజ వంటింట్లోకి పరుగెత్తింది

తనకు జ్వరమొచ్చిందని తెలియగానే పద్మకు సంతోషం కలిగింది దాంతో ఆమె జ్వరంవల్ల కలిగిన బాధనుకూడా మరిచిపోయి—భగవంతుడికి నమస్కరించుకుంది—

"ఏదయినా బాధగా వుందామ్మా!" సుబ్రహ్మణ్యం అడిగాడు.

"లేదు నాన్నా! తేలిగ్గానే వుంది!" అంది పద్మ. సుబ్రహ్మణ్యం బాధగా నిట్టూర్చాడు.



కారుమేఘం

మీరా.

పద్మకు రెండు రోజులవరకు టెంపరేచర్ తగ్గలేదు. ఆ తర్వాత కొంచెం కొంచెంగా తగ్గి నాలుగు రోజులలో నార్మల్‌కు వచ్చింది. ఆ రోజున డాక్టర్ చెప్పాడు "ఈ పాపకు చాలా విశ్రాంతి అవసరం. జ్వరం టైఫాయిడ్‌లోకి దింపుతుందేమోనని కంగారు పడ్డాను కానీ దేవుడి దయవల్ల అలా జరగలేదు. అయితే పత్యానికి మాత్రం ఒకటి రెండు రోజులు చూద్దాం—"

ఈ మాటలు పద్మ వింది. జ్వరం తగ్గిపోయిందన్న మాట ఆమెను కలవరపరచింది.

నిజంగా ఈ ఆరు రోజుల్లోనూ పద్మ బాగా సుఖపడిందని చెప్పవచ్చు. ఆ సుఖం ఆమె శరీరానికి కలిగింది కాదు. ఆమె మనస్సుకు. తల్లీ, తండ్రీ తన్నెంతగా అభిమానిస్తున్నారనీ, తన కోసం ప్రాణాలయినా అర్పించడానికి సిద్ధంగా వున్నారనీ—చీవాట్లు తప్ప వినిపించని అమ్మ నోటినుండి ఆదరణతో కూడిన మాటలు వినిపించడంతో పద్మ మనస్సు ఆహ్లాదంతో నిండిపోయింది. అమ్మ ఎప్పుడూ ఇలాగుంటే ఎంత బాగుండును? అనికూడా ఆమె అనుకుంది. అయితే అదంత సులువా? మళ్ళీ తన జ్వరం తగ్గగానే అమ్మ మళ్ళీ మామూలుగా అయిపోతుంది.

తల్లిప్రేమను అంతవరకూ సరిగా ఎవి చూడని పద్మకు—ఇంకా తనివి తీరలేదు. తల్లిలాలింపులో — ఆమెకు అదో రకమైన ఆనందానుభూతి కలుగుతోంది. ఈ ఆరు రోజుల్లోనూ తను పొందిన ఆనందం మరికొంత కాలం కొనసాగితే ఎంతో బాగుంటుందని ఆమెకు అనిపించింది. అంతేకాదు ఈ ఆరు రోజుల్లోనూ వనజా, సుబ్రహ్మణ్యం—పద్మకు వినిపించేలా ఒక్కసారిగూడా పోట్లాడుకోలేదు సరిగదా—ఎంతో సభ్యతను ప్రదర్శించేరు. ఈ మార్పుకూడా పద్మకు వాంఛనీయమే కావడంతో—జ్వరం తగ్గిపోయిందే అన్న బాధ పద్మను పీడించసాగింది.

చాలాసేపు ఆలోచించి పద్మ ఒక ధృఢ నిశ్చయానికి వచ్చింది. తన జ్వరం తగ్గిపోవడానికి వీల్లేదు — అందుకోసం తను ఏమైనా చేయాలి—ఏమైనా చేయాలి!

ఆ సాయంత్రమే హఠాత్తుగా పద్మకు టెంపరేచర్ పెరిగిందని కంగారుగా సుబ్రహ్మణ్యం డాక్టరుకోసం పరుగెత్తాడు. వనజ కంగారుగా- "ఇంతలోనే ఎలా వచ్చిందే బాబూ" అంటూ కళ్ళనీళ్ళతో పద్మ పక్కనే కూర్చుంది.

"ఎందుకమ్మా—అలా ఏడుస్తావు?" అంది పద్మ.

"ఏం లేదమ్మా' నీ జ్వరం తగ్గిపోయింది కదా అని పొద్దున్నే దేవుడికి కొబ్బరికాయ కూడా కొట్టాను — కానీ మళ్ళీ నీకు జ్వరమొచ్చింది — పాపం నాన్నగారు కంగారుగా డాక్టరుకోసం వెళ్ళారు!"

డాక్టరు వచ్చాడు. ఆమె నాడి చూశాడు. అనుభవంతో కూడిన ఆయన కళ్ళు అనుమానాస్పదంగా అందరివంకా చూశాయి. "పాపకు ఏమయినా పెట్టారా మధ్యాహ్నం?" అనడిగాడాయన.

"ఒక్క బార్లీ తప్ప ఏమీ ఇవ్వలేదు డాక్టర్!" అంది వనజ.

"నిజం చెప్పండి — మీ పాప ఆరోగ్యం

కోసమే. అడుగుతున్నాను." అన్నాడాయన గంభీరంగా—"ఒకవేళ పాప గట్టిగా మారాం చేస్తే పరవాలేదులే అని కొంచెం అన్నం పెట్టి వుంటే—చెప్పండి — పరవాలేదు — అలా పెట్టడంవల్ల మంచే కానీ, చెడు లేదు—"

"నిజంగా పెట్టలేదండీ—పాప—అది ఏ మారామూ చేయలేదుకూడా!" అంది వనజ.

"అయితే అంతా ఒకసారి బైటకు వెళ్ళండి!" అన్నాడాయన. అంతా వెళ్ళిపోయాక ఆయన పద్మ తల నిమురుతూ—"నువ్వు ఎవరూ చూడకుండా కొంచెం అన్నం తిన్నావుకదూ?" అన్నాడు.

"అవునండీ!" అనేసింది పద్మ చటుక్కున.

వెంటనే ఆయన తీక్షణంగా పద్మవంక చూశాడు. "ఎందుకు తిన్నావ్?"

పద్మ వణికిపోయింది. ఒక్క నిముషం ఆమెకు నోట మాటరాలేదు.

"ఎందుకు తిన్నావ్?" ఆయన మళ్ళీ గర్జించాడు.

"అది కాదండీ—అస్తమానూ మా అమ్మ నన్ను తిడుతూ వుంటుంది. ఎంత పనిచేసినా మెచ్చుకోదు. ఈ జ్వరమొచ్చినప్పట్నించీ మా అమ్మ చాలా అభిమానంగా చూస్తోంది. ఎప్పుడూ మాట్లాడనంత ప్రేమగా మాట్లాడుతోంది. మరి జ్వరం తగ్గిపోతే అలా మాటలాడదు. నాకేమో మా అమ్మెప్పుడూ అలాగే మాటలాడాలని వుంటుంది. అందుకోసమని జ్వరం తగ్గిపోకుండా వుండాలని ఎవరూ చూడకుండా కొంచెమే అన్నం తిన్నాను. నాకు జ్వరమొస్తే మా అమ్మా, నాన్నగారుకూడా దెబ్బలాడుకోవడం మానేశారు. లేకపోతే ఎప్పుడూ దెబ్బలాడుకోవడమే!" అంటూ ఏడుస్తూ చెప్పింది పద్మ.

డాక్టరు అంతా మౌనంగా విన్నాడు. ఆయన కళ్ళలో నీళ్ళు నిలిచాయి

సుబ్రహ్మణ్యం ఇంట్లోని భాగోతం గురించి ఆ వీధిలోని అందరకూ తెలుసు. డాక్టరుకూడా ఆ వీధిలోనివాడే. ఆయనకు పద్మ పసిమనసులోని తపన అర్థమయింది. తల్లి ప్రేమకోసం-శారీరకమైన బాధను ఎంతైనా సహించడానికి నిశ్చయించుకున్న పద్మ మానసిక సంఘర్షణ పరిమాణం ఆయనకు తెలిసివచ్చింది.

వనజ, సుబ్రహ్మణ్యం పద్మ గదిలోకి వచ్చారు. గది బయటనే వున్న వాళ్ళకీమాటలు వినిపించాయి. కళ్ళలో నీళ్ళతో పద్మ వంక చూస్తున్న వాళ్ళవంక డాక్టర్ అదోకలా చూసి అన్నాడు.

"తల్లిప్రేమలో పొందే అనుభూతి మరెందులోనూ పొందలేమంటారు. కన్న బిడ్డలను రోజుకొకసారైనా తలిదండ్రులు ఆప్యాయంగా పలకరించకపోతే వారి పసి మనసులు గాయపడతాయి. మీ అమ్మాయి మీ అభిమానంకోసం తహతహలాడిపోతోంది. సరయిన మందు మీరే ఇవ్వాలి. మీ మందు పనిచేశాకనే నా మందు పనిచేస్తుంది. రెండు రోజులు అమ్మాయిని జాగ్రత్తగా చూసుకుంటే చాలు—పెద్ద ప్రమాదమేం లేదు!"

రెండు బిళ్ళలిచ్చి, ఒక టానిక్ సీసా తెమ్మని రాసిచ్చి ఆయన వెళ్ళిపోయాడు.

వనజ, సుబ్రహ్మణ్యం ఇద్దరూ కుమార్తె వంక చూశారు. తమవంకే కన్నార్పకుండా చూస్తున్న అమాయకమైన పద్మను చూడగానే ఇద్దరి కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి—

"పాపిష్టిదాన్ని — కన్న కూతుర్ని ఎంత హింసపెట్టాను!" అని బాధపడింది వనజ. ఆ బాధలోనే ఆమె నిశ్చయం చేసుకుంది—ఆ నిశ్చయం చెబుదామని భర్తకేసి తిరగబోయేసరికి సుబ్రహ్మణ్యమే నెమ్మదిగా అన్నాడు.

"మన మింకెప్పుడూ పోట్లాడుకోకూడదే. కనీసం పిల్లల ముందయినా మానేద్దాం!"

సమాధానంగా వనజ అంది — "పిల్లలూ, దేవుడూ ఒకలాంటి వారే నంటారు — పిల్లల ముందేకాదు—సర్వవ్యాప్తి అయిన దేవుడి ముందు మాత్రం మనమెందుకు దెబ్బలాడుకోవాలి"

అలా అంటుండగానే ఆమె హృదయం భర్తపట్ల, పిల్లలపట్ల వాత్సల్యంతో నిండిపోయింది. □

బావ ముద్దిమ్మంటే 'అమ్మతో చెపుతా అలా అన్నావంటే' అని బెదిరించే మరదళ్ళుండటం సహజం. మరి ముద్దివ్వకపోతే మా అమ్మతో చెబుతానని బ్లాక్‌మెయిల్ చేసే మరదళ్ళూ వుంటారు పాపం గోపాలంలాంటి అమాయకుల ప్రాణాలకి!

బ్లాక్ మెయిల్

ఆర్. యస్. కె. మూర్తి

"ఎవరు ఎవర్ని బ్లాకుమెయిలు చేస్తున్నారంటారు?" అని అడుగుతూ క్లబ్బులోకి అడుగెట్టేడు, మహారాజ పోషకుడు.

ఆయన ఈ క్లబ్బుకి మాత్రమేగాక యింకా ఎన్నింటికో, ఎందరికో మహారాజ పోషకుడని ప్రతీతి; అయితే అవన్నీ రుజూలూ, సాక్ష్యాలూ లేని నిజాలు.

"ఎవరో ఒకరు, మరెవరో యింకొకర్ని, బ్లాకుమెయిలు చేయటం గూర్చికాదు, మేం మాటలాడుకోటం? ఈ దేశంలో, ఈనాడు, అందర్నీ, అన్ని సమయాల్లోను, బ్లాకు మెయిలు చెయ్యగల శక్తి ఎవరికుంది? అదీ ప్రశ్న—" వివరిస్తూ బల్లగుద్దాడు—రాజపోషకుడు.

ఆయనలా బల్ల గుద్దిన పోర్సుకి ఎదుటి గోడకున్న అమ్మవారి ఫోటో విలాసంగా కదిలి, కులాసాగా నవ్వేసింది. అదలా వుండగా

ఈ రాజపోషకుడు ఈ క్లబ్బుకేగాక ఇంకా చాలావాటికి, చాలమందికి రాజపోషకు డనటానికి రుజూలూ సాక్ష్యాలూ బోలెడన్ని. ఫర్ ఎగ్జాంపిల్, ఆయనెప్పుడూ 'ఫామిలీ'తో తప్ప సినిమా కెళ్ళడు. ఎటు తిరిగీ వచ్చినచిక్కేమిటంటే, తఫాకొకరుగా ఆయనతో సినిమా కొచ్చే 'ఫామిలీ' లలో ఆయన అసలు 'ఫామిలీ' ఎవరనేదే? అందువల్ల బ్లాకుమెయిలర్సుకి రాజపోషకుడిని మించిన 'ఐడియల్ విక్టిం' మరొకరు దొరకరనేది పచ్చి నిజం!

మహారాజ పోషకుడికివన్నీ తెలిసిన విషయాలే కదా? కాబట్టి ఆయన క్లబ్బులోకి వస్తూ "ఎవరు ఎవర్ని " అని అడగటంలో ఉద్దేశ్యం యిప్పుడు రాజపోషకుడ్ని కొత్తగా ఎవరు బ్లాకుమెయిలు చేస్తున్నారో తెలుసుకుందామనే; ఇది పసిగట్టే రాజపోషకుడు విషయాన్ని జనరలైజు చేసి పారేశాడు — అమ్మవారి బొమ్మకు నవ్వు తెప్పించే విధంగా.

ఇలాంటి జనరాలిటీస్‌కి జనరలుగా సమాధానం చెప్పటంలో మక్కువ, నేర్పు కలవాడు, మనవాళ్ళయ్య.

"మన గూఢచారి సంస్థ వుందా? దానికంతటికీ పెద్ద ఎవరో ఒకరు వుంటారుకదా? ఆ ఒకరు దేశంలో ఎవరినైనా, ఏ పాయింట్ ఆఫ్ టైములో నయినా, బ్లాకుమెయిలు చెయ్యగలరు" చిటికెలేస్తూ ఆన్సరు చెప్పాడు మన వాళ్ళయ్య.

అంతలావు బల్లగుద్దిన పోర్సుకే కదలని ఫోటో చిటికెలకు కదులుతుందా? ఈసారి కులాసాగా గోడనే వుండి, దిలాసాగా నవ్వింది. అమ్మవారి ఫోటో.

"చేసెయ్య గల రనేనా, చేస్తున్నారని కూడానా?" అందుకున్నాడు ముక్తసరిరావు. ఆయన ఏం మాటలాడినా ముక్తసరిగానే మాటాడుతుంటాడు.

"ఏం చేస్తున్నారంటావు?" అని కోపంగా అడిగాడు మహారాజ పోషకుడు. ఆయనకి ముక్తసరి మాటలంటే మహా కోపం మరి.

"బ్లాకుమెయిలు" — అన్నాడు ముక్తసరిరావు—ఒకటో, ఆరో ప్రతిపక్ష సభ్యులున్న

అసెంబ్లీలో ముఖ్యమంత్రులు సమాధానాలు చెప్పే ముక్తసరితో.

"ఎవరు, ఎవర్ని బ్లాకుమెయిలు చేస్తున్నారంటావు?" మళ్ళా అడిగాడు, మ.రా.పో.

"మనం మళ్ళా మొదటికొచ్చాం" అన్నాడు ము.స.రావు—ఒకరో, అరో ప్రతిపక్ష సభ్యులున్న పార్లమెంటులో పాలసీ వుపన్యాసాలు చేసే ప్రభువుల ముక్తసరితో.

ఇకనీ ము.స.రావుతో ఎంత మాటాడినా యింతే; అందుకే మాట మార్చాడు మ.రా.పోషకుడు—"ఎవరు, ఎవర్ని బ్లాకుమెయిలు చేసినా, చెయ్యకపోయినా, మా గోపాలాన్ని మాత్రం యిక నెవ్వరూ బ్లాకుమెయిలు చెయ్యలేరు."

"అబ్సర్డు. ఎవ్వరూ, ఎప్పుడూ బ్లాకు మెయిలు చేయటానికి వీలులేకుండా వుండటం అసంభవం," అన్నాడు రాజపోషకుడు—తన అనుభవాన్ని పురస్కరించుకొని.

"అబ్సర్డా. వాట్ అబ్సర్డ్! అబ్సర్డు కానిదే నేను చెప్తుంటా. మా గోపాలాన్ని యిక నెవ్వరూ బ్లాక్ మెయిల్ చెయ్యలేరు. తెలుసా?"

"ఎందుకనిట? ఏమిటట, అతనిలో వున్న ప్రత్యేకత?" అనడిగాడు, మనవాళ్ళయ్యా.

"అదా, అదో పెద్ద కథలే" అన్నాడు మ.రా.పో. కళ్ళు చికిలిస్తూ.

"ఇప్పుడా పెద్ద కథ చెప్తారు కాబోలు" అన్నాడు ము.స.రావు—కళ్ళు చిట్లిస్తూ.

"ముక్తసరిగానే చెప్పండి పోనీ" అంటూ ముక్తసరిరావును వెక్కిరించాడు రా.పో. కథలన్నా, కాకరకాయలన్నా ఆయనకు యిష్టం మరి!

"రెండో ప్రపంచ యుద్ధానికి ముందు మా గోపాలం '' కథ ప్రారంభించాడు, మ.రా.పోషకుడు.

"గోచీ లేకుండానే తిరిగేవాడు" పెద్ద జోకుతో అడ్డొచ్చాడు, ము.స.రావు.

క్లబ్బంతా దద్దరిల్లిపోయింది, నవ్వులతో.

"ష్యూర్. ష్యూర్. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు మా గోపాలం గోచీ లేకుండానే తిరిగేవాడు; నిజంగా. ఎందుకనంటే, అతనికి గోచీలు పెట్టుకోవలసిన అవసరం వచ్చేసరికి రెండో ప్ర.యు. ఆగేపోయింది. గోపాలం వాళ్ళ నాన్న పెద్ద శాంతికాముకుడు—మన నిక్సను, మావో, ఇందిరలకు మల్లే. అందుకని ఆయన యుద్ధం రోజుల్లో కరువొచ్చే అనేక వస్తువుల్ని గోడౌన్లలో నిల్వచేసేవాడు-వాడకం దార్ల సౌకర్యంకోసం. అందువల్ల యుద్ధం ఆగిపోవటంతో ఆయన గుండె ఆగిపోయింది. ఆయన భార్య అంతకు ముందే చనిపోవటంతో, అమ్మా, నాన్న లేని గోపాలం వాళ్ళ అత్తమ్మ పోషణలోకి వెళ్ళిపోయింది, యుద్ధం అగిన తర్వాతనే. అత్తమ్మ కప్పటికి వళ్ళో ఓ కూతురు, కడుపులో ఓ కూతురు. ఇద్దరు మరదళ్ళ బావగారైన గోపాలానికి గోచీ పెట్టుకోవలసిన అవసరం కలిగింది కూడా-ఆ విధంగా-రెం.ప్ర.యు. ఆగిపోయిన తర్వాతనే. సో, విట్టేవేసినా మన ముక్తసరిరావు "

"అయన ఏట్లతో మీ కెందుకు లెండి—కానివ్వండి" ఎంకరేజి చేశాడు, రాజపోషకుడు-క.లన్నా, కా.లన్నా వుండే ఇష్టంతో.

"అప్పుడలా, గోచీలు పెట్టుకోటం ప్రారంభించిన మా గోపాలం యిరవై ఏళ్ళ వాడై వుండగా, ఒకరోజున "

* * *

"ఏయి బావా, ఆఖరుసారిగా అడుగుతున్నాను. యిలా వస్తావా, రావా?" అని గోపాలాన్ని దబాయించింది — అతను గోచీ పెట్టుకోటం ప్రారంభించే నాటికి, అప్పటికింకా అమ్మ కడుపులోనే వున్న అత్తమ్మ కూతురు రాధ.

"పండు వెన్నెల—మల్లెలు పరిచింది—జగత్తునిండుకూ. విశాలమైన డాబా. అందంగా మంచంమీద చేరిన చిన్నారి.

పిట్టగోడ దగ్గర నుంచొని, మనసును ఏ ఎన్నికల సంరంభంలోనో పోగొట్టుకున్న వాడిలా, ఎటో చూస్తూ నిలబడ్డాడు, గోపాలం.

"అదికాదు రాధా..." ఏదో చెప్పబోయాడు, గోపాలం.



"కాదు లేదు, గీదు లేదు. నేను పది వంట్లు చదివేసరికి, యిలా వచ్చేయాలి. లేపోతే తెల్సుగా, ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి ."

లాభం లేదు. తప్పదు. బ్లాకుమెయిలు! వెళ్ళి మంచం దగ్గర నించొన్నాడు, గోపాలం.

"వెరీ గుడ్. గుడ్‌బాయ్. దా. యిలా కూర్చో" మంచంమీద, తన పక్కన, చోటు చూపించింది, మరదలు మాణిక్యం—అసలు మాణిక్యంలానే వెలిగిపోతూ.

"మనమిలా ఒకే మంచంమీద కూర్చుంటే "నసిగాడు, గోపాలం.

"కూర్చుంటే ఆ . ఏమౌతుందేమిటీ? అయినా అలా కూర్చోటం మనకిది మొదటి సారి కాదుగా? ఏం, యిప్పుడవన్నీ మళ్ళా గుర్తుచెయ్యాలా? ఇదిగో, చెప్తున్నాను బావా, నేను మూడు చదివేసరికి ఇక్కడ కూచోవాలి. లేకపోతే తెల్సుగా? ఒన్ రెండు " బ్లాక్‌మెయిలర్లకు మాత్రమే వుండే ధైర్యంతో లెక్క మొదలెట్టింది, రాధ.

గబుక్కున కూర్చున్నాడు, గోపాలం. తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిల్—అని స్వగతం చెప్పుకుంటూ.

"వెరీగుడ్. గుడ్‌బాయ్. ఆ .ఇక యిప్పుడేమిటంటే ఇలా నామీద ఓ చేయి వేసి, రెండో చేత్తో అలా నా ముఖం పట్టుకొని, . ఛీ. నాకు సిగ్గేస్తుందమ్మా ఇదిగో బావా, అలా మొద్దబ్బాయిలా కూర్చున్నావంటే నాకు కోపం వస్తుంది. ఎంచక్కా నా ముఖం చేతుల్లోకి తీసుకుని . ఆ అదే నేనేమో కళ్ళు మూసుకుంటాను. మా బావేమో ఎంచక్కా నా పెదిమల్ని "సిగ్గులు మొగ్గలై పూసినై రాధ ముఖంలో.

"రాధా, రాధా. ఇది అన్యాయం. పెళ్ళికాని వాళ్ళం—మనం యిలాంటి పన్లు చెయ్యవచ్చా? పెద్దవాళ్ళకు తెలిస్తే..." గీపెట్టేడు, గోపాలం-దేశంలోని అన్ని అరిష్టాలకూ ఆ సి.ఐ.ఏ. వాళ్ళ ఎలిబీనే గీపెట్టే జోకరులా.

"ఏం, పెద్దవాళ్ళకు తెలుస్తుందనే భయం యివ్వాళే వచ్చిందా? ఆ రోజు నేను అమాయకంగా నిద్రపోతుంటే అప్పుడు రాలేదా ఈ భయం పెద్ద నంగనాచిలా కబుర్లు చెప్తావు?"

"అదంటే . అది వేరు."

"ఇది చెట్టు. నా కదంతా తెలీదు బావా. నేను పది వంట్లు చదివేసరికి ఆ అంతే, లేకపోతే తెల్సుగా? ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి "

తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిలే. ప్యూర్ అండ్ సింపిల్! రాధ పెదిమల్ని సుతారంగా అందుకొన్నాడు, గోపాలం.

అమృతం తాగిన అప్సరసలా వెలిగిపోయింది రాధ. జిలేబీ మరో రెండు చుట్లు ఎక్కువ తినిపించబడ్డప్పటి ముఖం పెట్టేడు, గోపాలం.

"వెరీగుడ్. గుడ్‌బాయ్. స్వీట్ బావా?" ఆనందంతో పొంగిపోయింది, రాధ—ప్రజా ఉద్యమాల్ని బ్లాకుమెయిలుతో అణిచేసిన దేశ నాయకుల ఆనందంతో.

"కాని. రాధా, ఇదంతా నాకేమీ బాగాలేదు"

"మరి నువ్వా వెన్నెలరాత్రి చేసిన పని నాకు బాగుంటుందో లేదో అడిగే చేశావా? నేనిప్పుడు నీకు బాగులేదని మానెయ్యటానికి?" తెగిన వజ్రాల హారంలా పక్కమీద చెల్లా చెదురుగా పడిపోయింది, రాధ అందం.

*　　*　　*


ప్చ్. అదండీ సంగతి!

ఆ వెన్నెల రాత్రి గోపాలం దురుసుపని చేసిన మాట నిజమే. అప్పటి పరిస్థితి అలాంటిది, మరి. ఆ కష్వింపే వేరు. దాన్నే పట్టుకొని, తననిలా రోజుకోసారి బ్లాకుమెయిలు చెయ్యటం ప్చ్ ఏం బాగాలేదు.

ఒక ఆడపిల్ల—అందమైనదే ననుకోండి-సొంత మరదలే ననుకోండి—కాబోయే భార్యే ననుకోండి—అయితేమాత్రం, రోజూ తనచేత యిలా కాని పన్లు చేయించడం ప్చ్ ఏం బాగాలేదు.

అసలిలా జరుగుతుందని తెలిస్తే, ఆ వెన్నెల రాత్రి ఆ దురుసు పనిచేసి వుండేవాడు కాదు, గోపాలం.

(వి) చిత్ర విజ్ఞానం



12 సంవత్సరాలకోసారి అలహాబాదులో జరిగే "కుంభమేలా" మహోత్సవానికి దాదాపు 50 లక్షల హిందువులు దేశం నలుమూలలనుండి వస్తారు. ఇంత పెద్ద ఉత్సవం ప్రపంచంలో మరెక్కడా జరగదని "గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు" లో పేర్కొనబడివున్నది. ఇటీవల 1977 లో జరిగిన యీ ఉత్సవానికి 950 రైళ్ళు దేశం అన్ని మూలలనుండి అలహాబాదుకు నడుపబడినాయి!

ఆ రోజు కూడా ఈరోజు లాగే వెన్నెల మల్లెలను పరిచింది. చదివి, చదివి అలిసిపోయిన గోపాలం కాస్తంత గాలి పీల్చుకుందామని డాబా పైకి వెళ్ళాడు. అబ్బ, ఎంత మనోహరంగా వుంది రాధ!

మంచులాంటి వెన్నెల వేసవికే చల్లదనాన్నిస్తున్నది. హంస రెక్కల్లా తెల్లగా వున్న పరుపు. దానిపై తెల్లటి బట్టల్లో వెలిగిపోతున్న తేజోరాశి రాధ!

చిందర వందరగా వున్న ఆమె జుట్టులో చిక్కుకుపోయినై మల్లెలు. ఆ మల్లెల వాసనలతో మత్తెక్కి మెల్లగా వీస్తున్నది గాలి. ఆ గాలి పీల్చిన గోపాలానికి మతే పోయింది. ఆ పెదిమలు' ఎర్రటి ఆహ్వానాలను వేటినో అందించినై. ఆ ఆహ్వానాలను తోసిపుచ్చలేక మెల్లగా ఆమె పక్కన చేరి ఆ ఎర్రటి పెదిమల్ని అలా అందుకున్నాడు గోపాలం.

అమృతం తాగానని మురిసిపోయాడు ఆ క్షణంలో. ఆదిలా అజీర్ణం మాత్రలా వుండుండి గుర్రుమంటుందని వూహించలేదు. అతనలా పెదిమల్ని అందుకున్నాడో లేదో కలువ కన్నులు విచ్చుకున్నాయి వెన్నెల తాపు కన్నట్లు. "ఓ నువ్వా బావా! యూ నాటీ బాయ్! ఏం పన్లివి?" ఏవో చిలిపి పనులుచేస్తూ చిక్కిపోయిన గోపాలకృష్ణుని మందలించే గోపికల కోపంతో మందలించింది రాధ.

"ఆ ఆ అది కాదు రాధా వూరికే" కంగారుపడిపోయాడు గోపికల ట్రైనింగు బొత్తిగా లేని గోపాలం.

"ఊరికేనేం, పాపం వుండు, అమ్మతో చెప్పి "

"అమ్మతోనా, వద్దు రాధా వద్దు. అమ్మతో చెప్పొద్దు."

"చెప్పొద్దూ? ఏమమ్మా ఏం?"

"అత్తమ్మతో చెప్తే, అత్తమ్మేమో .. మరే అదే నాచేత జిలేబీలు తినిపించేస్తుంది వోక్ ."

"హ హ హ " ఎంత హృద్యంగమంగా నవ్వింది, రాధ! అయితే చెమటలు కక్కుతున్న గోపాలానికా నవ్వు షోకు తెలియలేదు.

ఇంతలో సీరియస్సయిపోయింది రాధ.

"మరయితే అమ్మతో చెప్పను కాని నేను చెప్పినట్లు వేస్తావా?"

బుర్ర వూపేశాడు గోపాలం "చిత్రగుప్తుడి" చిట్టా ముందు పెట్టి దేనికి బుర్ర వూపమంటే దానికి బుర్రవూపే చోటా నాయకులలా.

"ఐతే, ఏదీ మరోసారి " కళ్ళు మూసుకొని, పెదిమల్ని మెగ్గలుగా ముడిచింది, రాధ—భువన మోహన బాల.

"ఆ " అని నోరు తెరిచాడు గోపాలం-ఏదో మత్తులో వోట్లు గుద్దేసి తర్వాత ఐదేళ్ళు

నోరు తెరుచుకొని కూర్చుండే వోటరులా.

"అ లేదు.. గీలేదు. నే చెప్పినట్లు చెయ్యా ల్సిందే! లేపోతే. అమ్మతో చెప్పేస్తాను. తెల్సిందా?"

బ్లాకుమెయిలే! అయితే మాత్రం తప్పేదే ముంది? రాధ ముద్దును చెల్లించక తప్పలేదు గోపాలానికి.

"వెరీ గుడ్. గుడ్‌బాయ్. గో అండ్ హేవ్ స్వీట్ డ్రీమ్స్" బావకు పర్మిషను మంజూరు చేస్తూ, స్వీటు డ్రీమ్స్‌లోకి జారి పోయింది, డ్రీమ్ గరల్, రాధ.

ర ర ర

అలా ప్రారంభమయిందండీ, ఈ వెన్నెల బ్లాకుమెయిలు! ప్యూర్ అండ్ సింపిల్ బ్లాక్ మెయిలు.

అత్తమ్మంటే గోపాలానికున్న భయం "చిత్రగుప్తులంటే" మన 'సోషలిస్టు' మంత్రుల కుండదు. ఆ అత్తమ్మకేమో ఈ రాధ ముద్దుల కూతురు. కాకపోతే అత్తమ్మ చెపు తూనే వుంటుందనుకోండి-మా రాధను గోపీ గాడి కోసమే పెంచుతున్నానూ అని. వూరికే అనటం మాత్రమేనా?

"ఒసేయి అమ్మడూ! అంతటి ఎర్రటి వోణీలు వేసుకుంటే బావ భయపడ్డాడే. చక్కగా లైటు కలర్సు వేసుకో" అని రాధను మందలిస్తుంది కూడ అత్తమ్మ.

"అమ్మడూ, నువ్వా జిలేబీలు తినకే! అవంటే బావకు డోకుగదా!" అని కూడ అలవాట్లు మప్పుతుంటుంది, అత్తమ్మ.

అంతేకాదు! "ఒరేయి గోపీ, మా రాధ ఎప్పుడు ఏది కావాలంటే అప్పుడది చేస్తుం డాలి. లేకపోతే మా రాధకు కోపం వస్తుంది" అని గోపాలాన్ని మందలిస్తూ, కళ్ళు వత్తు కుంటుంది అత్తమ్మ.

రాధ డిగ్రీ అయిపోతుంటే నువ్వింకా ఈ యం. ఏ లోనే వుంటే ఎలాగురా? త్వరగా డాక్టరేటు చేసెయ్యి" అని రాధ కాలేజిలో చేరిన రోజునుంచీ గోపాలాన్ని తొందర చేస్తూనే వుంది, అత్తమ్మ.

అలా గోపాలంకోసమే రాధను పెంచింది అత్తమ్మ.

రాధ కోసమే గోపాలాన్ని పెద్దవాణ్ని చేసింది అత్తమ్మ.

అయితే మాత్రమేం! అత్తమ్మ చండ శాసనురాలు స్టాలిన్‌కంటె, హిట్లరుకంటే, మన ఇందిరమ్మకంటె కూడ. వెన్నెల మాయకు, మల్లెల మత్తుకు లోబడిపోయి గోపాలమిలాంటి చిలిపి పని చేశాడని తెలిస్తే అత్తమ్మ వూరుకోదు. జిలేబీలు తినిపిం చేస్తుంది.

జిలేబీలంటే బలే డోకు గోపాలానికి చిన్నప్పటినుంచీ. చిన్నప్పుడు తను మందు తాగనని మారాం చేస్తే జిలేబీల పళ్ళెం ముందు పెట్టి బ్లాకుమెయిలుచేసి, అతనిచేత మందు తాగించేది అత్తమ్మ.

పండక్కి తలంటు పోసుకోనని గోపాలం మొండికేస్తే "అయితే యివ్వాళ జిలేబీలే చేస్తాను. జాంగ్రీలు చెయ్యనే చెయ్యనని" అతగాడ్ని బ్లాకుమెయిలు చేసి తలంటు పోసేది అత్తమ్మ.

"రాధను పిక్నిక్‌కు తీసుకుపోకపోతే నీ పిక్నిక్ బాగ్‌లో అన్నీ జిలేబీలే పెట్టేస్తాను భడవకానా" అని బెదిరించి ఆ "పిల్లి"ని తోడుగా పంపేది అత్తమ్మ.

చిన్నప్పటినుంచి ఇలా జిలేబీల బ్లాకు మెయిలుతో సతమతమైపోతున్నాడు గోపాలం.

అది వదలించుకోటమే ఎలాగురా బాబూ అని గొడవ పడుతున్న గోపాలానికి వెన్నెల బ్లాకుమెయిలు కొత్తగా వచ్చి పడింది-ప్రజల నెలా వదిలించుకోవాలిరా బాబూ అని బాధ పడుతున్న మంత్రిగారికి "చిత్రగుప్తుడి" బెడద వచ్చి పడ్డట్లు.

* * *

చిటికెలేస్తూ ఆవలించాడు ము. స. రావు. అతగాడికి కథలంటే ఇష్టమేగాని ఇష్టమున్నట్లు కనిపించటం ఇష్టం లేదు.

"బయట వరండాలో బల్లలున్నాయి-నిద్ర పోయేవాళ్ళు నిద్రపోవచ్చు" అంటూ కథను

(వి)-చిత్ర విజ్ఞానం

ఈ చిత్రం ఎవరిదో చెప్పుకోండి చూద్దాం!


సోమర్ సెట్ మామ్?

మార్క్ ట్వైన్?

బెర్ట్రండ్ రస్సెల్?

ఐన్‌స్టీన్?

సమాధానం 87వ పేజీలో!!



కొనసాగించాడు మహారాజపోషకుడు.

* * *

ఇవేగాక యింకా యిలాంటివి ఎన్నో బ్లాకుమెయిలు బాధలుండేవి గోపాలానికొకప్పుడు.

మచ్చుకి మరొకటేమిటంటే గోపాలం చాలా మంచివాడుగదా.... దానివల్ల ఎన్ని బాధలో?

మా గోపీ చాలా మంచివాడమ్మా-అంటుంటుంది అత్తమ్మ నిరపాయకరంగా.

మా బావ చాలా మంచివాడు అనుకుంటుంది రాధ తియ్యగా.

మా గోపాలం బావ చాలా మంచివాడు అంటుండేది ప్రేమ అత్యంత ప్రమాదభరితంగా.

ప్రేమంటే అత్తమ్మ పెద్దకూతురు. కాస్తంత పర్మిసివ్ భావాలున్న పడతి. ఈ ప్రేమకు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోవటంతో కాస్తంత రిలీఫ్ దొరికింది గోపాలానికి. అబ్బ, ఎంత ఏడిపించేదో! గోపాలం మంచితనాన్ని ఆసరాగా తీసుకొని అతన్నెంతగా బ్లాకుమెయిలు చేసేదో?

నీళ్ళు పోసుకొని వంటికి టవలు చుట్టుకొని గబుక్కున గోపాలమున్న గదిలోకి వచ్చేసేది ప్రేమ. "ఓ బావా, నువ్వా? ఎవరో మగవాళ్లున్నారని హడలిపోయాను" అంటూ ఆ టవలు అవతల పారేసి గోపాలం కళ్ళెదుటే వస్త్రాలంకరణ ప్రారంభించేది - తన కళ్ళ ముందు గోచీ లేకుండా తిరిగిన అతగాడంటే భయమెందుకులే అని కాబోలు!

పోన్లే, ఈ ప్రేమకూడ తన ముందు గౌను లేకుండా తిరిగిన పిల్లేకదా - రెండో ప్రపంచ యుద్ధం ఆగిపోయిన కొత్తల్లో అని ఆ అలంకరణని ఆసక్తితో తిలకించేవాడు గోపాలం. అప్పుడలా గౌను లేకుండా తిరిగిన పిల్ల. ఇప్పుడబ్బా! ఎంత అలంకరణో!

ఒకనాడలాగే ముచ్చట తీర్చుకుంటున్న గోపాలాన్ని ముక్కు పట్టుకొని నిలేసింది ప్రేమ. "ఏంటమ్మా, అలా చూస్తావు? మీ ఆడపిల్ల బట్టలేసుకుంటుంటే అలా చూడొచ్చా?"

"అబ్బే....ఎలా చూశాను? ఎలా చూశాను! అబ్బే...." కంగారుపడిపోయాడు గోపాలం- వోటరు చేతిలో జుట్టు ఇరుక్కుపోయి అతనికి సంజాయిషీ చెప్పవలసి వచ్చిన ప్రజానాయకుడికి మల్లే.

"ఆ....ఎలా చూశావా! చెప్తాను. ఎలా చూసిందీ అమ్మతోనే చెప్తాను'"

"అత్తమ్మతోనా? వద్దు, ప్రేమా ప్లీజ్. అత్తమ్మతో చెప్తే జిలేబీలు తినిపించేస్తుంది" ప్రాణరహస్యాన్ని బాలనాగమ్మకి చెప్పేసిన మాయల మరాఠీ తప్పు చేసేసాడు గోపాలం.

ఇంకేం, దానితో మొదలయింది ప్రేమ బ్లాకుమెయిలు.

"అయితే అమ్మతో చెప్పనుగాని నేను చెప్పినట్లు చేస్తావా?"

బుర్ర వూపేశాడు గోపాలం - వోట్లు ఎదురుగుండా చూపెట్టి దేనికి బుర్ర ఊప మంటే దానికి బుర్రవూపే ప్రజాసేవకుడిలా.

"వెధవ టైలరుగాడు - వెనక గుండీలు పెట్టదురా అంటే విని చావడు. బావా బావా, యిలా వచ్చి ఈ జాకెట్టు గుండీలు పెట్టవూ, ప్లీజ్!" అడిగిందానికల్లా బుర్ర వూపేసిన బోళాశంకరుడికి భస్మాసురుడు పెట్టినట్లు గోపాలానికి టెస్టుకేసు పెట్టింది ప్రేమ.

"ఛ-ఛ. నీ జాకెట్టు గుండీలు నేను పెట్టట మేమిటి? ముందా వోణి వేసుకో" కళ్ళు మూసుకున్నాడు గోపాలం.

"అలాగేం అయితే అమ్మతో చెప్పి "

తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిలు. ప్యూర్ బ్లాక్‌మెయిలు. అనుకుంటూనే 'టైలరు వెధవ' చేసిన తప్పును దిద్దాడు గోపాలం.

"గుడ్ వెరీ గుడ్. అట్లా బుద్ధిమంతు డల్లే " విలాసంగా ప్రేమ వేసుకుంటున్న వోణీ, వేడిగా గోపాలం ముఖాన్ని రుద్దుతూ, ఏవో లోకాలకు ఎగిరిపోయింది.

* * *

ఈ ప్రేమకే పెళ్ళి మాటలు నలుగుతున్న రోజుల్లో పెద్ద రిలీఫు ఫీలయ్యాడు గోపాలం అసెంబ్లీ వాయిదా పడటంతో ప్రతిపక్షాల బెడద వదలిపోయిందని రిలీఫ్ ఫీలయ్యే ప్రజా నాయకుడిలా.

ఆ రిలీఫుతో అతనికెంతో ఉల్లాసం వచ్చింది. ఆ ఉల్లాసంతో అతనెళ్ళి ప్రేమను రెచ్చగొట్టాడు-అదోరకమైన హిప్పీ మత్తు లోంచి.

అప్పటికి కొన్ని గంటలుగా ముబ్బుపట్టి తుఫాను వాన, గాలులతో వాతావరణమంతా ఏదో హాయిగా మాయగా వుంది. ఆ హాయికి ప్రేమ వళ్ళంతా వేడెక్కిపోయి కూర్చుంది. మార్జువానా తాగిన వాళ్ళకు మోస్తరుగా మత్తుగా ఏదో గమ్మత్తుగా వుంది ప్రేమకు. అలాంటి ప్రేమనే రెచ్చగొట్టాడు పిచ్చి గోపాలం.

"అవును ప్రేమా, నీకు పెళ్ళట తెల్సా? ముహూర్తాలు కూడ " అంటూ తనలోని ఆనందాన్నంతా వెడలగక్కేశాడు - అసెంబ్లీ బాధ వదిలిపోగానే టూరుకి బయలుదేరెళ్ళి పోయే మహామాత్యుడి ఆనందంతో.

"అవునట. పెట్టేశారుట" బయటి మేఘాలకన్నా నల్లటి ముఖం పెట్టేసింది ప్రేమ.

కాని, అంతలోనే ఆమె మొఖం కుంకుమ పువ్వు రుద్దుకొన్నట్లు ఎర్రబడి పోయింది. గోపాలం భుజాలమీదనే చేతులేసి ఎర్రగా, కసిగా అడిగింది ప్రేమ "అయితే బావా, ఆడ దానికి పెళ్ళెందుకంటావు?"

"ఎందుకేమిటి, మొగుడి కోసం."

"మొగుడెందుకట?"

"మొగుడెందుకూ? అదేం ప్రశ్న? మొగుడు కావద్దూ?"

"అదే, ఎందుకూ అంట?"

"బలే. బలే. మొగుడెందుకంటే ఏమో నాకు తెలీదు."


"తెలీదేం పాపం మొగుడెందుకో చెప్ప లేని బుజ్జిపాపాయివి ఇప్పుడొచ్చి నన్నెం దుకు ." గోపాలం బుజ్జి బుగ్గల్ని బూరెలు చేసింది, ప్రేమ. "కాదు నీకు తెల్సు. చెప్పాలి. లేకపోతే అమ్మతో నా గుండీలు పెట్టేశావని చెప్పేస్తాను."

"అత్తమ్మతోనా, వద్దు ప్రేమా, ప్లీజ్."

"అయితే ఆడదానికి మొగుడెందుకో చెప్పు."

చిక్కులో పడ్డాడు గోపాలం. అన్సరు తెలియని ప్రశ్నలడిగి, పేంబెత్తం పుచ్చు కునే పొడుం మాస్టారిలా వుంది ప్రేమ తంతు. తెలీని ప్రశ్నకు తానేమని సమాధానం చెప్ప గలడు? ఇదేమన్నా జాకెట్టు గుండీలు పెట్టే యటమా, పోనీలే అని పెట్టెయ్యటానికి. ఆ గుండీలు

"ఊ ప్రేమా మొగుడెందుకంటే టైలరు వెధవ వద్దన్నా వినకుండా వెనుక గుండీలు పెత్తే పెట్టటానికి" అన్సరిచ్చాడు



గోపాలం- చదివిన చదువునుంచి కాక, క్వశ్చను పేపరునించే ఇన్స్పిరేషను పొంది పరీక్షలు రాసే ఏదో ఛాన్స్ విద్యార్థిలా.

"ఛీ పో బావా నీకేం తెలీదు. మొగాళ్ళింత మంచివాళ్ళయితే ఎలాగమ్మా!" అంటూ మంచం, పక్కా దున్నేసింది పర్మిసివుభావా లున్న ప్రేమ-బ్లాకుమెయిలు చేసినా రాజీనామా యివ్వని రాష్ట్రనాయకుడ్ని చూసి రొష్టుపడే కేంద్రనాయకుల కోపంతో.

అలా తన మంచితనంవల్ల వచ్చిన చిక్కు నుండి ఆ మంచితనం సహాయంతోనే బయట పడ్డాడు గోపాలం అప్పటికి ఆ రోజుకి.

* * *

మరో రోజున ఏం జరిగిందంటే

పెళ్ళయి కాపురాని కెళ్ళిన ప్రేమ పండక్కి దేనికో పుట్టింటి కొచ్చింది. వచ్చిన పదోరోజున కాబోలు నీళ్ళోసుకుందామని స్ట్రిప్‌టీజ్ ప్రారంభించింది. గోపాలం అక్కడే ఆమె కళ్ళెదుటే వున్నా అతగాడు తన కళ్ళె దుటే గోచీల్లేకుండా తిరిగినవాడేగదా. స్త్రానా ర్థియై అలా ఏదో చేస్తున్నదల్లా కెవ్వన కేకెట్టి "బావా, హెల్ప్ హెల్ప్" అని అరి చింది ప్రేమ. ఏమయిందోనని కంగారుగా పరిగెత్తాడు గోపాలం,

"ఈ గొలుసు చూడు బావా, జాకెట్టు గుండీల్లో ఎలా చిక్కడిపోయిందో? జాగ్ర త్తగా విడిపించవూ?" బ్రతిమలాడింది ప్రేమ.

ఎ డామ్సెల్ యిన్ డిస్ట్రెస్! సహాయం చెయ్యకపోవడం షివల్రీ కాదు.

జాగ్రత్తగా ఆ గుండీలు విప్పి గొలుసును విడదీసాడు గోపాలం.

"థాంక్స్ బావా, మరింక గుండీలు పెట్టేయి."

"అదేంటి, ఎట్లాగూ నీళ్ళోసుకోబోతున్నా వుగా?" అమాయకంగా అన్నాడు గోపాలం- సైలరు వెధవ తప్పు చేయకుండా ముందు వైపే పెట్టి కుట్టిన ఆ 'గుండీల్ని' మరో మారు ముట్టుకోవటం యిష్టంలేక కాబోలు!

"ఆ అయితే నేను నీళ్ళోసుకుంటుంటే కొంటె కిష్టుడిలా నువ్వు చూస్తూ కూర్చుంటా వన్నమాట. అమ్మదొంగా, ఏం బుద్ధులివి? వుండు, అమ్మతో చెప్పి "

"అత్తమ్మతోనా! వద్దు ప్రేమా ప్లీజ్. జిలేబీలు తినిపించేస్తుంది."

"అయితే గుండీలు పెట్టేసెయ్యి."

తప్పదు. బ్లాకుమెయిలే. అయినా అను కుంటూ బుద్ధిగా గుండీలు పెట్టేశాడు, గోపాలం.

దాంతో గోచీలేకుండా తిరిగిన రోజులకంటే ఏమాత్రం ఎదగని ఆ కుర్రాడ్ని చూచి గుర్రు మంది ప్రేమ. "ఏం బావా, గుండీలు పెట్టెయ్యమంటే అలా పెట్టెయ్యటమేనా?" అంటూ తుమ్మెదను పువ్వుల బాల చూచే చూపుతో గోపాలాన్ని చూసింది ప్రేమ. పెళ్ళయినా పర్మిసివు భావాలు వదిలిపెట్టని పడతి.

కానయితే తుమ్మెద రెక్కలు మూసుకొని నిద్రతో జోగిపోయింది "మరింకేం చేస్తా రేంటి?" అంటూ.

"ఛీ పో బావా ఇంత మంచయితే ఎట్లా గమ్మా?" పువ్వుల బాల ముడుచుకుపోయింది వెదజల్లుకుందామనుకున్న సౌరభాలను తన లోనే దాచుకుంటూ

మరోసారి కూడ అలా తన మంచితనం వల్ల వచ్చిన చిక్కునుంచి 'థాంక్సు టు దట్ మంచితనమ్' తప్పించుకున్నాడు గోపాలం బ్లాకుమెయిలోపహతుడు.

* * *

ఆ గుండీల బ్లాకుమెయిలు అలా కాస్త వెనుకపడుతూ వుండగానే ఇప్పుడీ వెన్నెల బ్లాకుమెయిలు!

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తున్నది, డాబా మీద. వెన్నెల్లో మంచం మెరిసిపోతున్నది. ఆ వెన్నెలకే మెరుపును యిస్తున్నది ఆ మంచం మీద పడుకున్న రాధ.

" లేకపోతే తెల్సుగా? ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి " అంటూ మధువు నందించింది మధుపం.

తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిలు! ప్యూర్ బ్లాక్ మెయిలు అని స్వగతం చెప్పు కుంటూ కరక్కాయ కషాయంలా దాన్నందు కున్నాడు గోపాలం.

"కాని, రాధా, పెళ్ళికానివాళ్ళం, మనమిలా చెయ్యటం " అరిగిపోయిన సి. ఐ. ఎ. ఎలిబీ' విసుగెత్తింది రాధకు.

"అలా పెళ్ళికానివాళ్ళం, పెళ్ళికానివాళ్ళం అంటూ నా ప్రాణం తియ్యకపోతే, ఆ పెళ్ళేదో చేసుకుంటే నే కాదన్నానా?" అంటూ గవర్న మెంటు కాంట్రాక్టులు ఎలా పట్టుకోవాలో, ఆ రహస్యం చెప్పేసిన మంత్రిగారిలా మురిసి పోయింది రాధ.

* * *

సీరియస్సుగా ఆలోచించాడు గోపాలం చిన్న చిన్న ఆమ్యామ్యాలు పట్టి చిత్రగుప్తు డికి దొరికిపోయేకంటే అసలు మురానాయ కుడ్నే పట్టేస్తే బాగుండును కదా అని ఆలో చించే మన ప్రజాసేవకులకి మల్లే.

"ఈ కుర్రగాడెవడో మనల్నే చిత్తు చేయా లని ఆలోచిస్తున్నాడే! పిల్లకాకి" అనుకుంటూ ఉండేలు దెబ్బ నవ్వులు నవ్వినట్లుగా కదిలింది ఎదురుగా గోడకున్న అమ్మ ఫోటో!

ఈ ఉండేలు దెబ్బల సంగతి ఆలోచించే స్థితిలో లేడు వెన్నెల బ్లాకుమెయిలుతో వుక్కిరి బిక్కిరై పోతూన్న గోపాలం. అంతే అలా చెయ్యాల్సిందే రాధ సూచించినట్లు. ఆ కాంట్రాక్టులు, ఎగ్రిమెంట్లు అధికారికంగానే పూర్తిచేసుకుంటే, యిక నీ రహస్యపు లంచాలు, వెన్నెల బ్లాకుమెయిలులు వుండవు. పెళ్ళి చేసుకుంటే

"ఏమిటీ! పెళ్ళి చేసుకుంటావా, నీచేతసలు నాలుగు జిలేబీలు తినిపించాలిరా, బడవకానా అని. పెళ్ళి చేసుకుంటాట్ట. ఇంకా డాక్టరేటు అవలేదు. అమ్మాయి డిగ్రీ ఏమో అయిపో వస్తున్నదీ " అంటూ కోప్పడిపోయింది అత్తమ్మ యువరాజకుమారుని ముద్దులకారు పేరెత్తితే మండిపడే అమ్మగారి పార్లమెంటు సభ్యుడిలా.

"అదికాదు అత్తమ్మా. నా థీసిస్ కాయి తాలు ఫెయిర్ కాపీచేసి పెట్టమంటే రాధ రలాయిస్తున్నది కదా! రేపు పెళ్ళయిపోతే దబాయించి అవన్నీ రాధచేత కాపీచేయించి, సబ్మిట్ చేస్తే రెండోరోజు కిచ్చేస్తారు డాక్ట రేటు. అంత బాగుంటుంది కదత్తమ్మా రాధ దస్తూరీ' నా దస్తూరి ఏమో "

"ఆ ఆ నాకు తెల్సులే. నీ దస్తూరి కూడ నీ వుంగరాల జుట్టుకిమల్లే ఓంకిరి చిం

రేగా! అయితే పెళ్ళి కాగానే డాక్టరేటు వస్తుందంటావు?"

"వచ్చేస్తుందత్తమ్మా" అంటూ మురిసిపోయాడు తియ్యటి ఆశలు చూపించి వోట్లను బుట్టలో వేసుకున్న రాజకీయ నాయకుడికి మల్లే.

"సర్లే, శాస్త్రుల్లుగారిని పిలిచి" అంటూ అత్తమ్మ బుట్టలో పడిపోయి వరాలిచ్చేసింది "ముద్దుల కారు"ని మెచ్చుకున్న ముఖ్యమంత్రులకు వరాలిచ్చే మాతృదేవిలాగా.

* * *

శాస్త్రుల్లుగారిని పిలవటం అయిపోయింది. ఆయన ముహూర్తాలు పెట్టటం అయిపోయింది. ఇంకా ఎవరెవరో రావటం, పందిళ్ళు వేయటం హడావుడి చెయ్యటం "మా బావమ్మ పెళ్ళికూతురాయెనే, మా రాదేమో పెళ్ళికొడుకాయెనే" అంటూ ప్రేమ పిచ్చిపాటలు పాడటం ఇదంతా ఏదో కలగా జరిగిపోయింది గోపాలానికి. బ్లాకుమెయిలు బాధ లేకుండానే వెన్నెల మత్తు అనుభవించవచ్చునన్న ఒకే ఒక ఆశతో తన చుట్టూ తిరుగుతూన్న ఆలశ్యం బాధని ఏదోలా సహించేశాడు గోపాలం.

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తున్నది పైన డాబామీద. రాధ కన్నుల్లో వెన్నెల ట్యూబు లైట్లకాంతిని మింగేస్తున్నది గమ్మత్తుగా వున్న ఆ గదిలో.

గమ్మత్తుగా వున్న శోభనం గదిలో 'మాయాలోకం' సినిమాలో మాయామోహిని గిరగిర మంచంమీద కూర్చున్న బాల నాగేశ్వరరావు ఫోజులో కూర్చున్న గోపాలానికి అంతా మత్తుగా మాయగా వుంది.

వేలాడదీసిన మల్లెలు మత్తుగా వాసనలు వెదజల్లుతున్నాయి. తన మెళ్ళో వేలాడుతున్న మరదలు ఏవో మాయలు చేస్తున్నది. అగరు వత్తుల వాసనలు అదేదో మత్తునిస్తున్నాయి. రాధనించి వికసిస్తున్న పరిమళాలు ఏవో మాయలు చేస్తున్నాయి

ఆ మాయలో ఆ మత్తులో తానేం చేస్తున్నాడో తెలియలేదు గోపాలానికి. ఆఖరికి తనచేత రాధ జిలేబీలు తినిపిస్తున్నదని, తాను అప్పుడే నాలుగు చుట్టలు తినేసానని కూడ తెలియలేదు గోపాలానికి. అప్పుడయినా తెలిసుండేది కాదు రాధ అలా ఆనందం ప్రకటించకపోతే.

"హోయ్, హోయ్ బావా! హిప్ హిప్ హుర్రే! జయం మనదే. విజయం మనదే. నువ్వు జిలేబీలు తినేశావు" అంటూ వివిధ భాషల్లో తన ఆనందాన్ని ప్రకటించేసింది రాధ తాను వోటు వేసిన అభ్యర్ధి గెలిచాడని సంతోషం ప్రకటించే వోటరులా.

గెలిచిన అభ్యర్థి అధికారం రుచి మరిగి తననెలా పిప్పరమెంటులా చప్పరించేస్తాడో తెలియదుగదా ఆ వోటరుకి.

జిలేబీలు తినేసి దాని తీపిరుచి మరిగిన గోపాలం తననెలా చికాకు పెడ్తాడో తెలియలేదు రాధకి పాపం!

హెవెన్ హైడ్స్ ద బుక్ ఆఫ్ ఫేట్ ఫ్రం అజ్—పాడుదేవుడు మన భవిష్యత్తుని మననుంచి దాచేస్తాడుగదా!

"ఆ జిలేబీలు తినేశానా వోక్" అంటూ అవన్నీ డోక్కోవాలని చూశాడు గోపాలం.

డోకు రాలేదు సరికదా, ఆ జిలేబీ తీపి అప్పట్టున ఆ క్షణంలో అతని జీవితాన్నే నింపేసినట్లయింది.

తియ్యదనాన్ని రుచిమరిగిన గోపాలం మరింత తియ్యదనానికి ఎగబడ్డాడు.

పళ్ళెంలో వున్న అన్ని జిలేబీల తీపి అతనికి చాలలేదు.

రాధ పెదవుల్లోని తియ్యదనం అతని ఆర్తి తీర్చలేదు.

మొదటి రాత్రిలోని తియ్యదనం అతన్ని తృప్తిపరచలేదు.

రాధ శరీరం నుండి జాలువారిన తియ్యదనం చాలలేదు. తీపి పిచ్చివాడయ్యాడు గోపాలం!

"దొంగపిల్లా, యింత దగా చేస్తావా?"

అంటూ రాధలో ఆ రాత్రిలో వున్న తియ్యదనానికి ఎగబడ్డాడు గోపాలం.

ఉక్కిరి బిక్కిరయింది రాధకు.

అందుతున్న తియ్యదనం ఆమెకు కాస్త మొహం మొత్తినట్టయింది. కాస్తంత కారం కావాలని కోరుకుంది కారం బంతిపూవులా కందిపోయిన రాధ. "ఏయి బావా, ఏమిటీ అల్లరి? కుదురుగా కూర్చుంటావా లేదా?" తీపిలో కారం నంజుకోవాలని చూసింది రాధ.

"కూర్చోను. ఏం చేస్తావేంటి?" కాలరెత్తాడు గోపాలం. మనవాడేనని ఓటేసినవాడు మంత్రి కాగానే టోపీ సవరించుకున్నట్లు తియ్యదనం కోసం వెర్రి ముచ్చట చూపించాడు గోపాలం. దాంతో వెర్రెత్తిపోయింది రాధకు.

"ఏయి బావా, ఆఖరిసారిగా చెప్తున్నాను. నేను పది వంట్లు చదివేలోగా కుదురుగా కూర్చోవాలి. లేపోతే, తెల్సుగా? ఒన్. రెండు, తీన్, నాల్గి, అంజి, ఆరు, సెవెన్, ఎనిమిది, నైన్, పది" ఒక్కోటి ఒక్కో భాషలో చదువుదామంటే అన్ని భాషలు రాక పది ఒంట్లని వెరశి తనకొచ్చిన ఐదు భాషల్లో చెప్పేసింది, రాధ.

అలవోకగా నవ్వుతూ కూర్చున్నాడు, గోపాలం—కార్యవర్ధి రాజు చేతిలో చిలుకను లాగేసుకున్న మాయల మరాఠీలా.

ఒంట్లు చదవటానికి తనకు పది భాషలు రాలేదేమన్న బాధకంటె, పది వంట్లు చదివినా బావ ఉలక్కపోవటం రాధకు బాధ కలిగించింది. వెర్రిగా ఎగబడ్తున్న బావను గుర్రుగా చూచింది, రాధ. "ఉండుండు, తెల్లారగానే అమ్మతో చెప్పి "

*   *   *

తెల్లారింది.

"పోన్లే అమ్మా, బావేగదా?" అంది అత్తమ్మ.

కస్సుమంది రాధ — గుర్రుమంటున్న కుక్కను కర్రతో కొట్టే కస్సుమన్నట్లుగా.

"ఏంటమ్మా, నువ్వూ మరీనూ. బావైతే మాత్రం అంత అల్లరి చేస్తాడేం?"

"పోన్లే అమ్మడూ, ఏదో ఉత్తుత్తి అల్లరి చేసుంటాడు."

"అల్లరి ఉత్తుత్తిదేం కాదు. ఆయన నీతో చెప్పిన మాటలే ఉత్తుత్తివి."

"ఆ ఏం చెప్పాడంటావు?"

"అదే నా చేత ఢీరీ కాఫీ చేయిస్తానని చెప్పలేదూ? అదంతా ఉత్తదే. ఆయనసలు ఢీరీ అంతా ఎప్పుడో సైపు చేయించారు" వెన్నెల సంగతి చెప్తే లాభంలేదని, కొత్త యిన్ఫర్మేషన్ ఇచ్చింది.

"ఏమిటేమిటి, అవన్నీ ఉత్తమాటలే. ఓరి భడవకానా! ఉండుండు. జిలేబీలు తినిపించేస్తాను" అంటూ బయలుదేరింది, అత్తమ్మ— చైనావాళ్ళమీదకు ఎస్ప్రో కాఫీ మిషన్లతో బయలుదేరిన భారతీయ రక్షణ దళాలకు మల్లే.

"తిను, భడవా" అంటూ అత్తమ్మ తినిపించిన జిలేబీలను, ఆనందంగా ఆరగించాడు, గోపాలం.

"ఆ " నోరుతెరుచుకొని వుండిపోయింది, అత్తమ్మ. కాసేపటికామె మురిసేపోయింది - తన అల్లుడింత జగదేక వీరుడైనందుకు. అత్తమ్మ జిలేబీల బ్లాకుమెయిలు ఆ మురిపెంలో మునిగిపోయింది.

ళ   ళ   ళ

పురిటి కొచ్చిన ప్రేమ, పిల్లవాడ్ని కని, - పిల్లడ్ని వళ్ళో వేసుకొని పాలిస్తున్నది, ఓ వెచ్చటి రోజున—మత్తుగా, గమ్మత్తుగా వున్న రోజున.

"ఏం, ప్రేమా, ఆడదానికి మొగుడెందుకో చెప్పమన్నావా?" అనడుగుతూ ఆ పిల్లడి బుగ్గల్ని ముద్దాడాడు గోపాలం. చక్కిలిగింతలైందేమో, ప్రేమకు - పర్మిసివ్ భావాలిప్పుడు బొత్తిగా లేని ప్రేమకు, "ఏయి బావా! ఏంటా దురుసు? ఫో అవతలికి" కసిరింది, ప్రేమ.

"అహ అదికాదు ప్రేమా, మళ్ళా గొలుసేమన్నా గుండీల్లో యిరుక్కుపోయిందేమోనని చూస్తున్నాను" అంటూ డిస్ట్రెసులో లేని డామ్సెలుకి సహాయం చెయ్యబోయాడు,

షివ్రలీ స్పిరిటుతో గోపాలం.

కెవ్వుమంది — కొత్తగా డిస్ట్రెసులో పడ్డ డామ్సెలు, ప్రేమ. "ఏయ్ చిలిపి" నవ్వు కుంటూ పారిపోయింది ప్రేమ—సైలరువెధవ తప్పు చెయ్యకుండా పెట్టిన గుండీలను పెట్టు కుంటూ.

ప్రేమ గుండీల బ్లాకుమెయిలు ఆ విధంగా ఆ గుండీల మధ్య క్రష్ అయిపోయింది.

* * *

"ఏయ్ రాధా, ఆఖరుసారినా అడుగు తున్నాను. యిలా వస్తావా, రావా? నేను పది వంట్లు చదివేసరికి రావాలి. లేకపోతే తెల్సుగా? ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి..."

లాభంలేదు. తప్పదు. దొంగబావ! ఏదో దురుసుపని చేసేస్తాడు.

తెల్లని చీరతో తియ్యని వెన్నెల్ని చిదు ముతూ, జాజుల వాసనలతో చల్లగాలిని చీల్సు కుంటూ నడిచి వచ్చింది, రాధ.

"గుడ్ వెరీగుడ్ గుడ్ రాధా...ఆ... యిప్పుదేమిటంటే "

"నువ్వేం చెప్పక్కర్లా, దొంగా అని, వెర్రి బావ! పిచ్చిబావ!" అంటూ దొంగబావను వెర్రి వాడ్నిచేసి తనను దోచుకోనిచ్చింది, రాధ.

రాధ వెన్నెల బ్లాకుమెయిలు అలా విచ్చి పోయింది.

* * *

"కధ కంచికెళ్ళింది. మనం అయ్ ఇంటికెళ్దాం. పొద్దోయింది అయ్ " ఆవ లించాడు, మహారాజ పోషకుడు.

"బ్లాకుమెయిలు చేయించుకొనే గోపాలం యిప్పుడు తానే పెద్ద బ్లాకుమెయిలరు అయి పోయాడన్న మాట. బలే బలే" ఆనందిం చాడు, రాజపోషకుడు, చిటికిలేస్తూ — ఆ వెన్నెల బ్లాకు మెయిలు కధలో తన'ఫామిలీల' బ్లాకుమెయిలు తప్పించుకోటానికి చిట్కా లేమన్నా దొరుకుతాయేమోనని, ఆ కధను తన చిటికెలతో కెలుకుతూ.

"ఇంతకీ ఈసపుగారు చెప్పేదేమిటో?" ముక్తసరిగా అడిగాడు, ముక్తసరిరావు.

"ఈసప్ ఏమిటి?" విసుక్కున్నారు, మ.రా.పో.

"అదే, తమరుగారు చెప్పిన కధలో ఈసప్ నీతేమిటీ అని?"

ప్రశ్నను వివరించారు ముక్తసరిరావు— తన కొంగు చుట్టూ ప్రదక్షిణాలు చేసే ప్రతి పక్షాల వాళ్ళ ముఖాన మాత్రం మరోనోటి ముత్యాన్ని రాల్చే మహానాయకుడి పోజులో.

"ఏముందీ. బ్లాకుమెయిలు కారం వెన్నెల తీపిలో నంజుకోవాలని మోజుపడే రాధలు, మత్తులో వున్నారుకదా అని మాయచేసి గోపాలంలచేత జిలేబీలు తినిపించకూడదు. అలా తినిపిస్తే "చిత్రగుప్తుల" జుట్టు చేతికి దొరికిన సమసమాజ నిర్మాతలకి మల్లే, వాళ్ళు వెర్రిగా తీపిని దోపిడీ చేసేస్తారన్న మాట. దోపిడీకి జోహుకుం అనాల్సి వస్తుందన్నమాట, రాధలకు" విషయాన్నంతా అలా జనరలైజు చేసేసాడు, మనవాళ్ళయ్య — జనరాలిటీస్‌కి జనరలుగా సమాధానం చెప్పే నేర్పు, మక్కువ గలవాడు కదా, మనవాళ్ళయ్య!

* * *

"అయ్ మా గొప్ప బ్లాకుమెయిలు కధే!" అంటూ ఒకసారి ఆవలించి, మరోసారి కులా సాగా కదిలి, చివరిసారి విలాసంగా నవ్వింది- గోడకున్న అమ్మ ఫొటో లాస్టులాఫ్ తనదే అవుతుందని ఆశించే మహానాయకుల ఆనందంతో. □

చిత్రం ఎవరిది?

సమాధానం;

మార్క్ ట్వైన్

(1835—1910)

యుద్ధ ప్రాతిపదికపై తుపాను సహాయ కార్యక్రమాలు

1979, మే 12 వ తేదీన ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలను తాకిన పెనుతుపాను వలన ఆస్తి, ప్రాణనష్టం అపారంగా సంభవించింది. ప్రళయ సదృశంగా విరుచుకుపడిన ఈ తుపానుకు 600 మందికి పైగా బలి అయ్యారు. 681 కోట్ల రూపాయల నష్టం సంభవించింది. సహాయపునరావాస కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికపై నిర్వహిస్తున్నాము.

సహాయచర్యల నిమిత్తం ఇంతవరకు 843.48 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడం జరిగింది.

తుపాను బాధితులకు ఇంతవరకు 12,386 టన్నుల బియ్యం, ఐదు లక్షలకు పైగా ధోవతలు, చీరలు, దుప్పట్లు పంచిపెట్టడం జరిగింది.

ప్రకాశం, నెల్లూరు జిల్లాలలోని వ్యవసాయదారులకు వారి పంటల పునరుద్ధరణకోసమై 17.83 కోట్ల రూపాయలు అడ్వాన్సుగా యివ్వ బడుతుంది.

తొలి విడతగా, తీరం వెంబడి 25 కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరు ప్రకాశం జిల్లాలో ఒక లక్ష గృహాలను నిర్మించటం జరిగింది.

డి. ఐ. పి. ఆర్. నెం: 51

ఆశల చీకటి — వి. రాజారామమోహనరావు

"పెద్ద వర్షం కాకపోయినా గాలికి జల్లు ఎక్కువయింది. కిటికీ దగ్గరగా వున్న కుర్చీని కొంచెం వెనక్కి లాక్కుంది సునంద. ఈ రాత్రి యీ చీకటి నా సొంతం అన్నట్టు చీకటితో కలిసిపోతూ కురుస్తోంది వర్షం.

"ఇంకా రాలేదేం" అనుకుంది చేతికున్న వాచీ చూసుకుంటూ సునంద. టైము పది దాటింది. ఎదురుగా డ్రస్సింగ్ టేబిల్ అద్దంలో కనిపిస్తున్న తన ప్రతిబింబాన్ని చూసి—

"అసలు నేనేనా " అనుకుంది.

అద్దంలో తనని తను చూసుకోటం తప్పని సరయిన బ్రతుకు. వేళ్ళగోళ్ళ దగ్గర్నుంచి, కత్తిరించిన కనుబొమ్మలవరకూ రంగులు పూసుకోవాలి. తీర్చి దిద్దుకోవాలి. క్రీములు, పౌడర్లు యిలా మేకప్, ముసుగే జీవితమై పోయింది.

పల్లెటూరు నుంచి నాలుగు మైళ్ళు నడచి రోజూ టౌనుకెళ్ళి హైస్కూల్లో చదివిన నాటి రూపం మగపిల్లలు ఎదేనా అంటే ఖస్సుమని లేచే ఆనాటి పొగరు గుర్తొచ్చినప్పుడు మరీ చిత్రంగా వుంటుంది సునందకి. జీవితం మనుషుల్ని వింతగా మార్చేస్తుంది అనిపిస్తుంది.

ఇంకోసారి టైము చూసుకుంది సునంద. పదిన్నర దగ్గర పడుతోంది. కొన్నాళ్ళక్రితం వరకూ యిలా ఎవరేనా వస్తారన్నా తను ఎక్కడికేనా వెళ్ళాలన్నా చాలా ఆతృతగా వుండేది. చాలా ఆశగా వుండేది. ఏరోజుకారోజే ఏ క్షణానికి ఆ క్షణమే తన భవిష్యత్తు తారాపధానికి జేరిపోతుందనిపించేది. ఆతృతకి వొళ్ళంతా సెగలొచ్చి బుగ్గలన్నీ ఎరుపెక్కి, శ్వాస తీవ్రమై తన కళ్ళు తన మనసు తనకే అర్థం కానట్టుండేది.

ఇప్పుడు ఇంచుమించు అలవాటయిపోయి నట్టే. ఇదివరకటి స్వచ్ఛంగా ఆశగా కనపడే లోకం యిప్పుడు చిత్రమైన రంగుల్లో రంగు రంగుల కన్నీళ్ళతో కన్పిస్తోంది.

ఏడాది క్రితంవరకూ ఎంతోయిష్టంగా గొప్పగా వుండే అబద్ధాలు యిప్పుడు యిబ్బందిగా వుంటున్నాయి. సినిమా జీవితంలో డబ్బు, పేరు, గ్లామరు వాటి తాలూకు గొప్ప లోకాన్ని నిత్యం కలలు కంటూ ఆశపడుతూ సిటీకి వచ్చింది. వచ్చిన ఏడాదికి మొదటి సారిగా తన పల్లెటూరికి వెళ్ళడం యిప్పటికీ గుర్తుంది సునందకి. నిజానికి ఆ వూర్లో పనేం లేదు. తల్లీ తండ్రీ లేని తనని పెంచిన మేనమామ కుటుంబం వుందని తప్ప ఆ వూరు తిరిగి వెళ్ళాల్సిన అవసరమూ లేదు. అయినా కావాలని పనిగట్టుకుని వెళ్ళింది. గొప్పగా కనబడాలని కార్లో వెళ్ళింది. రక రకాల పట్టు చీరలు, నాలుగు జతల కాలిజోళ్ళు, కళ్ళజోళ్ళు వేనిటీ బేగ్‌లు అందరి ముందూ ప్రదర్శించి తన గొప్పకి అదృష్టానికి ఆ వూరివారందరూ ఆశ్చర్యపోతుంటే మరింత గొప్పగా ఫోజు కొట్టి ఆనందపడింది.

"మా ఖర్మకి దరిద్రంలా దాపురించావు. నిన్ను కనిపారేసి సుఖంగా చచ్చారు. నీ అమ్మా బాబూ చాకిరీ చేయలేక నేనూ సంపాదించి పొయ్యలేక ఆయనా చస్తున్నాం ' అని అస్తమానం విసుక్కునే మేనత్త కూడా సినిమా కబుర్లు, ఆ అందమైన అబద్ధాలు ఆసక్తిగా వింటూంటే బలే గొప్పగా, తృప్తిగా అనిపించింది సునందకి.

జ్ఞానం తెలిసిం దగ్గర్నుంచి విసుక్కుని, చీదరించుకుని తప్పనిసరి దరిద్రంలా చూసిన మేనత్త కూడా తనని గొప్పగా చూస్తోంది యింకేం కావాలి అన్పించింది.

అంతే! ఆ వేడిలో జీవితం కొత్తవిలువల్తో కన్పించింది. ఎలాగయినా పైకి రావాలి. డబ్బు సంపాదించాలి. పేరు సంపాదించాలి. చిన్న

తనంలోనే తల్లీ, తండ్రీ కరువయిన నన్ను దరిద్రంగా అనామికంగా చూసిన వీళ్ళందరి కళ్ళు చెదిరేలా మతిపోయేలా సినీమాలోకాన్ని ఏలాలి, అదే ఆలోచన. అదే ఆరాటం. తనని నిర్లక్ష్యంచేసి నిరాదరించిన లోకంమీద మనుషుల మీద కసి: దానిముందు యిష్టం అయిష్టం శరీరం వీటిని వేటినీ లెక్కచెయ్యాలనిపించలేదు. సుడిగుండంలో చిక్కిన మనిషి తన ప్రమేయం ఏం లేనట్టే సినిమా జీవితం దేన్నీ లెక్కచెయ్యనివ్వలేదు సునందని.

ఊరు వెళ్ళొచ్చాక నాలుగేళ్ళ జీవితం గడిచినా తిరిగి తన వూరు వెళ్ళలేదు. సునందకి ఓరకంగా వెళ్ళాలనిపించలేదు. ఆనాడు ఎరువుగా ఊరికి తీసుకెళ్ళిన కారులాంటి కారు కొనుక్కున్నాక కనీసం ఒక సినిమాలోనేనా హీరోయిన్‌గా కనిపించాక తిరిగి వూరెళ్ళాలి అనుకుంది. ఈనాటికీ కోరికలు తీరలేదు. అప్పుడప్పుడూ దొరుకుతున్న చిన్న చిన్న వేషాలు ఎప్పటికేనా పైకి రాలేకపోతానా అన్న ఆశ యిదే యిప్పుడు సునందకి మిగిలినవి.

వర్షం తగ్గినట్టనిపిస్తే లేచి కిటికీ దగ్గర నిలబడి వెనక్కి తిరిగింది సునంద. ఆ వాతావరణం అంతా తనలాగే నిర్లిప్తంగా కనబడింది సునందకి.

మంచం మీద వొళ్ళెరక్కుండా నిద్రపోతున్న మూడేళ్ళ కూతురు రాధికని చూస్తూ వుంటే దగ్గరికెళ్ళి ముద్దు పెట్టుకోవాలనిపించింది. అడుగు ముందుకు వెయ్యబోతుంటే గుమ్మం ముందు కారాగిన చప్పుడయింది.

వీధి తలుపు తీసి చూసింది. తన కోసమే. రంగా కారు దిగుతున్నాడు.

"రడీయేనా వెళ్దామా" అన్నాడు గదిలో కొచ్చిన సునందవేపు చూస్తూ.

"రడీ" అన్నట్టు తలూపి ప్రక్కపోర్షన్ వాళ్ళ పనిమనిషి కోసం వెళ్ళింది సునంద. రాత్రుళ్ళు బైటికి వెళ్ళాల్సివస్తే వాళ్ళ పనిమనిషిని పిలిచి యింటిని, రాధికని అప్పజెప్పి బయలుదేరాలి.

పనిమనిషికి యిల్లు అప్పజెప్పి మరో అయిదు నిముషాలకి కారెక్కింది.

కొంతదూరం వెళ్ళాక . "కొత్త ప్రొడ్యూసర్ - అందులో కుర్రాడు, కొంచెం గట్టిగా యింప్రెస్ చేయగలిగితే మంచి ఛాన్సు దొరికే అవకాశం వుంది" అన్నాడు రంగా.

ఏం మాట్లాడకుండా తలూపింది సునంద. అలాంటి మాటలు కొత్తకాకపోయినా సునంద మనసులో ఎక్కడో చిన్నగా ఆశ వొళ్ళు విరుచుకుంది.

"నువ్విలా నీరసపడితే ఎలా. ఈ ఫీల్డులో ఎప్పుడే ఛాన్సు వస్తుందో చెప్పలేం. మనసులో ఏం వున్నా పైకి గలగల్లాడుతూ హుషారుగా వుండాలి" అన్నాడు రంగా తిరిగి.

ఆ మాటల్లోని ప్రోత్సాహం సునంద గ్రహించలేనిదేం కాదు. జూనియర్ ఆర్టిస్టు సప్లయిర్‌గా తనకున్న పరిచయాన్ని పలుకుబడిని ఉపయోగించి చాలాసార్లు సాయం చేశాడు సునందకి రంగా.

సరైన విలువలు, సరైన పద్ధతి లేని రంగంలో ఛాన్సు కోసం ఎప్పటికప్పుడు ఎదురు చూట్టమే దారి అన్నది ఎప్పుడో అర్థమైంది సునందకి.

కొత్త ప్రొడ్యూసర్ రావు వున్న హోటల్ చేరటానికి ఎంతోసేపు పట్టలేదు. అలాగే అతనితో తిరిగి అదే కార్లో వెనక్కి రావడానికి ఎంతోసేపు పట్టలేదు.

"సారీ, హోటల్‌లోనే వుండేవాళ్ళం. అనుకోకుండా ఎవరెవరో వచ్చారు. ఫ్రీగా మాట్లాడుకోవటానికి వుండదు. వాళ్ళు తెల్లారేదాకా వదిలే ఘటాలు కాదు. అందుకే మీ యింటికి రావాల్సి వచ్చింది" అన్నాడు రావు.

"ఫర్వాలేదండీ, దీనికి సారీ ఎందుకు. అసలు నేనే మిమ్మల్ని యింటికి పిలుచుకు వెళ్దామనుకున్నాను" అంది సునంద నవ్వుతూ.

అబద్ధపు మాటలు అబద్ధపు నవ్వులు. కారు యిల్లు చేరేలోపు అలాంటి నవ్వులు చాలా నవ్వింది. అలాంటి మాటలు చాలా చెప్పింది సునంద.

"అభిమానం, ట్రీట్‌మెంట్ ముఖ్యమండీ. అవి లేకపోతే పని చేయలేం. అందుకే ఆ

రెండు ప్రొడక్షన్స్ హీరోయిన్‌గా బుక్ చేస్తామన్నా ఒప్పుకోలేదు" అంది.

ఏ ఏ డైరెక్టర్ తనని ఎంతగా లైక్ చేస్తారో చెప్పింది. ఇల్లు చేరేవరకూ చెబుతూనే వుంది. అవకాశం వుంటే అలా తెల్లవార్లూ చెప్పే నేర్పు ఎప్పుడో అబ్బింది సునందకి.

సునంద, రావు గదిలోకి వచ్చాక సునందకి చెప్పి పనిమనిషి వెళ్ళిపోయింది. రావు వేపు చూస్తూ నవ్వుతూ కనురెప్పలు టపటపలాడిస్తూ మాట్లాడుతూన్న సునందకి తను మాట్లాడుతున్నట్టనిపించలేదు. ఏదో రికార్డు పెట్టి దానికి అలవాటుగా తను నటిస్తున్నట్టే వుంది.

కాసేపు చుట్టూ చూశాడు రావు. తర్వాత సునంద వేపు చూశాడు. సునందతో కలిసి తనూ నవ్వాడు. "ఇంత అందమైన నీకు మంచి భవి



ప్రగతికి సంకేతాలు...

పరిశ్రమలు పెరుగుతున్నాయి.

వాటితోపాటు పట్టణాలూ పెరుగుతున్నాయి.

పట్టణాలకు వలస వస్తున్న వారందరికీ నివాసాలు కల్పించి

పట్టణాలను అందంగా, క్రమబద్ధంగా,

నివాసయోగ్యంగా రూపొందించాలి.

నిజానికిది శ్రమతో కూడిన కార్యక్రమమే!

ఆంధ్రప్రదేశ్ లోని ప్రధాన పట్టణాలైన

హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడలలో

పట్టణాభివృద్ధి సంస్థలు పనిచేస్తున్నాయి.

ఈ పట్టణాలను సుందరంగా, ప్రణాళికాబద్ధంగా

తయారుచేయడానికి కృషిచేస్తున్నాయి.

సమగ్ర పట్టణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా

బృహత్తర పథకాలను, మండల పథకాలను

రూపొందిస్తున్నాయి.

పట్టణాలు ప్రగతికి సంకేతాలు!

భవిష్యత్తుకు బంగారు వాహనాలు!

డి. ఐ. పి. ఆర్. నెం: 52

ష్యత్తుంది" అన్నాడు. అని దగ్గరికి చేరి సునందను దగ్గిరికి తీసుకున్నాడు.

సునంద బెట్టు చెయ్యడం, వొద్దనడం, ఒప్పుకోవటం యివన్నీ జరుగుతుండగానే అదే మంచంమీద కొంచెం అడ్డుగా కనిపించింది నిద్రపోతున్న రాధిక రావుకు.

"ఈ పిల్లెవరూ " అన్నాడు అసహనంగా.

ఒళ్ళంతా ఒక్కసారి చల్లబడినట్టయింది సునందకి. మిగిలిన అబద్ధం బతుకులాగే అదీ అలవాటున్న అబద్ధమే అయినా గొంతు కొంచెం ఒణికింది.

"అక్కయ్య కూతురు . ఈ మధ్యే అక్కయ్య చచ్చిపోయింది. అందుకే తీసుకొచ్చి పెంచుతున్నాను " అంది. మరి ఆ రంగంలో గ్లామరు కోసం రేపెప్పుడో కలిసొస్తుందని ఆశించే భవిష్యత్తు కోసం తప్పని అబద్ధం.

'ఓహో అలాగా' అన్నట్టు తలూపాడు రావు. మళ్ళీ తిరిగి రావు రాధిక సంగతి అడక్కపోయినా మనసు - తన లోలోపలి తల్లి మనసు మరోసారి చచ్చిపోయినట్టు అనిపించింది సునందకి.

"ఏమిటో ఆలోచన" అన్నాడు రావు సునందవేపు చూస్తూ.

"అబ్బే ఏం లేదు" అంది సునంద తేరుకుని నవ్వుతూ.

"మన సినిమా సంగతేనా! నీ సంగతి రేపే డైరెక్టరుతో మాట్లాడతా సరేనా!" అన్నాడు.

'సరే' అన్నట్టు తలూపింది. తన ఆశలకి కోరికలకి పునాది ఏమిటో అవి తీరకపోవటానికి కారణాలేమిటో తెలియవు సునందకి. ఆ సమయంలో తెలుస్తున్నదొకటే. రావుని యింప్రెస్ చేయాలి. చేసి ఏదో సాధించాలి.

కొన్ని క్షణాల క్రితం చచ్చిపోయిన మనసుకి తిరిగి ఆశతో వూపిరి పోసే ప్రయత్నం చేస్తూ మరింతగా చీకటి వేపు, రావు వేపు జరిగింది సునంద. □

గతం-గీతం

ప్రశాంతమైన నిశాంతంలో ప్రాభాత శిశూదయం
ఎంత అందమైన దృశ్యం?!!
రాత్రి విరిగిన కలలపైనుండి, కరిగిన కామనలపైనుండి
నడిచి వస్తుం దీ ఉదయం;
అరుణ రక్త కాసారాలనుండి వెలుగుల ప్రాసాదంలోకి
వెయ్యికాళ్ళతో ప్రవేశిస్తుంది నా హృదయం;
నిన్న సాయంత్రం తెగిన కిరణాలు ఇవాళ మళ్ళీ
అతుక్కుంటాయి
రాత్రి త్రాణతో నిట్టూర్చిన జలజాలు నూరు రేకులుగా
వికసిస్తాయి:
సంధ్యకూ ఉషస్సుకూ మధ్య చీకటి కందకం
కందకంలో మొసళ్ళవలె రాత్రిలో పీడకలలు
చీకటిలో తడుములాడినంతసేపు ఏవో సందేహాలు
రాత్రి అంతగా భయపెట్టిన పీడకలలు ఇప్పు డేవీ?
రాత్రి నా ఆలోచనలవలె ఆకాశంలో ముసురుకున్న
నక్షత్రా లేవీ?


చందు సుబ్బారావు
మనవాడే!

మా బంధుకోటిలో ఎవరి పెళ్ళికన్నా వెళ్ళితే చాలు. పెళ్ళి పందిరంతా 'మన' వాళ్ళతో ఒకటే ఘాటు వాసన అగరొత్తులకంటే అధికంగా ముక్కులు బద్దలు కొడుతుంటుంది.

బెజవాడ వీరవిక్రమ కాలేజీ ప్రిన్సిపాల్ మనవాడే; సీలేరు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు గారు మనవాడే; హైదరాబాదు పోలీసు కమీషనర్‌గారు కూడా మనవారే

పందిట్లో మనవారుకాని మిత్రులెవరయినా వుంటారని కూడా గమనించకుండా మన తనం మ్రోగిపోతుంటుంది. నా కయితే చాలా సార్లు విసుగూ, అసహ్యమూ కలిగేవి.

నేను ఏ 'మన'తనానికి చెందినవాణ్నో స్పృహ కూడా లేనంత గొప్పవాణ్నని స్వయాన ప్రకటించుకోలేను కాని నా మట్టుకు నాకు 'మన' తనంమీద ఎప్పుడూ మక్కువ కలగలేదు.

అందమయిన అమ్మాయీ, ఆప్తుడయిన అబ్బాయీ నాకు మనవాళ్ళే అవ్వాలని అని పించలేదు. నేను మెచ్చిన రచయితా, నాకు నచ్చిన ఆర్టిస్టూ పరాయివాళ్ళే అయ్యారు. ఆపదలో రక్షించినవాడూ, ఆదరంగా ఉద్యోగ మిచ్చినవారూ నాకు చెందిన 'మన'వాళ్ళు కానే కాదు.

కారణాంతరాలు అంటూ వేరే లేవుకాని మా ఆవిడ మాత్రం మనవాళ్ళకే చెందటం కేవలం యాదృచ్ఛికం కాదు. 'మన'తనం నుంచి 'మగ'తనం కూడా బయటపడలేని మొట్టమొదటి 'రాజీ' అనబడే స్వార్ధానికి చెందిన విషయమే అనుకుంటాను. అందుచేత ఎక్కువగా 'మన'తనాన్ని గర్హిస్తూ ఉపన్యాసా లివ్వటానికి జంకుతుంటాను. పైగా మా ఆవిడ ట్రాన్స్‌ఫర్ విషయంలో ఇంకా లోతుగా ఇరుక్కుపోయాననే చెప్పాలి. ఇంట్లో మూల పారేసుండే మడ్డి కత్తికి పదునొచ్చింది. చుట్టాలొచ్చారని కోడిని కోసుకోటానికి మడ్డి కత్తి మళ్ళీ బయటకొచ్చింది.

* * *

మా ఆవిడ సదరు కమలకుమారి విజయ వాడ ప్రభుత్వ కళాశాలలో పని చేస్తుండేది. నేను వాల్తేరు యూనివర్శిటీలో వుంటూ నెలకో సారి బెజవాడ పోయొస్తుండేవాణ్ని. గోదావరి ఎక్స్‌ప్రెస్ పడింతర్వాత రెండు గంటల ప్రయాణకాలం తగ్గినమాట వాస్తవమేకాని నాగరికత పెరిగిన కొద్దీ మనసు కూడా వేగం పుంజుకుంటుందేమో బెజవాడ నెలకు రెండు సార్లు ప్రయాణమవుతుండేవాణ్ని. రైల్వే డిపార్టుమెంటువారి వార్షిక బడ్జెట్‌లో నష్టాన్ని చాలావరకు నేనొక్కణ్నే పూడుస్తున్నానేమో అనిపించేది.

ఎంత మనసు నిగ్రహించుకుని కూచుందా మనుకున్నా శలవు దొరికేసరికి పిల్లవాడికి బాగా లేదనో, పిల్లదానికి పుట్టినరోజనో కారణం కల్పించుకుని అంతరాత్మను సముదాయించుకుని ఆదరా బాదరా బెజవాడ చేరేవాణ్ణి. పెళ్ళయిన ఆరేడు ఏళ్ళనుంచీ ఇలా మాస శివరాత్రులు గడపటం ఆత్మవంచన, పరవంచన,పత్నివంచన అని తెలుసుకోటానికి అట్టే కాలం పట్టలేదు. పరుగెత్తుకుపోయి పిల్లల్నికూడా చూడకుండా అర్ధాంగితో ఏకాంతం కోరుకోవటం భౌతిక శాస్త్రీయమేమోకాని,జీవనశాస్త్రీయంగా కన్పించ లేదు.

'విశాఖపట్నం మార్పించటానికి ప్రయత్నిం చండీ' అని మా ఆవిడ ఎన్ని సార్లందో దాదాపు అన్ని వందల రూపాయలు ఖర్చు పెట్టాను హైదరాబాదు పోవటానికీ, రావటాని కీను

హైదరాబాదు ఆఫీసువారు కరుణించనే లేదు

మాకు పిల్లలు పుట్టారు. మా ఆవిడకు విసుగూ పుట్టింది.

నాకైతే బెజవాడకు 'గోదావరి వేసారుకదా, ఎక్కడుంటే ఏంలే' అనిపించింది. అంతగైనా కోనార్క్ ఎక్స్‌ప్రెస్, కోరమాండల్ ఎక్స్ ప్రెస్ వేసాం నాయనా వెధవది ట్రాన్స్‌ఫర్ అయితే ఎంత, కాకపోతే ఎంత అని రైల్వే వారు నా అత్త మామల్లా సముదాయించారు .

నా స్నేహితుడు బ్రహ్మం అయితే 'అయితే యాభై రూపాయలు పెట్టుకుని బెజవాడ

పోవాలేమిటోయ్, అయిదు రూపాయలు పట్టుకొని గాజువాక బస్సెక్కు. పాత పోస్టాఫీసు దగ్గర దిగితే రోజుకో వెరైటీ కూడాను ' అంటున్నాడు...

'నాన్నా, నాన్నా మమ్మల్నికూడా విశాఖ పట్నం తీసుకుపో' అంటున్నారు పిల్లలు పాపం ఊటీనో, సిమ్లానో అడగటం లేదు వాళ్ళు! నాన్న దగ్గరకొస్తా మంటున్నారంతే!

"మీ యిద్దరూ ఒక చోటుంటే చూడాలనుందిరా నాయనా" అంటూ అదేదో కాశీ విశ్వేశ్వరుణ్ణి చూసినంత పుణ్యాకార్యంలా మరీ మరీ కోరుకుంటున్నారు వృద్ధులైన తల్లి దండ్రులు.

బ్రహ్మాం కాక మిశతా మిత్రులు కూడా "ఈ మరం నిద్ర, సత్రం భోజనం ఎన్నాళ్ళోయ్, ఉద్యోగం మానేసి మీ ఆవిణ్ణి రమ్మను " అంటున్నారు పరిష్కారం బాగుంది కాని, అందులో ఉప్పూ, కారం తక్కువయినట్లుందేది. ఉద్యోగం మానేస్తే పరిష్కార మేమిటి—పిండాకూడు. 'For a few Coins' నానా గడ్డీ కరుస్తున్నారు ప్రజలు పెళ్ళాం ఓ వెయ్యి రూపాయలు సంపాదిస్తే వుండే సుఖవూ, సౌకర్యమూ యింట్లో కూచుని, ప్రక్కం టావిడ చీరలమీద ప్రతిరోజూ మనకు వుపన్యాసమిస్తుందంటే ఉంటుందా ! సంసారం కాదు సన్యాసం పుచ్చుకోవాలనిపించదూ

ఏమైనా, సకల చరాచర భౌతిక శక్తులూ, పంచభూతాలూ కూడా మా ఆవిడ విశాఖ పట్నం ట్రాన్స్ఫర్ కావటాన్ని కోరుకున్నాయి కాని జరిపించలేదు.

ఇహ ఒంటరి గదినీ, ఏకాంతాన్నీ, ఏదో పుస్తకాలనీ నమ్ముకుని సిగరెట్లతోనూ సినిమాలతోనూ కాపురం చెయ్యక తప్పదని తీర్మానించుకుని పోస్టల్ డిపార్ట్మెంటును పని రోజుల్లోనూ సౌత్ సెంట్రల్ రైల్వేవారిని శలవరోజుల్లోనూ అశ్రయిస్తూ బ్రతుకు తుండగా

* * *

ఒకానొక మనవాడిపెళ్ళిలో మా తోడల్లుడు శ్రీ శివరామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్, PWD, గుంటూరుగారు మళ్ళీ ఈ విషయం కదలేసారు.

"ఓస్ ఇంతేనా, చెప్పావుకావేమీ మూణ్ణమిషాల్లో పని పోనీ నాతో చెప్పక పోయినా కమలకుమారి వాళ్ళక్కతో చెప్పొచ్చుగా ఈపాటికి వాల్తేరులో ఇద్దరూ మరొక పిల్లను కూడా కనకపోయారా " అని జోకుతో సహా అభయం ప్రసాదించాడు.

"అబ్బే ఫామిలీ ప్లానింగ్ అయ్యిందండీ" అందామనుకున్నా కాని "ఆఁ. వేధవది తెలియకనా " అని వూరుకున్నాను

"ఇంకేం వచ్చే నెల మూడో తారీఖున బయలేరి గోదావరిలో రా నేను బెజవాడలో మీటవుతాను హైద్రాబాద్ పోదాం " అన్నాడు.

'పని అయిపోయినంత' ధీమాగా పలికాడు శివరామకృష్ణ. ఆయన ప్రతిభా వ్యుత్పత్తుల మీద ఇదివరలో చాలా కితాబులున్నాయి కాని, ఆయనది ఇంజనీరింగ్ ఫీల్డు మాది విద్యారంగం అవుతుందో లేదో అని వెరచాను. సరే ఆఖరి ప్రయత్నం క్రింద చేద్దామని సంకల్పించి "అలాగే అన్నయ్యగారూ " అన్నాను.

* * *

ఆ చెప్పిన మూడో తేదీకి ఇద్దరం హైద్రాబాద్ చేరాం "హోటల్లో దిగుదామండీ" అన్నా


శివరామకృష్ణ "ఎందుకూ మన మేనమామ అత్తగారి వియ్యంకుడి కొడు కిక్కడే హార్డ్వేర్ షాప్ పెట్టాడు పద" అని అతనింటికి తీసుకుపోయాడు.

అతనింట్లో బస చేసి, కాస్సేపయ్యాక ముగ్గురం పథకం ప్రకారం బయలు దేరాం

ముందు అసెంబ్లీకి పోయాం అక్కడ మన ఎమ్మెల్యే ఒకాయన్ని కలుసుకుని సంగతంతా వివరించాం (శివరామకృష్ణ వివరిం

జీడిపప్పు జన్మస్థలం బ్రెజిల్. అక్కడి "టుపీ" జాతివారు దీన్ని "అకాజూ" అని పిలిచేవారు. పోర్చుగీసు నావికులు మన దేశానికి వలస వచ్చినప్పుడు దీన్ని పట్టుకొచ్చారు. కేరళలోని కొచ్చిన్ వాసులు దీన్ని "పరంగి మాంగా" అంటారు. "పరంగి" అంటే పోర్చుగీసు వారు, "మాంగా" అంటే మామిడికాయ అని అర్థం. పోర్చుగీసువాళ్లు జీడి మామిడి కాయనుండి "కాష్యూ వైన్" తయారుచేశారు. "కాజూఫెనీ" అనబడే యీ "వైన్" ఇప్పటికీ గోవా బార్లలో దొరుకుతుంది॥

(వి)చిత్ర విజ్ఞానం



చాడు) ఆయన వెంటనే ఫోను పుచ్చుకుని ఉన్నత విద్యాశాఖ కార్యాలయంలో మూడవ సహాయ కార్యదర్శి అయిన ఐఏఎస్ ఆఫీసరు గారికి ఫోను చేసాడు.

ఆఫీసరుగారు "అర్జంటు పనిమీద మంత్రి గారితో వెళ్ళిపోతున్నాననీ ఈ పని ఎవర్ని కలుసుకుంటే చెప్పిన క్షణంలో అవుతుందో" ఆ మళయాళ మాంత్రిక రహస్యం చెప్పి ఫోను పెట్టేసారు. ఐఏఎస్ ఆఫీసర్లు కొంచెం టెక్కుగల ఘనమైనవాళ్ళు. మనవాళ్ళయినా వాళ్ళు కొంచెం తమవాళ్ళుగానే ఉండటం అలవాటు. ఆపాటి సూచనకే పొంగిపోయి, ఫోను పెట్టేసినా నాలుగు Thanks చెప్పి ఎమ్మెల్యే గారు మమ్మల్ని సూటిగా కార్యాలయానికి తీసుకుపోయి ఓ సూపరింటెండెంట్‌గారి కప్ప చెప్పారు. ఇదివరలో నే నాయనచుట్టూ చాలా సార్లు తిరిగాను. ఎన్నిసార్లు తిరిగినా కమల కుమారి అనే పేరు కాని, వాళ్ళాయన అనబడే ఓ జీవి కాని ఆయనకు గుర్తుండే వాళ్ళు కాదు

ఎమ్మెల్యేగారు చెవిలో ఓ మాట ఊది 'వెంటనే' వెళ్ళిపోయారు అసెంబ్లీ సెషన్సున్నాయని ।

ఆ మాట 'ఈటె'లా గుచ్చుకున్నట్లు వెంటనే మా ముగ్గురికీ కాఫీలు తెప్పించాడాయన నే నెవర్నో ఎక్కడుంటున్నానో వాకబుతీయనారంభించారు.

"ఔరా, దొంగ వెధవా " అనుకుని పైకి మర్యాదగా మాట్లాడాను. "ఓహో మనవాళ్ళింకా ఎవరెవరుంటారండీ యూనివర్సిటీలో " అంటూ యోగక్షేమా లడిగాడు. చెప్పాను ఆంధ్రదేశంలో మనతనం యొక్క ఘనతా, చరిత్రా, రాజకీయ సాంఘిక ప్రాముఖ్యతా శివరామకృష్ణ వివరించాడు. సూపర్నెంటుగారు చాలా సంతోషించాడు. ఫైళ్ళన్నీ తిరగేయించి, రాయవలసినవి రాసి, కొట్టేయవలసినవి తీసి 'నోట్' పుటప్ చేశాడు.

"వారం రోజుల్లో వస్తుంది మీ కెందుకు పొండి" అని సెలవిచ్చాడు. నా చెవుల్ని నమ్మలేకపోయాను — నా కష్టాలు గట్టెక్కాయి. నా సౌఖ్యం యింత కాలానికి పుంజుకుంది నా కోరిక నెరవేరింది

సుఖం సుఖం ఆనందం సంతోషం
. సరదా రోజా సంతోషం శివరామ
కృష్ణ పుణ్యం సూపర్నెంటుగారి ధర్మం
ఆఫీసరుగారి అనురాగం ఎమ్మెల్యేగారి దయ
మా చుట్టంగారి సహాయం ఏమైతేనేం
ఎలాగైతేనేం ఎందుకైతేనేం
నాకు వంటింటి తిండి పడకటింటి నిద్రా
పిల్లల చదువూ చల్లని కొంపా వెనుక

ఉప్పెన

సముద్రంలోని అలలు
ఉవ్వెత్తున ఎగిరి
అంబరాన్ని చుంబించాలని
కొండను ఢీకొని
విరిగిపోతున్నాయి!
తిరిగి సముద్రంలోనే
కలిసి పోతున్నాయి!!

* * *

సముద్రం అట్టడుగున మనిషి
అలలు వాని కనీనవసరాలు
అంబరం ధరలు
కొండ దళారీ

* * *

మరి సముద్రం పొంగితే ?!

—టి. గౌరీశంకర్.

బడే కాసులూ పొద్దుపోయే ఊసులూ . మీ అందరి పుణ్యాన వారందరి ధర్మాన—శివరామకృష్ణ సంకల్పాన అయ్యింది పనయ్యింది .

"మనవాళ్ళంటే అదీ పనికాకేం చేస్తుంది?" అన్నాడు శివరామకృష్ణ. "అందుకే మనవాళ్ళనో కంట కనిపెట్టుండాలి .." అన్నాడు నవ్వుతూ

నా కేడుపొచ్చింది నా ముఖంలో నెత్తురు పలచబడింది నా గుండెలో నిట్టూర్పు గడ్డ కట్టింది నా బుర్రలో తెలివి తెల్లపోయింది.

నేను పెంచి పోషించుకున్న కుక్కపిల్లలాంటి మేధస్సు చటుక్కుమని త్రెంచుకు పారిపోయింది.

మనవాళ్ళు మనవాళ్ళు మనవాడే .. మనవాడే! నే నెవర్ని? నా స్నేహితులెవరు? నాకు ప్రేమగా ఉత్తరాలు రాసే అహ్మద్, నన్ను నవ్వించి కవ్వించే శాస్త్రి నా ప్రియతమ, స్నేహితుడు వర్మ .నా తమ్ముడు కాని తమ్ముడు దిలీప్ నా ఆత్మీయుడు రవీ, నా స్నేహితురాళ్ళు సరోజా దేవీ, మేరీ జోసఫ్

వీళ్ళంతా ఎవరు ఏమైపోతున్నారు దూరమైపోతున్నారా దూరం చేసుకుంటున్నానా నన్ను నేనే మోసంచేసుకుంటున్నానా!

స్వార్థంలో కరిగి హిమాలయం కృంగిపోతుందా . లౌకిక సమాజం పేరిట కుళ్ళు కాలువలుగా ప్రవహించి అఖాతంలో కలిసి పోతున్నానా

పెద్ద మాటల గూర్చి పట్టింపుకాదు ఎవరో అంటారని భయమూ కాదు నా గుండెమీద చెయ్యి నాకు నిదర్శనం ఆ చెయ్యి వణుకుతూంది ఈ చెయ్యి వణుకుతూంది

* * *

ఆర్డర్సొచ్చాయి. మా ఆవిడ వాల్తేరు వచ్చింది బుట్టలో పాములా ఆలోచన చక్కగా నిద్రపోయింది. ఉదయం ఆరయ్యేసరికి చిక్కటి కాఫీ యిచ్చే మా ఆవిడ మొహం, తెల్లవార్లూ నేను చూసిన అందాన్ని మించి ఆహ్లాదంగా కన్పిస్తోంది. పిల్లలు చక్కగా కాన్వెంట్‌కు వెళుతున్నారు. ఒకే జీతంతో సంసారం గడుస్తోంది. కమలకుమారి చీరెలు, నగలు చిన్ని చిన్ని చిద్విలాసాలు మినహాయిస్తే కొద్దిగా డబ్బు 'సేవింగ్స్'లో వేస్తోంది నా ఆరోగ్యం కూడా బాగుంది

మా తోడల్లుణ్ణి తలుచుకుంటూండగా ఆయన దగ్గర్నుండే ఉత్తరం వచ్చింది.

"చిరంజీవి తమ్ముడు రావుకు ..

చి॥సౌ॥ కమలకుమారి ట్రాన్స్‌ఫర్ విషయంలో మనకు సహాయం చేసిన సూపరెంటెండెంట్ గారబ్బాయి యూనివర్సిటీలో సీటుకై వచ్చే నెల మూడవ తేదీన వచ్చుచున్నాడు 'మనవాడే' గనుక తగిన మర్యాదలు చేయటం ధర్మం . పని అగులాగున చూడవలసింది.

మీ అన్నయ్య,
శివరామకృష్ణ." □



ఆత్మహత్య

యర్రంశెట్టి సాయి

చిరంజీవి వంతెనమీద కొచ్చాడు.

నిర్మానుష్యంగా వుందక్కడ. బ్రిడ్జిమీద లైట్లుకూడా డిమ్మగా వెలుగుతున్నాయ్. టైము చూసుకున్నాడతను. సరిగ్గా అర్ధరాత్రి అయింది.

ఉండండి చలిగాలి రివ్వున వీచి వణుకు పుట్టిస్తోంది.

"ఓ రగ్గువుంటే బావుండు!" అనుకున్నాడు చిరంజీవి. వెచ్చగా, హాయిగా వుంటుంది.

అంతలోనే నవ్వు వచ్చిందతనికి.

ఇదేమిటి? నదిలోకి దూకి చావాలని వచ్చిన వాడికి రగ్గులమీద కోరికేమిటి మళ్ళీ?

వంతెనె మధ్యకొచ్చి నిలబడ్డాడతను. గోడ అంచుకెళ్ళి ఓసారి నదిలోకి తొంగిచూశాడు. నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది నది. నీళ్ళ ఒరవడి శబ్దం వుండుండి వినబడుతోంది.

మళ్ళీ వెనుకకు నడిచి ఎత్తుగావున్న సిమెంట్ దిమ్మమీద కూర్చున్నాడతను.

మరికొద్ది సేపట్లో చిరంజీవి అనే నిర్భాగ్యుడి కథకు ఫుల్‌స్టాప్ పెట్టేయ బోతున్నాడు తను.

లేపోతే ఏమిటి!

ఎంతకాలం భరించాలీ చాలీ చాలని జీవితం? ఎంతకాలం సహించాలీ దరిద్రం? ఒకరోజా, రెండు రోజులా? చిన్నప్పటినుంచీ ఇదే దరిద్రం వెంటాడుతోంటే ఎవరికి మాత్రం విరక్తిపుట్టదు? ఒకపూట తినీ, మరోపూట తినకా, కట్టుకోడానికి సరయిన బట్టల్లేకా, ఉదయం పదినుంచీ రాత్రి ఏడువరకూ గొడ్డు చాకిరిచేస్తూ-ఎందుకొచ్చిన బ్రతుకిది? ఆ తరువాతయినా విశ్రాంతి వుందా? కుక్కలను తీసుకుపోయే మున్సిపాలిటీ బండిలా, ఒకరిమీద ఒకరు నిలబడే ఆర్టీసీబస్‌లో రెండుమైళ్ళు చెమటతో స్నానంచేస్తూ ప్రయాణంచేసి, ఇంటికొస్తే-అహ్హహ్హా! అది ఇల్లా? తను చిన్నప్పుడు చూసిన గొడ్లపాకలు ఎంతో విశాలంగా, ఆరోగ్యకరంగా వుంటాయ్! అంతకంటె హీనమయిన ఆ ఒక్కగది కొంపలో ఎండవేడికీ, దానిగాలికీ, కాగిపోతూ రాత్రంతా గడిపి

ఛీ! అందుకే నిర్ణయించుకున్నాడు తను! ఈ జీవితం ఇవాళ అంతం కావాల్సిందే!

తన చచ్చినంత మాత్రాన కొంపలేం మునిగిపోవు. దేశమేం తల్లడిల్లిపోదు. పేపరు వాళ్లు మహా అయితే రెండులైన్లలో "ఫలానా వాడు నీళ్ళల్లో దూకి చచ్చాడావటాని" రాస్తారు.

"చిరంజీవి సూసయిడ్ చేసుకున్నాడట! అతని స్థానంలో ఇంకొకరిని భర్తీచేయాలి" అంటాడు తన మేనేజరు.

తన గదికి ఎదురుగ్గా పాకలో వుండే జానకి రెండురోజులు తన కిటికీవేపు చూసి విసుగొచ్చి, ఆ ఇంట్లో మరెవరయినా దిగితే వాడివేపు చూడటం మొదలు పెడుతుంది.

"వాడున్నా లేపోయినా ఒకటేలే! వాడు సంపాదించింది వాడికే చాలదు. మనకేనాడూ వాడి సహాయంలేదు" అంటాడు తన ముసలి తండ్రి.

తల్లి కాసేపేడ్చి ఊరుకుంటుంది.

అంతే! ఆ తరువాత చిరంజీవి అనేవాడు ఒకడున్నట్లు కూడా ఎవరికీ గుర్తుండదు.

అదే తనో ధనవంతుడయితే.

తన ఫోటో పేపర్లో పడుతుంది. జీవిత విశేషాలు ప్రచురింపబడతాయ్. ఎడిటోరియల్స్ రాస్తారు.

"అంతటి మేధావి పోవడం మన ఫాక్టరీకి తీరనినష్టం" అంటూ సంతాప సభ పెట్టేస్తాడు మేనేజరు.

తన గూడు కెదురుగ్గా వున్న జానకి నాల్రోజులపాటు అదృష్టం చేయిజారి పోయినందుకు విచారిస్తుంది.

"బాబూ! చిరంజీవీ! నిన్నెలా మర్చిపోము నాయనా! మా అందరి గుండెలూ ఎడారిచేసి వెళ్ళిపోయావా?" అంటూ విచారిస్తారు తల్లిదండ్రులు-న్యూస్‌పేపర్ ద్వారా'

నవ్వు వచ్చేసింది చిరంజీవికి.

అవును' ఇలాంటి కుక్కబ్రతుకు బ్రతకడం కంటె నిస్సందేహంగా చావడం వుత్తమం! వారం రోజులపాటు ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాడు తను.

అవునూ, తనెందుకింకా ఆలస్యం చేస్తున్నట్లు?


లేచి నిలబడ్డాడతను.

ఇంక ఆలస్యం అనవసరం! ఆలోచనలూ అనవసరమే! చాలామంది ఆఖరి క్షణాల్లో ఆలోచించి ఝామ్మని ఈలపాట పాడుతూ ఇంటికెళ్ళిపోయారట! అంచేత తను ఆలోచించకూడదు.

మళ్ళీ వంతెన గోడ దగ్గరకు నడిచాడు చిరంజీవి. కింద అంతా కటిక చీకటిగా వుంది. ఆ చీకట్లో ఎ రాయిమీదయినా పడితే? పచ్చడయి పోతాడు! ఒళ్ళు గగుర్పొడిచింది చిరంజీవికి.

ఛీ! ఏమిటీ పిచ్చి ఆలోచనలు? చచ్చేవాడు ఎలా ఛస్తేనేం?

"ఏయ్ ఎవరది?" దూరంగా కేక వినిపించింది.



ఖంగారుగా అటువేపు చూశాడు చిరంజీవి.

కాకీ బట్టలూ, నల్ల బూట్లూ—

చటుక్కున రెండడుగులు వెనక్కివేసి నిలబడ్డాడు చిరంజీవి.

పోలీసు త్వర త్వరగా అడుగులు వేసుకుంటూ చిరంజీవి దగ్గరకు చేరుకున్నాడు.

"ఎవర్నువ్వు?" అడిగాడు దబాయింపుగా.

"నా పేరు చిరంజీవండీ!"

"ఇక్కడేం జేస్తున్నావ్?"

"ఏమీ లేదండే! ఊరికే ఇలా నిలబడి ఆలోచిస్తున్నాను."

"ఆలోచిస్తున్నావా?"

"అవునండీ?"

"దేన్ని గురించి?"

చిరంజీవి తడబడ్డాడు.

"దేన్ని గురించి అంటే అదే ఫలానా అని ఏమీ లేదనుకోండి! జనరల్‌గా అన్ని విషయాలూ ఆలోచించేస్తున్నాను."

"అంటే?"

"అంటే అదేనండీ! మామూలుగా మన దేశం గురించీ, సైక్లోన్ల గురించీ, జపాన్‌లోని "కోషిబా" అనే ఓ అడవి తెగగురించీ."

"కోషిబా అనే అడవి తెగగురించా?"

"అవునండీ! ఆ తెగ జపాన్‌లో వుంది! వాళ్ళ పద్ధతులు చాలా తమాషాగా వుంటాయిలెండి! పెళ్ళి వుందనుకోండి! పెళ్ళిలో పెద్దలందరూ కలసి పెళ్ళికొడుకుని చావ గొట్టేస్తారు"

"అదేమిటి? ఎందుకలా? ఆ చుట్టుపక్కలెక్కడా పోలీస్‌స్టేషన్ లేదా?"

"ఉన్నా వాళ్ల లెక్కచేయర్లెండి! వాళ్ళ ప్రొసీజర్ అది! 'ఆచారాలు' అంటారు చూడండి! అవన్నమాట! వాటినెవరూ కాదనలేరు కదా!"

"అదేమిటి? ఆచారాలు అన్నీ ఏంచేసినా చూస్తూ ఊరుకొంటే ఇంక లా అండ్ ఆర్డర్ ఏదీ? వాళ్ళందర్నీ క్రిమినల్ కేస్ కింద బుక్ చేసి పారేసేవాడిని నేనక్కడ వున్నట్లయితే."

కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా గడచినయ్.

"నువ్వు ఆత్మహత్య చేసుకోడానికి రాలేదు కదా?" అసలువిషయం బయట పెట్టేశాడు కానిస్టేబుల్.

"ఛ ఛ! తప్పకదండీ! ఆత్మహత్య నేనెందుకు చేసుకుంటాను?"

"ఏమో! ఈమధ్య ఇదో ఫాషనయిపోయిందిలే! ప్రతి వెధవా ఆత్మహత్య చేసుకునేవాడే! తిండిలేకపోతే ఆత్మహత్య! పరీక్ష ఫెయిలయితే ఆత్మహత్య, ఇంట్లోవాళ్ళు గట్టిగా కూతలేస్తే ఆత్మహత్య, ప్రేమ బెసికితే ఆత్మహత్య, ఆఫీసరు సతాయిస్తే ఆత్మహత్య, ప్రమోషన్ దొరక్కపోతే ఆత్మహత్య, సినిమా టికెట్ దొరక్కపోతే ఆత్మహత్య, తన అభిమాన సినిమా నటుడు ఛస్తే ఆత్మహత్య, అభిమాన రాజకీయ నాయకుడు టపా కడితే వీడూ ఆ నాయకుడికి తోడు-ఛ ఛ! ఈ అడ్డమయిన ఆత్మహత్యలన్నీ చివరకుపడేది మా నెత్తిమీద! వాడెందుకు చచ్చాడూ? ఎట్లా చచ్చాడు? వాడే చచ్చాడా, ఇంకెవరివల్లనయినా చచ్చాడా?-ఇవన్నీ కనుక్కోలేక మేము ఛావాలి!"

"అవును! పాపం!" జాలిపడ్డాడు చిరంజీవి. "నిజంగా వాళ్ళందర్నీ షూట్ చేసినా పాపం లేదు!"

"కొంచెం కూడా లేదు?" వప్పుకున్నాడు కానిస్టేబుల్.

మరో నిమషం నిశ్శబ్దంగా గడిచింది.

"అయితే నువ్వు ఆత్మహత్య చేసుకోడానికి రాలేదంటావ్?"

"నూటికి నూరుపాళ్ళూ కరెక్టు!"

"ఈ అర్ధరాత్రి ఈ వంతెనమీదకి కేవలం ఆ అదేం అడవితెగ?"

"కోషిబా!"

"ఆ! 'కోషిబా'గురించి ఆలోచించడానికి వచ్చానంటావ్?"

"సరిగ్గా తెలుసుకున్నారు!"

"అయినా నాకేం నచ్చలేదు!"

"ఏమిటీ?" ఖంగారుగా అన్నాడు చిరంజీవి.

"అదే! ఆ కోషిబా తెగవాళ్ళు ఆ పెళ్ళికొడుకుని క్రిమినల్ ఎస్సాల్టు చేయడం!"

"నిజమే! నాకూ నచ్చలేదు! కానీ ఏం చేస్తాం? అది వాళ్ళ ఆచారం!"

"ఈ ఆచారాలు-అయ్‌మీన్, మూఢాచారాలు 'బాన్' చేయాలి!"

"తప్పకుండా!"

మరో రెండునిమషాలు 'కోషిబా' గురించి ఆలోచించాడు కానిస్టేబుల్.

ఆ విషయంలో తను చేయదగ్గదేమీ కనిపించలేదతనికి.

"సరే-నేను పోతున్నాను" అక్కడినుంచి ముందుకి నడిచాడతను.

"గుడ్‌నైట్ సర్!"

"గుడ్‌నైట్" అని రెండడుగులువేసి మళ్ళీ వెనక్కి వచ్చాడతను.

"ఇదిగో చూడు రాంబాబూ!"

"నా పేరు చిరంజీవండీ!"

"చూడు చిరంజీవీ-ఒకవేళ నీకు ఎప్పుడయినా ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తే ఈ వంతెన మీదనుంచి దూకి చేసుకోవద్దు? ఇక్కడికి ఓ మైలు దూరంలో ఇంకో బ్రిడ్జివుంది. అక్కడ చేసుకుంటే నాకేం అభ్యంతరంలేదు. ఎందుకనో తెలుసా?"

"తెలీదండీ!"

"ఆ బ్రిడ్జి మా స్టేషన్ లిమిట్స్‌లో లేదు. అంచేత మనకేమీ బాధ్యత వుండదు. సరేనా?"

"సరేనండీ!"

అతను వెళ్ళిపోయాడు.

చిరంజీవి అతను పూర్తిగా కనుమరుగయేంతవరకూ చూస్తూ అక్కడే నిలబడిపోయేడు.

ఇంక తను ఆలస్యం చేయగూడదు. చేస్తే ఇలాగే ఏదోక అంతరాయం తప్పదు. గోడ వేపు నడిచాడు చిరంజీవి.

"మాష్టారూ?" ఎవరో పరుగుతో వస్తున్న చప్పుడు.

వెనక్కి తిరిగి చూశాడు చిరంజీవి.

పక్కగా వున్న ఓ వ్యక్తి గాలిలో ఎగురుతున్నట్లు పరుగెడుతూ వచ్చాడక్కడికి.


అతని కాళ్ళు అరిగిపోయినట్లున్నాయ్.

గడ్డం పెరిగిపోయింది.

ప్రాణం కళ్ళల్లో వుంది.

"మీరు, ఆత్మహత్య చేసుకుంటున్నారా?"

(వి) చిత్ర విజ్ఞానం



ఇది గ్లైడర్ "గాలిపటం"! రైటు సోదర్లు దీన్ని 1902 లో ఎగురవేశారు. ఈ సాధనంతో వారు వైమానిక సిద్ధాంతాలను కనుగొన్నారు. 1903 లో ఆర్విల్ రైటు మొట్టమొదటిసారిగా తాను నిర్మించిన విమానంలో 12 సెకన్లపాటు, 10 అడుగుల ఎత్తులో, 120 అడుగుల దూరం ఎగిరాడు!!

ఒగరుస్తూ అడిగాడు తను.

"కాదు! సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను" చిరాగ్గా అన్నాడు చిరంజీవి.

అతను అర్థంకానట్లు మొఖం పెట్టాడు.

"లేకపోతే ఏమిటయ్యా! నా యిష్టం వచ్చినట్లు చేసుకుంటాను. మధ్యలో నీకెందుకు?" కోపంగా అన్నాడు చిరంజీవి.

ఆ వ్యక్తి కొంచెం జంకాడు.

"అదికాదండీ! ఒకవేళ మీరు ఆత్మహత్య చేసుకొనేటట్లయితే ..."

"పోలీసుల కప్ప జెప్పుతానంటావ్! అంతేనా?"

"రామ రామ! అంతపని నేనెందుకు చేస్తానండీ!"

"అయితే మరెందుకు ఆపుతున్నావ్‌నన్ను?"

"నేనెందు కాపుతానండీ! ఆ మాటకొస్తే మీరు ఆత్మహత్య చేసుకోవడమే నాకు కావలసింది!"

చిరంజీవికి అతనిమీద సదభిప్రాయం ఏర్పడింది.

"అంటే?"

"మీరు ఆత్మహత్య చేసుకోవడంకన్నా నేను కోరుకునేదింకేమీ లేదండీ! ఎటొచ్చీ చేసుకునేముందు నాకో చిన్న సహాయం చేస్తారేమోనని!"

"ఏమిటది?"

"మీరు మరోలా భావించికండి! మీరు వుంటున్న ఇంటి అడ్రస్ నా క్కావాలి! ఓ ఇల్లుకోసం వెతికి వెతికి వేసారిపోయానుసార్ ఈ అయిదేళ్ళనుంచీ! నా బాధ చూడలేక మా ఫ్రెండ్ ఒకడు సలహా ఇచ్చాడు, సాధారణంగా ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళు ఈ బ్రిడ్జి మీదనుంచే దూకి చస్తూంటారనీ, వాళ్ళను బ్రతిమాలుకుంటే వాళ్లు చావడంవల్ల ఖాళీ అయ్యే గదులు ఒకోసారి అద్దెకు లభిస్తాయ్ నీకూ! వాడికిలాగే మాంచి ఇల్లు దొరికిందిలెండి!

ఆరోజునుంచీ రాత్రుళ్ళు ఈ బ్రిడ్జీమీదే తిరుగుతున్నాను. నా దురదృష్టమేమిటోగాని పదిరోజులయిపోయినా సరయిన కేసే దొరకడంలేదు. అంతా ఇల్లూ వాకిలీలేసి సన్నా

సులే తగిలారు. ఎందుకో మిమ్మల్ని చూస్తూంటే తప్పక మీకో ఇల్లూ వాకిలీ వుంటుందని అనిపించింది. దయచేసి మీ అడ్రస్ చెప్పండిసార్! ఆ తరువాత నిరభ్యంతరంగా దూకేయండి! కావాలంటే దూకడంలో మీకు సహాయం చేస్తాను."

"సహాయమా?"

"అవున్సార్! మీకు ఇంత ఎత్తునుంచీ దూకడానికి ఒకవేళ బెరుగ్గావుంటే నేను బలంగా తోసివేస్తాను! నన్ను నమ్మండి!"

"ఇంతవరకూ ఇల్లులేకుండా ఎక్కడ వుంటున్నావ్ మరి?"

"ఫుట్‌పాత్‌లాంటి చోట!"

"మరి అక్కడినుంచీ మారడం ఎందుకూ?"

"నాకు రెండేళ్ళక్రితం పెళ్ళయింది. ఇన్నాళ్ళూ మా ఆవిడ వాళ్ళ ఊరిలోనే వుంది. మరో నెల లోపల ఆమెను కాపురానికి తీసుకు వెళ్ళకపోయేట్లయితే విడాకులిస్తానని ఈమధ్య వార్నింగిచ్చిందండీ! అందుకే ఇలా వీధిన పడ్డాను. మీవల్లనయినా నాకా ఇల్లు దొరికితే మీ పేరు చెప్పుకుని మీ ఇంట్లో సంసారం చేసుకుంటాను."

చిరంజీవికి అతన్నిచూస్తే జాలివేసింది. వెంటనే తన ఇంటి అడ్రస్ డయిరీలోనుంచీ చింపిన ఓ కాగితంపై రాసి అతనికిచ్చాడు.

"చూడు! ఇంటి అద్దె ఎనభయ్ రూపాయలు. ఒకే ఒక్కగది! నీళ్ళు అర్ధరాత్రి రెండుగంటలనుంచీ రెండున్నరవరకూ వస్తాయ్! బాత్‌రూమ్, పాయిఖానా ఎనిమిది కుటుంబాలకు కామన్. కరెంట్‌కి పది రూపాయలు-ఇవే ఆ ఇంటి వివరాలు."

"థాంక్యూసర్! చాలా థాంక్స్! నా కాపురం నిలబెట్టేరు."

"పరవాలేదు! వెళ్ళిరండి!"

అతను ఆనందంగా ఆనందబాష్పాలు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఇంక ఆలస్యం చేయ కూడదనుకుని మళ్ళీ గోడ దగ్గరకు నడిచాడు చిరంజీవి. కళ్ళు మూసుకుని దూకడానికి సిద్ధమయాడు.

"ఎవండోయ్! ఒక్కనిమషం ఆగండి!" దూరంనుంచీ వేగంగా పరుగెత్తుతూ వచ్చాడో యువకుడు.

చిరంజీవి అతని దగ్గరకు నడిచాడు.

"ఏంకావాలి మీకు?"

"చెప్తాను! ముందు మనం పరిచయం చేసుకుంటే బావుంటుంది. నాపేరు శ్రీరామ్. 1974 లో బి.కామ్ పాసయ్యాను. అప్పటి నుంచీ ఇప్పటివరకూ నూటఅరవైఎనిమిది ఇంటర్వ్యూల కెళ్ళాను. ఒక్కదాంట్లో కూడా సెలక్ట్ కాలేదు."

"అయితే, నన్నేం చేయమంటారు?"

"అలా కోప్పడకండి! ఇది నా గురించి పరిచయం! మరి మీ గురించి."

"ఇదిగో చూడండి! నేను మీ పరిచయ భాగ్యంకోసం కాదు ఇక్కడ కొచ్చింది!"


"అఫ్‌కోర్స్! నాకూ తెలుసనుకోండి! మీరు ఆత్మహత్య చేసుకోడానికి వచ్చి వుంటారు."

"అసలు విషయం."

"సరే మీకంత చిరాగ్గావుంటే అసలు విషయంలో కొచ్చేస్తాను. మీరెలాగూ చని పోతున్నారు. చనిపోయేముందు ఓ చిన్న పుణ్యం చేస్తే ఎకాఎకీన స్వర్గానికి వెళ్ళి పోతారు. నేను నాలుగేళ్ళనుంచీ వుద్యోగం కోసం తిరిగి తిరిగి ఫలితంలేకుండా పోయింది. ఎక్కడికెళ్ళినా రికమండేషన్లూ, నో వేకెన్సీ బోర్డులే! చివరకు పేపర్లో ఓ రోజు ఓ చని పోయినవాడి వుద్యోగంకోసం బోలెడుమంది నిరుద్యోగులు 'క్యూ' కట్టినవార్త చదివాను. నాకు బ్రహ్మాండమయిన అయిడియా వచ్చింది. ఈ నదిలో ఎలాగూ బోలెడుమంది బోలెడు కారణాలవల్ల ఆత్మహత్య చేసుకుంటూనే వుంటారు. వాళ్ళ వుద్యోగ వివరాలు తెలుసు కుంటే ఆ ఉద్యోగాలు దొరికే అవకాశం వుంటుంది కదా అని."

"అంటే చచ్చేవాడు ఛస్తే ఛావనీ-వాడి వుద్యోగం మాత్రం ముఖ్యమన్న మాట మీకు!" అక్కసుతో అడిగాడు చిరంజీవి.

"ఇందులో అనౌచిత్య మేముందండీ! మీ బ్రతుకెలాగూ బుగ్గయిపోతోంది. దాని ద్వారా



నా బ్రతుకు బావుచేసుకుంటే మీకుమాత్రం ఆనందంగా వుండదూ? నా తమ్ముడూ, చెల్లాయీ, మా నాన్నా, అమ్మా, అమ్మమ్మా- ఇంతమందికి మీ వుద్యోగం నాకు లభించడం ద్వారా తిండి పెడితే ఎంత పుణ్యం మీకు?"

"సరే సరే-నేనే ఆఫీస్‌లో పనిచేస్తున్నానో చెప్పమంటారు! అంతేనా?"

"అంతేకాదు! నేను మీవరుస తమ్ముడినని, మీ వుద్యోగం నాకిస్తే మీ కుటుంబాన్ని కొంతవరకూ నేను పోషించే బాధ్యత స్వీకరించగలననీ మీ ఆఫీసరుగారికో రికమండేషన్ లెటర్రాసి ఇవ్వండి!"

జేబులోనుంచి కాగితం పెన్నూ తీసియిస్తూ అన్నాడతను.

చిరంజీవి ఓ నిమషం ఆలోచించి అతను చెప్పినట్లే రాసి ఇచ్చేశాడు.

అతను వెళ్తూండగానే మరో యువకుడు పరుగుతో వచ్చాడక్కడికి.

"మీరు ఆత్మ హత్య చేసుకుంటున్నారాండీ?"

"అవును! నా ఇల్లు వుద్యోగం రెండూ ఎడ్వాన్స్ బుకింగ్ అయిపోయాయ్? ఇంకేం కావాలి మీకు?"

"అయ్యో! అదికాదండీ! నేను జర్నలిస్ట్‌ని. మాంచి సెన్సేషనల్ న్యూస్‌లు రాసినవాడికే ప్రమోషన్ అని మా ఎడిటర్ హఠాత్తుగా ఓ నిబంధన పెట్టాడు. దాంతో జర్నలిస్ట్‌లందరం రోడ్లవెంబడి పడ్డాం. నాకు ఓ బ్రహ్మాండమయిన అయిడియా వచ్చింది. ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళందరి జీవిత చరిత్రలూ సేకరించి ప్రచురిస్తే దానంత సెన్సేషనల్ ఇంకేమీ వుండదుకదా! అందుకని రోజూ ఈ బ్రిడ్జిదగ్గరే కాపలా కాస్తున్నాను. ఫరవాలేదులెండి! ఇప్పటికి ఆరు జీవిత చరిత్రలు దొరికాయ్. దయచేసి మీ జీవితచరిత్ర కూడా."

"అంటే నేను ఆత్మహత్య చేసుకోవడం పోస్టుపోన్ చేసుకుని మీకు జీవిత చరిత్ర రాసివ్వమంటారు!"

"నో నో నో-మీరు ఆత్మహత్య చేసుకోవడం షెడ్యూల్ ప్రకారం జరిగిపోవల్సిందే! నేనడిగేదది కాదు. మీకు డయిరీరాసే అలవాటుంటే మీ ఇంటికెళ్ళి అది తెచ్చుకుంటాను."

చిరంజీవికి నవ్వు వచ్చింది. ఓ నిమషం ఆలోచనలో పడ్డాడు.

"బాబ్బాబు? ఆలోచించకండి! మీ కాళ్ళు పట్టుకుంటాను. ప్రమోషన్ అంటే మాటలు కాదు. అరవైరూపాయలు జీతం పెరుగు

తుంది. అరవై రూపాయలంటే ఎంత పెద్దయో మీకు తెలీదేమో! నా జీవితమే మారిపోతుంది సార్!"

"అరవై రూపాయలకు జీవితం మారిపోతుందా?"

"మెల్లగా అంటారేమిటండీ! మా కుటుంబం మొత్తం రెండుపూటలా తిండి తినేందుకు వీలవుతుంది. అంతేకాదు. మా పెద్దాడిని స్కూల్లో చేర్పించి ఫీజు కట్టేందుకు సాధ్యమవుతుంది. మా ఆవిడ తన మెట్రిక్ పూర్తి చేయగలుగుతుంది. అది పూర్తయితే తనకో చిన్న వుద్యోగం దొరుకుతుంది. ఆ తరువాత మాకిక ఏ బాధలూ వుండవ్ హాయిగా, సుఖంగా, ప్రశాంతంగా" స్వర్గంలో తేలిపోతున్నట్లు మాట్లాడసాగాడతను.

"ఏయ్ మిష్టర్" పిలిచాడు చిరంజీవి.

"ఆ! చెప్పండి! "ఊహాలోకంనుంచి బయటపడుతూ అన్నాడు చిరంజీవి.

"ఇదిగో నా డయిరీ! ఇందులో నా జీవితం చాలావరకూ కనబడుతుంది. చాలా?"

అతను చిరంజీవి కాళ్ళమీద పడిపోయ్యాడు.

చిరంజీవి దూరంగా జరిగాడు.

"లేవండి! అదేమిటి?"

"నా కృతజ్ఞతసార్!" లేచి నిలబడుతూ అన్నాడతను.

"నేనంత గొప్పపనేమీ చేయలేదు. వెళ్ళిరండి!"

"థాంక్యూసర్-మా పేపర్లో మీ ఫోటో కూడావేసి కృతజ్ఞత తెలియజేసుకుంటాన్సార్."

వెళ్ళిపోయాడతను.

అతను వెళ్తూండగానే ఓకారు వేగంగావచ్చి ఆగిందక్కడ.

"ఏయ్ మిస్టర్." కార్లోంచి పిలిచాడో హతను.

"ఏమిటండీ!" భయంగా అడిగాడు చిరంజీవి.

"ఇలారా!"

చిరంజీవి కారు దగ్గరకు నడిచాడు.

"నువ్వు ఆత్మహత్య చేసుకోడానికి వచ్చావ్ కదూ?"

"అవును!"

కార్లో వాళ్ళందరూ మొఖామొఖాలు చూసుకున్నారు.

వెంటనే డోర్ తెరచుకుని ఇద్దరు కిందకు దిగారు.

"నీ పేరేమిటి?" అడిగాడొకతను. అతని ఖద్దరు బట్టలూ అవీ చూస్తూంటే ఓ పెద్ద నాయకుడిలా కనిపించాడు.

"చిరంజీవి అండీ!"

"నీది ఏ కానిస్టిట్యుయేన్సీ?"

చెప్పాడు చిరంజీవి.

"వెరీగుడ్! అయితే నన్ను గుర్తుపట్టలేదా?"

"లేదండీ!"

"క్రిందటి జనరలెలక్షన్లలో ఎమ్మెల్లేగా పోటీచేసి ఓడిపోయాను! నాపేరు భోలా శంకర్."

"అలాగా! నమస్కారమండి! బావున్నారా?"

"ఫరవాలేదు! ఇంతకూ నువ్వెందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నావ్?"

"ఒకటేమిటిసార్! లక్షకారణాలు! ఎటు చూచినా జీవితం అంధకారంగానే కనబడుతోంది! ఇలాంటి కాకిబ్రతుకు, అయ్‌మీన్ కుక్కబ్రతుకు బ్రతకడంకంటె చావడం మంచిదనిపించింది అంతే! వచ్చేశా నిక్కడికి."


"అవునోయ్! నాకూ ఎలక్షన్లో ఓడిపోయినప్పుడు అలాగే అనిపించింది. ఈ బ్రిడ్జిమీదకే వచ్చి రాత్రంతా గడిపాను! చివరకు నిర్ణయం మారిపోయిందనుకో! అది వేరేసంగతి! ఆత్మహత్య ఎందుకు చేసుకోవాలనిపించిందో తెలుసా? ఎలక్షన్లకోసం ఆస్తంతా ఖర్చుచేసి పారేశాను. అప్పులయిపోయినయ్. మరింకెలా బ్రతకడం! సరే అదంతా నీకెందుగ్గానీ-ఇప్పుడు నువ్వో సహాయం చేయాలి నాకు!"

"చెప్పండి! తప్పక చేస్తాను. మీకు తెలుసో తెలీకోగాని మొన్న ఎలక్షన్లో కూడా నా ఓటు మీకే వేశాను! మీ పార్టీ అంటే అంత అభిమానం నాకు!"

"నా ఓటే నన్నమాట! అయితే నాకింకా ఏ పేచీలేదు!" ఆనందంగా అన్నాడతను.

(వి) చిత్ర విజ్ఞానం

సినిమాల్లో మనం చూసే యింద్రజాల మహేంద్రజాలాలను, స్పెషల్ ఎఫెక్ట్స్ **(Special Effects)** అంటారు. వీటిని మొట్టమొదటిసారిగా (1896 లో) సినిమాల్లో ప్రవేశపెట్టింది-ఫ్రాన్సు దేశానికి సంబంధించిన జార్జెస్ మెలీస్ అనబడే కేమెరామాన్. ఇతడు అంతకు ముందు స్టేజిమీద యింద్రజాల ప్రదర్శనలిచ్చేవాడు.



“మీకేం కావాలో చెప్పండి. తప్పక చేస్తాను. ఆనందంగా చేస్తాను.”

మరింత అభిమానంతో అన్నాడు చిరంజీవి.

ఆ రాజకీయనాయకుడి కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. అతను త్రాగిన బ్రాందీ వాసన గుప్పుమంది.

ఛటుక్కున చిరంజీవిని కౌగలించుకుని భోరున ఏడ్చేశాడు.

“ఇదేనోయ్ నాకు సంతృప్తి. ఆ సంతా పోనీ, ఇంకా అప్పులవనీ. ఫరవాలేదు. కానీ నా తరఫుననున్న - ప్రజలు - నన్ను ఎంతగా ప్రేమిస్తున్నారో, నాకు ఏలాంటి సహాయం కావలసినా చేయడానికి ఎంత సంసిద్ధంగా వున్నారో, తల్చుకుంటే నా జీవితమంతా నాశనమయిపోయినా సరే ఫరవాలేదనిపిస్తుంది. ఈ ఒక్క రాజకీయం తప్పిస్తే ఇంతగా ప్రజాభిమానం పొందే ఫీల్డు మరేముందోయ్. సినిమా ఫీల్డుందంటే ఏ హీరోకయినా అభిమానులుండేది కొద్దికాలమే. ఆ తరువాత అంతా కొత్తహీరోవేపు పరుగెడతారు. కానీ రాజకీయం అలాక్కాదు. ఎంతకాలమయినా ప్రజాభిమానం అలాగే బూజుపట్టకుండా, ఉండిపోతోంది.”

“అవునండీ!” ఒప్పుకున్నాడు చిరంజీవి.

“ఇంతకూ ఇప్పుడు నువ్వు చేయవలసిన సహాయం ఏమిటో తెలుసా?”

“తెలీదండీ!”

“చాలా చిన్నవిషయమే ఇది. కానీ నీ ఈ సహాయంవల్ల నా భవిష్యత్తే మారిపోవచ్చు. నేను ఈ రాష్ట్రంలో పెద్ద పదవిని సంపాదించవచ్చు. ముఖ్యమంత్రినయినా నువ్వు ఆశ్చర్యపోనక్కర్లేదు. లేదా, కేంద్రంలో కూడా అడుగుపెట్టేందుకు అవకాశాలున్నాయ్.”

చిరంజీవి విస్మయంతో వింటున్నాడతని మాటలు. తనవల్ల అంత గొప్పపని జరుగుతుందా? ఓ ఛోటా రాజకీయనాయకుడిని ముఖ్యమంత్రిగా చేసేంత స్తోమతు తనకు వుందా? బ్రతికుండగా తనవల్ల ఎవరికీ ఏ సహాయమూ లేదు. కానీ తను చస్తే ఇంతమందికి ఇన్ని వుపకారాలు జరుగుతాయా? ఎవరో ఒకరు చావాలని ఇంతమంది రోజూ ప్రార్థనలు చేస్తున్నారా? దేముడా! 'బలి' అంటే ఇదేనా?

“నువ్వు ఓ కాగితంమీద నేను చెప్పినట్లు రాసివ్వాలి. అంతే. మిగతాదంతా మాజిక్ లాగా జరిపేస్తాను.”

“ఏం రాసివ్వమంటారండీ?”

"మరేంలేదు. ఓరోజు రాత్రి సినిమానుంచి నువ్వూ మీ ఆవిడా ఇంటికొస్తూంటే ఓ పోలీసు నిన్ను చూసి దొంగ అనుకుని పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ళి రాత్రంతా కొట్టారనీ, నీ భార్యను ఏంచేశారో తెలీదనీ-ఈ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాననీ రాసివ్వు! చాలు! నాసామిరంగా రేపు తెల్లారే సరికల్లా జనాన్ని పోగుజేసి రాష్ట్రమంతా పెద్ద ఎత్తున అల్లర్లు లేవదీసి ప్రభుత్వాన్ని స్తంభింప జేసేస్తాను."

"కానీ. నాకు పెళ్ళికాలేదుకదండీ ఇంక."

"ఫరవాలేదు! అదంతా మేము చూసుకుంటాం! పెళ్ళి ఇప్పుడే, ఇక్కడే జరుగుతుంది. ఏయ్-సుశీలను తీసుకురండ్రా!" కారు వేపు తిరిగి అరచాడతను.

పాతికేళ్ళ స్త్రీ కార్లోకుంచి దిగి అక్కడికొచ్చింది.

"ఇదిగో మంగళసూత్రం! కట్టేసెయ్! మేమంతా సాక్షులుగా వుంటాం!"

తొందరచేశాడు రాజకీయనాయకుడు.

చిరంజీ ఆశ్చర్యంనుంచి కోలుకోలేక పోతున్నాడు. తనకు ఎదురుగా అతి సమీపంగా నిలబడ్డ ఆ యువతివంక చూశాడు. ఆమె చిరంజీవిని చూసి చిన్నగా నవ్వింది.

చిరంజీవి హృదయంలో తుఫాను మొదలయింది.

ఇంత అందమయిన అమ్మాయి మెడలో తను తాళి కట్టబోతున్నాడా? కేవలం కొద్ది క్షణాలే అయినా ఈ దేవతకు భర్త స్థానం పొందటం ఎంత అదృష్టం!

"ఊ త్వరగా కానీ ." తొందరచేశారు వాళ్ళు.

చిరంజీవి ఆమె మెడలో తాళి కట్టేశాడు. కెమేరాలు క్లిక్ మన్నయ్.

"ఇదిగో కాగితం! త్వరగా రాసెయ్! పోలీస్‌పార్టీ బీటుకొచ్చే టైమవుతోంది!"

చిరంజీవి కాగితం తీసుకుని సిమెంట్ దిమ్మమీద కూర్చుని రాయడం ప్రారంభించాడు.

దూరంగా కారువస్తున్న శబ్దం అయింది.

"అది పోలీస్‌వాన్! సందేహంలేదు!" ఎవరో అన్నారు.

"అలాగయితే మనం ఇక్కడ వుండడం మంచిదికాదు! అలా బ్రిడ్జి చివరకెళ్ళి మళ్ళీ వద్దాం! ఏయ్ మీ ఇద్దరూ ఇక్కడే వుండండి!" త్వరత్వరగా కారు ఎక్కి స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు. పోలీస్‌వాన్ వచ్చి చిరంజీవి ఎదురుగ్గా ఆగింది.

"ఎవరుమీరు?" డోర్ తెరచుకుని దిగి అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"భార్యా భర్తలం!"

"ఇక్కడేం చేస్తున్నారు?"

"కాసేపు ప్రశాంతంగా గడుపుదామని వచ్చాం! ఇంట్లో ఇరుకు! జనం! మాట్లాడుకొనేందుకు కూడా వీల్లేని పరిస్తితి."

"చాల్చాల్లే గాని ఇంటికెళ్ళండి! ఈ బ్రిడ్జి కట్టింది భార్యా భర్తల విహారాలకోసం కాదు."

"వెళ్ళిపోతాం!"

వాన్ మరి కాస్త దూరం వెళ్ళి అక్కడ ఆగిపోయింది.

చిరంజీవి మళ్ళీ ఆ యువతి వంక చూశాడు.

"నీ పేరు సుశీల కదూ?"

"ఊ!"

"నిన్ను వీళ్ళెక్కడనుంచి తీసుకొచ్చారు?"

"నేను నాటకాలేస్తూంటాను! ఎక్కడా నాటకాల్లో అవకాశాలు దొరకకపోతే, ఆకలికి తాళలేకపోతే అప్పుడు శరీరాన్ని కుదువ పెడతాను!"

నిర్భయంగా చెప్పిందామె.

చిరంజీవి మనసంతా ఆమెమీద జాలితోను, ప్రేమతోనూ నిండిపోయింది.

"నీ కెవ్వరూలేరూ?"

"మా అమ్మవుంది. మా చెల్లెలువుంది! ఇప్పుడు నా భర్తగా మీరున్నారు" విరగబడి నవ్వుతూ అనేసి అంతలోనే హఠాత్తుగా ఏడ్చేయ సాగిందామె.

చిరంజీవి ఖంగారు పడిపోయాడు.

"సుశీలా! ఏమిటిది? ఏడుపెందుకు?" ఆమె భుజంమీద చేయివేసి తడుతూ అన్నాడు.

అతని కౌగిట్లోకి వరిగిపోయిందామె.

"మీకు తెలీదండీ! ఈ రోజుకోసం నేను ఎంతకాలంనుంచీ కలలు కంటున్నానో, ఎంతగా తపించిపోతున్నానో మీకు తెలీదు. ఎప్పటికయినా నన్ను ప్రేమించే మనిషి లభిస్తారనీ, నా మెడలో ఎవరయినా పుణ్యాత్ములు తాళికడతారనీ, వారి సరసన 'సంసార స్త్రీగా' నా జీవితం మలచుకోవాలనీ నేను వేయి కళ్ళతో ఎదుర్చూశాను. ఆ ఆశ అడుగంటిపోతున్న సమయంలో - కొద్దిక్షణాలకోసమే కావచ్చు. నా కోరిక తీరింది నేను వివాహితురాలినిప్పుడు! దేముడిచ్చిన వరమండీ ఇది! సామాన్యమయిన అదృష్టంకాదు!"

చిరంజీవి చలించిపోయాడు. ఆమెమీద ప్రేమ పొంగి పొరలింది.


"సుశీలా!" ఆమెను గాఢంగా కౌగలించుకుని తన్మయత్వం పొందాడు.

అతనికి కొత్త ఆశలు చిగురించాయ్. కొత్త కోరికలు మొలకెత్తాయ్.

అవును! తనకు వుద్యోగం వుంది, ఇల్లు వుంది, తనని ప్రేమించేవారున్నారు. ఇవేమీ లేకుండా ఎన్నో సంవత్సరాలనుంచీ జీవితం అలా ఆశలతోనే, కలలతోనే గడిపేస్తున్నవారు తనకు తారసపడ్డారు. తను ఆత్మహత్య చేసుకోబోతూంటే, తన ఇల్లుకోసం ఒకరు, తన వుద్యోగంకోసం ఒకరు-ఇలా ఇంకెంతమందో వారు అనుభవిస్తున్న బాధలు నిజానికి తన కంటె దారుణమయినవి. అయినా వారు చావాలనుకోవడంలేదు. భవిష్యత్తుమీద వారికి ఆశ వుంది. ఏదో సాధించగలమన్న నమ్మకం వుంది. వారందరూ అంత ఆత్మస్థైర్యంతో, నమ్మకంతో, ఆశతో జీవిస్తూన్నప్పుడు తనెందుకు భయపడాలి? ఎందుకు పిరికివాడిలా పారిపోవాలి?

"సుశీలా!" పిల్చాడు చిరంజీవి!

"ఏమిటండీ?" తలెత్తి అతనివంక చూస్తూ, కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది సుశీల!



"నువ్వు శాశ్వతంగా నా దానివిగా, నా భార్యగా వుంటావా?"

ఆమె ఆశ్చర్యపోయింది. "అదేమిటి? మీరు ఆత్మహత్య "

"అదంతా అదివరకటి విషయం సుశీలా! నేనిప్పుడు నా మనసు మార్చుకున్నాను. నీకు అంగీకారమయితే నాతోరా! మనం కొత్త జీవితం ప్రారంభిద్దాం!"

ఆమె చేయిపట్టుకుని ఆవేశంగా అన్నాడతను.

"ఇదంతా నిజంగా అంటున్నారా? నాకు నమ్మ బుద్ధికావటంలేదు" ఆశగా అడిగిందామె.

"పిచ్చి సుశీలా! చెప్పానుకదా! ఇప్పుడు నా జీవితం అర్థమే మారిపోయింది. పద, వాళ్ళు వచ్చేలోగానే మనం ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి."

ఇద్దరూ చేతులు పట్టుకుని బ్రిడ్జిమీద పరుగెత్త సాగారు.

ఇద్దరి కళ్ళనుంచీ వుండుండి ఓ కన్నీటి చుక్క రాలుతోంది. □

మహిళాజ్యోతి

ఇంగ్లండ్ దేశ చరిత్రలో తొలి మహిళా ప్రధాని మార్గరెట్ థాచర్

గ్రౌన్‌థామ్ ప్రాంతీయ రాజకీయాల్లో పాత్ర వహించి, కౌన్సిలర్, మేయర్ మొదలైన పదవుల నలంకరించిన ఒక సాధారణ వర్తకుని కుమార్తెగా యీమె అక్టోబరు 1925లో జన్మించారు.

గ్రాన్‌థామ్ గరల్స్ హైస్కూల్లోనూ, సోమర్‌విల్లి కళాశాలలోనూ, అక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోను అధ్యయనం చేశారు. రసాయన శాస్త్రంలో పట్టా (బి.యస్.సి.,) ఆక్స్‌ఫర్డ్ కళాశాలనుంచీ ఎం. ఎ. డిగ్రీ పొందారు.

ఆక్స్‌ఫర్డును విడిచాక ఒక పారిశ్రామిక సంస్థకు నాలుగు సంవత్సరాలపాటు రసాయన పరిశోధకురాలిగా పని చేశారు. అదే సమయంలో న్యాయశాస్త్రం కూడా అభ్యసించి, 1954లో లింకన్‌వారి ద్వారా కోర్టు ప్రవేశించారు. పన్నుల చట్టాన్ని గురించి ప్రత్యేకాధ్యయనం కొనసాగించారు.

జీవితంలో ఆమె రాణింపు -అండర్ గ్రాడ్యుయేట్‌గా వుండేప్పుడే ఆక్స్‌ఫర్డు యూనివర్సిటీ కన్‌సర్వేటివ్ ఏసోసియేషన్‌కి ప్రెసిడెంట్‌గా పనిచేశారు. పెండ్లికిముందు 1950, 51 లలో డార్ట్‌ఫర్డ్ నుంచీ పార్లమెంటు ఎన్నికలకు రెండుసార్లు పోటీచేశారు. వివాహం తరువాత 1959లో ఫించ్‌లీ ప్రదేశం నుంచీ హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎం.పి.గా ఎన్నికయ్యారు.

కన్సర్వేటివ్ పార్టీ ప్రతిపక్షమైన కాలంలో హౌస్ ఆఫ్ కామన్స్‌లో మిసెస్ థాచర్ ముఖ్య వ్యక్తుల్లో ఒకావిడ. 1966లో షాడో కాబినెట్‌లో నియమించబడ్డారు. ప్రతిపక్షంలో వున్నపుడావిడ, సాంఘిక సంక్షేమం, విద్య, ఆర్థిక వ్యవహారములు, గృహములు, శక్తి, ఇంధనము, రవాణా మొదలైన అనేక విషయాలపై శ్రద్ధ వహించేవారు. పెన్షన్ అండ్ నేషనల్ ఇన్సూరెన్స్ శాఖకు జాయింట్ సెక్రటరీగా ఆవిడ మొదటిసారిగా పార్లమెంటులో 1961 లో మంత్రిపదవిని గ్రైకొన్నారు. ఎడ్వర్డ్ హీత్ గవర్నమెంటు ఏర్పడినపుడు (జూన్ 70) విద్య, విజ్ఞాన శాస్త్ర శాఖలకు ఉపమంత్రీ, ప్రీవీకౌన్సిల్ అయ్యారు. 1974 ఫిబ్రవరి ఎన్నికల తరువాత కన్‌సర్వేటివ్స్ తరఫున వాతావరణలో సహాయకురాలిగానూ, డిసెంబర్ 74 లో ట్రెజరీలో ప్రతిపక్ష సభ్యురాలిగానూ పనిచేశారు.

ఫిబ్రవరి 1975 లో కన్‌సర్వేటివ్ పార్టీ నాయకురాలిగా ఎన్నుకొనబడ్డారు. ఆపై అనేక విదేశయాత్రలు కొనసాగించారు: ఇండియాకు 76 లో వచ్చారు.

వివాహ జీవితం: 1951 లో యీమె డెనిస్‌థాచర్‌ను వివాహమాడింది. ఈయన రెండవ ప్రపంచ యుద్ధంలో మేజరుగా చేశారు. తరువాత అనేక ఆయిల్ కంపెనీలకు డైరెక్టరుగా చేశారు. బర్మా ఆయిల్ కంపెనీ డైరెక్టరు పదవినుంచీ 76 లో రిటైరయ్యారు. వీరికి కవల సంతానం. కుమారుడు మార్క్-



(సి.ఎ), కెరోల్ అనబడే కుమార్తె.

ఇటీవలివరకూ అతి సహజంగా పరిగణించబడిన భారతీయుల బ్రిటన్ వలస అక్కడి ఆర్థికస్థితిగతుల దృష్ట్యా తగ్గింపబడసాగింది. పెరుగుతున్న నిరుద్యోగం, ధరలు, కార్మిక అశాంతి బ్రిటన్‌లో కూడా సంక్షోభం చెలరేపుతుండగా బ్రిటన్‌లోనికి వలసపై ఆంక్షలు పెరగసాగాయి. ఈ ఆంక్షలు వర్ణ, జాతి వివక్షతల కారణాన వివిధస్థాయిల్లో అమలుకావటం మొదలుకాగా పేరెన్నికగన్న బ్రిటన్ మహాసామ్రాజ్య పార్లమెంటరీ వ్యవస్థ గౌరవానికే ముప్పువాటిల్లింది. ఆ వ్యవస్థలో నివసిస్తున్న ఆసియన్ల సాంఘిక, ఆర్థికస్థితులూ, వారి భవిష్యత్తూ అగమ్యగోచరం కాసాగాయి.

మరిక కన్‌సర్వేటివ్ పార్టీ అధికారంలోకి వచ్చింది. వలస చట్టాల సవరణపేరిట ఆ పార్టీ అనేక ఎన్నికల వాగ్దానాలు చేసింది. ఇవీ, రాబోయే ఫలితాలూ నిరాశాజనకంగానే వున్నాయి. థాచర్ ప్రధాని పదవిలోకి వచ్చింది. ఆమె యీవిధంగా చెప్పారు: "అపారం కాని దేశ సంపదల దృష్ట్యా, దేశ శ్రేయస్సు దృష్ట్యా అనేక మార్పులు తీసుకొనిరాబడవలసివున్నాయి. వలస చట్టాలకు సంబంధించి మరింత తార్కికంగానూ, ఉపయోగకరంగానూ వ్యవహరించవలసిన అవసరం ఉంది. దేనికైనా ప్రజల సహకారం, వివక్షత, వివేచన అవసరంకదా."

ఫలితాలెలా వుండగలవో చూస్తాందాం.

FREE !! # తీరిన దాహం ఉచితం!!

కొన్ని సంవత్సరాల క్రిందట ఒక ఓడ యూరప్ దేశమునుండి దక్షిణ అమెరికా బయలుదేరింది. అనుకోని కొన్ని అవాంతరాలవల్ల ఆ ఓడ అనుకున్న సమయానికి గమ్యం చేరలేకపోయింది. నడి సముద్రంలో వుండగానే వారు తెచ్చుకున్న త్రాగే నీరు ఖర్చయిపోయింది. అలాగ ఒకటి రెండు రోజులు అతి కష్టంమీద గడిపి మూడవనాడు నీరు లేనియెడల చావు నిశ్చయం అని అందరూ అనుకొంటున్న సమయములో వారికి దూరాన ఒక ఓడ కనుపించింది. ఆ ఓడ సమీపమునకు రాగానే వారు త్రాగే నీటికోసం ఆ ఓడలోనివారిని అర్థించారు. కాని అవతలి ఓడలోని వారు తమ ఓడను ఆపలేదు. "మీ చుట్టూ నీళ్ళున్నాయి. అవి త్రాగండ"ని చెప్పి ముందుకు సాగిపోయారు. ఇంతలో ఓడలోని ఒక వ్యక్తి దాహముతో అలమటిస్తూ "నేనిక ఈ దాహాన్ని భరించలేను. ఉప్పు నీరయినా సరే త్రాగి మరణిస్తాన"ని ఆ సముద్రజలాన్ని గబగబా చేది నోట్లో పోసుకున్నాడు. ఆశ్చర్యం! ఆ నీళ్ళు ఉప్పు నీళ్ళు కావు, మంచినీళ్ళు. నడి సముద్రములో మంచినీరు ఎక్కడినుండి వచ్చినట్లు? ఆ ఓడలోనివారు అప్పుడు దక్షిణ అమెరికా దేశములో గొప్పదైన అమెజాన్ నది సాగరములో మిళితమైపోతున్న స్థలములో వున్నారు. భూభాగమునకు వేల మైళ్ళ దూరములోనున్న ఈ నిదీ జలమువలన ఆ సముద్రభాగపు జలాలు మధురంగా వున్నాయి.

జీవిత మార్గములో నీ ఆత్మీయ దాహంతీర్చ జీవజలపు ఊటగా క్రీస్తుప్రభు నీ చెంతనే వుండగా ఆత్మీయ దాహముతో అలమటిస్తావెందుకు? ఈ నీళ్ళు త్రాగువాడు ఎన్నడూ దప్పిగొనరు. ఆ నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటిబుగ్గగ వుండునని ప్రభు పలుకుచున్నాడు. ఆ ప్రభుగూర్చి తెలుసుకున్నారా!

ఉచితం !!


భగవత్స్వరూపుడైన ఏసుక్రీస్తు జీవితచరిత్ర, ఆయన బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా కావాలనుకుంటే మీ చిరునామా ఈరోజే తెల్పండి. పోస్టు ఖర్చులు మేమే భరించి మీకు ఉచితంగా పంపుతాము.

ఉచితం !!!

ఇదీ అడ్రస్:

ఎస్. జాన్ డేవిడ్
A.M.G.
పోస్టు బాక్సు-12
చిలకలూరిపేట
గుంటూరు జిల్లా.

Gospel Message
Inserted by A M.G



బొలారంనుంచి సికింద్రాబాద్‌కు వచ్చిన లోకల్ ట్రెయిన్ రద్దీగా వుంది. కూర్చునేందుకే కాదు. నించునేందుకుకూడా చోటులేదు.

"ఛీ. ఛీ. హైద్రాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఎప్పుడు బాగుపడుతుందో'' అన్నాడు స్వామినాథం చిరాకుగా.

నేను నవ్వి వూరుకున్నాను. ఎప్పుడూ తెల్ల బట్టలే వేసుకునే స్వామినాథం ఆ రోజు అప్పుడే మడతవిప్పిన తెల్లబట్టలు తొడుక్కున్నాడు. నలిగిపోతున్నాయి అవి.

"మొహంమీద నీళ్ళు చల్లండి"

—"పక్కకి తప్పుకోండి. గాలి ఆడనివ్వండి."

—"ఫిట్ అది. నీళ్ళు తాగించాలి." ఆకస్మాత్తుగా రకరకాల మాటలు వినబడ్డాయి కంగారుగా. అటు చూసాం కాని ఏమీ కనబడలేదు.

"ఏమిటి?" అడిగాడు స్వామినాథం తన పక్కన నించుని వున్న వ్యక్తిని.

తనకు తెలియదన్నట్టుగా తల అడ్డంగా

వూపాడతను.

"ఎవరికో హిస్టీరియా వచ్చినట్లుంది" ఇంకో వ్యక్తి చెప్పాడు స్వామినాధన్‌కి.

రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది కొన్ని క్షణాల్లో. అంతదాకా జైల్లో వుండి విడుదల లభించిన ఖైదీల్లాగా ఒక్కసారిగా ప్రయాణీకులంతా కంపార్ట్‌మెంట్ లోంచి బయటపడసాగారు గబగబా.

"పద" అన్నాను రైలు దిగి.

స్వామినాధం దిగలేదు. నిముషంలో కంపార్ట్‌మెంట్ ఖాళీ అయిపోయింది. అయినా లోపల ఏదో చేస్తున్నాడు. నాకు చిరాకేసింది. మా బస్సు బయలుదేరే టైం అయింది.

"త్వరగా వెళ్ళకపోతే బస్సులోకూడా సీట్ దొరకదు"అంటూ నేను మళ్ళీలోపలికివెళ్ళాను.

స్వామినాధం ఓ ఖాళీ సీట్‌మీద కూర్చుని వున్నాడు. అతని ప్రక్కన ఓ నలభై అయిదేళ్ళ వ్యక్తి సీటుకి చేరగిలబడి కూర్చుని వున్నాడు. అతని కళ్ళు మూసుకుని వున్నాయి. గుప్పిళ్ళు బిగించి వున్నాయి. నోట్లో నుంచి సన్నగా నురగ వస్తోంది.

స్వామినాధం నా వంక చూసాడు కొన్ని క్షణాలు. తర్వాత అతని కుడిచేతి గుప్పెటని బలవంతంగా తెరచి ఆ అరచేతిలో ఇనప తాళం చెవి ఒకటి వుంచాడు. నేను అవాక్కయిపోయి అలాగే చూస్తూ నిల్చున్నాను.

ఎంత సేపయిందో తెలియలేదు. దాదాపు అయిదు నిముషాల తర్వాతనుకుంటాను మూర్ఛ వచ్చిన అతను తేరుకున్నాడు. ఎంతో నిస్త్రాణగా వుంది అతనికి.

అప్పటికే స్వామినాధం తన జేబురుమాలతో అతని నోటిని శుభ్రంగా తుడిచాడు. అతను కళ్ళు విప్పి నీరసంగా చూసాడు స్వామినాధం వంక.

"ఇప్పుడు ఫర్వాలేదా?" అడిగాడు స్వామినాధం.

అతను తల వూపాడు.

"లేచి నడవగలరా?"

మళ్ళీ తలవూపి లేచాడు.

స్వామినాధం అతని కుడిచేతిలో వుంచిన తన తాళం చెవిని తీసుకున్నాడు. రుమాల కిటికీ లోంచి బయటకి పారేసి తనూ లేచాడు.

"థాంక్స్" అన్నాడతను రెండు చేతులూ జోడించి

ఆ నమస్కారం చేసిన విధంలోనే అతనికి స్వామినాధంమీద ఏర్పడ్డ కృతజ్ఞతా భావం కనపడింది అధికంగా.

"సార్. మీ టైం పాడుచేసాను" అన్నాడతను.

నా చేతి గడియారం వంక చూసుకున్నాను అప్పుడు.

ఆఫీసు కెళ్ళే మా బస్సు అప్పటికే వెళ్ళిపోయి వుంటుందనుకున్నాను.

ముగ్గురం ప్లాట్‌ఫారం మీదకు వచ్చాం. అతను నీళ్ళపంపువైపు వెళ్ళాడు మొహం కడుక్కోడానికి. మేం ఇద్దరం బయటకి నడిచాం స్వామినాధం చేతులు కడుక్కున్నాక.

"బస్సు వెళ్ళిపోయింది" అన్నాడు స్వామినాధం ఖాళీ బస్‌స్టాప్‌ని చూసి.

"ఇవాళ ఆఫీసుకు అరగంట లేటు."

ఆ తర్వాత మేం మౌనంగా వుండిపోయాం. ఆఫీస్‌కు చేరుకున్నాక ఆఫీసర్ గదిలోకి వెళ్ళాం అటెండెన్స్ రిజిష్టర్ అప్పటికే ఆయన గదిలోకి వెళ్ళటంవల్ల.

మేం సంతకాలు చేసాక అడిగాడు కోపంతో కూడిన అధికారంతో.

"ఆలస్య మయిందే?"

జరిగింది చెప్పాడు స్వామినాధం.

"ఇంకోసారి ఇలా లేటయితే నేను వూరుకోను. హెడ్ ఆఫీస్‌కి రిపోర్ట్ చేయాల్సి వుంటుంది. అయినా ఆయన మీకు బంధువా స్నేహితుడా?" కోపంగా కసిరాడు.

మారు మాట్లాడకుండా బయటకి వచ్చాం ఇద్దరం.

"సారీ గురూ. నావల్ల నీకుకూడా మాటొచ్చింది''అన్నాడు స్వామినాధం కొద్దిగా బాధగా.

"ఇట్సాల్‌రైట్" అన్నాను.

మర్నాడు వుదయం మళ్ళీ బొలారం రైల్వే స్టేషన్‌లో కలిసాం. స్వామినాగం నా చేతిలో ఓ కవరు వుంచి చెప్పాడు.

"నిన్న జరిగిన సంఘటన ఆధారంగా కథ రాసాను. చదువుతావా?"

తల వూపి కవరులోంచి స్టేపిల్ చేయబడ్డ ఎనిమిది అరఠావు కాగితాలని బయటకితీసాను.

రైలు వచ్చేలోగా పది నిముషాల్లో చదివేసాను ఆ కథని. అంతా జరిగింది జరిగినట్లుగానే రాసాడు స్వామినాథం. కాని చివరలో ఓ మార్పు చేసాడు. ఆఫీసర్ మమ్మల్ని కోప్పడ్డాడు గదా.

కాని కథలో మాత్రం అలా జరగదు. ఆలస్యానికి కారణం అడుగుతే జరిగింది చెప్తాడు స్వామినాథం. ఆఫీసర్ చాలా సంతోషపడతాడు అది విని. మిగతా స్టాఫ్‌ని పిలిచి జరిగింది చెప్తాడు. చాలామంది తమ అభినందనలు తెలియచేస్తారు స్వామినాథానికి.

"నీ కోరికని ఈ విధంగా కథద్వారా తీర్చుకుంటున్నావా?" అడిగాను నవ్వి.

"ఏం కోరిక?"

"ఆఫీసర్ మెచ్చుకోవడం."

"అది నా కోరిక కాదు. ఎలా వుంది కథ?"

"చాలా మామూలుగా వుంది."

"డల్‌గానా?"

"అది సరయిన పదం. ఏ ఆఫీసరూ నువు రాసిన కథలోలాగా ప్రవర్తించడు. అందులో మనం స్వయంగా అనుభవించాంగా."

నవ్వాడు.


"నిజమే. మన మొరేల్ ఎంత హీనస్థితికి దిగజారిందంటే, కథలో ఏ మనిషయినా మనం వూహించే విధంగా కాక—లేదా మనం ప్రవర్తించే రీతిగా కాక — ఏమాత్రం వున్నతంగా ప్రవర్తించినా ఆ కథ 'అసహజం బావుండలేదు' అంటాం. ఆఫీసర్ ఎలా ప్రవర్తించాడని కాదు. ఎలా ప్రవర్తించాలి అని ఈ కథలో రాసాను."

స్వామినాథం మాటలు గురించి ఆలోచిస్తుండగా నన్ను ప్రశ్నించాడు.

"చిన్నప్పుడు 'గుడ్ సమారిటన్' పాఠం చదువుకోలేదా? మనకా పాఠం నేర్పడంలోని వుద్దేశం ఏమిటి?"

రైలు రావడంతో నేను బదుల చెప్పకుండా స్వామినాథం చెయ్యి పట్టుకుని అటువైపు నడిచాను. □

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారం ఆగస్టు '79

అడ్డం

1. దక్షిణాదిని కుమారి.
3. ఆకె.
5. గర్భగుడి వుండేది.
7. కొందరికి కఠినం, కొందరికి కులాసా.
9. డైరెక్షన్.
10. మంచి యోధుడా (తలకిందులు)
12. ఉపయోగించి.
13. మొదటి వేల్పు వయస్సు.
15. గృహాలు.
16. విద్య ఒక వేదం.
17. ప్రాణహానికి పెట్టింది పేరు.
18. ఉదకమండలం.
20. భూమి మన్నింపు.
22. సంశయం.
23. ఒక ప్రేమికుడు.
25. ఒకడు, ఇంకొకడు కలిసి విష్ణువాహనం
27. మాటి మాటికి.

29. విరాజితం వృత్తం.
31. మచ్చ చెరగదు.
32. అగుః ఖలునికి వెల్లవిషం.

నిలువు

1. భాండము.
2. అకారంతో పాపనాశనంః
3. డిపెక్ట్ వులు తీసేది.
4. విద్యుచ్ఛక్తి కొలమానాలు.
5. వారం సెలవు 19.
6. పాత్ర.
7. రాజకీయ నాయకుని ఇంటిపేరు.
8. దయచెయ్యండి (పైటికికాదు లోనికి)
11. భయంతోనే ఇది.
14. సూర్యుడుంటే ఇదెందుకుః
15. జీవితంలో తప్పనిది.
18. కొందరి వుపన్యాసాలు.
19. ఒక పగలు, ఒక రాత్రి.
21. వజ్రాలు.
22. మెరుపు.
23. అరిషడ్వర్గాలలోనిది.
24. తండుల కణం.
26. జబ్బు మరు జన్మలోనే.
28. ఇల్లు.
30. చెవినిడి.

జూలై పదబంధ ప్రహేళికకు సమాధానం:

అడ్డం: 1. లాతి, 3. తజ, 5. కావాలని, 7. కలరూపు, 9. ముద్ర, 10. శబరి, 12. రువ్వు, 13. వంద, 15. దగా, 16. శశి, 17. మాస, 18. గమి, 20. రాగ, 22. ఈల, 23. కడప, 25. డకా, 27. నెగడెను, 29. విలాసాలు, 31. లక్క, 32. గని.

నిలువు: 1. లావాద్రవం, 2. తిల, 3. తల, 4. జరూరుగా, 5. కాము, 6. నిశ 7. కరి, 8. పువ్వు, 11. బస, 14. దశమి, 15. దసరా, 18. గలగల, 19. ప్రౌఢ, 21. గడసాని, 22. ఈనె, 23. కను, 24. ఏవి, 26. కాలు, 28. డెక్క, 30. లాగా.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి జూలై 27 వ తేదీలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

గతసంచిక పదబంధ ప్రహేళిక విజేతలు:

1. ఎ. సూర్యనారాయణ—ఇచ్ఛాపురం. 2. టి. సుధాదేవి—హైదరాబాదు. 3. వి. గోపాలకృష్ణ—మద్రాసు. 4. పి. ఎస్. శర్మ—సునాబేడా. 5. కె. వెంకటరావు—విశాఖపట్నం. వీరందరికీ బహుమతి సొమ్ము పంచి పంపిస్తున్నాము.

సినిమా

కోతలరాయుడు

సినిమా పేరే చిత్రంగావుంది. 'కోతల రాయుడు'. శ్రీ చరిత చిత్ర పతాకంపై నిర్మించబడుతున్న ఈ చిత్రం షూటింగ్ జూన్ 1న ప్రారంభమైంది, హైదరాబాద్‌లో. జూన్ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. యువ నటుడు చిరంజీవి; విలక్షణమైన వ్యక్తిత్వం గల (నిజానికి యాంటీ హీరో లక్షణాలు గల) పాత్రలో కథానాయకుడుగా నటిస్తున్నాడీ చిత్రంలో. ఎప్పుడూ అబద్ధాలాడుతూ, అల్లరి జీవితం గడిపేసే ఈ కథానాయకుడికి ఇద్దరు అన్నలు. ఆ పాత్రలలో గిరిబాబు, చక్రపాణి నటిస్తున్నారు. వదినలుగా కె. విజయ శైలజ నటిస్తున్నారు. తల్లి దండ్రులుగా హేమ సుందర్, నిర్మల నటిస్తున్నారు. మాధవి కథా నాయిక పాత్ర పోషిస్తోంది. ఇంకా సారథి, మంజుభార్గవి కూడా నటిస్తున్నారు ఈ చిత్రంలో. దర్శకత్వం కె. వాసు. నిర్మాత: తమ్మారెడ్డి వి. కె.

'చెయ్యెత్తి జైకొట్టు'లో కృష్ణంరాజు, గీత



సంభాషణలు: సత్యానంద్, సంగీతం: చక్రవర్తి, పాటలు: సి. నారాయణరెడ్డి, జలాది, చక్రవర్తి, కెమెరా: ఆర్. రామా రావు నిర్వహిస్తున్నారీ చిత్రానికి.


'సూపర్ మేన్'

యూనియన్ ఫిలింస్ సమర్పణలో లక్ష్మి విష్ణు ప్రొడక్షన్స్ బేనర్ క్రింద-యిదివరకు ఏ చిత్రంలోనూ తిలకించని పాశ్చాత్యదేశాల సౌందర్య చిత్రీకరణతో స్పెషల్ ఎఫెక్ట్స ప్రత్యేకాకర్షణలతో, శ్రావ్యమైన పాటల సౌరభంతో భారీ యెత్తున రూపొందనున్న ఈస్ట్మన్ కలర్ చిత్రం 'సూపర్ మేన్'.

'శ్రీ ఆంజనేయా-ప్రసన్నాంజనేయా
శ్రీరామ పదపద్మ సేవా ప్రమేయా
మాం పాహి పాహి - మాం పాహి పాహి' అనే ఆత్రేయ భక్తిరస గీతాన్ని పి. సుశీల గానం చేయగా రికార్డుచేయటం జరిగింది. పాటను చిరు ప్రాయంలో వున్న సూపర్ మేన్ పై చిత్రీకరిస్తారు

'మబ్బుల్లో చంద్రమ్మా-చంద్రమ్మా-
చంద్రమ్మా
మెలికలు తిరిగే మెరుపమ్మా
మెరుపుతో ఉరుముకు వెళ్ళమ్మా
బుల్లెమ్మా-బుడతమ్మా' అని, ఆత్రేయ రచించిన శృంగార యుగళ గీతాన్ని యస్. పి. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల పాడారు. ఈ డ్యూయెట్ పాటను సూపర్ మేన్ తన ప్రియురాలిని ఆకాశ మార్గాన ఎత్తుకెళ్ళి గాలిలో మబ్బుల్లో విహరిస్తూ ఆనందపారవశ్యమై పాడుకునేలా ఫారన్

'నరుడా ఏమి నీ కోరిక'లో నాగేశ్వరరావు, జయలలిత





'బొమ్మల కొలువు'లో కవిత, చంద్రమోహన్

ప్రకృతి సౌందర్య ప్రాంతాల్లో చిత్రీకరింపనున్నారు.

వి. మధుసూదనరావు దర్శకత్వంలో జనాకర్షణీయంగా తయారుకానున్న ఈ సంచలన చిత్రంలో ఎన్. టి రామారావు, జయప్రద ప్రధాన పాత్రలు నిర్వహిస్తారు. సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య మున్నగు తారలు పాల్గొంటున్న ఈ చిత్రానికి కథ ఆర్. కె. ధర్మరాజు, మాటలు - పాటలు: ఆచార్య ఆత్రేయ, సంగీతం: చక్రవర్తి, కెమెరా: మార్కస్ బార్ట్లే, కళ: కృష్ణారావు, స్క్రీన్‌ప్లే - దర్శకత్వం: వి. మధుసూదనరావు, నిర్మాత: ఆర్. గోపాల్.

'మన ఊరి మారుతి'

ప్రముఖ ఛాయా దర్శకుడు శ్రీ పి. దేవరాజ్ సమర్పించు శ్రీ చేతనా చిత్ర వారి వర్ణ చిత్రం 'మన ఊరి మారుతి'.

ఒక రోజున పల్లె ప్రజలు ఆనందంగా వన భోజనం చేస్తున్న సందర్భంలో కథానాయకురాలి (ప్రభ) నేస్తం మారుతి (సావిత్రి నామధేయం గల కోతి) హఠాత్తుగా అరుస్తూ వెళ్ళి పాయసం పాత్రను నేలపాలు చేసింది. దాంతో అందరికీ దానిపై ఆగ్రహావేశం కలిగింది. మరు క్షణంలో అందులో చచ్చిపడివున్న బల్లిని మారుతి చూపగానే విస్తుపోయారు. అందరి ప్రాణాలను తృటిలో కాపాడిన ఆ మారుతిని తమపాలిట దైవంగా తలచి-

'కోతంటే కోతిగాదురా నాయనా
మామూలు కోతిగాదురా - మా మంచి
దేవుడు
మన ఊరి మారుతి-రామన్న బంటైన
హనుమన్న సంతతీ

జ్యోతి

మా ఊరి మారుతమ్మా - మా ఊరి దేవుడమ్మా ....' అంటూ ఆ కోతిని కొలచి భక్తిగా పాడుతూ ఊరేగించారు పుర ప్రజలు. హృదయాన్ని హత్తుకొనే ఈ సన్నివేశానికి శ్రీ కొసరాజు పై పాటను ప్రజాదరణ పొందేలా వ్రాశారు. చిత్రంలో

'ముల్లు - పువ్వు'లో రజనీకాంత్





'కొతలరాయుడు'లో చిరంజీవి, మాధవి

నటిస్తున్న నటీనటు లందరితోపాటూ గ్రామ ప్రజలందరూ కూడా ఈ సన్నివేశ చిత్రీకరణలో పాల్గొన్నారు. మురళీ మోహన్, ప్రభ నాయకీ నాయకులుగా నటిస్తున్న ఈ చిత్రంలో పి. ఎల్. నారాయణ, జి. యస్. ఆర్. మూర్తి, కె. కె. శర్మ, రాళ్లపల్లి, మిఠాయి చిట్టి, రాధా కుమారి, నూతన్ లక్ష్మి మున్నగు నటీనటు లందరూ నటిస్తున్నారు. నూతన్ ప్రసాద్ ఈ చిత్రంలో అతిథి నటుడుగా పాల్గొంటున్నారు.

శేఖర్ స్క్రీన్‌ప్లే - దర్శకత్వం నిర్వహిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: జి. శ్రీనివాసరావు, బంగారు వీరభద్రం, కథ-మాటలు: పేరాల, పాటలు: కొసరాజు, గోపి, సంగీతం: సత్యం, కెమెరా: పి. దేవరాజ్, కళ: లీలాకృష్ణ, కూర్పు: మోహన్, సహకార దర్శకత్వం: యం. పి. ఆంజనేయులు.

'పరోపకారి పాపన్న'

అద్దమంటి మనసున్న చంద్రి, అమె పావలాంటి పాపన్న పచ్చని చేలు పంట పొలాలు బావిగట్లు కోనేటి అలలు ఏటి మలుపులు పిల్లగాలి సోనల మధ్య ఆడి పాడిన రెండు అమాయక హృదయాలు.

చంద్రి చురుకైనది, తెలివైనది, తీయనైన మనసున్నది. పాపన్న పరోపకారి. పల్లెపడుచుల అమాయకత్వానికి ఆటపట్టు అయినవాడు. ఆ రెండు గుండెలు చేసే అల్లరిని పాటగా పాడుకోసాగారు.

న్నారు. ఆర్ట్ అండ్ దర్శకత్వం: వి. కృష్ణమూర్తి.

జాతర

శ్రీ చెరుకూరి జనార్ధనరావు సమర్పణలో రూపొందించబడుతున్న 'జాతర' వర్ణ చిత్రం షూటింగ్ మే ఇరవై ఒకటిన ప్రారంభమై ఒకే షెడ్యూల్‌లో కొనసీమ ప్రాంతంలో సహజ వాతావరణంలో చిత్రీకరణ పూర్తిచేయబడుతుందని నిర్మాత ఆర్. యస్. రామరాజు తెలియజేశారు.


శ్రీధర్, చిరంజీవి, జయలక్ష్మి, లీలావతి, నాగభూషణం, పి. యల్. నారాయణ పాల్గొంటున్న యీ చిత్రంలో ఒక నూతన నటిని పరిచయం చేయాలని సంకల్పించారు. సంభాషణలు; యం. జీ. రామారావు, ఛాయ: ఉదయరాజ్, కళ; భాస్కరరాజు, నృత్యాలు: శివసుబ్రహ్మణ్యరాజు, కూర్పు: వసంతకుమార్‌రాజు.


కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ధవళ సత్యం నిర్వహిస్తున్నారు.

బొమ్మలకొలువు

తెలుగు సంస్కృతిలోను, తెలుగు సంప్రదాయంలోను ఒక అందమైన విభాగం బొమ్మలకొలువు. తెలుగు జాతి జీవనం యీ బొమ్మల కొలువులో అత్యంత మధురంగా పెనవేసుకుపోయి వున్నది. అంతటి ప్రాముఖ్యత వహించిన 'బొమ్మల కొలువు'ను సర్వాంగ సుందరంగా నవదివ్య రమణీయంగా తీర్చి దిద్దటం జరిగింది. అన్నిహంగులతో శరవేగాన షూటింగులు జరుపుకుంటున్న రంగుల చిత్రం 'బొమ్మలకొలువు'. అగ్రశ్రేణి సాంకేతిక నిపుణుల సారథ్యంలో రూపొందుతున్న "బొమ్మల కొలువు" చిత్రానికి కథ: ప్రముఖ

తెలుగు కల్చరల్ వెల్‌ఫేర్ అసోసియేషన్ (పెరంబూరు రైల్వే వర్క్‌షాప్) వారి వేడుకల సందర్భంగా ఉపన్యసిస్తున్న సినీనటుడు మురళీమోహన్





'నిమజ్జనం' చిత్రానికి కేంద్రప్రభుత్వ అవార్డు గెలిచిపెట్టిన దర్శకుడు బి. ఎస్. నారాయణను కళాసాగర్ సన్మానించింది. మనసత్యం, రావుగోపాలరావు, బి. ఎస్. నారాయణ దంపతులు, కళాసాగర్ అధ్యక్షులు డా॥ ముద్దుకృష్ణారెడ్డి చిత్రంలో ఉన్నారు.

బొంబాయి కథకులు కె. ఎ. అబ్బాస్ వ్రాశారు. బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలను, ఆత్రేయ పాటలు వ్రాశారు. ఎస్. రాజేశ్వరరావు సంగీతం, కళాధర్ కళ, భాస్కరరావు ఛాయాగ్రహణం, మోహన్ ఎడిటింగ్, సమకూరుస్తున్న యీ చిత్రానికి ప్రొడక్షన్ శాఖను కె. ఎం. నాయుడు, ఎ. కోటిలింగం నిర్వహిస్తున్నారు. ఇ. వెంకటేశ్వరరావు, చెరుకూరి కృష్ణారావు సహకార దర్శకత్వం నెరపుతున్నారు.

ఎన్నో విషయవంతమైన చిత్రాల దర్శకత్వంలో నవరసభరితంగా రూపొందుతున్న యీ చిత్రాన్ని ఎన్. ఎస్. మూర్తి సమర్పిస్తున్నారు. వాసిరాజా ప్రకాశం నిర్మాత.

బొమ్మలకొలువు నిర్మాణం ఒకవైపున శరవేగంతో జరుగుతుండగా, మరోవైపు 'తెలుగు తల్లి' నిర్మాణ సన్నాహాలు మరుకుగా ఆరంభమయ్యాయి. స్క్రిప్టువర్క్ జరుగుతున్న యీ 'తెలుగుతల్లి' చిత్రానికి తారాగణం యెన్నిక జరుగుతుంది.

"తెలుగుతల్లి" చిత్రం ఒక విభిన్నమైన చిత్రంగా రూపొందించాలని నిర్మాత

సంస్కృతిని, సాహితీ వైభవాన్ని, జానపద లలితకళల విలువలను ప్రతిబింబించేలా యీ చిత్రాన్ని నిర్మించాలన్నది మా ఆశ. ఈ చిత్రం చూసిన ప్రతి తెలుగు హృదయం ఆనందంతో, గర్వంతో పరవశించాలన్నది మా ఆశయం'' అంటారు నిర్మాత వాశిరాజు ప్రకాశం. కృషికి తగిన ఫలితాలు లభిస్తాయని, ఆశకు మించిన ఆశయసిద్ధి చేకూరగలవని ఆశిద్దాం.

సమాధి కడుతున్నాం చందాలివ్వండి?

'రాజకీయాలు' అత్యంత లాభసాటియైన వ్యాపారంగా తీర్చిదిద్దబడ్డాయి స్వార్థపరులైన రాజకీయవేత్తల చేతుల్లో పడి. ప్రజాసేవ రాజకీయవేత్తల బాధ్యత. సకల మానవ సౌభాగ్యానికి కృషిచేయడం వారి కర్తవ్యం. అయితే అలా కాకుండా ప్రజలంటే 'తామూ, తనవాళ్ళూ'గా నిర్వచించుకొని ఆ నిర్వచనానికి లోబడి ప్రజాసేవ చేస్తున్న రాజకీయవేత్తలు పదవుల కోసం యెంతటి ఘోరాలైనా చెయ్యడానికి వెనుదీయరు. ఈ కథాంశంతో రచయిత పరుచూరి రాసిన నాటకం 'సమాధి కడుతున్నాం చందాలివ్వండి' ప్రేక్షక జనాదరణ పొందింది. దర్శకుడుగా తొలి అవకాశం లభించిన యువకుడు జి.

హీరో కృష్ణ జన్మదిన వేడుకలు బొంబాయి తాజ్ మహల్ హోటల్‌లో జరిగాయి. 'దేవుడు చేసిన మనుషులు' హిందీలో నిర్మిస్తున్న సందర్భం, 'హరేకృష్ణ-హలో రాధ' చిత్ర షూటింగ్‌కి అమెరికా వెళ్ళే సందర్భమూ కలసి ఈ వేడుకలను మరింత ఘనతరం చేశాయి. ఫోటోలో అశోక్‌కుమార్, బిందియాగోస్వామి, సంజీవ్‌కుమార్, కృష్ణ, విజయనిర్మల ఉన్నారు.



నాగేంద్రప్రసాద్ దృష్టిలో 'మంచి చిత్రంగా రూపొందించదగ్గ అంశాలతో ఉన్న నాటకం'గా నిలచింది. చిత్రంగా రూపొందుతూంది. చలన చిత్రరూపానికి కూడా సంభాషణలుపరుచూరేరా స్తున్నారు. నాగభూషణం, నూతన్‌ప్రసాద్, పి యల్. నారాయణ, కె. విజయ, జయరేఖ (మోహిని), రాళ్ళపల్లి, జయమాలిని, నిర్మల, శివకుమార్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జె.వి. రాఘవులు. కెమెరా: కె. యస్. ప్రసాద్, కళ; దిలీప్‌సింగ్ నిర్వహిస్తున్నారు. నిర్మాతలు: నూలి రంగయ్య, పులిపాటి వెంకటేశ్వర్లు.

కుడి-ఎడమైతే

ప్రముఖ నిర్మాత దర్శకుడు తాతినేని ప్రకాశరావు నిర్మాతగా, ఆయన కుమారుడు టి. ఎల్. వి. ప్రసాద్ దర్శకుడుగా అనిల్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన "కుడి ఎడమైతే" చిత్రం చిత్రీకరణ పూర్తి అయి విడుదలకు సిద్ధమౌతోంది. నూతన్‌ప్రసాద్, హరిప్రసాద్, రోజారమణి, జయలక్ష్మి, రాళ్ళపల్లి, హాలం, హంస, నిర్మల నటించిన ఈ చిత్రానికి కథ ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు సమకూర్చారు. సంభాషణలు: దాసం గోపాలకృష్ణ, సంగీతం: రమేష్‌నాయుడు, ఛాయ: దేవరాజ్, కూర్పు: కణ్ణన్, కళ: తోట సమకూర్చారు.

కరుణామయుడి అమెరికా యాత్ర

కరుణామయుడిగా నటించి ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్రవేసి విజయం సాధించిన నిర్మాత నటుడు విజయ చందర్, అమెరికాలోని ఓ చలన చిత్ర వ్యాపారవేత్త ఆహ్వానంపై జూన్ 21 న బయలుదేరి అమెరికాకు వెళ్ళారు. ఆరు వారాలపాటు అమెరికాలో పర్యటించి ఆ నిర్మాత ఏర్పాటు చేస్తున్న టెలివిజన్ ప్రోగ్రాములలో పాల్గొనటం, లెక్చర్లు ఇవ్వడంతోపాటు కరుణామయుడు విదేశీ భాషలలోకి డబ్ చేసే ఏర్పాట్లు చూసుకోవడం, ఆ అమెరికన్ నిర్మాత సహకారంతో భారీ ఎత్తును తల పెడుతున్న 'సెయింట్‌పాల్' చిత్ర నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోవడం చేస్తారు విజయ చందర్.

కొత్త అర్థం!

ఇటీవల ఓ మిత్రుడు ఆంధ్రనుంచి మద్రాసు కొచ్చాడు. అయిదారునెలల్క్రితం విడుదలై ఫ్లాప్‌చిత్రంగా నిరూపించుకొన్న ఓచిత్రం గురించిన ప్రస్తావన వచ్చినప్పుడు "అదా....రియల్లీ అవుట్ స్టాండింగ్" అన్నాడు. వింటున్న అందరం ఆశ్చర్యపోయాం. చనువున్న మరో మిత్రుడు తిట్టాడు కూడా. దానికా మిత్రుడు చెప్పిన జవాబు "ఔట్‌స్టాండింగ్ అంటే అద్భుతం అని కాదురా వాజమ్మల్లారా మా సర్కిల్స్‌లో కొత్త ప్రయోగమది. థియేటర్లో కూర్చోను కూడా వీలుగాక బ[illegible]కొన్ని నిలబడే అవసరం కల్పించే స్టాండింగ్ చిత్రాలు" అని

—యక్షి

Edited&Published by V. Leelavathy Raghavaiah
Colony Kodambakkam, Madras-600024&Printed by